ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 14-8-2017 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 5

రూ. 5-00. పేజీలు 16+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



హార్దిక్ పాండ్య అదరగొట్టాడు

96 బంతుల్లో 108

శ్రీలంకతో మూడో టెస్టుపై భారత్ పట్టు బిగించింది. ఓవర్ నైట్ స్కోరు 329/6తో రెండో రోజు, ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. హార్దిక్ పాండ్య మెరుపు బ్యాటింగ్‌తో 487 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెరీర్‌లో పాండ్యకు ఇదే తొలి శతకం. అనంతరం చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (4/40) విజృంభించడంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 135కే కూలింది. ఫాలోఆన్‌లో పడ్డ లంక ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది.

ఆట ఆఖరున.. బోల్ట్.. బోల్తాపడ్డాడు



ప్రపంచ క్రీడా చరిత్రలో ఒక మహా ప్రస్థానానికి తెర పడింది. తన అసాధారణ వేగంతో అథ్లెటిక్ ట్రాక్‌పై ఎన్నో సంచనాలకు తెరతీసిన జమైకా పరుగుల వీరుడు ఉసేన్ బోల్ట్.. స్ప్రింట్ నుంచి నిష్క్రమించాడు. ఐతే దశాబ్ద కాలం పాటు ప్రపంచ వేదికలపై ఎన్నెన్నో రికార్డులు బద్దలు కొట్టి పతకాల పంట పండించిన బోల్ట్.. తన కెరీర్ చివరి పరుగులో కనీసం రేసు పూర్తి చేయలేకపోవడమే వైచిత్రి! లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 4×100 మీటర్ల రిలే పరుగులో ఉసేన్ విఫలమయ్యాడు. జమైకాజట్టులో ఆఖరున బ్యాటన్ అందుకున్న బోల్ట్.. తొడ కండరాలు పట్టేయడంతో మధ్యలోనే పరుగు ఆపేశాడు. బాధతో కుప్పకూలిపోయాడు.

వివరాలు ఛాంపియన్‌లో

విరుచుకుపడిన మృత్యువు



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిజిల్లాలో కొండ చరియలు విరిగిపడటంతో బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులను రక్షించే ప్రయత్నం చేస్తున్న సహాయక సిబ్బంది

కొండచరియల కింద 2 బస్సులు సమాధి
హిమాచల్‌లో ఘోరం
46 మృతదేహాల వెలికితీత
మృతుల్లో ఇద్దరు తెలంగాణ వాసులు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో మండీ-పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై కొట్రుపి వద్ద భారీ వర్షాలకు విరిగిపడిన కొండచరియలు రెండు బస్సుల్ని సమాధి చేయడంతో సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని భయపడుతున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయాక చోటు చేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి (మిగతా 2లో)

వైద్యానికి తక్షణ చికిత్స



ఉస్మానియా ఆసుపత్రిలో మరమ్మతులు చేయక మూలనపడ్డ వెంటిలేటర్లు

- పరికరాల నిర్వహణ బాధ్యత ప్రైవేటుకు అప్పగింత
- 48 గంటల్లోగా మరమ్మతు చేసేలా ఒప్పందం
- ఏటా రూ.10 కోట్ల వరకూ నిర్వహణ వ్యయం
- ఈ నెలాఖరులో లాంఛనంగా ప్రారంభం

ఈనాడు – హైదరాబాద్

ఉస్మానియా ఆసుపత్రిలో పైపు ఊడిపోయి పనిచేయని వెంటిలేటర్.. నెలల తరబడి పట్టించుకోని యంత్రాంగం. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో స్వల్ప మరమ్మతులతో పక్కనపడేసిన సీటీ స్కాన్ యంత్రం.. బాగోగులపై దృష్టిపెట్టని అధికారులు. తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న పరిస్థితి. వైద్య పరికరానికి చిన్న బోల్టు ఊడిపోయి ఒక్కసారి మూలకు పడిందంటే దాన్ని పట్టించుకునేవారే ఉండరు. ఇకపై ఆ దుస్థితి తొలగిపోనుంది. వైద్యపరికరాలకు జబ్బు చేస్తే వెంటనే చికిత్స చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. పరికరాలను ఎప్పటికప్పుడు బాగు చేయించే బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఈ-టెండర్ల విధానంలో ఇటీవలే 'ఫేబర్ సింధూరి మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్' సంస్థతో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లోనూ 'వైద్య పరికరాల నూతన నిర్వహణ విధానం' అమల్లోకి రానుంది.

ఏళ్లుగా అవస్థలు..

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలుకొని బోధనాసుపత్రుల దాకా అన్ని ఆసుపత్రుల్లోనూ సుమారు రూ.250 కోట్ల విలువైన 31,270 వైద్య పరికరాలున్నట్లు అంచనా. వీటిలో 30-50 శాతం వరకు పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. ఆసుపత్రుల అవసరాలరీత్యా తెలంగాణ ప్రభుత్వం గత మూడేళ్లలో సుమారు రూ.200 కోట్ల విలువైన వైద్యపరికరాలను కొనుగోలు చేసింది. కొనుగోలు సమయంలోనే ఉత్పత్తి సంస్థతో 'వార్షిక నిర్వహణ ఒప్పందాన్ని' కుదుర్చుకుంది. కానీ, దాన్ని అమలుచేయడంలో ఆసుపత్రులు విఫలమవుతున్నాయి. టీఎస్ఎంఎస్ఐడీసీలో ఒకే ఒక్క బయోమెడికల్ ఇంజినీరు ఉండడంతో పరికరం మరమ్మతుకు గురైనప్పుడు సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరపడం, సాంకేతిక నిపుణులు వచ్చే వరకు తరచూ వెంటపడడంపై దృష్టిపెట్టే పరిస్థితిలేదు. దీంతో కొత్త పరికరాలను కూడా పక్కన పడేస్తున్న దాఖలాలు (మిగతా 2లో)

ఐటీఐఆర్‌పై స్పష్టత ఇవ్వాలి

- నాలుగేళ్లుగా నయాపైసా రాలేదు
- కేంద్ర ఐటీశాఖ మంత్రికి కేటీఆర్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు ఐటీ పెట్టుబడుల ప్రాంతం (ఐటీఐఆర్) వస్తుందా? రాదా అనే అంశంపై స్పష్టతనివ్వాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు ఆయన ఆదివారం లేఖ రాశారు. ప్రాజెక్టును ప్రకటించి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ పైసా సాయం అందలేదన్నారు. "హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని 202 చదరపు కిలోమీటర్ల (మిగతా 2లో)

వరదల బీభత్సం

- నేపాల్‌లో చిక్కుకున్న 200 మంది భారతీయ పర్యాటకులు
- అసోం, బిహార్‌లపైనా తీవ్ర ప్రభావం

-2లో

హిజ్బుల్ అగ్రనాయకుడు ఘజ్నవీ హతం

- కశ్మీర్‌లో భద్రతా దళాల కీలక విజయం
- మరో ఇద్దరు ఉగ్రవాదులనూ మట్టుబెట్టిన సైన్యం
- ఇద్దరు సైనికుల వీరమరణం

-16లో

ఆన్‌లైన్లో భవిష్యనిధి ఉపసంహరణ

ఈనాడు, హైదరాబాద్: భవిష్యనిధి ఉపసంహరణలో యాజమాన్యం జోక్యాన్ని తగ్గించేందుకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఆన్‌లైన్ క్లెయిమ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉద్యోగం మానివేసినా, మరో కంపెనీలో చేరినా, వ్యక్తిగత అవసరాలకు భవిష్యనిధి తీసుకోవాలన్నా, పదవీవిరమణ సదుపాయాలు పొందాలన్నా ఇక దరఖాస్తు పత్రాలు పట్టుకుని మాత్ర సంస్థల చుట్టూ తిరగాల్సిన పని లేదు. యాజమాన్య ధ్రువీకరణ అవసరమే లేకుండా నేరుగా ఆన్‌లైన్ క్లెయిమ్ చేసుకుని, (మిగతా 2లో)

సెనగ రైతుకు విత్తు భారం

- దేశవ్యాప్తంగా పడిపోయిన పంట ధర
- గత మార్చిలో ఎక్కువ ధరకు కొన్న సర్కారీ సంస్థలు
- మార్కెట్‌కన్నా అధిక ధరకు అమ్ముతామని ప్రతిపాదనలు



ఈనాడు – హైదరాబాద్

వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే యాసంగి విత్తనాల ధరల మాయాజాలంతో రైతుల నడ్డి విరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వ విత్తన సంస్థలు గత మార్చిలో సెనగ పంటను అధిక ధరకు కొనడం వల్ల ఇప్పుడు విత్తన ధరల మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదమేర్పడింది. అప్పుడు కొన్న ధరకు అదనంగా కొంత పెంచి వచ్చే నెల నుంచి విత్తనాలు అమ్ముతామని 'రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ'(టీఎస్ సీడ్స్), హైదరాబాద్ వ్యవసాయ సహకార ఏజెన్సీ(హాకా)లు తాజాగా వ్యవసాయశాఖకు ప్రతిపాదించాయి. వీటికి ప్రభుత్వ ఆమోదం లభిస్తే యాసంగి పంటల సాగుకు ముందే సెనగ విత్తనాల ధరలకు రెక్కలు రానున్నాయి. మరోవైపు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సెనగ పంట ధరలు పతనదిశలో ఉన్నాయి.

ఎలా పెంచుతున్నారంటే..

తెలంగాణ, ఏపీల్లో యాసంగిలో సెనగ సాగు అధికంగా ఉంటుంది. గతేడాది యాసంగిలో రైతులు సాగుచేసిన సెనగ పంట ధర పెరగడం వల్ల టీఎస్ సీడ్స్, హాకాలు క్వింటాకు రూ.7,373 వరకు చెల్లించి విత్తన పంటను నేరుగా కొన్నాయి. ఈ పంట శుద్ధి, రవాణా, నిల్వ, పెట్టుబడిపై వడ్డీ ఖర్చులన్నీ అదనంగా రూ.1227 అవుతున్నాయని, వీటితో కలిపి క్వింటాకు రూ.8,600 చొప్పున రైతులకు వచ్చే నెల నుంచి అమ్మేందుకు అనుమతించాలని తాజాగా టీఎస్ సీడ్స్, హాకాలు ప్రతిపాదించాయి. గతేడాది(2016) యాసంగి పంట సాగుకు ముందు రాయితీ విత్తనాల ధరను రూ.9,500గా ప్రభుత్వం నిర్ణయించిందని, ఈసారి అంతకన్నా తక్కువగా రూ.8600కే విక్రయిస్తామని వివరణ ఇస్తున్నాయి. కానీ గతేడాది మార్కెట్ పరిస్థితులకు, ఇప్పటికి చాలా (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఇదిగో, అమెరికాకైనా, కొరియాకైనా నేను చెప్పేదొక్కటే ఉద్రిక్తతలు మంచిదికాదు. యుద్ధం వద్దు. శాంతియుతంగా ఉండండి!

ఉపాధి కూలీకి ఒకే ఖాతా

- అందులోనే వేతనం జమ
- ఖాతాలకు ఆధార్ అనుసంధానం

ఈనాడు – హైదరాబాద్

ఉపాధి హామీ కూలీలకు ఇక వారి బ్యాంకు, తపాలా ఖాతాల్లో దిల్లీ నుంచి నేరుగా వేతన మొత్తాలు జమకానున్నాయి. ఇలా వేతనం జమయ్యే బ్యాంకులో కూలీకి రెండు, మూడు ఖాతాలున్నట్లయితే అవన్నీ కలిపి ఇక ఒకే ఖాతాగా మార్చనున్నారు. బ్యాంకుల్లో ఖాతాలు లేనివారికి కొత్తగా ఖాతాలను తెరవటం, ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయటం లాంటి పనులు తెలంగాణలో ప్రారంభం కానున్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాల్లోకి నేరుగా కూలి మొత్తాలు జమ చేయడం వల్ల అక్రమాలను కొంతవరకు తగ్గించే అవకాశముంది. ఉపాధి పనులను చేసిన తర్వాత వేతన మొత్తాలను పొందేందుకు కూలీలకు ఇప్పటికీ అనేక వ్యయ ప్రయాసలు తప్పటం లేదు. తొలుత క్షేత్ర స్థాయి సిబ్బందే సొమ్మును అందజేసే విధానం ఉండగా.. అందులో అనేక అక్రమాలు చోటు చేసుకోవడంతో తపాలా కార్యాలయాలు, బ్యాంకుల ద్వారా సొమ్మును పంపిణీ చేసే విధానం అమల్లోకి వచ్చింది. ఇలా సొమ్మును పొందటానికి కూలీలు రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. పనిచేయని వ్యక్తుల పేర్లను జాబితాల్లో చేర్చి వారికి వేతనాలను అందివ్వటంలాంటి అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. వేతనాల చెల్లింపులను పగడ్బందీగా చేపట్టడానికి కేంద్రం తాజాగా కొన్ని సంస్కరణలను చేపట్టింది.

ఇ-చెల్లింపుల పరిధిలోకి 839 తపాలా కార్యాలయాలు

ఉపాధి కూలీకి ఒకే బ్యాంకులో రెండు, మూడు ఖాతాలున్నట్లయితే దేనిలో ఆఖరి లావాదేవీ జరిగి ఉంటే ఆ ఖాతాలోకే కూలి సొమ్ము ప్రస్తుతం జమవుతుంది. ఇలా సొమ్ము వచ్చినప్పటికీ ఒకటికి మించి ఖాతాలు ఉండడంతో ఏఖాతాలో సొమ్ము జమయిందో తెలియక కూలీలు వేతనం రాలేదని ఆందోళన చెందుతున్నారు. అందువల్లనే ఒకే ఖాతాగా మార్పు చేయనున్నారు. వారికి వేరే బ్యాంకుల్లోనూ ఖాతాలున్నట్లైతే ఆయా బ్యాంకుల సర్వీసు ఏరియా నిబంధనలకు (మిగతా 2లో)

ఆ వేళ్లు.. వైద్యులకే సవాల్

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని ఓ కుగ్రామానికి చెందిన ఈ బాలుడి పేరు తారిక్(12). ఇతని చేతి బొటనవేలు, చూపుడువేలు, మధ్యవేలు అసాధారణంగా పెరిగిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాడు. తోటి పిల్లలు భయపడుతున్నారని స్థానిక ఏ పాఠశాలలోనూ చేర్చుకోలేదు. దుస్తులు తొడుక్కుందామన్నా అతని అన్న హర్‌గ్యాన్ సహకరించనిదే సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం స్థానిక అల్పాహారశాలలో పనిచేస్తున్నాడు. తారిక్ పుట్టినప్పటి నుంచే అరచేతులు పెద్దగా ఉన్నాయని, అతనితోపాటే చేతివేళ్లూ పెరిగిపోయాయని అతని మేనత్త పుష్ప తెలిపారు. తన అన్న అయిన తారిక్ నాన్న.. పలువురు వైద్యులకు చూపినా లాభం లేకపోయిందని వాపోయింది. అతడు మరణించాక తారిక్‌ను ఆసుపత్రిలో చూపించేవారు లేకపోవడంతో తినాలన్నా, తాగాలన్నా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడని ఆమె తెలిపారు. చిన్నప్పుడు తారిక్‌కు స్నేహితులు కూడా ఉండేవారని, ప్రస్తుతం ఎవ్వరూ దగ్గరకు రావడం లేదని చెప్పారు. ఏదో శాపం కారణంగా తారిక్‌కు ఇలా అయిందని,



భారీగా పెరిగిన వేళ్లతో తారిక్ అవస్థలు

అతన్ని దెయ్యం అని సంబోధిస్తూ గ్రామస్థులంతా నోటికి వచ్చినట్లు దూషిస్తున్నారని ఆమె వాపోయింది. తారిక్ సమస్య ఓ మిస్టరీగా ఉందని, ఇలాంటి కేసును ఎప్పుడూ చూడలేదని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

కేన్సస్ గవర్నర్ పదవికి పోటీ

16 ఏళ్ల బాలుడి అభిలాష

టొపేకా(యుఎస్): కేన్సస్ గవర్నర్ పదవికి పోటీ పడాలని ఓ 16 ఏళ్ల బాలుడు గట్టిగా అనుకుంటున్నాడు. ఇక్కడి ఓ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న జాక్ బెర్జెర్‌సన్ తన అభీష్టాన్ని తడబడకుండా వెల్లడిస్తున్నాడు. 2018లో జరిగే ఎన్నికల్లో డెమోక్రాట్ అభ్యర్థిగా కేన్సస్ గవర్నర్ పదవికి పోటీచేయాలనుకుంటున్నాడు. ఈ మేరకు దరఖాస్తు కూడా చేసుకున్నాడు. అప్పటికి తనకింకా ఎన్నికల్లో ఓటు వేయడానికి హక్కు అనేదే రాదనీ...అయినా వెనుకాడేదే లేదని చెబుతున్నాడు. కేన్సస్ చట్టం ప్రకారం గవర్నర్ అభ్యర్థి అర్హతలు నిర్దేశించే నిబంధనలేవీ లేవు. వయసు, నివాస ధ్రువీకరణ, అనుభవానికి సంబంధించిన మార్గదర్శకాలూ లేవు. ఇందుకే, తాను పోటీలో నిలబడాలని నిర్ణయించుకున్నట్లు బెర్జెర్‌సన్ తెలిపాడు.



జాక్ బెర్జెర్‌సన్

ముచ్చటగా మూడుతరాలు విమానం నడపడంలో దిట్టలు

దిల్లీ: వినీలాకాశంలో రాయంచలా ఎగిరే విమానానికి సారథులు ఆ కుటుంబానికి చెందిన మూడుతరాలు. విమానాన్ని నడపడంలో ఆ కుటుంబానికి ఒకటీ.. రెండూ...కాదు.. ఏకంగా నూరేళ్ల చరిత్ర ఉంది. అదే 'భాసిన్'ల కుటుంబం. మడతనలగని తెల్లని దుస్తులు, ప్రత్యేకమైన టోపీ, బ్యాగులు, బ్యాడ్జీలతో హుందాగా...చకచకా నడుస్తూ వెళ్లి విమానాన్ని ...దాని గమనాన్ని తమ చేతుల్లోకి తీసుకుని గమ్యాన్ని చేరుకోవడం అనేది భాసిన్ కుటుంబీకులకు కొట్టిన పిండి మాత్రమే కాదు. మనసుకు నచ్చిన, మెచ్చిన ఉద్యోగం. భాసిన్‌ల కుటుంబంలో తొలి తరం పైలట్ కెప్టెన్. జైదేవ్ భాసిన్ 1954లో విధినిర్వహణలో చేరారు. తొలి ఏడుగురు పైలట్లలో భాసిన్ కూడా ఒకరు. తర్వాత ఆయన కుమారుడు కెప్టెన్ రోహిత్ భాసిన్ తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారా అన్నట్లు విమాన పైలట్ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా పనిచేస్తున్న నివేదితా జైన్‌ను రోహిత్ భాసిన్ వివాహం చేసుకున్నారు. మొత్తం మీద భాసిన్‌ల ఇంటికి చివరకు పైలట్టే కోడలుగా వచ్చేశారు. ఇప్పుడు. ..రోహిత్, నివేదితల పిల్లలిద్దరూ కూడా పైలట్లు కావడం గమనార్హం. అంటే..., జై దేవ్ భాసిన్ మనవడు రోహన్, మనవరాలు నీహారికలిద్దరూ కూడా పైలట్‌లయి...విమానాన్ని అద్భుతంగా



రోహిత్ భాసిన్, నీహారిక, నివేదిత, రోహన్ భాసిన్(ఎడమ నుంచి కుడికి)

నడుపుతున్నారు. చిన్నప్పటి నుంచీ కూడా విమానాలు నడపాలన్న కోరిక ఉండేది. నా కల నెరవేరింది. ఇప్పుడిక నా బిడ్డలు కూడా అదే వృత్తిని ఎంచుకున్నారంటూ నివేదితా భాసిన్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద మూడుతరాల వారు వందేళ్లుగా విమాన చరిత్రలో ప్రత్యేకంగా నిలిచారు.

వరదల బీభత్సం

కాఠ్‌మాండూ

నేపాల్ వరదల్లో సుమారు 200 మంది భారతీయులు సహా 700 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఛిత్వాన్‌లో వారంతా వరద నీటిలో బందీలయ్యారు. రాప్తీ, బుధి రాప్తీ నదులు పోటెత్తడంతో పర్యాటకులున్న హోటల్ ప్రాంతాలూ నీట మునిగిపోయాయి. వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి గజరాజులనూ, పడవలనూ రంగంలో దించారు. మూడు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టి, కొండచరియలు విరిగి పడడం వల్ల 55 మంది నేపాల్‌వాసులు ప్రాణాలు కోల్పోయారు. 36 మంది గల్లంతయ్యారు. మెరుపు వరదల వల్ల 21 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పలు రహదారులపై రాకపోకల్ని నిలిపివేశారు. వరదల పరిస్థితిపై నేపాల్ మంత్రిమండలి అత్యవసర సమావేశం నిర్వహించి, జిల్లా యంత్రాంగాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.

అసోంలో రంగంలోకి సైన్యం

గువాహటి: అసోంలో వర్షాల ధాటికి వరదలు వెల్లువెత్తి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బ్రహ్మపుత్ర నది అనేకచోట్ల ప్రమాద స్థాయిని మించి పరవళ్లు తొక్కుతోంది. సహాయక చర్యల్లో పాల్గొనడానికి సైన్యాన్ని రంగంలో దించారు. భారతీయ వాయుసేననూ అప్రమత్తం చేశారు. 33 జిల్లాల్లో 21 జిల్లాలపై వరద ప్రభావం పడగా ఒక్క ఆదివారమే 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ నుంచి జులై మధ్య వరదలు తెచ్చిన విపత్తు నుంచే రాష్ట్రం ఇంకా తేరుకోలేదు. ఈలోగానే మళ్లీ వరదలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి శర్వానంద సోనోవాల్‌తో ప్రధాని నరేంద్రమోదీ ఫోన్లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అవసరమైన సాయమంతా అందిస్తామని హామీ ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల కారణంగా రైళ్ల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలిగింది. 22 దూరప్రాంత రైళ్లు రద్దయ్యాయి. వన్యప్రాణుల అభయారణ్యాలూ నీటమునిగాయి. కొన్ని జిల్లాల్లో 45 సెం.మీ. మేర వర్షపాతం నమోదయింది.

బిహార్‌లో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు

పట్నా, దిల్లీ: వరదలు కారణంగా బిహార్‌లోని అనేక జిల్లాలు నీట మునిగిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీలతో ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ ఫోన్లో మాట్లాడి, పరిస్థితి తీవ్రతను తెలిపారు. సహాయ, పునరావాస కార్యక్రమాలకు సాయపడాల్సిందిగా అభ్యర్థించారు. ఆ వెంటనే సైనిక బలగాలు రంగంలో దిగాయి. ఏడు నదులు ఉధృతంగా ప్రవహిస్తూ వందలాది గ్రామాలను ముంచెత్తుతున్నాయి. రైల్వేస్టేషన్లు, జాతీయ రహదారులు కూడా నీట మునిగిపోయాయి. పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు పడుతున్నాయి.



భారీవర్షాల కారణంగా జలమయమైన నేపాల్‌లోని ధనుష జిల్లా విహంగ వీక్షణం



జలమయమైన నేపాల్‌లోని జనక్‌పూర్ విమానాశ్రయంలో నడిచి వస్తున్న విమాన ప్రయాణికులు

సర్కారు వైద్యానికి తక్షణ చికిత్స

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోకొల్లలు. ఎంతోకాలంగా నెలకొన్న ఈ దుస్థితి ఇక మారనుంది.

అమలు ఇలా..

- అన్ని స్థాయుల ఆసుపత్రులు ఈ పథకం పరిధిలోకి వస్తాయి.
- నిరంతరం వైద్య పరికరాల నిర్వహణ బాధ్యత ప్రైవేటు సంస్థదే.
- ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం తదితర పెద్దాసుపత్రుల్లో ప్రత్యేకంగా బయోమెడికల్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను ఒప్పంద సంస్థ అందుబాటులో ఉంచుతుంది.
- జిల్లాల్లో ప్రత్యేక సంచార సాంకేతిక నిపుణుల బృందం పనిచేస్తుంటుంది.
- పరికరం మరమ్మతుకు గురైనట్లుగా సమాచారమిచ్చిన 48 గంటల్లోపు బాగు చేయించాలి.
- ఏ పరికరమూ వారం రోజులకు మించి పనిచేయకుండా ఉండకూడదు.
- మొత్తం పరికరాల్లో కనీసం 95 శాతం పరికరాలు ఎప్పుడూ పనిచేస్తూనే ఉండేలా చూడాలి.
- నిర్దేశించిన గడువులోగా మరమ్మతు చేయించకపోతే సంస్థకిచ్చే చెల్లింపుల్లో ఆ మేరకు కోత పడుతుంది.
- ముఖ్యమైన పరికరాలు మరమ్మతుకు గురైతే వాటిని బాగుచేయించేలోపు ప్రత్యామ్నాయ పరికరాలను అందుబాటులో ఉంచాలి.
- ఒక్కో పరికరానికి ఒక్కో గుర్తింపు సంఖ్యను కేటాయించి వాటి విలువను లెక్కగట్టారు.
- ఇప్పటికే మరమ్మతులకు గురైన పరికరాలన్నింటినీ ఏడునెలల్లోగా బాగుచేసి, వినియోగంలోకి తీసుకురావాలి.
- ఏ ఆసుపత్రిలో ఏయే పరికరాలు పనిచేస్తున్నాయనే వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. దీన్ని ఉన్నతస్థాయిలోపర్యవేక్షిస్తుంటారు.
- ఇందుకోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబరు, ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు.
- మొత్తం పరికరాల నిర్వహణకు ఏటా రూ.10 కోట్ల వరకూ ఖర్చవుతుంది.

ఒక్క ఫోన్‌తో బాగవుతాయి



వైద్యపరికరాల నిర్వహణ దీర్ఘకాలంగా సమస్యగానే ఉంది. నిర్వహణ కోసం ప్రభుత్వమే అన్ని చోట్లా ఉద్యోగులను నియమించుకోవడం భారంతో కూడుకున్నది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్యపరికరాల నిర్వహణ విధానం అమల్లో ఉంది. తెలంగాణలోనూ త్వరలో అమలుకానుంది. ఇక ఒక్కఫోన్ చేస్తే చాలు పరికరాలను బాగుచేస్తారు.

–ఆర్.వేణుగోపాలరావు,
టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ

విరుచుకుపడిన మృత్యువు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం రాత్రి వరకు 46 మృతదేహాలను వెలికి తీయగలిగారు. వీరిలో 23 మందినే గుర్తించగలిగారు. మిగిలినవారిని గుర్తించడానికి ఫోరెన్సిక్ నిపుణుల్ని రంగంలో దించారు. 12 మంది క్షతగాత్రుల్ని మండీలోని ఆసుపత్రులకు తరలించారు. కొట్రుపి వద్ద రెండు బస్సుల్లోని ప్రయాణికులు తేనీరు సేవించడానికి ఆగి ఉన్నప్పుడు ఘటన చోటు చేసుకొంది. ఒక వాల్వో బస్సు మనాలీ నుంచి కాత్రాకు, రెండోది మనాలీ నుంచి చాంబాకు వెళ్తోంది. కుండపోతగా కురిసిన వర్షం తీవ్రతకు 250 మీటర్ల విస్తీర్ణం ఉన్న కొండచరియలు విరిగి, ఈ బస్సులపై పడి, వాటిని దాదాపు 800 మీటర్ల లోతున్న లోయలోకి తోసేశాయి. మరికొన్ని వాహనాలకూ, ఇళ్లకూ ప్రమాదం వాటిల్లినట్లు భావిస్తున్నారు. కొండచరియలతో పాటు పెద్దఎత్తున పడిన బురద, మట్టిలో బస్సులు కూరుకుపోయాయి. మృతుల సంఖ్య 50కి చేరవచ్చని హిమాచల్ ప్రదేశ్ రవాణా మంత్రి జి.ఎస్.బాలి చెప్పారు. ఏడు భారీ యంత్రాలతో పాటు 50 మంది కూలీలను రంగంలో దించి, బస్సుల్ని లోయ నుంచి వెలికితీసే పనుల్ని ముమ్మరం చేశారు. స్థానిక ప్రజాపనుల విభాగంతో పాటు సైన్యం, జాతీయ విపత్తు ఉపశమన దళం (ఎన్డీఆర్ఎఫ్), జమ్ము నుంచి తరలి వచ్చిన సైనిక బలగం కూడా రంగంలో దిగాయి. మరిన్ని కొండ చరియలు విరిగి పడవచ్చనే భయంతో ఆదివారం రాత్రి నుంచి గాలింపు చర్యలు నిలిపేశారు. మృతదేహాలకు సంఘటన స్థలంలోనే మరణోత్తర పరీక్షలు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. హిమాచల్‌లో కొండచరియల వల్ల బస్సులు లోయల్లోకి పడిపోవడం గత మూడు దశాబ్దాల్లో ఇది మూడోసారి. ఇలాంటి ఘటనల్లో 1988లో 45 మంది, 1994లో 42 మంది బస్సు ప్రయాణికులు సమాధి అయ్యారు.



ధ్వంసమైన బస్సుల వద్ద సహాయక చర్యల్లో సైనికులు, స్థానికులు



మండి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో ధ్వంసమైన వాహనాలు

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

ధర్మశాల: కొండచరియలు విరిగి బస్సులపై పడిన దుర్ఘటన ప్రదేశాన్ని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ సందర్శించి, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. గాయపడినవారి చికిత్సకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఒక బస్సులో 8 మంది, రెండో బస్సులో 47 మంది ప్రయాణిస్తున్నారని సీఎం చెప్పారు.

ప్రధాని మోదీ సంతాపం

దిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఘోర దుర్ఘటన పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. ఈ ఘటన తననెంతో బాధించిందని ట్వీట్ చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది.

మృతుల్లో యాదాద్రి, నల్గొండ జిల్లా వాసులు

బీబీనగర్, నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడి మృతిచెందిన వారిలో యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. బీబీనగర్ మండలం జంపల్లి వాసి కొంతం రాజిరెడ్డి, నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన దుబ్బాక కొండల్‌రెడ్డి(45) మరణించారు. వీరు ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చెందిన సంస్థల్లో మేనేజర్లుగా పనిచేస్తున్నారు. రాజిరెడ్డి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా హిమాచల్‌ప్రదేశ్ వెళ్లాడు. శనివారం హిమాచల్‌ప్రదేశ్‌లో రహదారిపై వెళ్తున్న వాహనాలపై కొండ చరియలు విరిగి పడటంతో వీరు మృతిచెందినట్లు ఆదివారం సమాచారం అందిందని గ్రామస్థులు తెలిపారు.



కొండల్‌రెడ్డి (దాచిన చిత్రం)

సెనగ రైతుకు విత్తు భారం

(మొదటి పేజీ తరువాయి)

వ్యత్యాసముంది. 2015లో కరవు కారణంగా సెనగ పంట సరిగా పండక ధరలు ఆకాశాన్నంటాయి. పైగా అప్పుడు ప్రభుత్వ సంస్థల వద్ద పంట లేక ప్రైవేటు కంపెనీల నుంచి కొనడానికి టెండర్లు పిలవగా వారు ధరలు పెంచడంతో చివరికి రూ.9500 విక్రయ ధరగా నిర్ణయించాల్సి వచ్చింది. కానీ 2015తో పోలిస్తే...2016 సెప్టెంబరులో అధిక వర్షాల కారణంగా తెలంగాణలో యాసంగిలో వరి, సెనగ పంటల దిగుబడి పెరిగి ధరలు కొంత తగ్గాయి. ఇవే పరిస్థితులు దేశవ్యాప్తంగా ఉండటంతో సెనగ పంట ధరలు పతనమవుతున్నాయి. ఇప్పుడు మధ్యప్రదేశ్ మార్కెట్‌లో సాధారణ పంట ధర క్వింటాకు రూ.4500 నుంచి 5500 వరకే ఉంది. ప్రస్తుతం పంట ధర పతనమవుతున్న మాట వాస్తవమేనని, తాము గత మార్చిలో క్వింటాకు రూ.7373 చెల్లించి కొన్నందున...ఇప్పుడు విత్తన ధరను రూ.8600గా నిర్ణయించాలని టీఎస్ సీడ్స్, హాకాలు కోరుతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం రూ.8600గా నిర్ణయించితే అదే స్థాయిలో ప్రైవేటు కంపెనీలు సైతం ధరను పెంచి అమ్మే అవకాశాలున్నాయి. లేదంటే ప్రభుత్వ ధరకన్నా కాస్త తక్కువకు ధర నిర్ణయించి అమ్ముకోవడం ద్వారా ప్రభుత్వ సంస్థల విక్రయాలను దెబ్బతీసే అవకాశాలున్నాయని ఓ అధికారి చెప్పారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పంట ధర తగ్గినందున అదే నిష్పత్తిలో ప్రభుత్వం విత్తన ధర తగ్గించాలని, ఇందుకోసం రాయితీ పెంచాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. రాయితీ పెంచకపోతే ధర పెరిగి రైతులపై కోట్లాది రూపాయల ఆర్థికభారం పడే అవకాశాలున్నాయి.

ఉపాధి కూలీకి ఒకే ఖాతా

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా ఖాతాలను నిర్వహిస్తారు. తపాలా కార్యాలయాల్లో ఖాతాలున్నవారికి వాటి ద్వారానూ చెల్లింపులు ఉంటాయని, తపాలా ఖాతాలు రద్దు కావని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ వర్గాలు చెబుతుండగా, జిల్లాల్లోని అదే శాఖ అధికారులు మాత్రం కేవలం బ్యాంకుల ఖాతాల్లోకి మాత్రమే సొమ్ము జమవుతుందని చెబుతూ ప్రతి ఉపాధి కూలీకీ బ్యాంకు ఖాతా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు.. ఇ-చెల్లింపుల కోసం తపాలా కార్యాలయాలను కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్(సీబీఎస్) పరిధిలోకి తేవాలంటూ కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో ఇప్పటివరకు 36 ప్రధాన కార్యాలయాలు, 803 ఉప కార్యాలయాలను సీబీఎస్ పరిధిలోకి తీసుకొచ్చారు. అందువల్ల వీటిలో ఖాతాలున్న వారికి సొమ్ము జమవుతుదని స్పష్టమవుతోంది.

ఐటీఐఆర్‌పై స్పష్టత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని ఐటీఐఆర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు 2013 సెప్టెంబరులో కేంద్రం ప్రకటించింది. దీనిపై ఇప్పటికి రెండుసార్లు సమగ్ర ప్రాజెక్టు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. మౌలిక వసతుల కోసం మొదటి విడతలో రూ.3275కోట్లు, రెండో విడతలో రూ.3110 కోట్ల విడుదలకు కేంద్రం 2013 నవంబరు 13న ఆమోదం తెలిపింది. దీనిపై అనేకసార్లు కేంద్రానికి విన్నవించినా నిధులు రాలేదు. ఐటీఐఆర్‌పై మీతోనూ పలు దఫాలు సమావేశమయ్యాం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. మూడేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. వృద్ధిరేటు, ఎగుమతులు పెరిగాయి. 2016-17లో ఐటీ ఎగుమతులు రూ.85479 కోట్లు. 2015-16 కంటే 13.85 శాతం పెరిగాయి. ఇది జాతీయ సగటు కంటే 4శాతం ఎక్కువ. పేరొందిన ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. టీహబ్, టాస్క్, ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేసి తెలంగాణ ఉపాధి కల్పన, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమల రంగంలో పురోగమిస్తోంది.

కేంద్రం సహకారం లేకున్నా: కేంద్రం నుంచి సహకారం లేకపోయినా తెలంగాణ ప్రభుత్వం ఈరంగంలో ప్రగతిని సాధిస్తోంది. గతంలో అంగీకరించినట్లు వెంటనే ఐటీఐఆర్‌కు కేంద్రం నిధులను విడుదల చేయాలి. ఐటీఐఆర్ వస్తే హైదరాబాద్‌కు మరిన్ని పెట్టుబడులు సమకూరుతాయి. ఉపాధి, పెట్టుబడులపరంగానే గాక దేశాభివృద్ధికి ఇది సహకరిస్తుంది. వెంటనే పరిష్కరించాలి" అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

తమిళనాడులోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏడాదిపాటు 'నీట్' నుంచి మినహాయిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తే కేంద్రం సహకరిస్తుందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. దీంతో సోమవారం ఉదయమే ఆర్డినెన్స్ ప్రతిని కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి విజయభాస్కర్ తెలిపారు.

ఆన్‌లైన్లో భవిష్యనిధి ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన సేవలు పొందేలా ఈపీఎఫ్‌వో నూతన వెబ్‌సైట్‌ను http://unifiedportalmem.epfindia.gov.in/memberinterface/ రూపొందించింది. ప్రస్తుతం దరఖాస్తు పూర్తిచేసేందుకు, యాజమాన్యం ఆమోదం తీసుకునేందుకు, ఈపీఎఫ్ కార్యాలయంలో సమర్పించేందుకు కనీసం వారం నుంచి పదిరోజుల సమయం పడుతోంది. దరఖాస్తు సంబంధిత సెక్షన్‌లోకి వెళ్లేందుకు మరోరెండు రోజులు పడుతుంది. ఆన్‌లైన్ సేవలతో సత్వరమే ఫలితం ఉంటుంది. ఈ సేవలు ప్రాంతీయ కార్యాలయాల్లో ప్రారంభమయ్యాయి. దీనికి ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం తప్పనిసరి. ఆన్‌లైన్లో దరఖాస్తు సమర్పించిన వెంటనే సంబంధిత అధికారి డాష్‌బోర్డుకు వెళ్తుంది. అక్కడ ఆమోదం పొందిన వెంటనే బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది. కేవైసీ కింద బ్యాంకు ఖాతా, పాన్‌నెంబరు, ఆధార్ తప్పనిసరిగా అవసరం. వీటితో పాటు గుర్తింపు కింద పాస్‌పోర్టు, ఓటరు కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు తదితర ఆప్షన్లను పెట్టారు. గతంలో బ్యాంకు ఖాతా, పాన్‌నెంబరు, ఆధార్‌నెంబరు అనుసంధానం చేయనివారు ఈ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు.

తప్పుల్లేని సమాచారం తప్పనిసరి: ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతాల్లో వివరాలన్నీ కేవైసీతో సరిపోలాలి. తేడాలుంటే అనుసంధానం వీలుకాదు. ఇందుకోసం కేవైసీ లేదా ఈపీఎఫ్‌వో డేటాబేస్‌లో అవసరమైన మార్పులు చేసుకోవాలి. ఉదాహరణకు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకుఖాతాల్లో వివరాలు సక్రమంగా ఉండి, ఈపీఎఫ్‌వోలో తప్పులు ఉంటే యాజమాన్యం ధ్రువీకరణలతో ఉద్యోగి ఆ తప్పులను సవరించుకోవాల్సి ఉంటుంది. ఈపీఎఫ్‌వో వివరాలు సరిగ్గా ఉండి, కేవైసీలో తప్పులుంటే ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతాల్లో వివరాలు సరిచేసుకోవాలి.

రిజిస్ట్రేషన్, సేవలు ఇలా..

- గతంలో యూఏఎన్ (విశిష్ఠ గుర్తింపు నెంబరు) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఆ వివరాలతో వెబ్‌సైట్‌లో లాగిన్ కావచ్చు.
- ఇప్పటివరకు యూఏఎన్ నెంబరు తీసుకోని చందాదారులు తమ సంస్థకోడ్, పీఎఫ్ నెంబరు నమోదు చేసి తెలుసుకోవచ్చు.
- కొత్తగా రిజిస్టర్ చేసుకునే ఖాతాదారులు యాక్టివ్ యూఏఎన్‌ను క్లిక్ చేయాలి. అక్కడ పేర్కొన్న వివరాలను నమోదు చేసి రిజిస్టరు చేసుకుని, పాస్‌వర్డ్ పొందాలి.
- వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయిన తరువాత, మేనేజ్ అనే ఆప్షన్‌లోకి వెళ్లి ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకోవాలి. తరువాత సమస్యలొస్తే ఆ వివరాలు తిరస్కరిస్తారు. అప్పుడు సంబంధిత కేవైసీ సంస్థల్లో వివరాలను సరిచేసుకోవాలి.
- కేవైసీ వివరాలు నమోదు చేసి, యాజమాన్యం ధ్రువీకరణ తీసుకున్నాక, ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేసి పంపితే చాలు. ఉద్యోగి కంపెనీ మారితే పీఎఫ్ ఖాతా వివరాలనూ బదిలీ చేసుకోవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో..

ఈపీఎఫ్‌వో సభ్యులు:	93,29,588
యూఏఎన్‌ల జారీ :	33,30,025
ఆధార్ అనుసంధానం :	19,23,086
పాన్ అనుసంధానం :	7,55,185
బ్యాంకు ఖాతా అనుసంధానం :	25,83,398
ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం :	14,91,851

గ్రహం అనుగ్రహం

14-8-2017 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
సప్తమి: సా. 6-01 తదుపరి అష్టమి
భరణి నక్షత్రం: తె. 3-14 తదుపరి కృత్తిక
అమృతఘడియలు: రా. 10-41 నుంచి 12-12 వరకు
వర్జ్యం: మ. 1-36 నుంచి 3-06 వరకు
దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-20 వరకు
తిరిగి మ. 3-02 నుంచి 3-52 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-46; సూర్యాస్తమయం: సా. 6-24
శ్రీ కృష్ణ జన్మాష్టమి

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	20.4	33.5
హైదరాబాద్	22.1	29.2
హన్మకొండ	24.0	29.0
కరీంనగర్	24.0	33.0
మహబూబ్‌నగర్	24.6	30.0
ఖమ్మం	25.0	31.0
రామగుండం	26.0	32.2

భక్తులతో పోటెత్తిన సప్తగిరులు

శనివారం హుండీ ఆదాయం రూ.3.42 కోట్లు


తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల దివ్యక్షేత్రం భక్తకోటితో పోటెత్తింది. వరుస సెలవులు, వారాంతం కారణంగా తండోపతండాలుగా యాత్రికులు తరలివస్తున్నారు. ధర్మదర్శనానికి వైకుంఠం-2లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి వెలుపల దాదాపు 2 కిలోమీటర్ల మేర బారులు తీరారు. కాలినడకన వేలాదిగా తరలివచ్చినా తితిదే రోజుకు 20 వేల మందికి మాత్రమే దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు 20 వేల వరకు విక్రయించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 70 వేల మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రికి ఈ సంఖ్య లక్షకు చేరుకోనుందని అంచనా. రద్దీని దృష్టిలో పెట్టుకుని సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలనే సంకల్పంతో సిఫారసు లేఖలను తితిదే స్వీకరించడంలేదు. శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.42 కోట్లు మేర వచ్చింది.

ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో సమాచారానికి ముప్పు!

★ ఎన్‌క్రిప్షన్ ఉన్నా... సైబర్ దాడులకు అవకాశం
★ తాజా అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్: ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సాప్, వైబర్ లాంటి సామాజిక అనుసంధాన వేదికలను ఉపయోగిస్తున్నారా? వీటిలో మీరు పంపే సమాచారం సంకేత నిక్షిప్తరూపం (ఎన్‌క్రిప్షన్)లోకి మారి ఎదుటివారికి చేరుతున్నా.. సైబర్‌దాడుల ముప్పు మాత్రం వెంటాడుతుందని తాజా అధ్యయనం చెబుతోంది. అమెరికాలోని బ్రింగ్‌హామ్ యంగ్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. సమాచార భద్రతకు 'గుర్తింపు నిర్ధారణ' మేలైన మార్గమని సూచించారు. ఏదైనా సున్నితమైన, కీలకమైన సందేశాలను పంపేటప్పుడు ఎదుటి వ్యక్తుల వివరాలను ధ్రువీకరించుకోవడాన్నే గుర్తింపు నిర్ధారణగా పిలుస్తారు. నెటిజన్ల మధ్య సమాచార బదిలీ భద్రంగా జరిగేందుకు ఇది తోడ్పడుతుంది. దీన్ని అనుసరించకపోతే మధ్యవర్తులు మన సమాచారాన్ని రహస్యంగాచూసే ముప్పుందని పరిశోధనకు నేతృత్వం వహించిన ఎల్హాం వజీరీపోర్ తెలిపారు. దీన్ని ఓ నెటిజన్ల బృందంపై ప్రయోగాత్మకంగా పరీక్షించారు కూడా. వారి క్రెడిట్ కార్డుల నంబర్లను ఎదుటివ్యక్తులకు రహస్యంగా పంపమని సూచించారు. సమాచారం హ్యాకింగ్‌కు గురయ్యే ముప్పుందని వారికి ముందుగానే హెచ్చరించారు. అయితే దీనిలో 14 శాతం మంది మాత్రమే రహస్యంగా సమాచారాన్ని పంపగలిగారు. తమ వివరాలు, కొన్ని ఘటనలపై ప్రశ్నలు సంధించడం లాంటి భద్రతా చర్యలను తీసుకొని రెండోసారి వారిని సమాచారాన్ని పంపమన్నారు. ఈ విధానంలో 79 శాతం మంది భద్రంగా తమ సందేశాలను పంపగలిగారు. అయితే గుర్తింపు నిర్ధారణకు ఒక్కొక్కరు సగటున 11 నిమిషాల సమయం తీసుకున్నారు. 'కొంత మంది గుర్తింపు నిర్ధారణ విధానాలను అనుసరించడంలో చిరాకు పడుతున్నారు. ఎక్కువ సమయం అవసరం పడుతుండటమే దీనికి కారణం. ప్రస్తుతం దీన్ని తగ్గించే విధానాలపై కృషిచేస్తున్నాం'అని పరిశోధకులు డేనియేల్ జప్పాల తెలిపారు.

శస్త్ర చికిత్సల నిర్వహణలో రోబోలే మేటి!



న్యూయార్క్: అన్నవాహికకు రోబోల సాయంతో చేపట్టే శస్త్రచికిత్సలు మెరుగు, సురక్షితమైనవని తాజా పరిశోధనలో తేలింది. అమెరికాలోని 'ఎలీనా హెల్త్' సంస్థ నిపుణులు దీన్ని చేపట్టారు. అన్నవాహిక శస్త్రచికిత్సలను ఆశ్రయించిన 100 మంది రోగుల సమాచారాన్ని వారు విశ్లేషించారు. రోగి శరీరంలో వైద్యుల చేయి వెళ్లలేని చోటుకు కూడా రోబోలు వెళ్లగలగుతున్నాయని గుర్తించారు. అంతేకాదు ఎలాంటి అదనపు కోతలు లేకుండా శోషరస గ్రంథులను రోబోలు తొలగిస్తున్నట్లు గమనించారు. దీంతో "వైద్యుల పర్యవేక్షణ"లో రోబోలు చేసే చికిత్సలు మెరుగైనవనే అవగాహనకు వచ్చారు. 'రోబో పరిజ్ఞానంతో శస్త్రచికిత్సలపై వైద్యులకు మెరుగైన అవగాహన వస్తుంది. అయితే చాలా కొద్ది ఆసుపత్రులు మాత్రమే రోబోల సాయం తీసుకుంటున్నాయి. వీటిని ఉపయోగించే నైపుణ్యం లేకపోవడం, సాంకేతిక పరమైన ఇబ్బందులే దీనికి కారణం'అని పరిశోధనకు నేతృత్వం వహించిన డేనియల్ డన్ తెలిపారు.

పందుల అవయవాలు మనుషులకు

★ జన్యు సవరణ పరిజ్ఞానంతో వైరస్‌ను నిర్వీర్యంచేసిన శాస్త్రవేత్తలు



బోస్టన్: అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో కీలక ముందడుగు. రోగులకు సరిపడే అవయవాలు దొరకడం అంత తేలికకాదు. సకాలంలో ఇవి అందక ప్రాణాలు కోల్పోయిన వారెందరో. ఈ సమస్యకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్, చైనాలోని షెజియాంగ్ వర్సిటీల నిపుణులు చక్కని పరిష్కారం కనిపెట్టారు. మనుషులకు పందుల్లోని కొన్ని అవయవాలు చక్కగా సరిపోతాయి. అయితే వాటిలోని పోర్సైన్ ఎండోజీనస్ రెట్రో వైరస్ (పీఈఆర్‌వీ)గా పిలిచే వైరస్‌తో కొత్త వ్యాధులు చుట్టుముట్టే ముప్పుంది. పీఈఆర్‌వీ ఓ కణం నుంచి మరో కణానికి ఇట్టే సంక్రమిస్తూ వేగంగా విస్తరించగలదు. ప్రస్తుతం పంది జన్యువుల్లోని ఈ వైరస్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వీర్యం చేయగలిగారు. దీని కోసం క్రిస్పార్ జన్యు సవరణ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. 'మానవుల కణాలను పందుల జన్యువులతో కలిపినపుడు.. పీఈఆర్‌వీ వేగంగా విస్తరించడం మొదలుపెట్టింది. మొత్తంగా 25 జన్యు పరివర్తనలను మేం గుర్తించాం. వీటిని 100 శాతం కచ్చితత్వంతో నిర్వీర్యం చేయగలిగాం'అని పరిశోధకులు ల్యూహన్ యాంగ్ తెలిపారు.

తేనీరుతో జలుబు మాయం!



వాషింగ్టన్: జలుబును అడ్డుకోవడంలో తేనీరు (టీ), రెడ్ వైన్ చక్కగా పనిచేస్తాయని తాజా అధ్యయనంలో తేలింది. వీటిలో లభించే ఓ సమ్మేళనం రోగ నిరోధక శక్తి మెరుగుకు తోడ్పడుతుందని వెలుగులోకి వచ్చింది. ఎలుక పిల్లలపై అమెరికాలోని వాషింగ్టన్ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. తేయాకు, రెడ్ వైన్, నేరేడు పండ్లలో కనిపించే ఫ్లేవనాయిడ్లపై వారు దృష్టి కేంద్రీకరించారు. వీటిని కడుపులోని బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయడంతో వెలువడే పదార్థాలు... జలుబు లక్షణాలను తగ్గిస్తున్నట్లు కనిపెట్టారు. 'ఫ్లేవనాయిడ్లకు ఔషధ గుణాలున్నాయని ఎప్పుడో బయటపడింది. అయితే ఇవి మన కడుపులోని బ్యాక్టీరియాతో కలిసినప్పుడు రోగ నిరోధక శక్తి పెరుగుతోందని తాజాగా మేం గుర్తించాం' అని పరిశోధకులు థాడ్డెస్ సాప్పెన్‌బెక్ తెలిపారు. జలుబు ఎక్కువగా ఉన్నప్పుడూ ఫ్లేవనాయిడ్లు చక్కని ఫలితాలనిస్తున్నాయని వివరించారు.

అధిక ఆదాయ వర్గాల... వ్యాయామం వారాంతంలోనే



వాషింగ్టన్: అధిక ఆదాయ వర్గాల ప్రజలు ఎక్కువగా వారాంతంలోనే వ్యాయామం చేస్తారని తాజా అధ్యయనం చెబుతోంది. మిగతా రోజుల్లో వీరు కదలకుండా చాలాసేపు కూర్చుండిపోతారని వివరిస్తోంది. అమెరికాలోని టెక్సాస్, జార్జియా స్టేట్ వర్సిటీల నిపుణులు దీన్ని చేపట్టారు. 5206 మంది వేతనాలు, వారి వ్యాయామ రీతుల మధ్య సంబంధాన్ని విశ్లేషించారు. దీంతో అల్పాదాయ వర్గాలు సరిపడా సమయం, సదుపాయాలు లేకపోవడంతో వ్యాయామం చేయలేకపోతున్నట్లు వెలుగులోకి వచ్చింది. మరోవైపు అధిక వేతనం సంపాదించేవారినీ సమయాభావం వేధిస్తున్నా... వారాంతంలో వీరు వ్యాయామం ఎక్కువగా చేస్తున్నట్లు బయటపడింది. ఏడాదికి రూ.12.81 లక్షలు సంపాదిస్తున్న వారితో పోలిస్తే రూ.48.06 లక్షలు వేతనం తీసుకునేవారు సగటున రోజుకు 4.6 నిమిషాలు ఎక్కువగా కసరత్తులు చేస్తున్నట్లు వెల్లడైంది.

కొత్తతరం మ్యాగ్‌లెవ్ రైలు

★ ప్రయోగాత్మకంగా నడిపిన చైనా

బీజింగ్: అయస్కాంత లెవిటేషన్ విధానంతో నడిచే కొత్తతరం రైలును చైనా ప్రయోగాత్మకంగా నడిపింది. ఒకమోస్తరు నుంచి తక్కువ వేగంతో నడిచే ఈ రైలు.. ఏడాదిలోగా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మ్యాగ్‌లెవ్ రైలు ప్రాజెక్టు 8 ఏళ్ల కిందట మొదలైంది. కొత్త తరం అయస్కాంత సస్పెన్షన్ వ్యవస్థ సహా అనే అంశాల్లో తాము పట్టు సాధించినట్లు చైనా రైల్వే రోలింగ్ స్టాక్ కార్పొరేషన్ (సీఆర్ఆర్‌సీ) డాలియన్ తెలిపారు. షాంఘైలో జరిగిన తాజా పరీక్షలో ఈ రైలు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. సంప్రదాయ రైలుతో పోలిస్తే ఇది ఒకింత నెమ్మదిగా నడుస్తుంది. అయితే తక్కువ ధ్వనిని వెలువరిస్తుంది. ఎగువ ప్రాంతంలోకి మెరుగ్గా వెళుతుంది. దీర్ఘకాలం మన్నుతుంది.

సౌచాలయాల్లో 96 శాతం వినియోగం

■ తెలంగాణ గ్రామాల్లో వాడుక తీరిది.. ■ ఇక్కడి 61 శాతం మందికి మరుగుదొడ్లు
■ భారత నాణ్యత మండలి సర్వేలో వెల్లడి ■ దేశంలోనే ఆఖరి స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గ్రామీణ సౌచాలయాల్లో 96 శాతం మేర ఆయా గృహాల్లో వారి వాడుకలో ఉన్నట్లు భారత నాణ్యత మండలి (క్యూసీఐ) వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్రాలతో పోల్చినప్పుడు సౌచాలయాల వినియోగం తెలంగాణలోనే ఎక్కువగా ఉంది. ఇక్కడి గ్రామీణుల్లో 61 శాతం మందికి మరుగుదొడ్ల సదుపాయమున్నట్లు క్యూసీఐ అంచనా వేసింది. మరోవైపు.. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు వంద శాతం మరుగుదొడ్లు గల జిల్లాలుగా నిలబడగా.. జోగులాంబ గద్వాల జిల్లా మాత్రం దేశంలోని ఆఖరి స్థానంలో కొనసాగుతూనే ఉంది. ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్ కింద ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. స్వచ్ఛభారత్‌ను ఆరంభించిన 2014, అక్టోబరు నుంచి ఇంతవరకు తెలంగాణలో 10లక్షల మరుగుదొడ్లను నిర్మించినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2018, అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను ఆరు బయలు మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పం. ఆయా గ్రామాల్లోని అన్ని కుటుంబాలు సౌచాలయాలను కలిగి ఉన్నప్పటికీ వాటిని కుటుంబ సభ్యులంతా వినియోగించుకోవడం చాలా ముఖ్యం. అందువల్లనే అసలు సౌచాలయాల్లో ఏ మేరకు వినియోగంలో ఉన్నది పరిశీలించే పనిని క్యూసీఐ చేపట్టింది. తెలంగాణతో సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లోగల 4,626 గ్రామాల్లో సర్వేను నిర్వహించి ఫలితాలను తాజాగా వెల్లడించింది. సర్వే విశ్లేషణ ప్రకారం తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో గల మరుగుదొడ్లలో 96 శాతం మేర ఆయా కుటుంబాల వినియోగంలోనే ఉన్నాయి. పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 93 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 87, కర్ణాటకలో 95 శాతం వాడుకలో ఉన్నాయి. దేశం మొత్తం మీద చూస్తే 91 శాతం సౌచాలయాలు మాత్రమే వాడుకలో ఉంటున్నాయి. తెలంగాణలోని మరుగుదొడ్ల సంఖ్యను బట్టి ఇక్కడి 53 శాతం (23లక్షలు) గ్రామీణ కుటుంబాలకు సౌచాలయాలుండగా.. క్యూసీఐ సర్వే ప్రకారం 61 శాతం కుటుంబాలు మరుగుదొడ్లను వినియోగించుకోగలుగుతున్నాయి. సామాజిక సౌచాలయాలకు వెళ్తుండటం వల్లనే ఇది సాధ్యమైంది.

నివేదిక ప్రకారం జిల్లాల్లో సౌచాలయాలు కలిగి ఉన్న గ్రామీణ కుటుంబాలు ఇలా ఉన్నాయి (శాతాల్లో)

అగ్రశ్రేణి ఐదు		ఆఖరి ఐదు	
కరీంనగర్	100	జోగులాంబ గద్వాల	7.82
రాజన్న సిరిసిల్ల	100	వికారాబాద్	17.19
జగిత్యాల	100	కొమురంభీం ఆసిఫాబాద్	17.23
నిజామాబాద్	91	నిర్మల్	18.29
మెదక్	83	జయశంకర్ భూపాలపల్లి	19.40

బాగోతాలను బయటపెడుతున్న కంప్యూటర్లు!

● వ్యవసాయ సహకార సంఘాల్లో అవినీతి
● కంప్యూటరీకరణకు జంకుతున్న పాలకవర్గాలు, సిబ్బంది

ఈనాడు, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలు, ఉద్యోగుల అవినీతి, అక్రమాలు కంప్యూటరీకరణ ప్రక్రియతో బట్టబయలవుతున్నాయి. తమ వ్యవహారాలు బయటికొస్తే ఏం చర్యలు తీసుకుంటారోమోనన్న భయంతో వీరు కంప్యూటరీకరణ త్వరగా పూర్తికాకుండా అడ్డుపడుతున్నారు. రాష్ట్రంలో 908 ప్యాక్స్‌కు గాను 798 సహకార బ్యాంకులతో, మిగిలిన 108 వాణిజ్య బ్యాంకులతో అనుసంధానమై ఉన్నాయి. వీటిలో సహకార బ్యాంకుల పరిధిలోని 798 సంఘాలను రెండు దశలుగా కంప్యూటరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు కానీ పలు జిల్లాల్లోని సంఘాల పాలకవర్గాలు, సిబ్బంది సహకరించడం లేదు. గత ఆర్థిక సంవత్సరం(2016-17) చివరి తేదీ అంటే గత మార్చి నాటికి సంఘం ఆర్థిక లావాదేవీలన్నీ సక్రమంగా ఇస్తే కంప్యూటరీకరిస్తారు. ఇప్పటివరకూ 468 ప్యాక్స్‌లో మాత్రమే ఈ తేదీ నాటికి రోజువారీ (డే బుక్) లెక్కలున్నాయి. మిగతా సంఘాలు ఇంతవరకూ వీటిని ఇవ్వలేదు. ఇప్పటివరకూ కేవలం 6 సంఘాలే ఆడిట్‌ను పూర్తిచేసి నివేదికలిచ్చాయి. 17 సంఘాల్లో మాత్రమే ఆన్‌లైన్ వ్యవహారాలు జరుగుతున్నాయి.

కుదరని పొంతన: సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పాత నిజామాబాద్ జిల్లాలోనే రోజువారి లెక్కలకు ఇప్పటి తేదీ వరకూ తాజా గణాంకాలు నమోదు కాలేదు. ఈ జిల్లాలో డేబుక్‌లో రాసిన నిధుల లెక్కలకు, ఇతర లావాదేవీలకు పొంతన కుదరడం లేదని, పాత కంప్యూటర్లకు వైరస్ వల్ల కంప్యూటరీకరణ సాగడం లేదని నాబార్డు జరిపిన తాజా తనిఖీలో వెల్లడైంది. పాత మెదక్, ఆదిలాబాద్, ఖమ్మం తదితర అన్నీ జిల్లాల్లో ఇలాంటి లోపాలే ఉన్నాయి. ఒక్క కరీంనగర్ జిల్లాల్లో కంప్యూటరీకరణ కాస్త వేగంగా ఉంది. సాధ్యమైనంత త్వరగా సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తిచేస్తామని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్‌క్యాబ్) ఛైర్మన్ కొండ్రు రవీందర్‌రావు 'ఈనాడు'కు తెలిపారు.

బోగస్ రుణాల గుట్టురట్టు..: రుణమాఫీ పథకం అమలుకు ముందు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల' (ప్యాక్స్)లో కంప్యూటరీకరణ లేదు. ఇప్పుడు ఇది జరుగుతున్నందున పంటరుణాల పంపిణీకి పాసు పుస్తకాలు, రైతు పేరు, ఆధార్ సంఖ్యతో సహా కంప్యూటర్‌లో నమోదు చేయాలి. కంప్యూటరీకరణ పూర్తికాని సంఘాల్లో సైతం ఈ వివరాలన్నీ పుస్తకాల్లో రాసి ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇవన్నీ తప్పనిసరిగా వచ్చే నెలాఖరుకల్లా కంప్యూటరీకరించాలని నాబార్డు లక్ష్యాన్ని విధించింది. దీంతో బోగస్ రుణాల గుట్టు రట్టవుతోంది.

రుణమాఫీ నిధులు.. బోగస్ ఖాతాల పాలు

● మల్యాల సహకార సంఘంలో మరో అవినీతి బాగోతం


మహబూబాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మల్యాల ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్)లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రూ.5.41 కోట్ల నిధుల స్వాహా బాగోతం మరువకముందే.. మాజీ సీఈవోతో పాటు మరికొందరు అధికారులు రుణమాఫీ నిధులను కాజేసిన వైనం బయటపడింది. రూ.2 కోట్లకు పైగా రుణమాఫీ నిధులను మింగేసినట్లు గుర్తించారు. భూమి లేని వారి, రైతుల పేరిట నకిలీ పత్రాలతో మరో రూ.కోటికి పైగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. రైతుల నుంచి వసూలు చేసిన వాటాధనానికి సంబంధించిన రూ.1.80 కోట్లు సైతం దుర్వినియోగమయ్యాయి. దీంతో తాజాగా రూ.4.80 కోట్లు స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. ఇలా సంఘంలో ఇప్పటిదాకా రూ.10.21 కోట్లు అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. అక్రమార్కులు కొందరు అధికారుల అండదండలతో నిరాక్షరాస్యులైన గిరిజన రైతులను నమ్మించి నిధులు కాజేశారు. రైతుల దగ్గర ఉండాల్సిన ఖాతాల పుస్తకాలు పూర్వ అధికారి వద్దే ఉంటున్నాయి. అయితే బ్యాంకు అప్పు ఉండటంతో రెండేళ్లుగా రైతులకు వ్యవసాయ రుణాలు, ఇతర బ్యాంకు రుణాలు నిలిచిపోయాయి. ఈ వ్యవహారంపై విచారణ చేసేందుకు ఉన్నతాధికారులు జాప్యం చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

మల్యాల పీఏసీఎస్‌లో భారీగా అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చాం. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. పీఏసీఎస్ ద్వారా రుణాలు నిలిచిపోయాయి. అవసరమున్న రైతులు బ్యాంకు వద్దకు నేరుగా వెళ్లి పొందే అవకాశముంది. పూర్తి స్థాయిలో విచారణ జరిపితే రైతులకు న్యాయం జరుగుతుంది.

– ఇందిర, డీసీవో, మహబూబాబాద్

'మేకపోతు' గాంభీర్యం..



విశాఖ మన్యంలోని హుకుంపేట మండలం చిన్నబూరుపుట్టుకు చెందిన రైతు కంబా లక్ష్మయ్య ఇంటి పెరట్లో బొప్పాయి కాయ విచిత్రంగా ఉండి చూపరులను ఆకట్టుకుంటోంది. రెండు కొమ్ములతో మేకపోతు ఆకారాన్ని పోలినట్లుగా కాయ పెరిగింది. 'మొక్కను నాటిన సమయంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, సక్రమంగా ఫలదీకరణం జరగకపోవడం వల్ల విభిన్న ఆకృతుల్లో కాయలు కాస్తాయని' చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివకుమార్ చెబుతున్నారు.

–న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

మాతృభాష పరిరక్షణకు నడుంకట్టాలి

● ఏపీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పిలుపు



ప్రసంగిస్తున్న ఏపీ ఉపసభాపతి మండలి. వేదికపై వై.డి.తోంగ్చి, ఎన్.గోపి, చంద్రశేఖర్ కంబార్, కె.శ్రీనివాసరావు, పెద్దిబొట్ల సుబ్బరామయ్య

విజయవాడ, న్యూస్‌టుడే: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రచయితలపై ఉందని శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. అనేక భాషలకు పెనుముప్పు పొంచి ఉందని, చాలా భాషలు మృతభాషలుగా మారిపోతున్నాయంటూ హెచ్చరికలను యునెస్కో ఇప్పటికే జారీ చేసిందని గుర్తుచేశారు. ఆయా భాషలను పరిరక్షించుకునేందుకు రచయితలంతా కలసికట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'ఈశాన్య, దక్షిణ రచయితల సమాగమం' జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారిపై బెంగాలీ ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. శరత్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ల ప్రభావంతో ఎంతో మంది తెలుగు రచయితలు కొత్త పుంతలు తొక్కారని వివరించారు. భావ కవిత్వానికి నాంది పలికారన్నారు. హిందీ సాహిత్యంలో ప్రేమ్‌చంద్ వంటి వారు తెలుగువారికి ఆత్మబంధువులని అన్నారు. తెలుగు వారిలో ఉన్న గొప్పతనం ఏంటంటే.. ప్రతి ఇంట్లో ఒక శరత్, ప్రేమ్‌చంద్ పేర్లు పెట్టుకుని వారిని ఆదరించారని తెలిపారు. ఇతర రాష్ట్రాల రచయితల పేర్లు పెట్టుకున్న ఏకైక జాతి తెలుగుజాతి మాత్రమేనని అన్నారు. చక్కని రచనలు చేసిన రచయితలు ఏ భాషవారైనా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని తెలిపారు. సుప్రసిద్ధ తెలుగు రచయిత పెద్దిబొట్ల సుబ్బరామయ్య మాట్లాడుతూ రచయితలు సమాజాన్ని చూసి దానితో ప్రభావితమై మంచి రచనలు చేస్తారని తెలిపారు. రచయితలు తమ అనుభవాలు, అనుభూతులను పాఠకులకు ఇవ్వాలని సూచించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేయగా సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్ ఎన్.గోపి సభకు సమాగమం విశేషాలను పరిచయం చేశారు. సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడు, ప్రసిద్ధ కన్నడ రచయిత చంద్రశేఖర్ కంబార్, ప్రసిద్ధ అస్సామీ రచయిత వై.డి.తోంగ్చి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలకు 'అధ్యాపక' వెసులుబాటు

● అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి 1:20
● పరిశీలిస్తున్న ఏఐసీటీఈ
● క్రెడిట్ల సంఖ్య తగ్గింపుపైనా దృష్టి

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపక, విద్యార్థుల నిష్పత్తిని మార్చాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) యోచిస్తోంది. ఏళ్ల తరబడి యాజమాన్యాలు దీనిపై విన్నవిస్తున్న నేపథ్యంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి 15మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలన్నది నిబంధన. ఒక బ్రాంచీలో ఒక సెక్షన్ ఉంటే(60 సీట్లు) నలుగురు అధ్యాపకులను నియమించుకోవాలి. అయితే తగిన విద్యార్హతలున్న అధ్యాపకులు లభించడం లేదని, అందరూ ఐటీ ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారని, 1:20గా నిష్పత్తిని మార్చాలని యాజమాన్యాలు మొరపెట్టుకుంటున్నాయి. ఇతర కోర్సుల్లో 1:20 నిష్పత్తిని అమలు చేస్తుండగా ఇంజినీరింగ్‌కే ఎందుకు ఈ నిబంధన అని ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో 1:20గా నిష్పత్తిలో మార్చేందుకు ఏఐసీటీఈ సానుకూలంగా పరిశీలిస్తోంది. దీనిపై నిర్ణయం తీసుకుంటే వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి వచ్చే అవకాశముంది. నిష్పత్తి తక్కువగా ఉండటం వల్ల బోగస్ అధ్యాపకులను చూపిస్తున్నారని, నిష్పత్తిని పెంచితే అలాంటివి తగ్గే అవకాశముందని ఓ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ అభిప్రాయబడ్డారు. దీనివల్ల నలుగురు అధ్యాపకులు ఉండాల్సిన చోట ముగ్గురు సరిపోతారన్నారు.

సిలబస్ భారం తగ్గింపు

ప్రస్తుతం బీటెక్‌కోర్సుకు 200వరకు క్రెడిట్లు ఉంటున్నాయి. అంటే సిలబస్ ఎక్కువగా ఉంటోంది. దీనివల్ల విద్యార్థులు పుస్తకాలు చదవడానికి తప్ప మిగతా విషయాలపై దృష్టిపెట్టే సమయం లేకుండాపోతోంది. ఈనేపథ్యంలో క్రెడిట్లను 160కి తగ్గించాలని ఏఐసీటీఈ భావిస్తోంది. థియరీ కంటే ప్రాక్టికల్స్, ప్రాజెక్టులకు సమయం కేటాయించేలా పాఠ్యప్రణాళిక ఉండాలని యోచిస్తోంది. ప్రస్తుతం జేఎన్‌టీయూహెచ్ పరిధిలో బీటెక్ కోర్సుకు 192క్రెడిట్లు ఉన్నాయి.

పాక్ జైలు గోడలు బద్దలుకొట్టుకొచ్చారు

● భారత వైమానిక దళ పైలట్ల వీరోచితగాథ
● 1971 యుద్ధ సమయంలో ఖైదీలుగా చిక్కిన పారుల్‌కర్ బృందం
● రెండు నెలలు శ్రమించి గోడను తొలిచారు
● సినిమాగా వస్తున్న సాహసకృత్యం



1971లో పాకిస్థాన్‌కు యుద్ధఖైదీలుగా పట్టుబడి ఏడాది తరువాత మనదేశానికి తిరిగి వచ్చిన భారత పైలట్లు

దిల్లీ: "మేం శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి పోరాడతాం. ఒక్క తూటాతో మా విమానం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకవేళ నేను యుద్ధఖైదీగా శత్రువుల చేతికి చిక్కితే.. నేను తప్పించుకొని తీరుతా" 1968లో ఒక ఆహ్లాదకరమైన రాత్రివేళ భోజనం చేస్తూ.. ఫ్లయిట్ లెఫ్టినెంట్ దిలీప్ పారుల్‌కర్ తన కమాండింగ్ అధికారి ఎం.ఎస్.బావాతో అన్న మాటలివి. మూడేళ్ల తర్వాత 1971లో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం చెలరేగినప్పుడు ఈ మాటలు నిజమయ్యాయి. అప్పట్లో పారుల్‌కర్‌తోపాటు పాక్ చేతికి భారత వైమానిక దళ పైలట్లు ఎం.ఎస్.గ్రేవాల్, హరీశ్ సిన్హ్‌జీలు శత్రు నిర్బంధం నుంచి తప్పించుకొని పారిపోయారు. రోమాంచితమైన ఈ సాహసగాథ ఇప్పుడు బాలీవుడ్‌లో సినిమా కథగా మారింది. "ద గ్రేట్ ఇండియన్ ఎస్కేప్' పేరుతో దర్శకుడు తరణజీత్ సింగ్ దీన్ని తెరకెక్కిస్తున్నారు.

1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చెలరేగేటప్పటికి పారుల్‌కర్‌కు 29 ఏళ్లు. ఆ ఏడాది డిసెంబర్ 10న ఆయన తన సుఖోయ్-7 యుద్ధవిమానంతో పాక్‌లోని ఒక రాడార్ కేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు బయలుదేరగా శత్రు సైనికులు ఆ యుద్ధవిమానాన్ని పేల్చివేశారు. పారాచూట్ సాయంతో కిందకి దిగిన పారుల్‌కర్‌ను రావల్పిండికి సమీపంలోని ఒక కారాగార శిబిరంలో నిర్బంధించారు. అక్కడ భారత వైమానిక దళానికి చెందిన ఇతర పైలట్లు కూడా నిర్బంధంలో ఉన్నారు. ఈ ఘటన జరిగిన ఆరు రోజులకు యుద్ధం ముగిసింది. తొలుత పారుల్‌కర్ ఒక విచిత్రమైన ఆలోచన చేశాడు. పాక్ వైమానిక దళ సిబ్బంది ఒకరిని పట్టుకొని.. అతడి తలకు రివాల్వర్‌ను గురిపెట్టి, తనను విమానంలో దిల్లీకి తీసుకెళ్లాలని బెదిరిద్దామనుకున్నారు. అయితే అంతలోనే ఆ ఆలోచనను విరమించుకున్నాడు.

ఆ తర్వాత మూడు నెలల పాటు పారుల్‌కర్, గ్రేవాల్, హరీశ్‌లు మౌనంగా ఉండిపోయారు. యుద్ధం ముగిసిన నేపథ్యంలో తమను స్వదేశానికి అప్పజెబుతారని భావించారు. అలాంటిదేదీ జరగకపోవడంతో పరారీకి వ్యూహరచన చేయడం మొదలుపెట్టారు. పారిపోవడానికి అనువుగా ఉన్న ఒక సెల్‌లోకి ఏదో విధంగా మారారు. అప్పటి నుంచి. 18 అంగుళాల మందమున్న గోడను ప్రతీ రాత్రి ఒక పదునైన వస్తువుతో తవ్వడం మొదలుపెట్టారు. దాదాపు రెండు నెలలు తర్వాత 1972 ఆగస్టు 13న అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పారుల్‌కర్, ఎం.ఎస్.గ్రేవాల్, హరీశ్‌లు జైలు నుంచి బయటపడ్డారు. పఠాన్ దుస్తులు ధరించి, నీరు, ఔషధాలు, ఎండు పళ్లు, రూ.600 సొమ్ముతో రోడ్డుపైకొచ్చారు. ఆ తర్వాత 12 గంటల పాటు ప్రయాణం సాగించి. పెషావర్ చేరారు. అక్కడి నుంచి జామ్‌రౌద్ చేరుకున్నారు. ఈ క్రమంలో ఐదారు చెక్‌పాయింట్లను క్షేమంగా దాటేశారు. కానీ, లాండీ కోటాల్‌లో ఒక పొరపాటు కారణంగా వారు దొరికిపోయారు. ఎప్పుడో మూసేసిన లాండీ ఖానా అనే రైల్వే స్టేషన్ కోసం అందర్నీ వాకబు చేయడమే వారు చేసిన తప్పిదం. మళ్లీ మూడు నెలల పాటు వారు నిర్బంధంలో ఉన్నారు. ఎట్టకేలకు వారిని భారత్‌కు అప్పగించాలని పాక్ నిర్ణయించడంతో 1972 డిసెంబర్ 1న స్వదేశానికి చేరుకున్నారు.

స్వదేశానికి తిరిగొచ్చాక పారుల్‌కర్.. భారత వైమానిక దళంలో తిరిగి చేరారు. తాజాగా ఆయన వయసు 74 ఏళ్లు. నాటి అనుభవాలను పంచుకున్నారు. యుద్ధఖైదీగా చిక్కాక శత్రువు నిర్బంధం నుంచి పరారీకావడం మినహా తనకు మరో ఆలోచన లేదన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే పరిణామాల గురించి తాను భయపడలేదని చెప్పారు.



పరిశ్రమలో ఉన్న పశువ్యర్థాలు

కోళ్ల దాణా పేరుతో వ్యర్థాల దందా

ధారూర్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం డోర్నాల గ్రామ శివారులో కోళ్ల దాణా పేరిట చేస్తున్న అక్రమ వ్యాపారం గుట్టురట్టయింది. ఇక్కడ కోళ్లదాణా, కుక్కలకు బిస్కెట్లు తయారు చేయడానికి 2015 సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు అనుమతి తీసుకున్నారు. శనివారం రాత్రి వర్షం కురిసిన తర్వాత పరిశ్రమ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం వెళ్లి పరిశీలించిన పోలీసులు, అధికారులకు దారుణ పరిస్థితులు కంటపడ్డాయి. ఏకంగా లారీ లోడు పశుమాంసం, వ్యర్థాలు పట్టుబడ్డాయి. 250 బస్తాల ఎముకల పిండి, వెయ్యి లీటర్ల కల్తీ నూనెను గుర్తించారు. వెంటనే ధారూర్ సీఐ ఉపేందర్, మండల ఆర్ఐ యాదయ్య కలిసి పరిశ్రమను జప్తు చేశారు.

ఈనాడు

మహిళలకేదీ రక్షణ ఛత్రం?

'ఈ సమున్నత భవనం (ఇప్పటి రాష్ట్రపతి భవన్)పై ఎగరనున్న తొలి జాతీయ పతాక, ఈ దేశ మహిళల కానుక కావడం సందర్భ ప్రాధాన్యానికి తగ్గట్లుగా ఉంది'- ఏడు దశాబ్దాల క్రితం సరిగ్గా ఇదే రోజు నడిరేయి స్వాతంత్ర్య భానూదయ వేళ బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతికి త్రివర్ణ పతాక అందిస్తూ శ్రీమతి హంసా మెహతా ఆనందోద్వేగంలో పలికిన మాటలవి. దోపిడీ పీడనల నుంచి విముక్తే లక్ష్యంగా అసిధారావ్రతంలా సాగిన అహింసోద్యమంలో ఆత్మ త్యాగాలకు సిద్ధపడి మహిళాలోకం పోషించిన పాత్ర అద్వితీయమైనది. స్వతంత్ర భారతంలో లింగ వివక్షకు తావులేదంటూ రాజ్యాంగం ఘనతర ఆశయ ప్రకటన చేసినా మహిళలపై అంతులేని కథలా సాగుతున్న వేధింపులు, అత్యాచారాల దురాగతాలు సభ్య సమాజాన్ని సిగ్గిలజేస్తున్నాయి. పదిరోజుల నాడు చండీగఢ్‌లో ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె వర్ణిక కుందు (29)ను కారులో వెంటాడి, అటకాయించి, అపహరించేందుకు ఇద్దరు యువకులు చేసిన విఫలయత్నం రాజకీయ రంగు పులుముకొని యావద్దేశం దృష్టిని ఆకర్షించింది. ఆ యువతిని మద్యం మత్తులో వెంటాడిన ప్రబుద్ధుల్లో ఒకడు హరియాణా రాష్ట్ర భాజపా అధ్యక్షుడి పుత్రరత్నం కావడం, దుర్ఘటన జరిగిన వెంటనే నిందితుల్ని నిర్బంధించిన పోలీసులు వెంటనే బెయిలుపై విడుదల చెయ్యడంతో ఆందోళనలు రేగాయి. 'ఆపదలో ఉన్నా... ఆదుకోండి' అంటూ వర్ణిక ఇచ్చిన ఎస్ఎంఎస్‌కు తక్షణం స్పందించిన పోలీసులు, దరిమిలా దర్యాప్తులో తడబాటు వైఖరి కనబరిచినా, భారత శిక్షాస్మృతిలోని నిర్దిష్ట నిబంధనల కింద కేసులు పెట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఈ గొడవ జరుగుతున్నప్పుడే గుర్గావ్, ముంబయి వంటి ప్రాంతాల్లో ఒంటరి ఆడవాళ్లను వెంటాడి భయభ్రాంతం చేసే నేరాలు నమోదయ్యాయి. ఆడవారిపై అమానుష కృత్యాల సంఖ్య ఏటికేడు పెరిగిపోతున్న దుర్భర వాస్తవానికి కేంద్ర నేరగణాంకాల బ్యూరో నివేదికలే అద్దంపడుతున్నాయి. దేశ జనాభాలో సగంగా ఉన్న స్త్రీ మూర్తుల మానాభిమానాలకు భరోసా ఇవ్వలేని ఈ దురవస్థ మరి ఇంకెన్నేళ్లన్న కోట్లాది జనావళి గుండె ఘోషకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే జవాబుదారీ!

అత్యాచారాల రాజధానిగా దుష్కీర్తి మూటగట్టుకొన్న దేశ రాజధాని దిల్లీయే, అమ్మాయిలను వెంటాడి వేధించే ఆకతాయిల అడ్డాగానూ పేరుమోసింది. 1996లో ప్రియదర్శిని మట్టూ అనే దిల్లీ విశ్వవిద్యాలయ న్యాయ విద్యార్థినిని సీనియర్ పోలీసు అధికారి కొడుకైన సంతోష్ సింగ్ పశువాంఛతో వెంటాడి మట్టుపెట్టిన వైనం సంచలనం సృష్టించింది. ఆ ఘోరం జరిగిన 17 ఏళ్లకు, 2012 డిసెంబరునాటి నిర్భయ ఘోరకలి దరిమిలా- ఆడవారిని వెంటాడి వేధించడాన్ని శిక్షార్హమైన నేరంగా కేంద్రం చట్టసవరణలు చేసింది. దాని ప్రకారం- ఆడపిల్లల్ని వెంటాడి వేధించే కేసుల్లో దోషులకు ఏడాదికి తగ్గకుండా మూడేళ్ల వరకూ జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించాల్సి ఉంటుంది. చట్టం ఇంత నిర్దుష్టంగా ఉన్నా ప్రాణాంతక పోకిరీల బెడద స్త్రీ మూర్తుల్ని పగలనక రేయనక బెంబేలెత్తిస్తూనే ఉంది. ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయమంత్రి లోక్‌సభకు వెల్లడించిన వివరాల ప్రకారం- 2014లో ఆడపిల్లల్ని వెంటాడి వేధించిన కేసులు 4699 నమోదైనా, 134 కేసుల్లో 262 మందికే శిక్షలు పడ్డాయి. 2015లో కేసుల సంఖ్య 6266కు చేరినా, శిక్షలు పడ్డది మాత్రం 340 కేసుల్లో 473 మందికే! నిరుడు 7132 కేసులకుగాను శిక్షలు పడిన దోషుల సంఖ్య కేవలం అయిదు శాతానికే పరిమితమైపోయింది. దేశ రాజధానిలోనే రెండున్నర వేల కేసులు నమోదైనా 139 కేసుల్లోనే శిక్షలు పడ్డాయంటే- నేర న్యాయ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో బోధపడుతుంది. మహిళలపై వేధింపులు అధికంగా నమోదవుతున్న నాలుగు రాష్ట్రాల్లో రెండు తెలుగు రాష్ట్రాలూ నిక్షేపంగా చోటు చేసుకోవడం సిగ్గుచేటు. అన్ని స్థాయుల్లో స్త్రీల భద్రతకు పూచీపడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దన్నుతో తెలుగు ప్రభుత్వాలు పరిశ్రమించాలిప్పుడు!

'కామా తురాణాం... న భయం, న లజ్జ' అన్నారు పెద్దలు. సిగ్గెగ్గులు ఒగ్గేసి పశుప్రవృత్తితో రెచ్చిపోయే ప్రబుద్ధుల వెన్నులో వణుకుపుట్టేలా చట్టం కొరసాచకపోబట్టే వాళ్ల ఆటలు సాగుతున్నాయని చెప్పక తప్పదు! పోలీసు దాకా గడప తొక్కి, ఫిర్యాదు చేస్తే కుటుంబం పరువు పోతుందని తమలో తాము కుమిలిపోయే అభాగినులు అంతిమంగా మృగాళ్ల చేతిలో కడతేరిపోయిన దురదృష్టకర ఘటనలూ ఎన్నో ఉన్నాయి. ఆడపిల్లల అపహరణ యత్నాల కేసుల సంఖ్య 2015లో 64 వేలకు చేరింది. తమపై హింసా దౌర్జన్యాలు జరిగినప్పుడు 40శాతం కంటే తక్కువమంది మహిళలే సాటివారి సహాయం కోరుతున్నారని, కేవలం 10శాతమే పోలీసులను ఆశ్రయిస్తున్నారని ఐక్యరాజ్య సమితి విపుల అధ్యయనం ఎలుగెత్తి చాటింది. అలా అరకొరగా పోలీసు రికార్డులకు ఎక్కుతున్న వాటిలో 21.7శాతం కేసుల్లోనే దోషులకు శిక్షలు పడటం నగుబాటు! 2015 చివరినాటికి మహిళలపై నేరాలకు సంబంధించిన 11 లక్షల కేసులు పెండింగులో పడి ఉండటం గ్రహపాటు! దేశవ్యాప్తంగా 17 లక్షల పోలీసు బలగంలో మహిళా రక్షకభటుల వాటా కేవలం 6.4శాతమని, మహిళా పోలీసు స్టేషన్లను విరివిగా ఏర్పాటు చేస్తే తప్ప తమపై జరిగే అఘాయిత్యాలపై స్త్రీలు ఫిర్యాదు చేసే అవకాశాలు స్వల్పమేనని అధ్యయనాలు చాటుతున్నాయి. ఆడపిల్లలపై లైంగిక హింస దిగ్భ్రాంతకర స్థాయికి చేరిందన్న తాజా ఆర్థిక సర్వే సైతం- ప్రత్యేక కోర్టుల ట్రైబ్యునళ్ల ఏర్పాటుతో సరిపుచ్చకుండా, నిర్ణీత కాలావధిలో బాధితులకు న్యాయం దక్కేలా ఏమేమి చెయ్యాలో విపులీకరించింది. జాతి సౌభాగ్య రూపశిల్పులుగా స్త్రీ మూర్తులు ముందడుగు వెయ్యాలంటే, సామాజిక భద్రతా వ్యవస్థలకు గట్టిగా నట్లు బిగించి, నేర శక్తుల వెన్ను విరిచేందుకు ప్రభుత్వాలు ప్రతిన బూనాల్సిన సమయమిది!

రెక్కలు తెగిన విపక్షాలు!



సోనియా, రాహుల్ | అఖిలేష్ యాదవ్ | మాయావతి | సీతారాం ఏచూరి | మమత | కేజ్రీవాల్ | నవీన్ పట్నాయక్ | లాలుప్రసాద్ యాదవ్

భాజపాకు బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించడంలో కాంగ్రెస్ సహా మిగిలిన పార్టీలన్నీ దారుణంగా విఫలమవుతున్నాయి. ప్రజలతో మమేకమై, నిర్మాణాత్మకంగా పాలకపక్షాన్ని ప్రశ్నించడంలో విపక్షం పూర్తిగా తేలిపోతోంది. ప్రజా ప్రయోజన అంశాలపై చట్టసభల్లో సహేతుక చర్చ జరిపి అధికార పార్టీకి దిశానిర్దేశం చేయడం విపక్షాల బాధ్యత. కానీ, చట్టసభలను స్తంభింప చేయడమే లక్ష్యమన్నట్లుగా అవి ప్రవర్తిస్తున్న తీరు ప్రజల్లో విపక్షాలపట్ల వ్యతిరేకతను పెంచుతోంది.

మోదీ ప్రభంజనం ముందు 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేతర పార్టీలు దూదిపింజెల్లా తేలిపోయాయి. కాంగ్రెస్ క్రమక్రమంగా మరీ బలహీన పక్షంగా మారిపోతోంది. గోవా, మణిపూర్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఇటీవలి ఎన్నికలు ఈ వాస్తవాన్నే ప్రతిఫలించాయి. ప్రస్తుతం దేశంలోని 18 రాష్ట్రాల్లో భాజపా అధికారం నెరపుతోంది. విపక్ష శిబిరం బలం కోల్పోయి చిందరవందరగా తయారైంది. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఓ పది చిన్న పార్టీలు భాజపా వ్యతిరేక పక్షాన నిలిచాయి. అవినీతికి, కుటుంబ రాజకీయాలకు దూరంగా పురోభివృద్ధే నినాదంగా పనిచేసే విలక్షణ పార్టీగా భాజపా పేరు తెచ్చుకుంది. దేశంలోని మరే పార్టీకీ ఇంత స్పష్టమైన సిద్ధాంతం కనిపించదు! ఒకప్పుడు భిన్నవర్గాల్లో మరీ ముఖ్యంగా దళితులు, ముస్లిములు, వెనకబడిన తరగతుల మద్దతు పొందిన పార్టీ క్రమంగా ఎవరికీ కానిదిగా మారిపోతోంది. ప్రాభవం కోల్పోయి కాంగ్రెస్ ఇవ్వాళ చతికిలపడిందంటే అందుకు స్వయంకృతాపరాధాలే కారణం. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో కాంగ్రెస్ స్కంధావారాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. పంజాబ్‌లో కాంగ్రెస్ 38.5శాతం ఓట్లు సాధించి విజయం మూటగట్టుకోవడానికి ఆ పార్టీకి అక్కడ అపూర్వ ప్రజామద్దతు లభించడం కారణం కాదు. అకాలీ-భాజపా పాలనపట్ల తీవ్రంగా విసిగివేసారిన ప్రజలు మరో మార్గాంతరం లేక పంజాబ్‌లో కాంగ్రెస్‌ను నెత్తికెత్తుకున్నారు. గోవాలో మెజారిటీ సీట్లు సంపాదించినా అధికారం నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల హవా పెరిగింది. ఉత్తర భారతంలోని ఉత్తర్ ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాలు; దక్షిణాన తమిళనాడు; అటు పశ్చిమ్ బంగలో కాంగ్రెస్ అధికారం నెరపి పాతికేళ్లకు పైగానే అయింది.

యూపీఏ పాలన వైఫల్యాలు కాంగ్రెస్ బలాన్ని దెబ్బకొట్టాయి. మరోవంక రాహుల్ గాంధీకి ఏ కోశానా నాయకత్వ లక్షణాలు లేకపోవడం, కాంగ్రెస్‌ను ముందుండి నడపగల పరిణతి లేని వ్యక్తిగా కనిపించడంతో పార్టీ శ్రేణులు పూర్తిగా డీలాపడ్డాయి. రాహుల్ పసలేని ప్రసంగాలు ప్రజలను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాయి. 2010నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన ఎన్నికల్లో రాహుల్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాలు మూటగట్టుకుంది. గడచిన మూడేళ్లుగా వరస ఎదురుదెబ్బలు తగులుతున్నా రాహుల్‌గానీ, ఆయన పార్టీగానీ ఏ మాత్రం పాఠాలు నేర్చుకోకపోవడంతో దేశంలో కీలక విపక్షం పరిస్థితి మరింత దిగజారింది.

యూపీలో కకావికలం!

ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలిన తరవాత సమాజ్‌వాదీ పార్టీలో కుటుంబ కలహం మరింత ముదిరింది. అఖిలేష్ యాదవ్, శివపాల్‌ల మధ్య వైరంతో ఎస్పీ ప్రాభవం అంతకంతకూ కొడిగడుతోంది. సంప్రదాయ ఓటుబ్యాంకు వారికి క్రమంగా దూరమవుతోంది. మరోవంక మాయావతి సారథ్యంలోని బీఎస్పీ సైతం యూపీలో భాజపాకు సిసలైన ప్రత్యామ్నాయంగా కనిపించడం లేదు. బడుగువర్గాలకు తాను బలమైన అండగా నిలబడతానని నిరూపించుకోవడంలో ఆ పార్టీ విఫలమవుతోంది. మోదీ ప్రవచిస్తున్న అభివృద్ధి అజెండాకు సమానస్థాయిలో ప్రత్యామ్నాయ విధానం వినిపించలేక ఎస్పీ, బీఎస్పీలు చేతులెత్తేశాయి. దళితులు, వెనకబడిన తరగతులకు పెద్దదిక్కుగా చెప్పుకొన్న మాయావతి క్రమంగా ఆ వర్గాలకు దూరమయ్యారు. ఇప్పుడు బడుగులంతా భాజపా దిశగా చూపుసారించారు. 2014నాటి సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ మూడో స్థానంలో నిలిచింది. ఆ తరవాత 2014-'16 మధ్యకాలంలో ఆ రాష్ట్రంలో బీఎస్పీకి ఉన్న దళితుల మద్దతు 26శాతంనుంచి 22శాతానికి కోసుకుపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం 19 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అత్యధిక యువ జనాభా భారత్ సొంతం. మంచి విద్యనభ్యసించి కొత్త ఆశలు, ఆకాంక్షలతో జీవితపథంలో అడుగిడే ఈ వర్గంపై భాజపా దృష్టిపెట్టింది. ముఖ్యంగా విద్యావంతులైన దళిత యువతను భాజపా బాగా ఆకట్టుకోగలుగుతోంది. ఉత్తర్ ప్రదేశ్ రాజకీయ సమీకరణలను అనూహ్యంగా మార్చివేసిన పరిణామమిది.

యూపీలో విజయదుందుభి మోగించిన కొంతకాలానికే బిహార్‌లోనూ పాలకస్థానం చేజిక్కించుకోవడం భాజపా జైత్రయాత్రకు దాఖలా. నాలుగేళ్లక్రితం భాజపాను వదిలి ఆర్జేడీతో అంటకాగి అధికారంలోకి వచ్చిన నితీశ్ కుమార్-



మోదీ, షా ఎత్తులకు చిత్తు

లాలూ కుటుంబ అవినీతిని భరించలేక కూటమినుంచి బయటకు వచ్చేశారు. తిరిగి భాజపాతో చేయికలిపి బిహార్ పాలన పీఠం అధిష్ఠించారు. దీంతో ఉత్తర భారతంలోని హిందీ రాష్ట్రాల్లో భాజపా విజయం పరిపూర్ణమైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నితీశ్‌తో జట్టుగా భాజపా వ్యతిరేక మహాకూటమిని ఏర్పాటు చేద్దామనుకున్న కాంగ్రెస్ ఆశలపై నీళ్లు చల్లిన పరిణామమిది. బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లు ఉమ్మడిగా 120 లోక్‌సభ సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తుండటం గమనార్హం. గడచిన మూడేళ్లలో కాంగ్రెస్ బలాధిక్యం ఉన్న హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోంవంటి రాష్ట్రాల్లో భాజపా పాగా వేయగలిగింది.

తమిళనాట కొత్త ఆట

జయలలిత మరణంతో చెల్లాచెదురైన ఏఐఏడీఎంకే వర్గాలన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకువచ్చి ఎన్డీఏ పక్షాన నిలిపే ప్రయత్నాలను కొంతకాలంగా భాజపా ముమ్మరం చేసింది. రాజకీయంగా శశికళ ఉత్థాన పతనాలను భాజపా అద్భుతమైన అవకాశాలుగా మలచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఏఐఏడీఎంకే వర్గాలన్నీ భాజపా తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబడ్డ రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతు పలకడం ద్వారా తమ ప్రస్థానం ఎన్డీయే ఛత్రం కిందే అని పరోక్షంగా చాటాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓట్ల శాతం 2.2శాతంనుంచి 2.8శాతానికి పెరిగింది. ఏఐఏడీఎంకే ఎన్డీయే పక్షాన నిలబడితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ సీట్ల పరంగా భాజపా మిత్రపక్షాలు మరింత బలం పుంజుకొనే అవకాశాలు కొట్టిపారేయలేనివి.

2016 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా మొట్టమొదటిసారిగా కేరళలో ఖాతా తెరిచింది. ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలిచి సత్తా చాటింది. 2014నాటి సార్వత్రిక ఎన్నికల్లో 11.3 శాతం ఓట్లతో రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. కేరళలో జరిగిన ఏ ఎన్నికల్లోనైనా భాజపా ఆ స్థాయి ఓట్లు దక్కించుకోవడం అదే ప్రథమం. భాజపాకు పెరుగుతున్న ఓట్లశాతం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, వామపక్షాలకు వణుకు పుట్టిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కేరళలో కనీసం అయిదు ఎంపీ స్థానాలు గెలుచుకునేందుకు భాజపా వ్యూహాలకు పదునుపెడుతోంది.

పశ్చిమ్ బంగలో కమలోదయం!

దేశానికి తూర్పున ఉన్న పశ్చిమ్ బంగలో మమతా బెనర్జీ పలుకుబడి క్రమంగా క్షీణిస్తోంది. డార్జిలింగ్‌లో చెలరేగిన గూర్ఖా ఉద్యమంపట్ల మరీ కర్కశంగా వ్యవహరించడంతో మమత చెడ్డపేరు మూటగట్టుకుంది. వీటికితోడు నారద టేపులు, చిట్‌ఫండ్ కుంభకోణాలు అంతకంతకూ ప్రభుత్వం మెడకు చుట్టుకుంటున్నాయి. తృణమూల్ నాయకులపై సీబీఐ విచారణ తీవ్రతరమయ్యేకొద్దీ ఆ పార్టీ ప్రాభవం కొడిగడుతోంది. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు భాజపానుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి. సీపీఐ(ఎం) ప్రతిష్ఠ అంతకంతకూ కొడిగడుతుండటం కూడా భాజపాకు కలిసివచ్చే అంశం. మమత ప్రభుత్వ తప్పిదాలపై గట్టి గళం వినిపించడంలో కమ్యూనిస్టులు వెనకబడిపోయారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వీధుల్లోకొచ్చి పోరాటం చేయగల సత్తాగల పార్టీగా భాజపా ప్రతిష్ఠ అంతకంతకూ పెరుగుతోంది.

కేజ్రీవాల్... స్వయంకృతాలు

దిల్లీ నగర పాలక ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పేలవ ప్రదర్శన తరవాతా అరవింద్ కేజ్రీవాల్ వైఖరిలో మార్పు రాలేదు. ప్రతి సమస్యకూ అవతలి పార్టీలను అనుక్షణం వేలెత్తి చూపుతూ, తాము మాత్రం పులుకడిగిన ముత్యాలమన్నట్లుగా మాట్లాడే కేజ్రీవాల్ ధోరణి పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవలి ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలదే తప్పు అంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు- ఆమ్ఆద్మీ నాయకత్వం తప్పులు దిద్దుకొనేందుకు ఏమాత్రం సుముఖంగా లేదన్న వాస్తవాన్నే వెల్లడించింది. నిర్మాణాత్మక విపక్షం ప్రజాస్వామ్యానికి ప్రాణం. పాలక పార్టీ వైఫల్యాలను, తప్పులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ దానిని సరైన దారిలో నడపడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత. ప్రభుత్వ విధానాలను, చర్యలను డేగ కళ్లతో గమనిస్తూ ప్రజలను చైతన్యపరచడంలో విపక్షాలు విఫలమైతే- అధికారపార్టీ నిరంకుశంగా మారిపోయే ప్రమాదం ఉంది. ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి ఇది ఏమాత్రం తగదు. దేశంలో నిర్మాణాత్మక విపక్షం జాడ కనిపించకపోవడమే దురదృష్టకరం. ఎన్నికలకోసం అవకాశవాద పొత్తులు కుదుర్చుకునే విపక్ష కూటమి ఎంతోకాలం స్థిరంగా ఉండలేదు. సిద్ధాంతపరంగా భాజపా బలమైన పునాదులు ఉన్న పార్టీ. దాన్ని ఎదుర్కొని నిలబడాలంటే నిజమైన, నిజాయతీగల ప్రత్యామ్నాయ దార్శనిక దృక్పథంతో విపక్షాలు ముందుకు రావాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పునఃసమీక్షించుకుని, విధానాలను పూర్తిగా తిరగరాసుకుంటే తప్ప ప్రతిపక్ష పార్టీలు ఈ దేశంలో పాలక పార్టీకి దీటుగా నిలబడగల పరిస్థితి లేదు.

- నీరజ్ కుమార్

పర్యాటకానికి ఆరోగ్యం



ఈదర శ్రీనివాసరెడ్డి

ఆధునిక జీవనం ఎన్నో అనారోగ్య సమస్యలకు అంటుకడుతోంది. మధుమేహం, తీవ్రమైన ఒత్తిడి, క్యాన్సర్, గుండె జబ్బుల వంటివి అంతకంతకూ విస్తరిస్తున్నాయి. అందుకే చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. వైద్య, ఆరోగ్య అవసరాలకోసం దేశ సరిహద్దులు దాటి విదేశాలకు వెళ్ళే వారి సంఖ్య సైతం ఇనుమడిస్తోంది. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం వంటి సంప్రదాయ చికిత్సలకోసం భారత్‌లో అడుగుమోపే విదేశీయుల సంఖ్యా పెరుగుతుండటంతో- ఆరోగ్య పర్యాటకం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

పెరుగుతున్న పోటీ

ప్రపంచ ఆరోగ్య పర్యాటక ప్రాంతాల్లో ఐరోపా దేశాలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. అంతర్జాతీయ 'ఆరోగ్య పర్యాటక సూచీ'ల్లో కెనడా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్‌లు ముందున్నాయి. గడచిన నాలుగేళ్లలో రష్యా, టర్కీ, పోలండ్‌లు సైతం ఆరోగ్య పర్యాటకంపై గట్టి శ్రద్ధపెట్టి అభివృద్ధి చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పర్యాటకం ద్వారా 67,800 కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతోంది. ఈ మార్కెట్లో వాటాకోసం అగ్రరాజ్యాలతోపాటు జోర్డాన్, ఫిలిప్పీన్స్ వంటి చిన్న దేశాలూ పోటీపడుతున్నాయి. 2013-'17 మధ్యకాలంలో 85లక్షల విదేశీ పర్యాటకులను రష్యా ఆకర్షించగలిగితే, ఫ్రాన్స్ 83లక్షల విదేశీయులను ఆకట్టుకొంది. అత్యంత ఆధునిక వైద్య సేవలు ఐరోపా దేశాల్లో లభిస్తున్నాయి. వాటికయ్యే ఖర్చు భారీగానే ఉంటోంది. కాబట్టి అందరి దృష్టీ ఇప్పుడు భారత్‌వైపు మరలుతోంది. ముఖ్యంగా ఆఫ్రికా; మధ్య, తూర్పు ఆసియా దేశాలు ఇప్పుడు వైద్య సాయం కోసం భారత్‌వైపు చూస్తున్నాయి. గుండె జబ్బులు, కీళ్లు, మోకాళ్ల మార్పిడి, క్యాన్సర్, మూత్రపిండ సమస్యలు, కాలేయ సంబంధిత వ్యాధులు, కృత్రిమ సంతానోత్పత్తి వంటి వైద్య చికిత్సలకోసం ఈ దేశాలనుంచి భారత్‌కు అత్యధికంగా విదేశీయులు తరలి వస్తున్నారు. అమెరికా, ఇంగ్లాండ్‌లతో పోల్చినప్పుడు భారత్‌లో వైద్య వ్యయం 30శాతం మాత్రమే! దాంతో పేద దేశాలతోపాటు సంపన్న రాజ్యాల యాత్రికులూ భారత్‌పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా, ఐరోపాల్లో సౌందర్య శస్త్ర చికిత్సలు బీమా పథకాల కిందికి రావు. దాంతో అక్కడినుంచి సౌందర్య చికిత్సకోసం మన దేశానికి వచ్చే యాత్రికుల సంఖ్య గణనీయంగా ఉంది. 2015-16లో 70లక్షల విదేశీ పర్యాటకులు కేవలం ఆరోగ్య అవసరాలకోసమే భారత్‌ను సందర్శించారు. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లో భారత్ వాటా 300 కోట్ల డాలర్లు కాగా- 2020నాటికి 80,000 కోట్లు బిలియన్ డాలర్ల విలువగల మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆరోగ్య పర్యాటక రంగంలో కేరళ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. మొత్తంగా ప్రపంచ మార్కెట్లో కేరళ అయిదు శాతం వాటా కలిగి ఉంది. 2020నాటికి ఈ వాటాను మరింత పెంచుకునేందుకు ఆ రాష్ట్రం ప్రణాళికలు రచిస్తోంది. 'ఆరోగ్య పర్యాటక పథకం' ద్వారా కేరళ పెద్దయెత్తున టూరిస్టులను ఆకర్షిస్తోంది. ఆరోగ్యంతోపాటు ఆహ్లాదకరమైన ప్రకృతి రమణీయ స్థలాలు ఉండటంవల్ల విశ్రాంతి వినోదాలతోపాటు- ఆరోగ్య పరిరక్షణ పొందవచ్చునన్న ఉద్దేశంతో ఎక్కువమంది పర్యాటకులు కేరళవైపు ఆకర్షితులవుతున్నారు. కేరళ మాత్రమే కాకుండా భారత్‌లోని మరెన్నో ప్రాంతాల్లో ప్రాచీన వైద్య విధానాల ద్వారా క్యాన్సర్ వంటి సమస్యలకూ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. యోగ, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్సవంటి ఎన్నో శాస్త్రీయ చికిత్స విధానాలు నాలుగు శతాబ్దాలుగా వారసత్వంగా కొనసాగుతున్న దేశం మనది. వీటివల్ల ఆరోగ్య పరంగా మేలు జరగడంతోపాటు- ఎలాంటి దుష్ప్రభావాలూ లేకపోవడంతో అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్నాయి.



ప్రగతికి అవకాశం

ఆసియాలో ఆరోగ్య పర్యాటక వ్యాపారం గణనీయంగా పెరుగుతోంది. థాయ్‌లాండ్, సింగపూర్, దక్షిణ కొరియా, దుబాయ్‌లు ఈ మార్కెట్‌ను చేజిక్కించుకునే దిశగా వేగంగా పావులు కదుపుతున్నాయి. వాటితో పోలిస్తే భారత్‌లో నిష్ణాతులైన వైద్యులు, ఆధునిక మౌలిక వసతులు ఎక్కువే. కాకపోతే పాశ్చాత్య దేశాలను ఆకట్టుకొనేందుకు సేంద్రియ ఉత్పత్తులు, శాఖాహార ఆహార విధానాలు, పంటపొలం నుంచి వేరుగా ప్రకృతి వైద్యశాలకు చేర్చే వివిధ పద్ధతులను విస్తరించాల్సి ఉంది. కార్పొరేట్ రంగంలోని వైద్యశాలలు తమ వాటా పెంచుకొనేందుకు వివిధ పర్యాటక ప్రదేశాల్లో అధునాతన విభాగాలను ప్రారంభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వాటిని తీర్చిదిద్ది విదేశీ యాత్రికులను ఆకర్షిస్తున్నాయి. అందుకోసం (ఇ.సి.హెచ్.ఓ.ఎమ్) అంతర్జాతీయ ఆరోగ్య విధానాల ఫలితాల అంచనా సమాఖ్య నుంచి గుర్తింపు పొందటానికి అన్ని అధునాతన విధానాలకు శ్రీకారం చుడుతున్నారు.

భారత్‌లో తయారీ తరహాలోనే 'హీల్ ఇన్ ఇండియా' (భారత్‌లో ఆరోగ్యం పొందండి) విధానం ప్రవేశపెట్టి ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సేవలను విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం 2015లోనే జాతీయ వైద్య, ఆరోగ్య పర్యాటక అభివృద్ధి సంస్థను స్థాపించారు. కానీ, ఆచరణలో ఈ సంస్థ పనితీరు అంతంతమాత్రంగా ఉంది. 2014లో 1,84,298మంది విదేశీ యాత్రికులు వైద్యసేవల కోసం భారత్‌కు రాగా, 2015లో 2,33,918 మంది, 2016లో 3,16,060 మంది దేశానికి వచ్చారు. వచ్చే ఏడాదికి నాలుగు లక్షల మంది విదేశీ టూరిస్టులను ఆకర్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ విషయంలో పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లు భారత్‌తో పోలిస్తే ఎంతో ముందుండటం గమనార్హం.

కొత్త బలంతో ముందుకు...

అంతర్జాతీయ వైద్య, ఆరోగ్య పర్యాటక రంగంలో భారత్ ముందు వరసలో నిలబడాలంటే- బలాలను కూడగట్టుకుని సంపూర్ణ వైద్య విధానంతో సాగాలి. అందుకనుగుణంగా వైద్య చట్టాలనూ మార్పు చేర్పులు చేసుకోవాలి. భారతీయ వైద్యశాలల సందర్శనకు విదేశాలకు వీసా సులభంగా లభించే ఏర్పాట్లు ఉండాలి. దేశంలోని గుర్తింపు పొందిన, అంతర్జాతీయ ప్రమాణాలున్న వైద్యశాలల గురించి రాయబార కార్యాలయాల ద్వారా ప్రపంచమంతటా ప్రచారం చెయ్యాలి. పర్యాటక; వైద్య, ఆరోగ్య శాఖలను సమన్వయపరచి విదేశీయాత్రికులకు సులభంగా వసతి, రవాణా, వైద్యసేవలు గుండుగుత్తగా అందించే 'ప్యాకేజీ'కి రూపకల్పన చేయాలి. భారత్‌ను సందర్శిస్తున్న వారిలో 30శాతం దక్షిణాసియా దేశాలకు చెందిన వారు కాగా- 32శాతం ఆఫ్రికా వాసులు, 10శాతం ఐరోపా దేశీయులు ఉన్నారు. ప్రపంచవ్యాప్త వైద్య పర్యాటకుల్లో కేవలం 6.4శాతం యాత్రికులు మాత్రమే భారత్‌ను సందర్శిస్తున్నారు. వీరివల్ల 2015లో 17శాతం విదేశీ మారకం లభించింది. ఈ ఆదాయాన్ని పెంచుకుంటే- దేశం అభివృద్ధి సాధించడమేగాక పర్యాటక రంగంలోనూ ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. విదేశీ రోగులకోసం ఏర్పాటుచేసిన అధునాతన మౌలిక వసతులను తక్కువ ధరలకే భారతీయ గ్రామీణ ప్రాంత పేద రోగులకూ అందుబాటులోకి తీసుకురావచ్చు. చరకుడు, పతంజలి, శుశ్రూతుడు వంటి ఎందరో మహానుభావులు ఎన్నో వైద్య చికిత్సా విధానాల ద్వారా భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేశారు. ఆ సమున్నత వైభవాన్ని ప్రపంచానికి అందుబాటులోకి తీసుకువస్తే- 'ఆరోగ్య పర్యాటకం'లో భారత్ తిరుగులేని స్థాయికి చేరుతుంది.

(రచయిత- ప్రిన్సిపల్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

కృష్ణ తత్త్వం

కృష్ణాష్టమి అంటే- కృష్ణ, అష్టమి. ఇది కృష్ణపక్షంలో వచ్చే అష్టమి. కృష్ణుడు జన్మించిన అష్టమి. శ్రావణ కృష్ణపక్ష అష్టమి నాటి రాత్రికి శాక్తేయ సిద్ధాంతంలో 'మోహ రాత్రి' అని పేరు. కృష్ణజన్మకు పూర్వమే గల ఈ రాత్రి ఉపాసకులకు ప్రధానమైనది. ప్రత్యేక మహిమ కలిగిన రాత్రి ఇది. కృష్ణుడు పుట్టిన సమయానికే, నంద గోకులంలో యశోదాదేవికి పుత్రికగా మహాశక్తి యోగమాయ జన్మించింది. ఆ తల్లి పుట్టిన అష్టమి కూడా ఇదే!

దైవీ గుణసంపద గలవారి మోహాది మాయాజాలాన్ని క్షయింపజేసే మోక్ష కారకుడు, జగన్మోహనుడు శ్రీకృష్ణుడు. ఆ అవతారం అగాధమైనది, అనంతమైనది! పరమాత్మ తత్వాన్ని, ఉపనిషత్ రహస్యాలను తన లీలల ద్వారా ప్రకటించిన భగవానుడు ఆయన. ప్రేమ, రౌద్ర, వీర, కరుణ, హాస, శాంతాది భావాల్ని ప్రకటించిన గోవిందుడి గాథ- వివిధ కోణాల్లో దివ్యత్వాన్ని ఆవిష్కరించింది.

బాల్యంలోనే దావాగ్నిని మింగి గోకులాన్ని కాచిన స్వామి ఆయన. బ్రహ్మదేవుడి అహాన్ని అణచివేస్తూ- ఏకకాలంలో అనేకంగా లేగల, గోప బాలుర రూపాల్ని ధరించి అబ్బురపరచాడు. మట్టుపెట్టడానికి మాయారూపాలతో వచ్చిన దనుజుల్ని చడీచప్పుడు లేకుండా రూపుమాపిన బాల వీరమూర్తి కృష్ణుడు. అరచేతితో గోవర్ధనగిరిని ఎత్తినవాడు. స్వర్గలోకంలోని ఇంద్రుడి దర్పాన్ని నిగ్రహించాడు. శుద్ధ జలాల్ని విషమయం చేసిన కాళీయ సర్పాన్ని నియంత్రించాడు. ఫణి ఫణాలపై నర్తించి, అతడిని ఆ నీటి నెలవు నుంచి మళ్లించి, సురక్షిత స్థలానికి పంపి అనుగ్రహించాడు. ప్రకృతిని కలుష రహితంగా ఉంచాలని సకల మానవాళికీ బోధించాడు కృష్ణుడు.

బహుజన్మల యోగసాధనతో పరబ్రహ్మ ప్రాప్తి కోసం గోపికా రూపాలు ధరించిన శుద్ధ జీవులకు ఆయన బ్రహ్మానంద రసానుభవాన్ని ప్రసాదించాడు. రాసలీలా వినోది, నాదావతారుడికి వేణుగానాన్ని వినిపించిన సంగీత మూర్తి కృష్ణపరమాత్మ.

కృష్ణుడు కువలయాపీడం అనే మదగజాన్ని నిరోధించాడు. చాణూర ముష్టికాది మల్లయోధుల్ని ఓడించాడు. కంస శిశుపాలాది దుష్టుల్ని దునుమాడిన ప్రతాపశాలి ఆయన. జరాసంధ, రుక్మి, కాలయవనుడు వంటి దుర్మార్గుల దురాగతాల్ని అడ్డుకున్నాడు. ఆయన రాజనీతి చతురుడు. వంచనతో ఆగకుండా ద్రౌపదీదేవిని నిండుసభలో పరాభవించిన కౌరవుల్ని హెచ్చరించాడు. అనివార్యమైన సంగ్రామంలో వారికి తగిన పాఠం చెప్పిన ధర్మరక్షకుడు కృష్ణుడు.



కృష్ణభగవానుడు ఆర్తితో శరణు వేడిన పాంచాలిని ఆదుకున్నాడు. ధర్మానికి కట్టుబడి తనను ఆశ్రయించిన పాండవుల్ని దరిజేర్చుకున్నాడు. జ్ఞానభక్తుడై చేరుకున్న కుచేలుణ్ని ఆదరించిన స్వామి ఆయన. జరాసంధుడి చెరలో గల ఎనభై మంది రాజుల్ని విడిపించి, సుస్థిరత కలిగించిన కృపాళువు. నరకాసురుడి బారిన పడిన పదహారువేల మంది రాచకన్యలకు, వారి కోరిక మేరకు భద్రత చేకూర్చిన క్షేమంకరుడు! తన వైపు గల సైన్యం కంటే తానే చాలని ఎంచుకున్న అర్జునుడి రథానికి సారథిగా విజయాన్ని ప్రసాదించాడు. కృష్ణుడు విశ్వజనీన తత్వశాస్త్రమైన గీతామృతాన్ని వర్షించిన జ్ఞానానంద మూర్తి. తన, పర అనే భేదం లేకుండా, వారి వారి కర్మలకు అనుగుణంగా ఫలాల్ని ప్రసాదించాడు. చెక్కుచెదరని చిరునవ్వుతో నిలిచిన ఆయన 'యోగీశ్వరేశ్వరుడు'.

వేదాల నుంచి విస్తరించిన కర్మ, యోగ, ఉపాసన, తత్వమార్గాల్ని కృష్ణుడు చక్కగా సమన్వయించాడు. సర్వశాస్త్రసారంగా అర్జునుడికి గీతాశాస్త్రాన్ని బోధించడమే కాక, తన అవతార పరిసమాప్తి వేళ ఉద్ధవుడికి తత్వబోధ చేసిన జగద్గురువు ఆయన.

అవతార కాలంలోనే కాక ఆ తరవాతి కాలంలోనూ- తనను స్మరించి, ఆరాధించి, కీర్తించిన యోగుల్ని తరింపజేసిన భగవానుడు. శుక యోగి, ఆదిశంకరులు, రామానుజాచార్య, మధ్వాచార్య, చైతన్య మహాప్రభు, వల్లభాచార్య, జయదేవుడు, పోతన, లీలాశుకుడు, నారాయణ తీర్థులు, మధుసూదన సరస్వతి, మీరాబాయి, తుకారాం, సక్కుబాయి, సూరదాసు... ఇలా ఎందరెందరో కృష్ణయోగులున్నారు. వారందరూ సాత్విక, మధుర, దివ్య భక్తిమార్గంలో జ్యోతి స్వరూపులై వెలుగునింపారు.

ఇంతమంది మహాత్ముల భావనలో ప్రకాశించిన శ్రీకృష్ణ చైతన్యానికి సమస్త భక్తకోటీ సాదర ప్రణామాలు అందజేస్తోంది!

- సామవేదం షణ్ముఖ శర్మ

అంతర్యామి

నియామకాలిక్కడ.. పనిచేసేదెక్కడో!

- పేరుకే ప్రజారోగ్య పరిధి
- 'సర్దుబాటు'తో అస్తవ్యస్తంగా ప్రజారోగ్యం
- సేవలు మాత్రం వైద్య విద్య, వైద్య విధాన పరిషత్, జైళ్లు, పోలీసు విభాగాల్లో
- ఇదే తరహాలో 60శాతం మంది వైద్యులు విధులు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో భారీగా వైద్యుల కొరత

ఈనాడు – హైదరాబాద్

ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నియమితులైన వైద్యుల్లో దాదాపు 60 శాతం మందికిపైగా ఇతర విభాగాల్లో సేవలందించడానికి సర్దుబాటు(డిప్యూటేషన్)పై వెళ్లారు. మరో 10-15శాతం పోస్టులు దీర్ఘకాలంగా భర్తీకి నోచుకోక ఖాళీగా ఉంటున్నాయి. వీటిల్లో తాత్కాలిక ప్రాతిపదికన కొన్ని పోస్టులను, జాతీయ ఆరోగ్య మిషన్ పథకాల్లో భాగంగా ఒప్పంద ప్రాతిపదికన మరికొన్ని నియమించి నెట్టుకొస్తున్నారు. తెలంగాణలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) కేవలం 25-30శాతం మంది ప్రభుత్వ వైద్యులు మాత్రమే సేవలందిస్తున్నారు. భారీగా వైద్యుల కొరత వేధిస్తుండడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులకు సాధారణ సేవలు కూడా లభించని పరిస్థితి.

ఏం జరుగుతోంది?

పీహెచ్‌సీల్లో పనిచేయడానికి ఎంబీబీఎస్, బీడీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్లను నియమిస్తారు. ఇలా నియమితులైన వైద్యులు గ్రామీణంలో పనిచేయాల్సి ఉంటుంది. గతంలో ప్రభుత్వం గ్రామీణంలో పనిచేసే వైద్యులకు ఒక వెసులుబాటు కల్పించింది. మూడేళ్లపాటు గ్రామీణంలో, రెండేళ్లపాటు అటవీ ప్రాంతంలో పనిచేస్తే పీజీ వైద్యవిద్య సీట్లలో కన్వీనర్‌కోటాలో క్లినికల్ విభాగంలో 30శాతం, నాన్‌క్లినికల్ విభాగంలో 50శాతం సీట్లను కేటాయిస్తోంది. అలా ఇన్‌సర్వీసు కోటా(ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులకిచ్చే రిజర్వేషన్) కింద ఏటా 150-200మంది వరకూ కన్వీనర్‌కోటాలో పీజీ వైద్యవిద్య అభ్యసిస్తున్నారు. అలా పీజీ వైద్యవిద్య పూర్తి చేసిన స్పెషలిస్టు వైద్యులు తమ మాతృవిభాగమైన ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో పనిచేయడానికి ఆసక్తి చూపడంలేదు. పీహెచ్‌సీల్లో స్పెషలిస్టు సేవలకనుగుణంగా సదుపాయాలు కల్పించకపోవడంతో ఇన్‌సర్వీస్ పీజీ వైద్యులు ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో వీరిని 'సర్దుబాటు' ప్రాతిపదికన వేర్వేరు విభాగాల్లో నియమిస్తూ వస్తోంది. రాష్ట్రంలో మొత్తం 1367 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మంజూరై ఉండగా వీరిలో దాదాపు 700-800 మంది వరకు వైద్యవిధాన పరిషత్, వైద్యవిద్య సంచాలకులు, జైళ్లు, పోలీసు, ఆరోగ్యశ్రీ, తదితర విభాగాల్లో సర్దుబాటు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే ఇప్పటికీ పీజీ చేసి కూడా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నారు. వాస్తవంగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులు సుమారు 300మంది వరకూ ఉంటారని అంచనా. మిగిలిన సుమారు 400ఖాళీల్లో ఒప్పంద వైద్యులే. అసలు ఏయే వైద్యులు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారనే సమగ్ర సమాచారం ప్రజారోగ్య సంచాలకుల వద్ద లేకపోవడం గమనార్హం. ఆయావైద్యుల సర్వీసు వ్యవహారాల్లో భాగంగా వస్తే తప్ప, వారి గురించి తెలియనంత దీనస్థితిలో ఈ విభాగం పనిచేస్తోంది.

సర్దుబాటే అసలు సమస్య..

పీజీ వైద్యవిద్య పూర్తిచేసిన వైద్యులు 'సర్దుబాటు'పేరిట వేర్వేరు విభాగాల్లో సేవలందిస్తుండడంతో ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో ఆ పోస్టులను ఖాళీలుగా చూపించలేకపోతున్నారు. దీంతో ఆ పోస్టుల్లో వైద్యుల్లేక, కొత్త నియామకాలు చేపట్టక రెంటికి చెడ్డ రేవడిలా ప్రాథమిక ఆరోగ్యం కునారిల్లుతోంది. రాష్ట్రంలో 731 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటిల్లో చాలావరకు ఒక వైద్యుడే సేవలందిస్తున్నారు. వీరిలోనూ 60శాతానికి పైగా ఒప్పంద వైద్యులే. దీంతో పీహెచ్‌సీల్లో నెలకు 10 కాన్పులు కూడా జరపడంలేదు. ఈ ఒక్కరే సంచార వైద్య సేవలు, సమావేశాలకూ హాజరుకావాల్సి ఉండడంతో అత్యధిక సందర్భాల్లో వైద్యసేవలూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేటును ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి, సర్దుబాటు విధానానికి స్వస్తి పలకాల్సిన అవసరముంది. ఒకవేళ పీజీ వైద్యసేవలు వినియోగించుకోలేని పరిస్థితి ఉంటే ఆమేరకు ఎప్పటికప్పుడూ ఖాళీలను భర్తీ చేసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదో పోలీస్ సెటిల్‌మెంట్

- ఠాణాలో బాధితుడి అక్రమ నిర్బంధం
- బలవంతంగా చెక్కులపై సంతకాలు
- సైబరాబాద్ కమిషనర్ ఆగ్రహం..
- అదనపు డీసీపీ, సీఐలపై కేసుల నమోదు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, రాయదుర్గం: ఓ స్థల వివాదంలో తలదూర్చిన ఖాకీలు ఠాణాలోనే సెటిల్‌మెంట్‌కు పాల్పడ్డారు. బాధితుడిని నిర్బంధించి చెక్కులపై బలవంతంగా సంతకాలు తీసుకున్నారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీస్ ఉన్నతాధికారులు జరిపిన విచారణలో వాస్తవాలు వెలుగుచూడటంతో 'సెటిల్‌మెంట్' ఖాకీలపై కేసు నమోదైంది. వివాదంలో తలదూర్చిన అదనపు డీసీపీతోపాటు ఆ ఠాణా ఎస్‌హెచ్‌వోపై అదే ఠాణాలో కేసు నమోదు కావడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి.. పటాన్‌చెరు సమీపంలోని ముత్తంగిలోని ఓ స్థలంపై రాచకొండ అదనపు డీసీపీ (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్) టి.పులిందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యారెడ్డికి అబూబకర్ అనే వ్యక్తికి మధ్య వివాదం నడుస్తోంది. రూ.5 లక్షలు బయానాగా తీసుకొని తనకు స్థలం విక్రయించేందుకు ఒప్పందం రాసిచ్చిన అబూబకర్.. ఆ ఒప్పందం ఉల్లంఘించి ఇతరులకు అమ్మారంటూ ఐశ్వర్యారెడ్డి గతనెల 25న రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇదే విషయంలో అబూబకర్‌ను ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఠాణాకు పిలిపించారు. అది సివిల్ వివాదమయినా.. పోలీసులు హద్దు మీరారు. పులిందర్‌రెడ్డి ఒత్తిడి మేరకు బాధితుడిని ఠాణాలో నిర్బంధించారు. అతడితో మూడు చెక్కులపై రూ.60 లక్షలకు బలవంతంగా సంతకాలు తీసుకుని వదిలేశారు. అనంతరం బాధితుడు కమిషనర్ సందీప్‌శాండిల్యను కలిసి మొర పెట్టుకున్నాడు. ఆయన ఆదేశాలతో మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ రమణకుమార్ విచారణ జరిపారు. బాధితుడితో బలవంతంగా చెక్కులు తీసుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ ఆదేశాల మేరకు పులిందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, రాజశేఖర్, లక్ష్మీనారాయణతోపాటు ఐశ్వర్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సీఐపై వేటు పడే అవకాశమున్నట్లు సమాచారం. గతంలో సైబరాబాద్‌లో ట్రాఫిక్ అదనపు డీసీపీగా పనిచేసిన పులిందర్‌రెడ్డి వివాదస్పదుడిగా ముద్రపడ్డారు. అప్పట్లో అక్రమ వసూళ్ల ఆరోపణలపై డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. తాజాగా భూవివాదంలో ఇరుక్కొని కేసులో చిక్కుకోవడంతో అతడిపై చర్యలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదీ వివాదం..: పటాన్‌చెరు సమీపంలోని ముత్తంగి గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన సుమారు ఎకరం స్థలాన్ని ముజీబ్ అనే వ్యక్తి రూ.కోటి వెచ్చించి కొనేందుకు బయానాగా రూ.10 లక్షలు చెల్లించారు. గడువు పూర్తయినా మిగిలిన మొత్తాన్ని చెల్లించకపోవడంతో రైతుల నుంచి సోదరులైన అబూబకర్, అబ్దుల్లా కొనాలని నిర్ణయించుకొని రూ.20 లక్షలు చెల్లించారు. వారూ గడువులోగా డబ్బులు చెల్లించలేకపోయారు. ఆ సమయంలో వీరికి పరిచయం ఉన్న ప్రస్తుత అదనపు డీసీపీ టి.పులిందర్‌రెడ్డి ఈ వివాదంలోకి ప్రవేశించారు. అదే స్థలం కొంతమేరకు ఆక్రమణకు గురవడం.. మిగిలిన సొమ్ము సమకూరకపోవడంతో స్థలం చేజారే ప్రమాదముందని సోదరులిద్దరూ పులిందర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపారు. స్థలం వివాదంలో ఉన్నందున అదనపు డీసీపీ సహకారం అవసరమని భావించి అతడి కుమార్తె ఐశ్వర్యరెడ్డికి స్థలాన్ని విక్రయించినట్లుగా ఒప్పందం రాసుకున్నారు. మరోవైపు మిగిలిన సొమ్ము చెల్లించాలని రైతుల నుంచి ఒత్తిడి పెరిగింది. కానీ రోజులు గడిచినా వీరు సొమ్ము చెల్లించకపోవడంతో అదే స్థలాన్ని గంగాధర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి కొనుగోలు చేశారు. వీరిద్దరు ఆ స్థలం కోసం రైతులిద్దరికీ రూ.45 లక్షలు, ముజీబ్‌కు రూ.20 లక్షలు, అబూబకర్, అబ్దుల్లాకు రూ.30 లక్షలు, ఇతర వివాదాల పరిష్కారానికి రూ.25 లక్షలు చెల్లించి స్థలాన్ని సొంతం చేసుకున్నారు. అయితే అబూబకర్, అబ్దుల్లా స్థలాన్ని విక్రయించిన సంగతి తర్వాత తెలుసుకున్న పులిందర్‌రెడ్డి, అతడి కుమార్తె ఐశ్వర్యరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఇలా ఎందుకు చేశారంటూ నిలదీశారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈనేపథ్యంలో గత నెల 25న ఐశ్వర్యారెడ్డి రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అబూబకర్‌పై ఫిర్యాదు చేశారు. తనకు స్థలం అమ్మేందుకు రూ.5 లక్షలు బయానాగా తీసుకొన్న అబూబకర్.. అదే స్థలాన్ని మరొకరికి విక్రయించి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేక్రమంలో రాయదుర్గం పోలీసులు అబూబకర్‌ను ఠాణాకు పిలిపించి బలవంతంగా చెక్కులపై సంతకాలు తీసుకోవడంతో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి.



కాలిపోతున్న సెల్‌ఫోన్ (అంతర్ చిత్రంలో) బాధితుని తొడభాగంపై గాయం

ప్యాంట్ జేబులో పేలిన చరవాణి

త్రుటిలో తప్పిన ప్రమాదం

రావులపాలెం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రావులపాలేనికి చెందిన భావన సూర్యకిరణ్ 20 రోజుల క్రితం రెడ్ ఎం.ఐ నోట్-4 చరవాణిని కొనుగోలు చేశారు. ఆదివారం దానిని ప్యాంట్ జేబులో పెట్టుకుని ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కొంతదూరం వెళ్లగానే ఒక్కసారిగా జేబులో నుంచి మంటలు రావడంతో బండి దిగి చూసేసరికి ఫోన్ కాలిపోతూ కనిపించింది. అతని తొడకు గాయాలయ్యాయి.

కుంతియాది అవగాహనా రాహిత్యం

ఎంపీ బూరనర్సయ్యగౌడ్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు రామచంద్రకుంతియాకు తెలంగాణ మీద ఏమాత్రం అవగాహన లేదని, సీఎం కేసీఆర్‌పై ఆయన వ్యాఖ్యలు అర్థంపర్థం లేనివని భువనగిరి (తెరాస) ఎంపీ బూరనర్సయ్యగౌడ్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని, దీనిపై కుంతియాకు ఎలాంటి సమాచారం లేకపోవడం కాంగ్రెస్ పార్టీ వైఫల్యాన్ని చాటుతోందని పేర్కొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

- పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో నిర్ణయం



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఆర్సీ కుంతియా, నేతలు షబ్బీర్‌అలీ, మధుయాస్కి, భట్టివిక్రమార్క, జానారెడ్డి, నంది ఎల్లయ్య, పొన్నాల లక్ష్మయ్య తదితరులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ నిర్బంధం కొనసాగుతోందని, పోలీసు రాజ్యం నడుస్తోందని ఆరోపిస్తూ తెరాస ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. మిషన్ 2019 పేరుతో తెలంగాణలో ప్రజాపాలన అందించేందుకు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయాలని తీర్మానించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడినవర్గాలపై దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తీర్మానించింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌ఛార్జి ఆర్.సి.కుంతియా నేతృత్వంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సతీష్ జర్కోలి, సీఎల్పీ నాయకుడు కె.జానారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టివిక్రమార్క, మండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్‌అలీ, ఎంపీ రేణుకా చౌదరి, పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య సహా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

రాహుల్ సందేశ యాత్రలు

గడప గడపకు కాంగ్రెస్ పేరుతో ప్రతి ఇంటికి పార్టీ విధానాలను చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టడంతో పాటు బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. సెప్టెంబరు 30లోపు బూత్, గ్రామ, డివిజన్, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు పూర్తి చేయాలని, బూత్ స్థాయి, బ్లాక్ స్థాయి ఏజెంట్లను నియమించాలని నిర్ణయించారు. ఆగస్టు 20లోగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో సోషల్‌మీడియా కో ఆర్డినేటర్లను నియమించనున్నారు. గాంధీభవన్‌లో రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ విభాగం, పీసీసీ సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గ, మండల, డివిజన్ కేంద్రాల్లో రాహుల్‌గాంధీ సందేశ యాత్రలు నిర్వహించి ఆయన ప్రసంగాలను తెలుగులో అనువదించి ప్రజలకు పంచి పెట్టనున్నారు. తెలంగాణ ప్రభుత్వంపై తీసుకువచ్చిన ఛార్జిషీట్‌ను ప్రజలకు పంచి పెట్టాలని నిర్ణయించారు. కార్యవర్గ సమావేశం వివరాలను టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌లు మీడియాకు వివరించారు.

కేసులను సీబీఐకి అప్పగించాలి

తెలంగాణలో తక్షణం ఉద్యోగాలు భర్తీ చేయాలని వీరు డిమాండ్ చేశారు. మియాపూర్ భూముల కుంభకోణం, ఇసుక మాఫియా, నయీం, డ్రగ్స్ కేసులలో సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటరుణాలు అందడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పౌరహక్కుల్ని కాలరాస్తున్నారని, ఉద్యమాలు చేస్తున్నవారిని నిర్బంధిస్తున్నారని అన్నారు. భూసేకరణ తీరును వ్యతిరేకిస్తూ న్యాయస్థానాలను రైతులు ఆశ్రయిస్తుంటే కాంగ్రెస్ కేసులు వేస్తోందని ప్రభుత్వం ఆరోపిస్తోందన్నారు.

నాలుగు తీర్మానాలు

గుజరాత్ పర్యటనలో రాహుల్‌గాంధీపై భాజపా దాడిని ఖండిస్తూ, యూపీలో 60 మంది చిన్నారుల మృతికి భాజపా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, సిరిసిల్లలో ఇసుక మాఫియా లారీలకు అమాయకులు చనిపోతున్న వైనాన్ని ఖండిస్తూ, సిరిసిల్లలో దళితులు, బీసీలను అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు క్రూరంగా హింసించడాన్ని నిరసిస్తూ తీర్మానాలు చేశారు.

ఉద్యమాలను అణచివేస్తే పతనం తప్పదు: తమ్మినేని

సంగారెడ్డి, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాలను అణచివేస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. సంగారెడ్డిలో టీ-మాస్ జిల్లా ఫోరం ఆవిర్భావ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐకాస ఛైర్మన్ కోదండరాంను ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కేబినెట్‌లో సామాజిక న్యాయం లేదన్నారు.

ఇరాన్‌లో ఓ నగరంలో క్లోరిన్ వాయువు లీకై 300 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. డెజ్ఫుల్‌లోని నీటి సరఫరా రిజర్వాయర్ నుంచి లీకైనట్లు గుర్తించారు.

ఉన్నత విద్యలో ప్రధానాచార్యులేరి?

- సగం డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు ఇన్‌ఛార్జిలే దిక్కు
- పీహెచ్‌డీ నిబంధనతో డిగ్రీలో అర్హులు లేరు
- పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్డుకుంటున్న అనర్హుల ముఠా
- అధ్యాపకులకే అదనపు బాధ్యతలతో కుంటుపడుతున్న బోధన

ఈనాడు – హైదరాబాద్

ఉన్నత విద్యా కళాశాలల్లో ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోంది. అర్హులు లేక సగం డిగ్రీ కళాశాలలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లు పనిచేస్తుండగా.. అర్హులున్నా పాలిటెక్నిక్ కళాశాలల్లోని అధ్యాపకులకు పదోన్నతులు ఇవ్వకుండా విద్యాశాఖ తాత్సారం చేస్తోంది. కారణాలు ఏమైనా విద్యాబోధన కుంటుపడి విద్యార్థులు నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లే దిక్కుగా మారారు. సగానికిపైగా కళాశాలల్లో ఇన్‌ఛార్జులే. పాలిటెక్నిక్ కళాశాలలు 57 ఉండగా 38 చోట్ల రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు లేరు. 132 డిగ్రీ కళాశాలల్లో 53 చోట్ల మాత్రమే శాశ్వత ప్రిన్సిపాళ్లు ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

పాలిటెక్నిక్ కళాశాలలు.. ఆరేళ్లుగా మోకాలడ్డు: రాష్ట్రంలో 57 పాలిటెక్నిక్ కళాశాలలుండగా 49 కళాశాలలకు ప్రిన్సిపాల్ ఉద్యోగాలు మంజూరయ్యాయి. అంటే 8 కళాశాలల్లో ప్రిన్సిపాల్ పోస్టులే లేవు. 49 కళాశాలల్లో 30 చోట్ల రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు లేరు. ఎవరో ఒక సీనియర్ అధ్యాపకులకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బాధ్యత అప్పగిస్తున్నారు ప్రిన్సిపాళ్లుగా అర్హులు లేరా అంటే ఎంతో మంది ఉన్నారు. ఇంజినీరింగేతర బ్రాంచీల వారికి పీహెచ్‌డీ ఉండాలి. ఇంజినీరింగ్ బ్రాంచి అధ్యాపకులు ప్రిన్సిపాల్‌గా అర్హత పొందాలంటే బీటెక్, ఎంటెక్‌లో ఒక దాంట్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. ఆ అర్హతలు ఉన్నాయని 2012-13 నుంచి ఏటా సాంకేతిక విద్యా శాఖ నుంచి రాష్ట్ర విద్యాశాఖకు ప్రతిపాదనలు (ప్యానెల్ జాబితా) పంపుతూనే ఉన్నారు. ఏటా ఆగస్టు 31లోగా పదోన్నతుల కమిటీ (డీపీసీ) నిర్ణయం తీసుకోవాలి. అయితే అర్హులతో కూడిన జాబితాను విద్యాశాఖ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి పంపడం లేదన్న విమర్శలున్నాయి. పదోన్నతులకు అర్హత లేనివారు కొందరు అర్హులకు పదోన్నతులు దక్కకుండా ముడుపులు, రాజకీయ పలుకుబడితో సచివాలయంలో చక్రం తిప్పుతున్నారని సమాచారం. ఫలితం గత ఆరేళ్లుగా అర్హులైన అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు దక్కడం లేదు. విద్యాశాఖ ప్రిన్సిపాళ్ల పదోన్నతుల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై అధ్యాపకులు మండిపడుతున్నారు.

డిగ్రీ కళాశాలలు.. సర్వీసు, పీహెచ్‌డీ నిబంధనలే అడ్డంకి: డిగ్రీ కళాశాలలోని అధ్యాపకులు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందాలంటే 15 సంవత్సరాల అనుభవంతో పాటు పీహెచ్‌డీ ఉండాలని ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2007లో జీఓ విడుదల చేసింది. 1986 నుంచి ఉద్యోగంలో చేరిన వారందరికీ జీవో వర్తిస్తుందని పేర్కొన్నారు. దాంతో 25- 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారు కూడా అధ్యాపకులుగా చేరి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందలేకపోతున్నారు. తాత్కాలిక అధ్యాపకులుగా చేస్తున్న 160 మందిని 1996లో క్రమబద్ధీకరించారు. వారిలో పీహెచ్‌డీ ఉన్నవారు పదోన్నతులు పొందగా పీహెచ్‌డీ లేనివారు పాతికేళ్ల సర్వీసున్నా అవకాశం దక్కించుకోలేకపోయారు. జూనియర్ కళాశాలల నుంచి డిగ్రీ అధ్యాపకులుగా పదోన్నతులు పొందిన వారు తప్పనిసరిగా ఐదేళ్లలో జాతీయ అర్హత పరీక్ష లేదా రాష్ట్ర అర్హత పరీక్ష లేదా పీహెచ్‌డీ అర్హత సాధించాలని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. వారు పీహెచ్‌డీలో చేరితే ఐదేళ్ల వేతనాలు ఇచ్చింది. తమకు కూడా ఇస్తే తామూ పీహెచ్‌డీ చేసేవాళ్లమని ప్రత్యక్ష నియామకాల ద్వారా అధ్యాపకులుగా వచ్చినవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో మొత్తం 130 కళాశాలల్లో కేవలం 53 చోట్లే శాశ్వత ప్రిన్సిపాళ్లు ఉన్నారు. 14 కళాశాలలకు అసలు ప్రిన్సిపాళ్ల పోస్టుల్నే ప్రభుత్వం మంజూరు చేయలేదు. అలాంటి వాటిలో హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి, మల్కాజిగిరి తదితర కళాశాలలున్నాయి.

అంతర్గతంగా రగడ

డిగ్రీ కళాశాలల్లో సీనియర్లకు ప్రిన్సిపాళ్లుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కొన్నిచోట్ల వారు నిరాకరిస్తున్నారు. మొత్తం 40 కళాశాలల్లో సీనియర్లు లేక 2009 తర్వాత అధ్యాపకులుగా చేరిన వారు కూడా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లుగా పనిచేస్తున్నారు. అదనపు బాధ్యతలు చూస్తున్నా విద్యాబోధన చేయాల్సిందే. కొన్నిచోట్ల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లు తమ వంతు బోధన చేయాలని ఇతర అధ్యాపకులను కోరితే వారు తమకేం పని ప్రశ్నిస్తున్నారు. ఇది చివరికి వివాదంగా మారి ఫిర్యాదుల వరకు వెళుతోంది.

నిబంధన మార్చాలి



పీహెచ్‌డీ అనేది విద్యాపరమైన అర్హత. ప్రిన్సిపాల్ ఉద్యోగమన్నది పరిపాలనకు సంబంధించింది. అందువల్ల పీహెచ్‌డీ నిబంధనను తొలగించాలి. అవసరమైతే 20 సంవత్సరాల సర్వీసు ఉన్న వాళ్లకు పీహెచ్‌డీ నిబంధన వర్తించదని మార్పు చేయవచ్చు. జీఓ 2007లో వచ్చినందున అప్పటి నుంచి ఉద్యోగంలో చేరిన వారికి వర్తించేలా మార్చాలి.

– హరినాథ శర్మ, రాష్ట్ర నేత, డిగ్రీ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం



పసికందు అస్థిపంజరం

'అమ్మా'నుషం

- పుట్టిన శిశువును ఇంట్లోనే పాతిపెట్టిన తల్లి
- వీడిన పసికందు అదృశ్యం కేసు మిస్టరీ

తాంసి, న్యూస్‌టుడే: నవ మాసాలు మోసి కన్న తల్లే తన పసికందును పుట్టగానే పాతిపెట్టిన దారుణ ఘటన ఇది. 50 రోజుల కిందట తన పసికందును ఓ వ్యక్తి అపహరించాడని కేసు పెట్టిన తల్లి.. అదే వ్యక్తితో కలిసి శిశువును కడతేర్చిన ఘటన ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్లలో చోటుచేసుకుంది. కప్పర్లకు చెందిన వెంకటమ్మ భర్త చనిపోవడంతో అదే గ్రామానికి చెందిన శంకర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చి మగ శిశువుకు జన్మనిచ్చింది. అక్రమ సంబంధం బయటపడుతుందన్న భయంతో ఆ శిశువును పుట్టిన రోజునే ఇంట్లో పాతిపెట్టారు. శిశువు పుట్టిన విషయం బయటకు పొక్కడంతో వెంకటమ్మ ఓ వ్యక్తి తన శిశువును అపహరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఆదిలాబాద్ పట్టణ శివారులో శంకర్, వెంకటమ్మ కనిపించారు. వారిని విచారించగా అసలు విషయం బయటకొచ్చింది. పసికందు చనిపోయి పుట్టిందని, అందుకే ఇంట్లో పాతిపెట్టామని వారిద్దరు అంగీకరించారు. ఇద్దర్నీ అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు. తహసీల్దారు సమక్షంలో పంచనామా నిర్వహించారు.

వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో మొక్కలు నాటాలి: జోగు రామన్న

కరీంనగర్(కార్పొరేషన్), న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో మొక్కలు నాటాలని, వర్షాలు లేనిచోట ఇప్పటికే నాటిన మొక్కలను రక్షించాలని అటవీశాఖ మంత్రి జోగు రామన్న ఆదేశించారు. మూడోవిడత హరితహారం ప్రారంభం సందర్భంగా జులై 12న సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో నాటిన మొక్కలను ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, జిల్లా పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై, ఆగస్టు నెలల్లో నెలకు 4 సార్లు మొక్కలకు నీరు పట్టడానికి ట్రాక్టర్ల ద్వారా అనుమతి ఇవ్వడం జరిగిందని, ఒక ట్రాక్టర్‌కు రూ.480 చెల్లిస్తున్నట్లు వివరించారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు, చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాల వద్ద ఆదివారం వాహనాల రద్దీ కొనసాగింది. వరుస సెలవుదినాలకు తోడు బోనాలు, శుభకార్యాలు అధికంగా ఉండటంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. ముఖ్యంగా యాదాద్రి క్షేత్ర దర్శనార్థం హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాల సంఖ్య పెరిగింది. వరుస సెలవులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కో వాహనం టోల్‌ప్లాజా దాటడానికి ఐదు నిమిషాల సమయం పట్టింది. – న్యూస్‌టుడే, బీబీనగర్

డిసెంబర్ నాటికి ఎల్లంపల్లి నీళ్లు మిడ్‌మానేరులో పడాలి: మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల నిర్మాణం ఏడు పాత జిల్లాల రైతుల జీవితాలతో ముడిపడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. పనుల విషయంలో సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఆదివారమిక్కడ నిర్వహించిన సమీక్షలో హరీశ్ మాట్లాడుతూ.. ఎల్లంపల్లి, మిడ్ మానేరు పనులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. కొత్తఏడాదిలో అడుగుపెట్టేనాటికి ఎల్లంపల్లి ప్రాజెక్టు నీళ్లు మిడ్‌మానేరులో పడాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలో 6, 7, 8 ప్యాకేజీలను వారంలో రెండురోజులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిశీలించాలని ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డిని మంత్రి ఆదేశించారు. నవంబర్ నాటికి ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను పూర్తిచేయాలని సూచించారు. ఈ ప్యాకేజీల పనులన్నీ డిసెంబర్ నాటికి పూర్తికావాలన్నారు. ఈ సందర్భంగా పలు పనులకు లక్ష్యాలను నిర్దేశించారు. నవంబర్ నాటికి పంపుహౌజ్, భూగర్భ సొరంగం పనులు, వాటికి అనుబంధంగా ఉన్నవి పూర్తిచేయాలన్నారు. డిసెంబర్ నాటికి డ్రైరన్ నిర్వహించాలని సూచించారు. ప్యాకేజీల్లోని సొరంగాలు, కాల్వల లైనింగ్ పనులు అక్టోబర్, నవంబర్ నాటికి ముగించాలన్నారు. మేడారం రిజర్వాయర్ పనులు వేగిరం చేయాలని, రైతుల పంటలకు పరిహారం వెంటనే ఇవ్వాలని తెలిపారు. పంటల విరామానికి సంబంధించిన దస్త్రాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని నీటిపారుల ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ను కోరారు.

అక్రమ పరిశ్రమలకు అడ్డా

- కాటేదాన్‌లో 100కి పైనే
- అనుమతులు, గుర్తింపు లేకుండా నిర్వహణ
- జీడిమెట్ల, సనత్‌నగర్, చర్లపల్లిల్లో ఉనికి
- నకిలీ, కల్తీ వస్తువుల తయారీ
- తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు తరలింపు
- కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల నిఘా వైఫల్యమే కారణం

అది నగరం నడిమధ్యనున్న కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతం.. అందులో ఒక మూతపడిన పరిశ్రమ.. బయట తాళం ఉంది. లోపల యంత్రాల శబ్దాలు.. వాటిలో కల్తీ, నకిలీ వస్తువులు తయారవుతున్నాయి. ఇలా ఒక్కచోటే కాదు.. హైదరాబాద్, చుట్టుపక్కల పలు పారిశ్రామికవాడల్లో జరుగుతోంది. వ్యాపారుల కక్కుర్తి, ప్రభుత్వ నిఘా వైఫల్యాలతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసుల దాడుల్లో కాటేదాన్ పారిశ్రామిక వాడలో నెలలో 49 మూతపడిన పరిశ్రమలను తనిఖీ చేయగా పెద్దఎత్తున నకిలీ తయారీ కేంద్రాలు బయటపడ్డాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది.



కాటేదాన్‌లో మూతపడ్డ పరిశ్రమ

ఈనాడు - హైదరాబాద్

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు విధిగా అనుమతులు తీసుకోవాలి. పరిశ్రమలశాఖతో పాటు వాణిజ్య, కర్మాగారాలు, కార్మిక శాఖలు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులుండాలి. హైదరాబాద్ పరిధిలోనివి జీహెచ్ఎంసీ నుంచి వ్యాపార లైసెన్స్ పొందాలి. మురుగునీటి పారుదల, విద్యుత్తు, జలమండలి నీటిసరఫరా.. తదితరాలకు కనెక్షన్‌లు తీసుకోవాలి. తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం పారిశ్రామిక అనుమతులు స్వీయధ్రువీకరణ విధానం (టీఎస్ఐపాస్) చేపట్టింది. ఏకగవాక్ష అనుమతులు లభిస్తున్నాయి. అయినా ఇవేమీ లేకుండా పరిశ్రమలు కొనసాగుతున్నాయి.

బయట తాళం.. లోపల తయారీ

బయట తాళాలువేసి లోపల ఉత్పత్తుల ప్రక్రియ నడుస్తోంది. అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా సాగుతోంది. కాలుష్యపూరిత వ్యర్థాలను బయటపడేస్తున్నారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని నూర్‌ఖాన్ కుంటను కాలుష్యమయం చేశారు. గుట్టలపై వ్యర్థాలను వేస్తున్నారు. వీటి దుర్వాసనను ప్రజలు భరించలేకపోతున్నారు.

వ్యాపారం కోట్లలో

అక్రమ పరిశ్రమలు రూ.కోట్ల వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. వీటివల్ల ప్రభుత్వాదాయానికి గండిపడుతోంది. పన్నులకు గండికొడుతున్నారు. విద్యుత్, నీటి బిల్లులను, పన్నులను కంపెనీలు చెల్లించడం లేదు. పారిశ్రామిక ప్రాంతాల్లో స్థానిక ప్రాధికార సంస్థ (ఐలా)లున్నాయి. పరిశ్రమలశాఖ, టీఎస్ఐఐసీల కార్యకలాపాలు సాగుతుంటాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వస్తుంటారు. విద్యుత్, కార్మిక, జలమండలి, జీహెచ్ఎంసీల సిబ్బందికి వాస్తవాలు తెలిసినా అక్రమార్కులను అడ్డుకోవడంలేదు.



కాటేదాన్‌లో వ్యర్థాల పొగలతో ఇబ్బంది

అపరిష్కృతంగా ఖాయిలా పరిశ్రమల కథ

ఖాయిలాపడిన పరిశ్రమలను తిరిగి తెరిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూతపడిన వాటిలో తిరిగి నడిచే సామర్థ్యం గల వాటికి అవకాశమున్నా ప్రస్తుతం దొంగచాటుగా వస్తున్న ఆదాయం కారణంగా పలువురు యజమానులు పునరుద్ధరణకు ప్రయత్నించడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కాలుష్య సమస్యతో హైదరాబాద్ మహానగర పరిధిలో 1545 పరిశ్రమలకు రాష్ట్రప్రభుత్వం నోటీసులిచ్చింది. ఈ పరిశ్రమల తీరు మెరుగుపడే అవకాశం లేనందున వీటిని బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) అవతలకు తరలించాలని నిర్ణయించింది. 19 గ్రామాల్లో 6500 ఎకరాల భూమిని గుర్తించింది. పరిశ్రమల తరలింపు మొదలవ్వలేదు. ఇటీవల పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి కాలుష్య పరిశ్రమల అంశం చర్చించినా పురోగతిలేదు.

ప్రమాదకర పరిణామాలు

పరిశ్రమల తరలింపును చేపట్టకుండా కాలుష్య పరిశ్రమలను యథాతథంగా కొనసాగించడం, మూతపడిన వాటిపై నిఘా ఉంచకపోవడం వల్ల అవి అక్రమ కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. ఇందులో ఉత్పత్తులను వాహనాల్లో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మంత్రి కేటీఆర్ కాలుష్య పరిశ్రమల సమీక్ష సందర్భంగా పారిశ్రామికవాడల్లో సీసీటీవీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాచేస్తే అక్రమాలను నియంత్రించే అవకాశముంది.

కాటేదాన్ పారిశ్రామికవాడలో

కాటేదాన్ పారిశ్రామికవాడ కాలుష్య కేంద్రంగా ఉన్నందున కార్యకలాపాలు పెద్దగా ఉండవని చెబుతూ అధికారులు దాడులకు దూరంగా ఉంటున్నారు. వాస్తవానికి అక్కడున్న 1349 పరిశ్రమల్లో సగానికి పైగా అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయనే అనుమానాలున్నాయి. గగన్ పహాడ్‌లో 486 పరిశ్రమలుండగా అక్కడ 200కి పైగా పరిశ్రమలకు గుర్తింపు లేదు.

వాటిపై కఠిన చర్యలు



మా డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామికవాడలో కల్తీ పదార్థాలు ఉత్పత్తి చేసే.. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే ఇవి ఏర్పడ్డాయి. అప్పట్లో నిఘా లేకుండా ప్రోత్సహించడం వల్లనే ఇవి పెద్ద సంఖ్యలో అక్రమంగా వెలిశాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక కల్తీలపై సీఎం కొరడా ఝుళిపించారు. నకిలీ వస్తువులను తయారుచేసే పరిశ్రమలను మూసివేయిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-తోకల శ్రీనివాస్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్

తనిఖీ చేస్తే బయటపడతాయి



అనుమతుల్లేకుండా నడుస్తున్న పరిశ్రమలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అనారోగ్యం కలిగించే ఉత్పత్తులు సాగుతున్నాయి. ఒక్కో పరిశ్రమను తనిఖీ చేస్తే బాగోతాలు బయటపడతాయి.

-అమరేశ్‌గౌడ్, కాటేదాన్

తరలింపునకు సిద్ధం



అనుమతుల్లేకుండా పరిశ్రమలను ఏర్పాటు చేయరాదు. జీడిమెట్లలో ఇలాంటివి లేకుండా చర్యలు తీసుకున్నాం. కాలుష్య పరిశ్రమల తరలింపునకు మేం సిద్ధమే. ఓఆర్ఆర్ బయట సరైన వసతులు కల్పిస్తే అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అంతా సుముఖంగా ఉన్నారు.

-ఎఎల్ఎన్ రెడ్డి, జీడిమెట్ల ఐలా అధ్యక్షుడు

మూసివేత వరం

ఉమ్మడి రాష్ట్రంలో వివిధ కారణాల వల్ల అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో 1545 పరిశ్రమల్లో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో చాలావాటికి తాళాలు వేశారు. తమ యూనిట్లు మూతపడిన తర్వాత పారిశ్రామికవేత్తలు ఇతర వ్యాపారాలపై దృష్టి సారించారు. ఇదే తరుణంలో నకిలీ, కల్తీరాయుళ్ల దృష్టి వాటిపై పడింది. యజమానులను నమ్మించి, వాటిని అద్దెకు తీసుకొని అక్రమ వ్యాపారాలను ప్రారంభించారు. వీటికి కాటేదాన్ అడ్డాగా ఉంది. జీడిమెట్ల, సుభాష్‌నగర్, బొల్లారం, బాలానగర్, చర్లపల్లి, సనత్‌నగర్, మేడ్చల్, గాంధీనగర్, పటాన్‌చెరు పారిశ్రామికవాడల్లోనూ, వాటి విస్తరణ ప్రాంతాల్లో ఈ అక్రమాలను ప్రారంభించారు. ప్రసిద్ధ కంపెనీల పేరిట నకిలీ నూనెలు, బిస్కెట్లు, కుర్‌కురేలు తయారు చేస్తున్నారు. మసాలాలు, టీ పొడి, నూడిల్స్, చిప్స్ తయారవుతున్నాయి. బడా కంపెనీల పేరిట చీరలు, దుస్తులను రూపొందిస్తున్నారు. ప్రమాదకర రసాయనాలు, మందులనూ ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద కంపెనీల ముద్రలతో ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు, గృహోపకరణాలను సృష్టిస్తున్నారు. చెప్పులు, బూట్లు, రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తులు జరుగుతున్నాయి.



నాసిరకం అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ

పోలీసుల దాడులు

కల్తీలు, నకిలీలపై చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన తర్వాత పోలీసులు కాటేదాన్ పారిశ్రామికవాడపై తనిఖీలు చేపట్టారు. 49 పరిశ్రమల్లో అక్రమాలు వెలుగుచూశాయి. ఆహారపదార్థాలు, నూనెలు, అల్లం వెల్లుల్లి మిశ్రమం, బిస్కట్లు ఇతర సామగ్రి పెద్దఎత్తున బయటపడింది. జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో కల్తీ పచ్చళ్లను పట్టుకున్నారు.



పరిశ్రమలో పోలీసుల తనిఖీలు (పాతచిత్రం)

డిజిటల్ వినియోగంపై ఇంటర్ విద్యామండలికి అవార్డు

ఈనాడు, హైదరాబాద్: పరీక్షల్లో సంస్కరణల అమలుతోపాటు పరిపాలనపరమైన విషయాలు, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగిస్తున్న తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలికి 'ఉత్తమ డిజిటల్ వినియోగం' విభాగంలో అవార్డు లభించింది. దిల్లీలో శనివారం జరిగిన 'వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్'లో ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్రీలంక విద్యాశాఖమంత్రి వి.ఎస్.రాధాకృష్ణన్ చేతులమీదుగా ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి వి.అశోక్ అవార్డును అందుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలోడు అటవీ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకున్నట్లు సమాచారం. సంఘటనా స్థలంలో ఒక రివాల్వర్, తపంచాలను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

'మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.18 వేలు చెల్లించాలి'

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు కనీస వేతనం రూ.18 వేల చొప్పున చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు నెలకు రూ.వెయ్యితో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం కొన్ని జిల్లాల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరి కాదన్నారు. మహాసభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, ఎస్.రమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక హక్కుపై దాడి

త్వరలో తదుపరి కార్యాచరణ

తెఐకాస ఛైర్మన్ కోదండరాం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నాలుగో దశ అమరుల స్ఫూర్తియాత్రను ప్రభుత్వం అడ్డుకొని సభలు నిర్వహించుకొనే ప్రజాస్వామిక హక్కుపై దాడికి పాల్పడిందని తెఐకాస ఛైర్మన్ కోదండరాం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రను తెరాస కార్యకర్తలు అడ్డుకున్నా, దానికి అధికార యంత్రాంగం సహకరించినా.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఐకాస ఆధ్వర్యంలో యాత్రను నిర్వహించడానికి ప్రయత్నించామన్నారు. యాత్ర ద్వారా ఉద్యమ ఆకాంక్షల అమలుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలనుకున్నామని పేర్కొన్నారు. ప్రజలు తమ అధికారాలు తెలుసుకుంటేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం ఐకాస చట్టబద్ధంగా ఎదిరించిందని కోదండరాం వివరించారు. తెఐకాస పోరాటానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, తెదేపా, భాజపా, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ తదితర పార్టీలకు, ప్రజాసంఘాలకు, విద్యార్థి సంఘాలకు, ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో ఐకాస స్టీరింగ్ కమిటీ సమావేశమై తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

ఆధార్‌తో ముడిపడిన పాన్‌లు 9.3 కోట్లు

దిల్లీ: ఆధార్ సంఖ్యలతో 'శాశ్వత ఖాతా సంఖ్య' (పాన్)లను అనుసంధానం చేసుకోవాలని ఆదాయపు పన్ను శాఖ చేసిన విజ్ఞప్తిపై ఈ నెల 5వ తేదీ వరకు 9.3 కోట్ల మందికి పైగా పని పూర్తి చేసుకున్నారని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. పాన్‌లు ఉన్నవారు దాదాపు 30 కోట్ల మంది కాగా వీరిలో 30% మంది వాటిని ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నట్లయింది. వీరిలో 3 కోట్ల మంది ఒక్క జూన్, జులై నెలలోనే ముందుకు వచ్చారు. ఈ అనుసంధానతకు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినందువల్ల సంఖ్య ఇంకా పెరుగుతుందని భావిస్తున్నారు. ఐ.టి. రిటర్న్‌ు దాఖలు చేయాలంటే ఆధార్, పాన్‌ల అనుసంధానం తప్పనిసరి అని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ రెండింటినీ లంకె పెట్టకపోతే రిటర్న్‌ను పరిశీలించబోమని కూడా హెచ్చరించింది.



ఆలయంలో కుటుంబ సభ్యులతో ఎంపీ కవిత

బాసర ఆలయాభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

- రూ.102 కోట్లతో ప్రతిపాదనలు
- ఎంపీ కవిత వెల్లడి

ముథోల్, న్యూస్‌టుడే: బాసర జ్ఞాన సరస్వతీ ఆలయంలో రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని తలచారని, రూ.102 కోట్లతో ప్రణాళికలు తయారు చేయించారని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సరస్వతీ మాత దర్శనం, మరిది కుమార్తె అక్షరాభ్యాసం కోసం బాసరకు వచ్చిన ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడారు. త్వరలో ముఖ్యమంత్రి బాసరకు వస్తారని, అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తారని వెల్లడించారు. బాసరకు ముఖ్యమంత్రి రారన్నది అపోహ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో మిగతా దేవాలయాల మాదిరిగా బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఎంపీ పాల్గొన్నారు.

పనితీరును బట్టే వర్సిటీలకు నిధులు

- మూడు శ్రేణులుగా విభజించి కేటాయించాలి
- విద్యా నాణ్యత పెంపు కోసం నీతి ఆయోగ్ మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక
- పాఠశాల, ఉన్నత విద్యలో సంస్కరణలకు సిఫార్సు

ఈనాడు - హైదరాబాద్

అంతర్జాతీయ ర్యాంకింగ్‌లలో చోటుదక్కేలా విశ్వవిద్యాలయాల్లో భారీ సంస్కరణలకు కేంద్రం సమాయత్తమైంది. అన్నింటికీ సమానంగా నిధులు మంజూరు చేయడం కాకుండా పనితీరును బట్టి వర్సిటీలకు నిధులు, స్వయం ప్రతిపత్తి ఇవ్వనున్నారు. ఈ మేరకు వచ్చే మూడేళ్లలో చేపట్టాల్సిన మార్పులపై నీతి ఆయోగ్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.

సగటు వయసు 29 సంవత్సరాలతో 2020 నాటికి యువ దేశంగా భారత్ అవతరించనుంది. అదే సమయంలో ఈ సగటు అమెరికాలో 40, యూరప్ దేశాల్లో 46, జపాన్‌లో 47గా ఉండనుంది. ఈ నేపథ్యంలో భారత్ ప్రపంచానికి నిపుణులను అందించే కేంద్రంగా మారేందుకు అవకాశం ఉంది. అయితే విద్యా ప్రమాణాలు ఘోరంగా పడిపోవడం ప్రతిబంధకంగా మారింది. 'యువ' అవకాశాన్ని అందిపుచ్చుకోవాలంటే పాఠశాల, ఉన్నత విద్యలో భారీ మార్పులు తీసుకురావాలని నీతి ఆయోగ్ సంకల్పించింది. అందుకు 2017-18 నుంచి 2019-20 నాటికి మూడేళ్ల లక్ష్యాలను నిర్దేశించింది.

'ఉన్నత' విద్యకు పంచతంత్రం..

ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన ఉన్నత విద్య వ్యవస్థను పరిశీలిస్తే నియంత్రణపై తక్కువ. స్వయంప్రతిపత్తి, పారదర్శకతలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారని స్పష్టమవుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో ప్రధానంగా 5 చర్యలు తీసుకోవడం అవసరమని నీతి ఆయోగ్ పేర్కొంది. అవి.

- 10 ప్రభుత్వ, 10 ప్రైవేటు విద్యాసంస్థలను ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలుగా మార్చడం. ఈ విషయంలో చైనా, సింగపూర్ దేశాల విధానాలను పరిశీలించాలి. మంచి పనితీరు కనబరిచే వర్సిటీలకు అధిక నిధులు ఇవ్వాలి.
- ఉత్తమ పనితీరు కనబరిచే విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి.
- నియంత్రణ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావడం. విశ్వవిద్యాలయాలను టైర్ విధానం.. అంటే మూడే శ్రేణులుగా చేసి పర్యవేక్షించాలి.
- ప్రజాఅవసరాలను దృష్టిలో ఉంచుకొని వాటికే పరిశోధన నిధులివ్వాలి.
- ఉద్యోగ నైపుణ్యాలు పెంచేందుకు విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం. డిమాండ్ ఉన్న నర్సింగ్, పారామెడికల్ తదితర కోర్సులపై దృష్టి పెట్టాలి.

లక్ష్య సాధనకు గడువులివీ..

- పాఠశాల విద్య: విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని అంచనా వేయడం - ప్రతి సంవత్సరం డిసెంబరు. పాఠశాల విద్యా నాణ్యత సూచికలు ఇవ్వడం - 2018 మార్చి. కొత్త పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టడం - 2020 మార్చి
- ఉన్నత విద్య: 20 ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను ఎంపిక చేయడం - 2017 సెప్టెంబరు. విశ్వవిద్యాలయాలను 3 గ్రేడ్లుగా విభజించడం- 2018 మార్చి. కళాశాలల్లో వృత్తి విద్య కోర్సులకు అనుమతి- 2017 సెప్టెంబరు.

పాఠశాల విద్యకు త్రిముఖ వ్యూహం

చదువు ఫలితం (లెర్నింగ్ అవుట్‌కమ్) విధానంలో మార్పులు చేయడం, ప్రభావవంతంగా నేర్చుకునేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులకు తగిన సాధన సంపత్తిని సమకూర్చడం, ప్రస్తుతం ఉన్న పాలన యంత్రాంగాన్ని అభివృద్ధి చేయడాన్ని ప్రధాన లక్ష్యాలుగా తీసుకున్నారు.

- విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని గుర్తించేందుకు జాతీయ సాధన అధ్యయనం(న్యాస్) పేరిట పరీక్షలు నిర్వహించాలి. వాటి ఆధారంగా ఆయా పాఠశాలలకు పాఠశాల విద్య నాణ్యత సూచిక(ఎస్ఈక్యూఐ)లు అందించాలి.
- విద్యార్థులు ప్రాథమిక అంశాల్లో వెనకబడకుండా స్థానికంగా ఉండే కాంట్రాక్టు ట్యూటర్లను నియమించుకోవాలి. విద్యార్థి అన్నివిధాలా సన్నద్ధం అయినప్పుడే పరీక్షలు నిర్వహించడం(ఎగ్జామ్స్ ఆన్ డిమాండ్).
- ప్రైవేటు కంటే సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలు దారుణంగా ఉన్నాయి. ఏటేటా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. అందుకే పాఠశాల విద్యా నాణ్యత సూచిక(ఎస్ఈక్యూఐ)లను పక్కాగా అమలు చేస్తూ పర్యవేక్షించాలి.

పై కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో బెయిలు ఇవ్వకండి!!

కింది కోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం సూచన

దిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాధారణ బెయిలును మంజూరు చేసేపద్ధతిని కింది కోర్టులు తక్షణం నిలిపేయాలంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉన్నత న్యాయస్థానాలు ముందస్తు బెయిలును మంజూరు చేసి ఉన్న కేసుల్లో నిందితులు నేరుగా కింది కోర్టులకు వెళ్లి సాధారణ బెయిలు కోసం లొంగిపోవడం కుదరదని పేర్కొంది. జస్టిస్.రంజన్ గొగోయ్, జస్టిస్. నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు చెప్పింది. ఝార్ఖండ్‌లోని ఓ కింది కోర్టు ఒక కేసులో నిందితుడికి సాధారణ బెయిలును మంజూరు చేసిన సంఘటనను సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా ఉదహరించింది. తాత్కాలిక ఉపశమనంగా పై కోర్టు నుంచి ముందస్తు బెయిలను పొంది ఉన్న ఓ నిందితుడికి ఝార్ఖండ్‌లోని కిందికోర్టు సాధారణ బెయిలును మంజూరు చేసిన విషయాన్ని ధర్మాసనం ప్రత్యేకంగా పరిశీలించి... ఇకపై అలాంటి పద్ధతులను నిలిపేయాలని కింది కోర్టులకు సూచించింది.

పట్టుబట్టి.. నిలబెట్టారు

- మూసివేత ముంగిట పాఠశాల
- కాపాడుకున్న ఉపాధ్యాయులు
- రెండేళ్లలో 8 నుంచి 114కి విద్యార్థుల చేరిక

ఈనాడు, నల్గొండ: ప్రైవేటు మోజులో పడి తల్లిదండ్రులు సర్కారు బడిని నిర్లక్ష్యం చేస్తున్న ఈ కాలంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు కలసికట్టుగా బడిని కాపాడుకున్నారు. రెండేళ్ల కిందట 8మంది పిల్లలతో మూసివేత ముంగిట నిలిచిన పాఠశాల ఇప్పుడు 114 మంది పిల్లలతో కళకళలాడుతోంది. అదే నల్గొండ మాల్‌బౌలిలోని బాలికల ఉన్నత పాఠశాల. 8మంది విద్యార్థులకు 8మంది ఉపాధ్యాయులున్నారని అప్పట్లో 'ఈనాడు' కథనం ప్రచురించింది. విద్యార్థులు లేకపోవడంతో పాఠశాల మూసివేస్తారని భావించిన ఉపాధ్యాయులు స్థానికులకు పాఠశాల గురించి అవగాహన కల్పించారు. దీంతో గతేడాది 60 మంది విద్యార్థుల వరకూ చేరారు. పది విద్యార్థులు 8 జీపీఏకు పైగా సాధించి ఉత్తీర్ణులయ్యారు. ఇక్కడ డిజిటల్ విద్యాబోధన నిర్వహిస్తుండటం విశేషం. పాఠశాలను అదనపు గదుల కొరత వేధిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజనానికి వరండానే దిక్కు. ఇప్పుడీ పాఠశాల ఇలా ఉండటానికి 'ఈనాడు' కృషి మరవలేనిదని, ఇక్కడ చదివిన విద్యార్థులు పలువురిని చేర్పించారని ప్రధానోపాధ్యాయురాలుసురేఖ అన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంతో పాటు, తమను బాగా చూసుకుంటున్నారని తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రతిభ పేర్కొంది.



టీవీలో డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థినులు

కాజీపేట వ్యాగన్ వర్క్‌షాప్ ఏర్పాటులో జాప్యం!

- మొత్తం భూమి అప్పగించాకే ముందుకు
- టెండర్ల ప్రక్రియపై తాజాగా ఆర్‌వీఎన్ఎల్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: కాజీపేటలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ఏర్పాటు జాప్యమయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం భూమిని అప్పగించిన తర్వాతే ముందుకు వెళ్లాలని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) తాజాగా నిర్ణయించింది. భూ వివాదం మళ్లీ మొదటికి రావడంతో టెండర్ల ప్రక్రియకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నప్పటికీ మరి కొంతకాలం వేచిచూడాలన్న అభిప్రాయానికి వచ్చింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండువేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే వ్యాగన్ వర్క్‌షాప్ కోసం రైల్వేశాఖ కోరిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 160 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే అది దేవాదాయభూమి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. దీంతో 24 ఎకరాలు మినహా మిగిలిన భూమి వివాదం పరిష్కారమైందని ఆర్‌వీఎన్ఎల్ వర్గాలు పేర్కొన్నాయి. మిగిలిన భూమి విషయమూ పరిష్కారమవుతుందని, త్వరలో వర్క్‌షాప్ పనులు చేపట్టవచ్చని భావించాయి. 2016-17 బడ్జెట్‌లో రూ. 265 కోట్ల అంచనావ్యయంతో వ్యాగన్ వర్క్‌షాప్‌ను ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కొత్త పన్నుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని తాజా అంచనా వ్యయాన్ని లెక్కించారు. పరిష్కారమైందనుకున్న దేవాదాయభూముల్లో కొంతభాగంపై మళ్లీ కేసులు నమోదయ్యాయని ఆర్‌వీఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈవిషయం రెండడుగులు వెనక్కి వెళ్లినట్లయ్యింది. రైల్వే లైన్ల విషయంలో కొన్ని చోట్ల భూసేకరణలో జాప్యం జరిగినా..ఆ భాగాన్ని వదిలేసుకుని మిగిలినచోట్ల పనులు చేపట్టవచ్చని ఆర్‌వీఎన్ఎల్ వర్గాలు చెబుతున్నాయి. వ్యాగన్ వర్క్‌షాప్‌నకు మొత్తం భూమిని కేటాయిస్తేగానీ నిర్మాణపనులు చేపట్టలేమని పేర్కొంటున్నాయి.

వసుంధర

ఆ అవార్డు... ఆమె పోరాటానికే!



ఆ అమ్మాయి పేరు సువర్ణారాజ్. పోలియో బాధితురాలు. అంతర్జాతీయస్థాయి పారా టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి. ఆమెకు ఎదురైన చిన్న సమస్యను ప్రశ్నించి, పోరాటం చేసినందుకు ఇప్పుడు అవార్డే అందుకోబోతోంది. నాగ్‌పూర్‌కు చెందిన సువర్ణ పోలియో బాధితురాలు. పెళ్లయ్యాక భర్తతో కలిసి దిల్లీలో స్థిరపడిన ఆమె ఓ వైపు టేబుల్‌టెన్నిస్ పోటీలకు వెళ్తూనే తనలాంటి వారికోసం ఎన్జీఓను నడుపుతోంది. భారీ భవనాలూ, రైళ్లూ, బస్సుల్లో తనలాంటివారికి సౌకర్యంగా ఉండేందుకు ఎలాంటి వసతులు కల్పించాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చాలాసార్లు వినతీపత్రాలు సమర్పించింది. అంతేకాదు, యాక్సిసబుల్ ఇండియా క్యాంపైన్ తరపున పనిచేస్తోంది. ఈ మధ్య ఆమె దిల్లీకి వెళుతూ గరీబ్ రథ్ రైలు ఎక్కింది. ఆమెది మిడిల్‌బెర్త్. 'అడుగున ఉన్న బెర్త్ ఇస్తారా' అని తోటి ప్రయాణికుల్ని అడిగింది. వాళ్లు సహకరించలేదు. అలా ఆ రాత్రంతా ఆమె బెర్త్‌పై కాకుండా కింద పడుకోవాల్సి వచ్చింది. మర్నాడే తన సమస్యను వివరిస్తూ కేంద్ర రైల్వే మంత్రి సురేష్‌ప్రభుని ఉద్దేశిస్తూ ప్రముఖ అంతర్జాల అర్జీల సంస్థ 'ఛేంజ్ డాట్ ఆర్గ్'లో ఫిర్యాదుచేసింది. ఆయన దీనిపై విచారణ జరపాలంటూ.. ప్రత్యేక కమిటీని నియమించారు. అంతేకాదు ఆమె ధైర్యానికి మెచ్చిన రైల్వే శాఖ ఆమెను నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ ఎంఫైసిస్ యూనివర్సల్ డిజైన్ (ఎన్‌సీపీఈడీపి-ముదా)అవార్డుకు ఎంపికచేసింది.

మెదడులోని చెత్త తీసేద్దాం

ఆలస్యంగా నిద్రలేచారు. అర్ధగంటలో కాలేజీకి సిద్ధం కావాలి. పని ప్రారంభిస్తారు. కానీ ఇంతలోనే ఆలోచనలు వచ్చిపడుతుంటాయి. వీటికారణంగా చేస్తున్న పనిపై ఏకాగ్రత పోతుంది. కంప్యూటర్‌లో అనవసరమైన ఫైల్స్‌ని ట్రాష్‌బిన్‌లో పడేస్తున్నట్టు మెదడులోని ఈ ఆలోచనల్నీ చేస్తే ఎంత బావుణ్ను!

● **ఎలా తీసేయాలి? :** మెదడుకి ఇలాంటి 'ట్రాష్ బిన్' వ్యవస్థ లోపల ఉండదు. బయటే ఉంటుంది. మన మనసులో ఉన్నదంతా రాయడం.. అలాంటి ఓ ఏర్పాటే! ప్రత్యేకంగా డైరీ పెట్టుకుంటారో, ఏదైనా పేపర్‌లో రాసుకుంటారో మీ ఇష్టం. రోజు మీ పనులన్నీ పూర్తయ్యాక ఇందుకోసం ఓ 10 నిమిషాలు కేటాయించండి. మీ ఆలోచనలు నిండిన ఆ కాగితమే.. ట్రాష్ బిన్! ఈ అలవాటువల్ల ఒక్కవారం నుంచే చక్కటి ఫలితం కనిపిస్తుంది మనకి.

● **ఏమిటి లాభం? :** రాయడం వల్ల.. మెదడు తనకి తానే ప్రతి ఆలోచనకీ ఓ తార్కికత(లాజిక్) ఉండేలా చూసుకుంటుంది. అలాంటి తర్కంలేని ఆలోచనలని వడపోయడం ప్రారంభిస్తుంది. దాంతో తాడూబొంగరంలేని ఆలోచనల రాక తగ్గుతుంది. అవసరమైనవే మెదడులో నిలుస్తాయి. ఏకాగ్రతా పెరగుతుంది. ఇలా ఓసారి ప్రయత్నించి చూడండి..!

టీనేజీలో బరువు చేస్తుంది చేటు!



అధిక బరువు.. ఈ రోజుల్లో చాలామంది సమస్య ఇది. టీనేజీదశలో ఉన్న కొందరమ్మాయిలు దీన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. దానివల్ల నెలసరికి సంబంధించిన సమస్యలు మొదలు... ఇంకెన్నో ఎదురవుతాయి. అవేంటీ... వాటినెలా తగ్గించుకోవాలో చూద్దాం.

టీనేజీ దశలో అధికబరువున్నప్పుడు కొన్ని సమస్యలు అప్పటికప్పుడు కనిపిస్తే మరికొన్ని భవిష్యత్తులో ఎదురవుతాయి. అప్పటికప్పుడు కనిపించే సమస్యల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం మొదటిది. అధికబరువున్న 5 నుంచి 17 ఏళ్ల లోపువారిపై చేసిన అధ్యయనంలో డెబ్భైశాతం మందికి కొలెస్ట్రాల్ వల్ల ఏదో ఒక సమస్య ఉందని తేలింది. ఇక రెండో సమస్య పీసీఓఎస్(పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్). అంటే నెలసరి సరిగ్గా రాకపోవడంతోపాటూ...అవాంఛిత రోమాలూ, మొటిమలూ, జుట్టు రాలవడం... వంటివి ఎక్కువగా కనిపించే లక్షణాలు. అలాగే ప్రీడయాబెటీస్ దశ ఉండొచ్చు. అంటే.. రక్తంలో చక్కెరస్థాయులు మామూలుగా కంటే కాస్త ఎక్కువగా ఉంటాయి. అంటే భవిష్యత్తులో మధుమేహం రావొచ్చనడానికి ఇది సంకేతం అవుతుంది. ఇవే కాదు... నిద్రలేమీ, కీళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఉండొచ్చు. ఇక, బాగా లావుండటం వల్ల నలుగురిలోకీ వెళ్లలేక మానసికంగానూ కుంగిపోవడం ఇలాంటివారిలో ఎక్కువగా కనిపిస్తుంది. రెండేళ్లవయసునుంచీ అధికబరువున్న పిల్లలు.. పెరిగేకొద్దీ అలాగే ఉండొచ్చనీ ఓ అధ్యయనం చెబుతోంది. అధికబరువును టీనేజీ దశలో నిర్లక్ష్యం చేస్తే గనుక.. భవిష్యత్తులో ఒక వయసు వచ్చాక గుండెజబ్బులూ, టైప్ 2 మధుమేహం, కీళ్లనొప్పుల వంటి చాలా సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువని మరవకూడదు. ఇక, బరువున్న చాలామంది అమ్మాయిలు దాన్ని కారణంగా చూపి.. తక్కువగా తింటారు. అన్నిరకాల పదార్థాలు తీసుకోవడానికి భయపడతారు. దాంతో ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందక.. భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగానే ఉంటుంది.

గుర్తించడమెలా...

అధిక బరువూ, స్థూలకాయం మధ్య ఉన్న తేడాను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) పరీక్ష చేయించుకోవాలి. బీఎంఐ 18.5 -25 మధ్య ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లు అర్థం. అదే 25 - 30 వరకూ వెళ్తే.. అధికబరువు ఉన్నామని గుర్తించాలి. ఒకవేళ 30 - 35 దాటితే స్థూలకాయులన్నమాట. బీఎంఐ తెలుసుకోవాలంటే... ముందు ఎత్తుని (మీటర్లలో) ఎత్తుతో హెచ్చించాలి. ఆ వచ్చిన దాంతో బరువును(కేజీల్లో) భాగించాలి. ఆ ప్రకారం ఎంత బరువున్నామో తెలుసుకోవచ్చు. ఇక, కొలెస్ట్రాల్ స్థాయిని అంచనా వేసేందుకు రక్తపరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది. మధుమేహ సమస్యని కూడా ముందే అంచనా వేసేందుకు పరీక్షలుంటాయి. ఒకవేళ నెలసరిలో తేడాలుండి అవాంఛిత రోమాలు కనిపిస్తుంటే తేలిగ్గా తీసుకోకుండా పీసీఓఎస్ ఉందేమో పరీక్ష చేయించుకోవాలి. దీనికోసం నెలసరి వచ్చిన రెండోరోజున కొన్నిరకాల హార్మోన్ల పరీక్షలు చేస్తారు. వాటిల్లో ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రొలాక్టిన్ వంటివి ముఖ్యమైనవి. అవసరాన్ని బట్టి పురుషహార్మోన్ల స్థాయిని అంచనా వేసే పరీక్షలు కూడా చేయాల్సి రావచ్చు.

ఎలాంటి మార్పులు చేసుకోవాలీ..

బరువును అదుపులో ఉంచాలంటే... ముందు జీవనవిధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. కొవ్వుశాతం తక్కువగా ఉన్న పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. పొట్టు తీయని గోధుమలూ, దంపుడు బియ్యం, ఓట్స్.. లాంటివి ఎక్కువగా ఎంచుకోవాలి. మైదా దానికి సంబంధించిన పదార్థాలు బాగా తగ్గించెయ్యాలి. మానేస్తే మరీ ఉత్తమం. తీపి పదార్థాలను తగ్గించాలి. కూరగాయలూ, పండ్లూ ఎక్కువగా తీసుకునేందుకు ప్రయత్నించాలి. ఎముకల సమస్యలు రాకుండా క్యాల్షియం, విటమిన్ డి పోషకాలు శరీరానికి టీనేజీ దశలోనే అందేలా చూసుకోవాలి. వీటిని ఈ దశలో నిర్లక్ష్యం చేస్తే గనుక భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ ఎదురయ్యే ప్రమాదం కూడా ఎక్కువే. ఇందుకోసం రోజూ రెండుగ్లాసుల పాలూ, పెరుగూ, ఇతర పాల పదార్థాలు తీసుకోవాలి. పరిస్థితిని బట్టి వైద్యులు డి విటమిన్‌ని మాత్రల రూపంలో సూచిస్తారు. ఇక, ఎముకలు ఆరోగ్యంగా ఉండేందుకే కాదు.. బరువు తగ్గేందుకూ నడక, పరుగు, యోగా.. వంటివి ప్రతీరోజూ అరగంట నుంచి గంటవరకూ తప్పనిసరిగా చేయాలి. లేదా ఆసక్తి ఉంటే ఏదయినా క్రీడలో కూడా చేరొచ్చు. ఒకవేళ పీసీఓఎస్ ఉందని తేలితే.. పై జాగ్రత్తలు తీసుకోవడంతోపాటూ.. వైద్యులు అదనంగా కొన్ని మందులు సూచిస్తారు. అంటే హార్మోన్ల మాత్రలను కొంత కాలం వాడమని చెబుతారు. దానివల్ల నెలసరి సమస్యలు కూడా చాలామటుకూ అదులోకి వస్తాయి. బరువు ఐదుశాతం తగ్గినా కూడా పీసీఓఎస్ సమస్య చాలామటుకూ అదుపులోకి వచ్చేస్తుంది. పీసీఓఎస్‌ని నిర్లక్ష్యం చేస్తే గనుక... భవిష్యత్తు సంతానసాఫల్యత తగ్గే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అంటే త్వరగా పిల్లలు కలగకపోవచ్చు. అలాగే మధుమేహం, అధికరక్తపోటు త్వరగా వచ్చే ఆస్కారం కూడా ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి వైద్యులు చెప్పిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలి. ఎప్పటికప్పుడు బరువును గమనించుకోవాలి.



డాక్టర్ ప్రణతీరెడ్డి
యూరో గైనకాలజిస్టు
ఫోన్: 9848051052

పాత్రల్లో.. పూలమొక్కలు!

మనం వాడని కొన్ని వస్తువుల్ని ఓ మూల పారేస్తాం. కానీ వాటిని కూడా మళ్లీ సద్వినియోగం చేసుకునేలా మార్చుకోవచ్చు. ఎలాగంటే...



◆ మూల పడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలను అలంకరణ వస్తువులుగా తీర్చిదిద్దుకోవచ్చు. వాటి పైభాగాన్ని తీసేసి దానికి నచ్చిన రంగూ, డిజైన్లు చేస్తే ఫ్లవరు వాజుల్లా వాడుకోవచ్చు. అంతేకాదు పెన్నులూ, పెన్సిళ్లూ.. ఇలా చిన్నారులకు సంబంధించినవి వేసుకోవడానికీ ఉపయోగించుకోవచ్చు.



◆ రంగు పోయిందనీ, పట్టడంలేదనీ వేసుకోకుండా కొన్ని దుస్తుల్ని వార్డ్‌రోబ్‌కే పరిమితం చేస్తుంటాం కదా. వాటిని కత్తిరించి సెల్‌ఫోన్, హ్యాండ్ పౌచ్‌లుగా తయారు చేసుకోవచ్చు. కుట్లు అల్లికలతో అందంగా చేతిపనిచేస్తే డిజైనర్ లుక్ వస్తుంది.



◆ పండ్లను కొన్నప్పుడు వాటితోపాటు వల సంచులు వస్తుంటాయి. వాటిలో కూరగాయలు ఉంచి వేలాడదీసుకోవచ్చు. ఒకవేళ అది చిరిగిపోతే పాదాలను శుభ్రపరచుకోవడానికి, గిన్నెలు తోముకోవడానికి వాడుకోవచ్చు.



◆ వంటింట్లో బాణలీ, పాత్రలకు రంధ్రాలు పడితే అవి నిరుపయోగమే అనుకొని మూల పడేస్తుంటాం. కానీ వాటిల్లో మట్టి నింపి మొక్కలు పెట్టుకోవచ్చు. ముఖ్యంగా కొత్తిమీరా, పుదీనా వంటివి పెంచుకోవచ్చు.

◆ పాత చున్నీలూ, చీరలపై హరివిల్లు వర్ణాలతో పెయింట్ వేసి చూడండి. దిండు, కుషను కవర్లుగా మార్చేసుకోవచ్చు.

◆ ఖరీదు పెట్టి కొన్న పూసల దండలు ఒక్కోసారి త్వరగా తెగిపోతుంటాయి. వాటిని అలా వదిలేయకుండా.. పూసలన్నీ సేకరించాలి. వీలైతే మరికొన్ని చేర్చి పొడవాటి దండలుగా గుచ్చి.. గుమ్మానికి ఇరువైపులా వేలాడదీయొచ్చు.

నలుపు తగ్గి.. మెరుపు ఇలా!

ఒక్కపూట సరిగా నిద్రలేకపోతే చాలు కొందరికి కళ్లకింద నల్లటి చారలు వచ్చేస్తాయి. వీటిని ఇంటి చిట్కాలతో తగ్గించుకునేందుకు ఏం చేయాలో చూడండి.



❖ **బాదం నూనె:** ఇందులో విటమిన్ కె ఎక్కువగా ఉంటుంది. ఇది కళ్లకింద నలుపుని తగ్గించి, చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తుంది. ముఖ్యంగా నల్లటి వలయాలను క్రమంగా మాయం చేయడంలో కీలకంగా పనిచేస్తుంది. ఇది సహజ యాంటీ ఇన్‌ఫ్లమేటరీగానూ పనిచేస్తుంది. రాత్రిపూట పడుకోవడానికి ముందు ఆ నూనె రాసుకుని మర్నాడు చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే సరి. చాలా తక్కువ సమయంలోనే ఫలితం కనిపిస్తుంది.

❖ **బంగాళాదుంప:** పచ్చి బంగాళాదుంప సహజ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది వాపునీ, కంటిచుట్టూ నలుపునూ సులువుగా తగ్గిస్తుంది. బంగాళాదుంప రసాన్ని కళ్లకింద రాసి పదిహేను నిమిషాలు ఆరనిచ్చి ఆపై కడిగేయాలి. ఇలా రోజులో రెండుసార్లు చేస్తుంటే ఫలితం కనిపిస్తుంది.

❖ **టీ బ్యాగులు:** వాడేసిన టీబ్యాగులను మరోసారి గోరువెచ్చని నీళ్లలో ముంచి తీసి వాటిని కళ్లపై ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల వాపు తగ్గుతుంది. నల్లటి వలయాలు కూడా క్రమంగా పోతాయి. ఇలానే కీరదోస ముక్కల్ని ఉంచుకున్నా మార్పు కనిపిస్తుంది.



మనం ఇప్పుడిలా ఈ పత్రికని చదువుతున్నాం కదా! మన కుటుంబాల్లో.. వందల ఏళ్లకిందటో, అంతకంటే ముందో ఎప్పుడో ఒకప్పుడు 'అమ్మాయిలకి చదువక్కర్లేదు!' అనే కట్టుబాటు ఉండే ఉంటుంది. అది 'టప్'మని తెగడానికి మీ కుటుంబంలో తీసుకున్న ఏదో ఒక చిన్న నిర్ణయం కారణమై ఉండొచ్చు. దానికి ఏదో ఒక ప్రభుత్వ పథకం దోహదకారీ కావొచ్చు! నేడు ఇంతమంది మహిళలం విద్యాధికులుగా మారామంటే దాని వెనక ఎన్నో పథకాలు కారణమై ఉంటాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఆ తొంభైమంది గిరిజన మహిళల జీవితాల్లోనూ నాబార్డు తీసుకున్న ఓ పథకం అలాంటి కదలికే తెచ్చింది. వారి జీవితాల్లో వెలుగులు పూయించింది. అదెలాగో చూద్దామా?

గిరిజన స్త్రీలకు 'చిరు'దన్ను!

వరహమ్మది.. కుసిని తండా. శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీ ప్రాంతం సీతంపేట మండలంలో ఇదో గిరిజన గ్రామం. వరహమ్మ వితంతువు. ఆమెకు చిన్నప్పటి నుంచి తెలిసిందంతా తమవాళ్లు పోడు వ్యవసాయం చేసేచోటకి వెళ్లి అక్కడ దొరికే ఎండుకట్టెల్ని ఏరుకోవడం. వాటిని గ్రామాల్లో తిరిగి వంటచెరకుగా అమ్మడం! నెలకి ఎనిమిదివందల రూపాయలు కళ్లజూస్తే.. పెద్దగా లాభం వచ్చినట్టే! అలాంటి వరహమ్మ ఆరునెలలకిందటే చిరువ్యాపారిగా మారింది. నెలతిరక్కుండానే ఐదువేల రూపాయలు సంపాదిస్తోంది. వసంతది బూర్జా మండలం. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా వెళ్తుండేది. ఇప్పుడు చిరుధాన్యాల ఉత్పత్తులమ్మే ఔట్‌లెట్‌లో ఉద్యోగిని. ఆరువేలదాకా జీతం! ఈ ఇద్దరే కాదు.. ఇలా తొంభైమంది కుటుంబాల్లో కొత్త వెలుగులు పూయించింది నాబార్డు. అదీ కేవలం ఆరేడు నెలల వ్యవధిలో!! జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) శ్రీకాకుళం గిరిజన తండాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఏదైనా చేయాలనుకుంది. లైవ్‌లీహుడ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమం)ని చేపట్టాలనుకుంది. కనీసం తొంభైమందికి సహకారం అందించాలని ప్రణాళిక వేసుకుంది. మరి ఏ కార్యక్రమం కోసం ఈ సహకారం అందించాలి? ఈ జిల్లాలో పనిచేస్తున్న యాక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసస్(ఆర్ట్స్) ఎన్జీఓ సహకారం తీసుకుంది. ఈ సంస్థ అప్పటికే ఇక్కడి రైతులతో 'మాతోట' వంటి కార్యక్రమాలని చేపడుతోంది. ఈ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, సమన్వయకర్త స్వాతి నాబార్డు కార్యక్రమాన్ని చిరుధాన్యాల పునరాభివృద్ధి కార్యక్రమం(మిల్లెట్స్ రివైవల్) వైపు మళ్లించాలనుకున్నారు. గిరిజన రైతుల చేత చిరుధాన్యాల పంట శాతం పెంచడం, అలా చేతికొచ్చిన ధాన్యాలతో అక్కడి మహిళలకి ఉపయోగపడే ఆహార ఉత్పత్తులు తయారుచేయడం.. ఇదీ పథకం! ఈ ఆహార ఉత్పత్తుల తయారీయే గిరిజన మహిళలకిప్పుడు ఆర్థిక సాకారతని తెచ్చాయి!

మహారాష్ట్రలో శిక్షణ..

సీతంపేటా, బూర్జా, వీరఘట్టం మండలాల్లోని తొంభైమంది మహిళలని ఈ పథకం కోసం ఎంపిక చేశారు. చిరుధాన్యాలతో చేయగల ఆధునిక ఉత్పత్తులపై శిక్షణ ఇప్పించారు. అదీ మహారాష్ట్రలోని నాసిక్‌లో! చిరుధాన్యాలనగానే రాగిపిండి, జొన్నరవ్వ వాటితో చేసే రెండుమూడు ఇతర ఉత్పత్తులే గుర్తుకొస్తాయి. కానీ ఈ గిరిజన మహిళలకి రాగి కేక్, మల్టీగ్రెయిన్ ఆటా, న్యూట్రీమిక్స్, మల్టీగ్రెయిన్ బిస్కట్లు వంటి నేటి నగరజీవి కోరుకునే ఆధునిక ఆహార ఉత్పత్తులని నేర్పించారు. ఇంకేముంది? వీళ్ల ఉత్పత్తులకి మంచి గిరాకీ ఏర్పడింది. దాంతో బూర్జమండలం పెద్దపేటలో ఔట్‌లెట్ కూడా పెట్టించారు. ఈ ఒక్కదాంట్లోనే 30 మంది వివిధ స్థాయుల్లో పనిచేస్తున్నారు. ఇక్కడి ఉత్పత్తుల్ని పాలకొండలోని బేకరీలూ, శ్రీకాకుళం కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఉత్పత్తులకి కావాల్సిన పల్వరైజేషన్ పరికరాలవంటివాటిని హైదరాబాద్‌కి చెందిన వాసన్ సంస్థ అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖకి చెందిన అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆర్థిక సాయం చేస్తోంది. ముఖ్యంగా ఈ సంస్థ స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల దాదాపు అందరికీ పెట్టుబడులు ఇప్పించారు. ఔట్‌లెట్‌తో సంబంధంలేని వరహమ్మలాంటి అరవైమందికి ఇవే శ్రీరామరక్షలా మారాయి.



ప్రమీల

టాటా సంస్థ..

నాబార్డు, ఆర్ట్స్, ఆత్మా, వాసన్.. ఈ సంస్థలు గిరిజన మహిళలు తయారుచేస్తున్న ఈ ఉత్పత్తులకి కార్పొరేట్ స్థాయి అందించే పనిలో కూడా పడ్డాయి. ఇందుకోసం టాటా ఆహార ఉత్పత్తుల సంస్థతో అతిత్వరలోనే అవగాహనా ఒప్పందం కుదుర్చుకోబోతున్నాయి. అంటే ఇకపై ఈ గిరిజన స్త్రీలు తయారుచేసిన ఈ ఉత్పత్తుల్ని టాటా సంస్థే తమ బ్రాండ్ పేరుతో పంపిణీ చేస్తుంది! అదే జరిగితే.. గిరిజన గూడేల్లేని ఈ స్త్రీల కుటుంబాలు అభివృద్ధిదిశగా ఎన్నో అడుగులు ముందుకేసినట్టే!!

– మోనంగి భరత విజయకుమార్, న్యూస్‌టుడే, వీరఘట్టం

చిల్లీ పరోటా... ఎలా చేయాలి?



డియర్ వసుంధర
శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు



? ఈ మధ్య చెన్నై వెళ్లినప్పుడు చిల్లీ పరోటా తిన్నాను. అది నాకు బాగా నచ్చడంతో దాన్ని ఇంట్లో తయారుచేశా. కానీ ఆ రుచి రాలేదు. ఎక్కడ పొరపాటు చేశానో అర్థంకావడంలేదు.

- రమ్య, హైదరాబాద్

✔ చిల్లీ పరోటా చెన్నైలో ఎక్కువగా దొరుకుతుంది. ముందుగా పరోటాలను చేసుకుని మీకు నచ్చిన ఆకారాల్లో (త్రికోణ, చతురస్ర, డైమండ్) కోసుకోవాలి. లేదా చిన్న చిన్న ముక్కల్లా కోసుకోవాలి. బాణలిని పొయ్యి మీద పెట్టి.. కాస్త నూనె వేయాలి అది వేడయ్యాక అల్లం,వెల్లుల్లి ముక్కల్ని వేయించాలి. తర్వాత సన్నగా, పొడుగ్గా తరిగిన పచ్చిమిర్చి, పెద్దగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేయించుకోవాలి. ఇప్పుడు తగినంత ఉప్పు, కారం, గరం మసాలా పొడి, టొమాటో సాస్, సోయా సాస్ వేసి కలపాలి. ఇది చైనీస్ వంటకాన్ని పోలి ఉంది కాబట్టి పెద్దమంటపైనే వీటన్నింటినీ వేయించుకోవాలి. అన్నీ వేగాక ముందుగా పెట్టుకున్న పరోటా ముక్కలు కూడా వేసి బాగా కలపాలి. వాటికి మసాలా పూర్తిగా పట్టాక నిమ్మరసం, కొత్తిమీర, ఉల్లిపొరక తరుగు వేసి బాగా కలిపి దింపేయాలి. అయితే పరోటా ముక్కల్ని ఎక్కువ సేపు వేయిస్తే మెత్తగా అయిపోతాయని మరవకూడదు. కావాలనుకుంటే కారం బదులు మిరియాలపొడి వేసుకోవచ్చు. దీన్ని ఇంకా వైవిధ్యంగా చేసుకోవాలంటే పరోటా ముక్కలకు ఉప్పు, కారం, అల్లంవెల్లుల్లి ముద్దతోపాటూ కాస్త మైదా, మొక్కజొన్న పిండి కూడా కలిపి నూనెలో వేయించుకుని తీసుకోవాలి. తరవాత వీటిని ముందుగా చేసుకున్న మసాలాలో వేసి వేయించుకోవచ్చు. కొన్ని ప్రాంతాల్లో జీడిపప్పు, గసగసాలూ, ఉప్పు, కారం వేయించిన ఉల్లిపాయలు కలిపి ముద్దలా చేసి కూడా కలుపుతారు.

30700 వద్ద మద్దతు



సమీక్ష : భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఒత్తిడికి గురవుతున్న అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. ఫలితంగా గత వారం మన మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. కొన్ని దేశీయ దిగ్గజ సంస్థల ఆర్థిక ఫలితాలు నిరాశ పరచడమూ మరో కారణం. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులు ఉపసంహరించడం, షేర్ల విలువలు అధికస్థాయిలకు చేరాయనే ఆందోళనలు, మద్దతు పలికే అంశాలేవీ లేకపోవడం మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీసింది. ఉత్తర కొరియా మిస్సైల్ పరీక్షల నేపథ్యంలో, అప్రమత్తమైన అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే దేశీయ మార్కెట్ కూడా ప్రారంభమైంది. చైనాతో మన దేశానికి ఏర్పడిన ఉద్రిక్తతలూ మదుపర్లను అప్రమత్తం చేశాయి. అధికస్థాయిల వద్ద ట్రేడర్లు లాభాలు స్వీకరించడంతో, మదుపర్ల సెంటిమెంటుపై ఒత్తిడి ఏర్పడింది. బంగారంపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలన్న వాణిజ్య శాఖ ప్రతిపాదనను ఆర్థిక శాఖ తిరస్కరించడం, వస్త్రాలపై జీఎస్‌టీ (వస్తు సేవల పన్ను) రేటు తగ్గింపు, విలాసవంత కార్లపై సుంకం పెంపు ప్రతిపాదన, ఆయా రంగాల షేర్లపై ప్రభావం చూపాయి. డొల్ల కంపెనీలుగా అనుమానిస్తూ, 331 సంస్థల షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలకు సెబీ సిఫారసు చేయడంతో, అమ్మకాలు వెల్లువెత్తాయి. షేర్ల విలువల్లో ఒక్కసారిగా దిద్దుబాటు చేటుచేసుకోవడం వల్ల పొజిషన్లు రద్దు చేసుకున్నారు. ఫలితంగా వారాన్ని మార్కెట్లు భారీ నష్టాలతో ముగించాయి. వారం మొత్తంమీద సెన్సెక్స్ 1112 పాయింట్లు కోల్పోయి 31213 వద్ద, నిఫ్టీ 355 పాయింట్లు నష్టపోయి 9710 వద్ద ముగిశాయి. ఎఫ్ఐఐలు నికరంగా రూ.549 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మ్యూచువల్ ఫండ్‌ల నికర కొనుగోళ్లు రూ.3007 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:9గా నమోదు కావడం, మార్కెట్లో అన్ని రంగాలపై ఉన్న విక్రయాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా వరుసగా 5 వారాలు లాభాలు ఆర్జించిన మార్కెట్లు, గత వారంలో నిర్ణయాత్మక మద్దతు స్థాయి అయిన 32,000 దిగువకు చేరాయి. 4 వారాల లాభాలన్నీ హరించుకుపోయాయి. 7 నెలల తరవాత, కీలక మద్దతు స్థాయి అయిన 60 రోజుల సగటు చలనం కంటే కిందకు వచ్చాయి. మార్కెట్లలో రికవరీ ఉంటే, సెన్సెక్స్‌కు 31480 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తుంది. ఒక వేళ కిందకు వస్తే 30600-30700 పాయింట్ల వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ స్థాయి కంటే కిందకు వస్తే, మార్కెట్లు మరింత బలహీనపడే వీలుంది.

ప్రభావిత అంశాలు దేశీయ, అంతర్జాతీయ అంశాలు ప్రభావితం చేస్తాయి. టాటా పవర్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, ఐడీబీఐ బ్యాంక్; డిష్‌టీవీ, పెన్నార్ ఇండస్ట్రీస్ వంటి కొన్ని సంస్థలు మినహా, అత్యధిక కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు ముగిశాయి. నేడు వెలువడే రిటైల్, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలూ ప్రభావం చూపుతాయి. అమెరికాలో భవిష్యత్తులో వడ్డీరేట్ల పెంపునకు సంబంధించి ఫెడ్ కమిటీ నిర్ణయాలు ఈనెల 16న వెలువడతాయి. జపాన్, జర్మనీ రెండో త్రైమాసిక జీడీపీ గణాంకాలు కూడా వెలుగులోకి వస్తాయి. చమురు ధరలు, రూపాయి కదలికలు, డీఐఐలు/ఎఫ్ఐఐల పెట్టుబడుల ప్రభావమూ మార్కెట్‌పై ఉంటుంది. ముఖ్యంగా దేశాల మధ్య ఉద్రిక్తతలు అమిత ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు: 30965, 30610, 30247; **తక్షణ నిరోధం:** 31471, 32062, 32196

సెన్సెక్స్‌కు 30600-30700 పాయింట్ల వద్ద మద్దతు లభించవచ్చు.

– *సతీశ్ కంతేటి, జెన్ మనీ*






కోడిగుడ్లు 13వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	348	విశాఖపట్నం	360
చిల్లర (ఒక్క గుడ్డు)	4.10	వరంగల్	350
బెంగళూరు	375	చిత్తూరు	380
14న		చెన్నై	387
విజయవాడ/గోదావరి	355	నమక్కల్	375


కొనసాగనున్న నష్టాలు!

- దిగ్గజ కంపెనీల ఫలితాలు కీలకం
- టెలికాం, ఫార్మా, వాహన రంగాలు ప్రతికూలం
- ఐటీ, లోహ షేర్లు పుంజుకోవచ్చు
- విశ్లేషకుల అంచనాలు




స్టాక్ మార్కెట్ ఈ వారం

అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో.. గత వారం మొత్తం నష్టాల బాట పట్టిన మార్కెట్ ఈ వారం కూడా అదే ధోరణి ప్రదర్శించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం సెలవు కనుక మార్కెట్లు నాలుగు రోజులే పనిచేస్తాయి. నేడు విడుదలయ్యే టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో పరిణామాలు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల నుంచీ సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. నిఫ్టీ-50కి 9543 వద్ద మద్దతు లభించొచ్చని చెబుతున్నారు. 9770 వద్ద నిరోధం ఎదురుకావొచ్చనీ అంటున్నారు. నేడు ఫలితాలు వెల్లడించనున్న బీపీసీఎల్, బ్యాంక్ ఆఫ్ బరోడాల పైనా ఓ కన్నేయవచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..



టెలికాం: చాలా వరకు టెలికాం కంపెనీలు ఈ వారమూ నష్టాల పాలు కావొచ్చు. రిలయన్స్ జియో వచ్చాక ఆపరేటర్ల మధ్య ఏర్పడ్డ తీవ్ర పోటీ ఇందుకు నేపథ్యం. రిలయన్స్ కమ్యూనికేషన్స్ షేర్లు రూ.19.30-22.10 మధ్య చలించొచ్చు. ఐడియా సెల్యులార్‌కు రూ.83.90 వద్ద మద్దతు; రూ.92 వద్ద నిరోధం కనిపించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు రూ.402.50-420.50 మధ్య కదలాడవచ్చు. టాటా కమ్యూనికేషన్స్ రూ.570-650 మధ్య చలించొచ్చు.



ఫార్మా: ఈ రంగంలో నిరుత్సాహకర ఫలితాలు (సన్ ఫార్మా, సిప్లా, కేడిలా) వెలువడటంతో ఆయా కంపెనీల షేర్లు డీలా పడవచ్చు. సన్‌ఫార్మా షేరు ఈ వారం రూ.434కు పరిమితం కావొచ్చని అంచనా. ఒక వేళ ఆ స్థాయినీ కోల్పోతే రూ.409 దాకా రావొచ్చు. సిప్లా సైతం రూ.525 దిశగా పతనం చెందవచ్చు. ఏవైనా లాభాలొస్తే రూ.564కు పరిమితం కావొచ్చని సాంకేతిక విశ్లేషకులు చెబుతున్నారు.



యంత్ర పరికరాలు: మరింత నష్టపోయే అవకాశం ఉంది. ఈ రంగ వృద్ధి గణాంకాలు నిరుత్సాహకరంగా నమోదు కావడం ఇందుకు నేపథ్యం. ఎల్ అండ్ టీ రూ.1140-1162 మధ్య చలించొచ్చు. ఈ వారం ఇది రూ.1160ను పరీక్షించే అవకాశం లేకపోలేదు. అంచనాల కంటే తక్కువ స్థాయి ఫలితాలను ప్రకటించిన భెల్ కూడా రూ.114 దిశగా నష్టపోవచ్చు. సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ స్వల్పకాలంలో డీలా పడొచ్చు.



సిమెంట్: మిశ్రమ ధోరణిలో కనిపించొచ్చు. అల్ట్రాటెక్ సిమెంట్ సానుకూలంగా; ఏసీసీ, అంబుజా సిమెంట్స్ ప్రతికూలంగా ట్రేడవ్వచ్చు. మధ్య నుంచి దీర్ఘ కాలానికి సిమెంట్ రంగంపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. మంచి వర్షపాతం, అధిక మౌలిక వ్యయాలు, అందుబాటు ధర గృహాలపై దృష్టి సారిస్తుండడం ఇందుకు కారణం. అల్ట్రాటెక్ రూ.3840-4060; అంబుజా సిమెంట్స్ రూ.258-274; ఏసీసీ రూ.1712-1831 మధ్య చలించొచ్చు.



చమురు: ప్రభుత్వ రంగ చమురు రిఫైనరీలు, రిటైలర్లయిన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. శుక్రవారం మార్కెట్ అనంతరం బీపీసీఎల్ ఫలితాల(నికర లాభంలో 71% క్షీణత)ను ప్రకటించింది. నేడు కంపెనీ షేర్లపై ఆ ప్రభావం కనిపించొచ్చు. ముడి చమురు ధరలు; మార్కెట్ ధోరణిపై ఆధారపడి చమురు రంగ షేర్లు కదుల్తాయి.



వాహన: మార్కెట్‌తో పాటే చాలా వరకు వాహన రంగ షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. దిగ్గజ వాహన కంపెనీల ఫలితాలు అంచనాల కంటే దిగువగా వెలువడటం కూడా ఇందుకు దోహదం చేయవచ్చు. టాటా మోటార్స్ లక్ష్యం ధరను రూ.534 నుంచి రూ.483కు ఎల్‌కేపీ రీసెర్చ్ తగ్గించింది. ఐషర్ మోటార్స్ రూ.29,000 దిశగా; టీవీఎస్ మోటార్స్ రూ.500 వైపు; టాటా మోటార్స్ రూ.340కు నష్టపోయే అవకాశం ఉంది. మారుతీ సుజుకీ రూ.7400 దరిదాపుల్లో కదలాడవచ్చు.



బ్యాంకింగ్: ఫలితాలు స్తబ్దుగా ఉన్నందున బ్యాంకు షేర్లు ఒత్తిడిలోనే కొనసాగొచ్చు. శుక్రవారం మార్కెట్ అనంతరం ఫలితాలను ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ వారం నష్టపోవచ్చు. ప్రస్తుతానికి అన్ని బ్యాంకుల ఆర్థిక ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థిరీకరణ అవకాశాలపై మార్కెట్ దృష్టి సారించొచ్చు. నిఫ్టీ బ్యాంక్ సూచీకి 23,800 వద్ద మద్దతు; 24,326 వద్ద నిరోధాన్ని అంచనా వేస్తున్నారు.



ఎఫ్ఎమ్‌సీజీ: మార్కెట్ ధోరణిని అనుసరిస్తూ.. చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడవచ్చు. ఐటీసీ తన దీర్ఘకాల నిరోధ స్థాయిలను కోల్పోయిన నేపథ్యంలో రూ.289 స్థాయికి పడిపోవచ్చు. హిందుస్థాన్ యునిలీవర్‌కు రూ.1195 వద్ద నిరోధం; రూ.1140 వద్ద మద్దతు; డాబర్ ఇండియాకు రూ.290 వద్ద మద్దతు; రూ.310 వద్ద నిరోధం కనిపిస్తోంది.



లోహ: ఈ వారం కొంత పుంజుకునే అవకాశం ఉంది. చాలా వరకు కంపెనీలు సాంకేతికంగా బలంగా కనిపిస్తుండడమే ఇందుకు కారణం. ప్రస్తుత స్థాయిల వద్ద ఆకర్షణీయంగా కనిపిస్తున్నందున జీఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎమ్ఓఐఎల్ షేర్లను పరిశీలించొచ్చని రెలిగేర్ క్యాపిటల్ మార్కెట్స్ పేర్కొంది.



ఐటీ: సానుకూలంగా కదలాడొచ్చు. రూపాయి బలహీనతలు ఐటీ షేర్ల ర్యాలీకి సహకరించవచ్చు. జులై మొదటి వారం నుంచి నిఫ్టీ 50తో పోలిస్తే నిఫ్టీ ఐటీ సూచీ రాణిస్తోంది. ఈ ధోరణి కొనసాగొచ్చని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. టీసీఎస్ రూ.2400-2700 శ్రేణిలో కదలాడవచ్చు. ఇన్ఫోసిస్ రూ.930-1090; విప్రో రూ.275-335 మధ్య కదలాడవచ్చు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు రూ.830 వద్ద మద్దతు; రూ.940-980 వద్ద నిరోధం ఉండొచ్చు. ఇక టెక్ మహీంద్రాకు రూ.380 వద్ద మద్దతు లభించొచ్చని; రూ.430-440 వద్ద నిరోధం ఎదురు కావొచ్చని అంచనా.

డాక్టర్ రెడ్డీస్‌కు 'న్యాయ' కష్టాలు!

ఈనాడు, హైదరాబాద్: తయారీ యూనిట్లలోని నాణ్యత గురించి వెల్లడించనందున, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌పై క్లాస్ యాక్షన్ కేసు దాఖలు చేయాలని అమెరికాలోని న్యాయ సంస్థలు (లా ఫర్మ్‌లు) యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సంస్థలు డాక్టర్ రెడ్డీస్ నుంచి వాటాదారులు క్లెయిమ్‌లు పొందడానికి ఉన్న అవకాశాలపై పరిశోధన చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ ఫార్ములేషన్ల యూనిట్, శ్రీకాకుళం, తెలంగాణలోని మిర్యాలగూడలో ఉన్న ఏపీఐ యూనిట్లు తయారీ ప్రమాణాలకు అనుగుణంగా లేవని డాక్టర్ రెడ్డీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) 2015 నవంబరులో హెచ్చరిక లేఖ జారీ చేసింది. తాజాగా గత గురువారం (ఆగస్టు 10, 2017)నాడు హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఉన్న ఫార్ములేషన్ల తయారీ యూనిట్‌కు సంబంధించి మంచి తయారీ విధానాల (జీఎంపీ) ధ్రువీకరణ పత్రాన్ని జర్మనీ ఔషధ నియంత్రణ సంస్థ పునరుద్ధరించలేదు. ఈ యూనిట్‌పై జర్మనీ నాన్ కాంప్లియన్స్ నోటీసు ఉందని, ఇటీవల తనిఖీలు నిర్వహించిన తర్వాత కూడా జర్మనీ నియంత్రణ సంస్థ ధ్రువీకరణను పునరుద్ధరించలేదని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఈ మేరకు తమ జర్మనీ అనుబంధ సంస్థ 'బెటాఫార్మా'కు సమాచారం పంపిందని వివరించింది. ఈ రెండు సందర్భాల్లో డాక్టర్ రెడ్డీస్ షేరు నష్టపోయింది. ఈ అంశాలపై సెక్యూరిటీస్ క్లెయిమ్‌లు చేయడానికి ఉన్న అవకాశాలను న్యాయ సంస్థలు పరిశీలిస్తున్నాయి. అయితే.. వీటి వల్ల కంపెనీకి ఎటువంటి ఇబ్బంది ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఫెడరల్ సెక్యూరిటీస్ చట్టాల ఉల్లంఘన అవకాశాలపై పరిశోధన చేస్తున్నట్లు తాజాగా వాటాదారుల హక్కుల న్యాయ సంస్థ జాన్సన్ అండ్ వీవర్స్ ఎల్ఎల్‌పీ వెల్లడించింది. రోసెన్ లా, గోల్డ్‌బెర్గ్ లా వంటి 7-8 న్యాయ సంస్థలు ఈ దిశగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ వాహనాల అభివృద్ధి కష్టమే: హోండా

- సుంకం పెంపు ప్రభావం


యోచిరో ఉనో

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)లో పెద్ద కార్లు, స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీ)పై అధిక సుంకం విధించడం ఆందోళనకరమని హోండా కార్స్ ఇండియా పేర్కొంది. 28% పన్నుకు అదనంగా సుంకం గరిష్ఠ పరిమితిని 15% నుంచి 25% వరకు సుంకం పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయ ప్రభావం, దేశంలో అంతర్జాతీయ బ్రాండ్ల విస్తరణపై పడుతుందని హోండా తెలిపింది. అంతర్జాతీయ అవసరాల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దేశీయంగా వాహనాలు అభివృద్ధి చేయడం కూడా కష్టమవుతుందని పేర్కొంది. ప్రపంచ తయారీ కేంద్రాల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్న దశలో, ఇటువంటి పరిణామాలు ఎంతో నిరాశ కలిగిస్తున్నట్లు వివరించింది. చిన్న కార్లను మాత్రమే భారత్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందనే తప్పుడు సందేశం ఇచ్చినట్లు అవుతుందని వివరించింది. 'పెద్ద వాహనాలపై సుంకాన్ని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచడం తీవ్ర నిరాశకు గురి చేసింది. దేశీయంగా ఉత్పత్తి చేసి, ఎగుమతి చేసే వాహనాలు, విడి భాగాలపైనా ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అంతర్జాతీయ తయారీ కేంద్రంగా ఎదగాలన్న భారత్ స్ఫూర్తికి ఇది విఘాతం కలిగిస్తోంది. చాలా దేశాల్లో ప్రారంభ స్థాయి వాహనాలుగా భావించే వాటిని భారత్‌లో ఖరీదైనవిగా చూస్తున్నారు. వాహనం పొడవు నాలుగు మీటర్లకంటే పైన ఉండటమే ఇందుకు ప్రధాన కారణమ'ని హోండా కార్స్ ఇండియా అధ్యక్షుడు, ముఖ్యకార్య నిర్వహణాధికారి (సీఈఓ) యోచిరో ఉనో పేర్కొన్నారు.

రూ.1,600 కోట్ల పెట్టుబడులు: 2017-18లో రూ.1,600 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా వెల్లడించింది. మరో 500 విక్రయ కేంద్రాలు నెలకొల్పనున్నట్లు పేర్కొంది.

అహం వీడండి.. మూర్తిని పిలవండి

- ఇన్ఫీ గౌరవ ఛైర్మన్‌గా నియమించాలి: వి.బాలకృష్ణన్



బెంగళూరు: ఇన్ఫోసిస్ గౌరవ ఛైర్మన్, ప్రధాన మార్గదర్శిగా సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్.ఆర్.నారాయణమూర్తిని వెంటనే బోర్డు ఆహ్వానించాలని, సంస్థ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) వి.బాలకృష్ణన్ సూచించారు. దీర్ఘకాలం పాటు సుస్థిర పాలనా నిబంధనలు రూపొందించేందుకు వీలుగా బోర్డును పునర్నియమించే అవకాశం మూర్తికి కల్పించాలని పేర్కొన్నారు. కార్యనిర్వాహక యాజమాన్యం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా తగిన పరిశీలనలను బోర్డు జరపాల్సి ఉందన్నారు. 'మూర్తి కనుక కోరుకుంటే, ఆయనకు అధికారిక పాత్ర అప్పగించే అంశాన్ని బోర్డు తప్పక పరిశీలిస్తుంది' అని ఇన్ఫీ సహ ఛైర్మన్ రవి వెంకటేశన్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో, బాలకృష్ణన్ ఇలా స్పందించారు. 'బోర్డు తన అహాన్ని విడిచిపెట్టి, మూర్తితో పాటు ఇతర వ్యవస్థాపకులతో నేరుగా సంప్రదింపులు జరపాలి. వాటాదారులు మరింత లాభపడేలా చూడాలి. నమ్మకం, పాలనాపరమైన అంశాల్లో కంపెనీ ప్రతిష్ఠను నిలబెట్టుకోవడం ముఖ్యం. సంస్థ వ్యవస్థాపకులు, ప్రస్తుత బోర్డు మధ్య ఉన్న వివాదాల వల్ల కంపెనీపై ప్రభావం పడుతోంది. ఇది వాటాదారులకు క్షేమదాయకం కాదు. గత మూడేళ్లుగా కంపెనీ షేరు విలువ పెరుగుదల పెద్దగా లేకపోవడం, మదుపుదార్లను ఇబ్బంది పెట్టే అంశమే. మూర్తికి చట్టబద్ధమైన బాధ్యతలు అవసరం లేదు. అయితే పాలనా పరమైన అంశాల్లో ఆయన బోర్డుకు మార్గదర్శకం చేయగలరు. మదుపుదార్లకు కంపెనీపై విశ్వాసం కలిగించగలరు. కంపెనీకి కీలకమైన విలువలు, సంస్కృతికి పట్టం గడుతూనే, సంస్కరణలకూ బాట వేయగల'రన్నారు.

హీరో మరో 3 స్కూటర్లు!

200 సీసీ కొత్త స్పోర్ట్స్ బైక్

దిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ మరో 3 స్కూటర్ మోడళ్లను ప్రవేశ పెట్టనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి స్కూటర్ విభాగంలో గణనీయమైన మార్కెట్ వాటా దక్కించుకోవడమే లక్ష్యంగా కొత్త వాహనాలు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 125 సీసీ ఇంజను సామర్థ్యంతో మొదటి స్కూటరును, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగిలిన రెండు మోడళ్లు విడుదల చేసేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. 200 సీసీ ఇంజను సామర్థ్యంతో సరికొత్త స్పోర్ట్స్ బైక్‌ను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మార్కెట్టులోకి విడుదలచేయాలని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం 110 సీసీ ఇంజిన్‌తో మాస్ట్రో ఎడ్జ్, డ్యూయెట్ స్కూటర్లు, 100 సీసీ ఇంజిన్‌తో ప్లెజర్ స్కూటర్‌ను హీరో ఉత్పత్తి చేస్తోంది.

నేటి బోర్డు సమావేశాలు

★ అపోలో హస్పిటల్స్ ★ కోల్ ఇండియా ★ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ★ గ్రాన్యూల్స్ ఇండియా ★ సువెన్ లైఫ్ సైన్సెస్ ★ పెన్నార్ ఇండస్ట్రీస్ ★ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ★ ఐవీఆర్‌సీఎల్ ★ గాయత్రీ ప్రాజెక్ట్స్ ★ ఐడీబీఐ బ్యాంక్ ★ సొనాటా సాఫ్ట్‌వేర్ ★ టాటా పవర్ ★ ఎంటీఎన్‌ఎల్ ★ పయనీర్ డిస్టిలరీస్ ★ మెక్‌డోవెల్ హోల్డింగ్స్ ★ సద్భావ్ ఇంజనీరింగ్ ★ ఎన్‌బీసీసీ ★ జేకే టైర్ ★ జైన్ ఇరిగేషన్ ★ ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ ★ ఇన్ఫీబీమ్ ★ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ★ అమృతాంజన్

పసుపు బలహీనం!

కమొడిటీస్ ఈ వారం

బంగారం, వెండి



పసిడి అక్టోబరు కాంట్రాక్టు గత వారం రూ.28,389 వద్ద ప్రారంభమైంది. ఆ తరవాత రూ.28,330-29,295 మధ్య చలించి చివరకు 2.87% లాభంతో రూ.29,205 వద్ద ముగిసింది. ఈ వారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15న మార్కెట్లు పనిచేయవు. భారత్-చైనా, అమెరికా-ఉత్తర కొరియా భౌగోళిక అనిశ్చితులు పసిడి ధరపై ప్రభావం చూపొచ్చు. సాంకేతికతంగా కాంట్రాక్టు రూ.29,060 దిగువన ముగియకుంటే మదుపర్లు షార్ట్ సెల్లింగ్ పొజిషన్లకు దూరంగా ఉండటమే మంచిది. ట్రేడర్లు రూ.28,366ను స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ షార్ట్ పొజిషన్లు తీసుకోవచ్చు. వెండి సెప్టెంబరు కాంట్రాక్టు గత వారం రూ.37,177 వద్ద ప్రారంభమైంది. ఆ తరువాత రూ.36,935-39,520 మధ్య చలించి చివరకు 5.41 శాతం లాభంతో రూ.39,190 వద్ద స్థిరపడింది. ఈ వారం విషయానికి వస్తే మంగళవారం న్యూయార్క్ ఎంపైర్ స్టేట్ తయారీ గణాంకాలు వెలువడనున్నాయి. ఇవి వెండి ధరలపై ప్రభావం చూపొచ్చు. అందువల్ల బుధవారం కాంట్రాక్టు కొంత మేర నష్టపోయే అవకాశం ఉంది. రూ.39,650 పైన చలిస్తే మరింత పెరిగే వీలున్నందున ఈస్థాయిపైన షార్ట్ పొజిషన్ల జోలికి పోకపోవడమే ఉత్తమం.

ప్రాథమిక లోహాలు

ఈ వారం రాగి ఆగస్టు కాంట్రాక్టుకు సాంకేతికంగా రూ.420-422 స్థాయిల వద్ద కొనుగోళ్లు చోటుచేసుకోవచ్చు. కాబట్టి లాంగ్ పొజిషన్లు ఉన్న వారు ఈ స్థాయిల వద్ద లాభాలు స్వీకరించడమే ఉత్తమం. చిన్న ట్రేడర్లు రూ.418పై నుంచే లాభాలు స్వీకరించడం శ్రేయస్కరం. సీసం ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.147 కింద ముగిస్తే, రూ.143 వరకు నష్టపోవచ్చు. కాబట్టి ఈ స్థాయికి దిగువున లాంగ్ పొజిషన్ల జోలికి పోవద్దు. ఈ వారం జింక్ ఆగస్టు కాంట్రాక్టు రూ.188 పైన సానుకూలంగా కనిపిస్తోంది. కాబట్టి ఈ స్థాయి పైన కొత్త పొజిషన్లు తీసుకోవడంతో పాటు ప్రస్తుత పొజిషన్లను కొనసాగించడం కలిసిరావొచ్చు. అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం ముగింపు ప్రాతిపదికన రూ.127 దిగువన చలిస్తే మరింత నష్టపోయే వీలుంది. రూ.136.70 వద్ద నిరోధం కనిపిస్తున్నందున ఆ స్థాయిల వద్ద లాభాలను స్వీకరించడమే మంచిది. ఈ వారం నికెల్ ఆగస్టు కాంట్రాక్టు సాంకేతికంగా సానుకూలంగానే కనిపిస్తోంది. కాట్టి ప్రస్తుత పొజిషన్లను రూ.728 వరకు కొనసాగిస్తే కలిసొచ్చే అవకాశం ఉంది.



గతవారం పొజిషన్లు ఇలా


కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి(ఆగస్టు)	405.75	412.30	1.61
సీసం (ఆగస్టు)	149.45	148.80	(0.43)
జింక్ (ఆగస్టు)	178.40	185.40	3.92
అల్యూమినియం(ఆగస్టు)	121.50	130.30	7.24
నికెల్ (ఆగస్టు)	656.50	681.70	3.84
ముడిచమురు (ఆగస్టు)	3,130	3,125	(0.16)
సహజవాయువు (ఆగస్టు)	178.50	191.50	7.28
పసుపు (సెప్టెంబరు)	7,794	7,370	(5.44)
జీలకర్ర (సెప్టెంబరు)	19,690	19,525	(0.84)

ఇంధన రంగం



ఈ వారం ముడి చమురు ఆగస్టు కాంట్రాక్టు రూ.3,080 దిగువన ముగిస్తే మరింత నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి రూ.3,136ను స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ ఈ స్థాయి కంటే కిందకు వస్తే విక్రయించడం మంచిది. సహజ వాయువు ఆగస్టు కాంట్రాక్టు ఈ వారం రూ.189 దిగువున చలించకుంటే లాంగ్ పొజిషన్లను కొనసాగించడం కలిసి రావొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



ఈ వారం పసుపు సెప్టెంబరు కాంట్రాక్టు రూ.8,156 పైన చలించకుంటే అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి లాభాలు స్వీకరించడం ఉత్తమం. ఈ వారం జీలకర్ర సెప్టెంబరు కాంట్రాక్టును రూ.19,922 స్టాప్‌లాస్‌గా పరిగణిస్తూ రూ.19,195 లక్ష్యంతో పెరిగిన ప్రతిసారీ విక్రయించడమే మంచిది.

– *ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్*

జీఎంఆర్ నష్టం రూ.137 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: విమానాశ్రయాల వ్యాపారం పనితీరు బాగుండడంతో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నష్టాల భారాన్ని తగ్గించుకుంది. 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి ఏకీకృత నష్టం రూ.137 కోట్లకు పరిమితమైంది. ఏడాది క్రితం ఇదే కాల నికర నష్టం రూ.235 కోట్లతో పోలిస్తే, ఈసారి 42 శాతం తగ్గింది. మొత్తం సమగ్ర నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. రూ.190 కోట్ల నుంచి రూ.107 కోట్లకు పరిమితమైందని కంపెనీ వెల్లడించింది. సమీక్ష త్రైమాసికానికి ఇతర ఆదాయంతో కలిపి మొత్తం ఆదాయం 41 శాతం వృద్ధితో రూ.2,315.86 కోట్ల నుంచి రూ.3,274.31 కోట్లకు చేరింది. 2017-18 తొలి త్రైమాసికానికి కార్యకలాపాల ద్వారా లభించిన ఆదాయం రూ.3,107.98 కోట్లు ఉందని.. ఇందులో విమానాశ్రయాల వ్యాపారం ద్వారా లభించిన ఆదాయం రూ.1,900 కోట్లని కంపెనీ వెల్లడించింది. వ్యయాలు 36 శాతం పెరిగి రూ.2,253.50 కోట్ల నుంచి రూ.3,078.14 కోట్లకు చేరాయి. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే సమీక్ష త్రైమాసికానికి దిల్లీ విమానాశ్రయం ప్రయాణికులు 14 శాతం వృద్ధితో 1.57 కోట్ల మందికి, హైదరాబాద్ విమానాశ్రయం ప్రయాణికులు 19 శాతం వృద్ధితో 42 లక్షలకు చేరినట్లు జీఎంఆర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. ఎబిటా రూ.759 కోట్ల నుంచి రూ.844 కోట్లకు పెరిగింది. పన్నులు, ఇతర చెల్లింపులకు ముందు విమానాశ్రయాల వ్యాపారంలో కంపెనీకి రూ.674 కోట్ల లాభం వచ్చింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఈ లాభం రూ.545 కోట్లుంది.

40% వాటా రూ.13,000 కోట్లకు!

జీఐసీతో ఒప్పందానికి డీసీసీడీఎల్ సన్నాహాలు

దిల్లీ: డీఎల్ఎఫ్ అద్దె విభాగంలో, తమకు ఉన్న 40 శాతం వాటాను సింగపూర్‌కు చెందిన సార్వభౌమ వెల్త్ ఫండ్ జీఐసీకి విక్రయించేందుకు ప్రమోటర్లు సన్నాహాలు చేస్తున్నారు. తమ వాటాను రూ.13,000 కోట్లకు విక్రయించేందుకు ఈనెలలోనే ఒప్పందం చేసుకోనున్నారని సమాచారం. గ్రూప్‌నకు చెందిన వాణిజ్య ఆస్తులను డీఎల్ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్ లిమిటెడ్ (డీసీసీడీఎల్) నిర్వహిస్తోంది. ఇందులో ప్రమోటర్లకు ఉన్న మొత్తం వాటాను విక్రయిస్తారని 2015 అక్టోబరులో డీఎల్ఎఫ్ ప్రకటించిన సంగతి విదితమే. ఈ లావాదేవీపై ప్రత్యేకంగా చర్చించేందుకు ఈ ఏడాది మార్చిలో ప్రమోటర్లు జీఐఎస్‌తో ఒప్పందం చేసుకున్నారు. కచ్చితంగా అమలయ్యే కొనుగోలు ఒప్పందంపై ఇరు సంస్థలు, ఈనెలాఖరులోగా సంతకాలు చేస్తాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.12,000-13,000 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

గ్రంథపాలన గాలికి..!



ఇది మహబూబాబాద్‌లోని జిల్లా గ్రంథాలయం దుస్థితి. స్థలం లేక చదువుకునే బల్లపైనే పుస్తకాల సంచులు వేశారు.

ఈనాడు, హైదరాబాద్
న్యూస్‌టుడే యంత్రాంగం

- కాలానుగుణంగా మారని గ్రంథాలయాలు
- నేటి తరాన్ని ఆకర్షించడంలో విఫలం
- వసతుల కొరత.. అపరిశుభ్ర వాతావరణం
- సెస్సు ఎగ్గొడుతున్న స్థానిక సంస్థలు
- నిధుల లేమితో సతమతం
- బహుళ ప్రయోజన కేంద్రాలుగా మారాలంటున్న నిపుణులు

విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలు ఆధునికీకరణను అందుకోలేక ఆదరణను కోల్పోతున్నాయి. సాంకేతికత అరచేతిలో అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత 'స్మార్ట్' యుగంలో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. పాత భవనాలు, అపరిశుభ్ర వాతావరణం.. వసతుల లేమితో గ్రంథాలయాలు క్రమంగా నేటి తరానికి దూరమవుతున్నాయి. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పుస్తక నిలయాల పునరుజ్జీవంపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే భవిష్యత్తులో అవి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.



రెండే గదులతో సిరిసిల్ల జిల్లా గ్రంథాలయం

ఇదీ దుస్థితి..

- గ్రంథాలయాలంటే ఆదాయార్జన లేని విభాగమనే భావన ప్రభుత్వాల్లో ఉంటోంది. దాంతో మూడు దశాబ్దాల నుంచి సిబ్బంది నియామకాలే జరపడం లేదు. బడ్జెట్ కేవలం వేతనాలు, నిర్వహణకే సరిపోతోంది.
- ఇక్కడ గ్రంథాలయం ఉందంటూ ఎక్కడా ఒక్క బోర్డు కూడా కనిపించదు. కనీసం ప్రధాన దారి నుంచి గ్రంథాలయానికి వెళ్లే దారి అంటూ సూచికలే ఉండవు. జిల్లా గ్రంథాలయాలకు రంగులు వేసి దశాబ్దాలు గడుస్తోంది.
- ఇంటర్‌నెట్, కంప్యూటర్ల ఏర్పాటు కేవలం హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాలకే పరిమితమైంది.
- ఇప్పటి వరకు ఉన్న శాఖా గ్రంథాలయాలనే కొత్త జిల్లాల కేంద్ర గ్రంథాలయాలుగా మార్చడంతో కనీస వసతులు కరవయ్యాయి.
- అధిక శాతం మండల, గ్రామ గ్రంథాలయాల్లో కనీసం నీటి సౌకర్యం, శౌచాలయాలు కూడా లేవు.
- 50 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఒక్కో గ్రంథలయాధికారి రెండు మూడు గ్రంథాలయాలకు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తుండటంతో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.
- రోజుల తరబడి పుస్తకాల గదులు తెరుచుకోని గ్రంథాలయాలు కోకొల్లలు.



హైదరాబాద్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో మూలనపడిన మొబైల్ లైబ్రరీ బస్సులు

సెస్సు బకాయిలు బోలెడు..

పంచాయతీలు, పుర, నగర పాలక సంస్థలు ఆస్తి పన్నులో 8 శాతం గ్రంథాలయ సెస్సుగా వసూలు చేస్తున్నాయి. ఆ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయ పరిషత్‌లకు ఏటా భారీగా ఆదాయం రావాల్సి ఉంది. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఏటా రూ.90 కోట్లు గ్రంథాలయ సెస్సు రూపేణా గ్రంథాలయ పరిషత్‌కు అందాలి. 2013 నాటికే జీహెచ్‌ఎంసీ రూ.300 కోట్లకుపైగా సెస్సు బకాయిపడింది. ఈ నాలుగేళ్లలో అది రెట్టింపైంది. ప్రతి ఉమ్మడి జిల్లాలో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు బకాయిలున్నాయి. ఈ సమస్యను ప్రభుత్వం సైతం పట్టించుకోవడం లేదు. ఫలితంగా గ్రంథాలయాలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

గ్రంథాలయాలు.. గణాంకాలు..

రాష్ట్రంలోని మొత్తం గ్రంథాలయాలు	1934
కేంద్ర గ్రంథాలయం	1 (అఫ్జల్‌గంజ్)
ప్రాంతీయ గ్రంథాలయాలు	3
నగర/జిల్లా గ్రంథాలయాలు	10
శాఖా గ్రంథాలయాలు	558
పుస్తక నిక్షిప్త కేంద్రాలు	1376
మొత్తం రెగ్యులర్ సిబ్బంది	523 మంది
ఖాళీలు	460 మంది (పొరుగుసేవల కింద 180 మంది పనిచేస్తున్నారు)
మొత్తం గ్రంథాలు	68 లక్షలు
సభ్యులు	4.83 లక్షల మంది
2016లో సందర్శకులు	2 కోట్లు (ఒకరు ఏడాదిలో 10 సార్లు వస్తే సందర్శకుల సంఖ్య 10గా లెక్కిస్తారు)
వార్షిక బడ్జెట్	2016-17కు రూ.63 కోట్లు



ఇది కరీంనగర్‌లోని జిల్లా గ్రంథాలయం. కనీసం బోర్డు కూడా కనిపించని దుస్థితి

నవీకరణ వేగవంతం



ముఖ్యమంత్రి కేసీఆర్ పుస్తక ప్రియుడు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధ్యాపక వృత్తి నుంచి వచ్చారు. కాబట్టి తెలంగాణ గ్రంథాలయాలకు మంచి రోజులు వచ్చాయి. ఇటీవల ముఖ్యమంత్రి 29 జిల్లాలకు ఛైర్మన్లను ప్రకటించారు. వారు బాధ్యతలు చేపట్టాక గ్రంథాలయాల నవీకరణలో వేగం పుంజుకుంటుంది. ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. కంప్యూటర్లను సమకూర్చుకొని వై ఫై సౌకర్యం కల్పించబోతున్నాం. రూ.3.14 కోట్లతో త్వరలో పుస్తకాలు కొనుగోలు చేసి జిల్లాలకు పంపిస్తాం.

-అయాచితం శ్రీధర్, ఛైర్మన్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్

యువతకు ఉపయోగపడేలా..



గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడమే కాకుండా యువతకు ఉపయోగపడేలా పలు మార్పులకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఆన్‌లైన్ ద్వారా నమూనా పరీక్షలు నిర్వహించాలని, స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ, వారానికోసారి నిపుణులతో తరగతులు, కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని నిర్ణయించి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. మరికొద్ది నెలల్లోనే ఇవి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

-రమణకుమార్, సంచాలకుడు, ప్రజా గ్రంథాలయాల విభాగం

సామాజిక అవసరాలు తీర్చేలా..



బ్రిటన్ లాంటి దేశాల్లో గ్రంథాలయాలను శిక్షణ కేంద్రాలుగా, సభలు, సమావేశాలు పెట్టుకునే స్థలాలుగానూ ఉపయోగించుకుంటున్నారు. పిల్లలనూ ఆకట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు పిల్లలు, యువత, వృద్ధులు, మహిళల అవసరాలు, ఆశయాలు, ఆలోచనలు కనిపెట్టి గ్రంథాలయాలను మార్చుకోవాలి.

- ఆచార్య సుదర్శన్, లైబ్రరీ సైన్స్ నిపుణుడు

పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించాలి



రాష్ట్రంలో 1982 తర్వాత గ్రంథాలయాల పరిస్థితి పూర్తిగా దిగజారింది. కాలానుగుణంగా వాటిని ఆధునికీకరించాలి. అందుకు అవసరమైనన్ని నిధులు కేటాయించాలి. చిన్న పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేసి గ్రంథాలయాలకు రప్పించాలంటే వారికి ప్రత్యేక వసతులు కల్పించాలి.

-లక్పతినాయక్, లైబ్రరీ సైన్స్ పరిశోధక విద్యార్థి, ఓయూ

ఇది బ్రిటన్‌లోని కోడ్రింగ్టన్ గ్రంథాలయం. పురాతన భవనం ఫ్లోరింగ్‌ను మార్పుళ్లు వేసి ఆధునికీకరించారు. బ్రిటన్‌లో గత 6 సంవత్సరాల్లో 350 గ్రంథాలయాలు మూతపడ్డాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పాత భవనాలను ఇప్పటి తరాన్ని ఆకట్టుకునేలా ఆహ్లాదకరంగా మార్చుతున్నారు.



ఇలా చేస్తే మేలు..

- ఇప్పుడున్న గ్రంథాలయాలు కాలానుగుణంగా మారకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు ఆ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పుడు రాజధానిలోని అశోక్‌నగర్, దిల్‌షుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాల మాదిరిగా స్టడీ హాళ్లు వెలుస్తున్నాయి. కేవలం అక్కడ చదువుకోవడానికే నెలకు నాన్ ఏసీ గదికి రూ.600 వరకు, ఏసీ గదికి రూ.800-1000 వరకు వసూలు చేస్తున్నారు. అలాంటి వాటిని గ్రంథాలయాల్లో ఏర్పాటు చేయాలని యువత కోరుతోంది.
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆయా కాలనీ సంఘాల నిర్వహణలో 1000 ఈ- లైబ్రరీలు ఏర్పాటు చేయాలని మూడేళ్ల క్రితమే నిర్ణయం తీసుకున్నారు. కానీ, 10 మాత్రమే నెలకొల్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ-లైబ్రరీల ఏర్పాటుపై దృష్టిసారించాలి.
- మారుతున్న జీవన శైలి నేపథ్యంలో ఒక చోటికి వెళితే పది అవసరాలు తీరేలా ఉండాలి. గ్రంథాలయాలు కూడా కేవలం పుస్తకాలు చదువుకోవడానికి కాకుండా సామాజిక అవసరాలు తీర్చే కేంద్రాలుగా మారాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలి. చిన్న చిన్న చర్చలు జరుపుకునేలా వసతులు ఉండాలి.
- అందరికీ కంప్యూటర్, ఇతర నైపుణ్యాలు నేర్పేలా మారాలి. యువతకు శిక్షణ ఇచ్చేలా ఉండాలి. సొంతంగా ఆ పనులు చేయకున్నా ప్రైవేట్ వ్యక్తులకు స్థలం కేటాయించవచ్చు.
- గ్రంథాలయ భవనం, పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి.

ఆగస్టు 15 పురస్కారాల ప్రకటన

- **పోలీసు రంగంలో అంజనీకుమార్, రాజీవ్‌రతన్**
- **సాహితీరంగంలో సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, విజయసారథిల ఎంపిక**

ఈనాడు - హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలను అందించిన వారికి తెలంగాణ ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. వీటిని ఈనెల 15న గోల్కొండ కోటలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అందజేస్తారు. సాహితీవేత్తలు, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, హరితహారానికి కృషి చేసినవారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

రాష్ట్రపతి పోలీసు పతకాలు

- అంజనీకుమార్, అదనపు డీజీపీ, హైదరాబాద్
- రాజీవ్ రతన్, డీజీ, అగ్నిమాపక సేవలు
- ఎన్.సూర్యనారాయణ, డీఐజీ, విజిలెన్స్
- ఎం.శివప్రసాద్, అదనపు సీపీ

సాంస్కృతిక శాఖ

- సుద్దాల అశోక్‌తేజ, తెలుగు గేయరచయిత
- జయరాజ్, తెలుగు గేయరచయిత
- భాష్యం విజయసారథి, తెలుగు-సంస్కృత మేధావి

రాష్ట్ర ప్రోత్సాహక అవార్డులు

- డాక్టర్ జె.రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూరు

గ్రూప్-1

- డాక్టర్ సీహెచ్.మధుసూదన్, అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా వైద్యకళాశాల
- సురేష్‌బాబు, డీపీవో, సిద్దిపేట
- పి.డబ్ల్యూ.జాన్సన్, డీఆర్‌డీవో, వికారాబాద్

గ్రూప్-2

- ఖానాపూర్ చంద్రకళ, ఆర్‌డీవో, హైదరాబాద్
- జి.విశ్వనాథం గుప్తా, ప్రధానోపాధ్యాయుడు, రంగారెడ్డి
- రమీజుద్దీన్ అహ్మద్, మండల ప్రణాళిక అధికారి, పెద్దపల్లి

గ్రూప్-3

- ఎం.జయమ్మ, స్టాఫ్‌నర్సు, మహబూబ్‌నగర్
- కె.ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి వరంగల్ రూరల్
- డి.శంకర్‌కుమార్, పీఏ, సీపీఆర్‌వో

గ్రూప్-4

- బి.దశరథ్, సైకిల్ ఆర్డర్లీ, మహిళా శిశుసంక్షేమం
- కె.గంగయ్య, ఆఫీసు సబార్డినేటు, కామారెడ్డి
- కె.కిష్టయ్య, ఆఫీసు సబార్డినేటు, యాదాద్రి

పోలీసుశాఖ (భారతీయ పోలీసు పతకాలు)

- టి.శరత్‌బాబు, అదనపు ఎస్పీ, సీఐడీ
- నీలగిరి దివ్యచరణ్‌రావు, అదనపు డీసీపీ, సైబరాబాద్
- టి.సుదర్శన్, డీఎస్పీ, ఏసీబీ, కరీంనగర్
- ఉప్పు తిరుపతి, ఏసీపీ, మహంకాళి, హైదరాబాద్
- మదాడి రమణకుమార్, ఏపీపీ, మాదాపూర్, సైబరాబాద్
- శవిలి ప్రేమ్‌రాజ్, ఏఎస్సై, ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్
- మ్యాడంచెట్టి వెంకట్‌రావు, ఆర్ఐ, ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్
- పట్లోళ్ల మధుసూధన్‌రెడ్డి, ఎస్ఐ, ఎస్ఐబీ, ఇంటిలిజెన్స్, హైదరాబాద్
- సయ్యద్ యూసుపుద్దీన్, ఆర్ఎస్ఐ, డీపీటీసీ, నల్గొండ
- గజ్జెల లక్ష్మయ్య, హెచ్‌సీ, ఎస్‌బీ, సైబరాబాద్
- అన్ను దామోదర్‌రెడ్డి హెచ్‌సీ, కౌంటర్ ఇంటెలిజెన్స్, హైదరాబాద్
- సిద్దా సదానందం, ఏఆర్‌పీసీ, డీఏఆర్ వరంగల్
- దివంగత డి.సిద్దయ్య ఎస్సై,
- దివంగత సి.నాగరాజు, పీసీ
- మహ్మద్ యూసుఫ్ అలీఖాన్, ఫైర్‌మెన్, లంగర్‌హౌజ్
- కె.వెంకట్‌రెడ్డి, ఫైర్‌మెన్, సాలార్‌జంగ్ మ్యూజియం
- కె.శ్రీశైలం, ఫైర్‌మెన్, మాదాపూర్, రంగారెడ్డి
- మహ్మద్ యాసీన్, ఫైర్‌మెన్, మలక్‌పేట
- బి.మల్లయ్య, ఫైర్‌మెన్, కరీంనగర్
- వి.ఈదయ్య, ఫైర్‌మెన్, హుజూర్‌నగర్, నల్గొండ
- కె.శంకరయ్య, ఫైర్‌మెన్, నారాయణపేట, మహబూబ్‌నగర్

హరితమిత్ర

- వై.శేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధి, వరంగల్ రూరల్
- పెద్దిసుదర్శన్‌రెడ్డి, ప్రజాప్రతినిధి, వరంగల్ రూరల్
- సి.శ్రీధర్‌రావు, డీఎఫ్‌వో, సిద్దిపేట
- ఎంపీపీఎస్, మూరపల్లి, జగిత్యాల
- అటవీశాఖ, సింగరేణి, రామగుండం-1, పెద్దపల్లి

సామాజిక కార్యకర్తలు, స్కౌట్స్ అండ్‌గైడ్స్

- పి.బసంత్‌రెడ్డి, సామాజిక కార్యకర్త, జక్రాన్‌పల్లి, నిజామాబాద్
- జి.పరమేశ్వర్, ఎస్‌వోసీ, హైదరాబాద్
- జి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు, కరీంనగర్
- ఎం.రాజగోపాల్, రాష్ట్రకోశాధికారి, హైదరాబాద్
- ఎ.సుగుణ రాజేంద్రమ్, ఎస్‌టీసీ, హైదరాబాద్
- టి.వెంకట లక్ష్మి, మహబూబ్‌నగర్

పాఠశాల విద్య

- తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, తాటిపల్లి, జగిత్యాల
- జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల మిర్దాపల్లి, నిజామాబాద్.



ఆదివారం హైదరాబాద్‌లోని గోల్కొండ కోట ఆవరణలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల కసరత్తులో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ పతాకాన్ని ఎగురవేసేది వీరే

- **మంత్రులతో పాటు ప్రముఖులకు బాధ్యతలు**

ఈనాడు, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 30 జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో జెండా వందనం చేసే మంత్రులు, ఇతర ప్రముఖుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 17 మంది మంత్రులకు తోడు శాసనసభాపతి, మండలి ఛైర్మన్, ప్రభుత్వ ఛీఫ్ విప్‌లు, విప్‌లు, ఇతర ప్రముఖులకు, ఉన్నతాధికారులకు అవకాశం కల్పించింది. వీరు అమరవీరులకు నివాళి, గౌరవవందనం స్వీకరణ, జెండా వందనంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పురస్కారాలను పంపిణీ చేస్తారు. ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

ఇదీ జాబితా

జయశంకర్ భూపాలపల్లి జిల్లా- శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మహబూబాబాద్- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య, వరంగల్ అర్బన్- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వరంగల్ రూరల్- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ- ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, రాజన్న సిరిసిల్ల- పరిశ్రమల మంత్రి కేటీఆర్, కరీంనగర్- ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, జగిత్యాల- ప్రభుత్వ ఛీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి- మండలి ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆదిలాబాద్- బీసీ సంక్షేమ మంత్రి జోగు రామన్న, నిర్మల్- గృహనిర్మాణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల- ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, కుమురంభీమ్ ఆసిఫాబాద్- మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, సిద్దిపేట- నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, మెదక్- ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, సంగారెడ్డి- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, నిజామాబాద్- వ్యవసాయమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి - ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మహబూబ్‌నగర్- వైద్యఆరోగ్యమంత్రి సి.లక్ష్మారెడ్డి, నాగర్‌కర్నూలు- గ్రామీణాభివృద్ధి మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.నిరంజన్‌రెడ్డి, జోగులాంబ గద్వాల- పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఖమ్మం- రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం- అబ్కారి మంత్రి పద్మారావు, నల్గొండ- మండలి వైస్ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, సూర్యాపేట- విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, వికారాబాద్- రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి- ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మేడ్చల్- హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఈ జాబితాలో ఉన్నారు.

రూ.13.77 లక్షలు పలికిన ఐన్‌స్టీన్ ఉత్తరం

బోస్టన్: విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 1919లో రాసిన ఒక లేఖ ఇక్కడ తాజాగా జరిగిన వేలంలో ఏకంగా రూ.13,77,314 పలికింది. తొలి భార్యతో విడాకులు, తమ సంతానం చదువు సంధ్యలకు సంబంధించిన భవిష్యత్ ఏర్పాట్లపై ఆయన ఈ ఉత్తరాన్ని 1919 డిసెంబరు అయిదో తేదీన రాశారు. ఒక కాగితానికి ఇరువైపులా ఆయన స్వహస్తాలతో ఉత్తరాన్ని లిఖించారు. లేఖకు ఓ వైపు "ఆల్బర్ట్" అనీ.. రెండోవైపు "పప్పా" అని సంతకాలు చేశారు. మహా శాస్త్రవేత్త అయిన ఐన్‌స్టీన్ వ్యక్తిగత కుటుంబ జీవితానికి చెందిన వివరాలతో కూడిన అత్యంత ప్రత్యేకమైన లేఖ ఇది అంటూ వేలం నిర్వాహకులు పేర్కొన్నారు. ఐన్‌స్టీన్ స్వదస్తూరీతో ఉన్న ఈ లేఖ రాసిన కాగితం ఇప్పటికీ చెక్కుచెదరలేదని తెలిపారు.

ఉత్తరం మొదట్లో అంతా ఆయన తన భార్య మిలేవా మరిక్‌తో విడాకుల వ్యవహారం గురించి రాశారు. తర్వాత తన పెద్ద కుమారుడు హన్స్ ఆల్బర్ట్ చదువుసంధ్యలు, భవిష్యత్ భద్రత గురించి పర్కొన్నారు. లేఖకు మరోవైపున ఉన్న పుటలో పెద్ద కుమారుడు హన్స్‌తో పాటు ...చిన్నవాడైన ఎడ్వర్డ్‌ల చదువు గురించి మరింత వివరంగా రాశారు.

పరిహారం పెంచమంటే కేసులు పెడతారా!

- **పోలీసులు కొట్టారంటున్న బాధిత రైతు**

పెద్దపల్లి, మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టు కోసం ఇచ్చిన భూమికి న్యాయమైన పరిహారం అడిగితే పోలీసులతో చిత్రహింసలకు గురిచేస్తున్నారని పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన పలువురు భూనిర్వాసితులు పేర్కొన్నారు. ఇతర గ్రామాలకు చెల్లించిన విధంగా పరిహారం ఇవ్వాలని పనులను అడ్డుకొన్నందుకు తమపై దాడులకు పాల్పడుతున్నట్లు వాపోయారు. పెద్దపల్లిలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాంబట్ల శ్రీనివాస్, బాధిత రైతు చంద్రమోహన్ చెప్పిన వివరాల ప్రకారం..సుందిళ్ల ఆనకట్ట నిర్మాణం కోసం సిరిపురం గ్రామానికి చెందిన చంద్రమోహన్ తన భూమిని ఇవ్వడంతోపాటు గ్రామంలోని రైతులందరితో ఇప్పించాడు. జీవో 123 ప్రకారం ఇచ్చేందుకు రైతులను ఒప్పించి సహకరించాడు. ఇతర గ్రామాల్లో పరిహారం ఎక్కువ చెల్లించినట్లయితే అదే మాదిరిగా ఇచ్చేందుకు అంగీకరించిన అధికారులు, నాయకులు ఇప్పుడు స్పందించడం లేదు. ఇదే జిల్లాలోని గోలివాడలో రూ.13 లక్షల వరకు రైతులకు పరిహారం ఇచ్చారని, సిరిపురంలో మాత్రం రూ.8 లక్షలు ఇచ్చినట్లు వారు తెలిపారు. మంథని ఎస్సై 36 గంటలపాటు తనను పోలీసుకస్టడీలో ఉంచుకొని చిత్రహింసలు పెట్టినట్లు పేర్కొన్నాడు. తనపై 4 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గోదావరిఖని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. 'నిన్ను ఎందుకు అరెస్టు చేశార'ని అడిగితే తాను కోల్పోయిన భూమికి అదనపు పరిహారం ఇవ్వాలని పనులను అడ్డుకున్నందుకు కేసు నమోదు చేశారని పేర్కొన్నట్లు తెలిపాడు. ఇంత కఠినమైన సెక్షన్లు విధించడం సరైంది కాదని, స్టేషన్‌లో పూచికత్తుపై బెయిల్ ఇవ్వాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించినట్లు బాధితుడు వివరించాడు. చంద్రమోహన్‌ను చిత్రహింసలకు గురి చేశారన్న ఆరోపణలు వాస్తవం కాదని.. గుత్తేదారు ఫిర్యాదు మేరకే పనులను అడ్డుకున్నందుకు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.



కన్నీరు మున్నీరవుతున్న రైతు చంద్రమోహన్

ఓటర్లుగా చేరికకు ప్రవాస భారతీయుల ఆసక్తి

పోర్టల్‌లో 24,348 మంది నమోదు

దిల్లీ: దేశంలో ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ప్రవాస భారతీయులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించిన 'ఓవర్‌సీస్ ఇండియన్ ఓటర్స్' పోర్టల్‌లో 24,348 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో కేరళకు చెందిన వారే 23,556 మంది కావడం గమనార్హం. 364 మంది పంజాబీలు, 14మంది గుజరాతీలు కూడా ఉన్నారు. సందేహాలు తీర్చుకునేందుకు చాలా మంది ఈ పోర్టల్ ద్వారా ప్రశ్నలు పంపిస్తున్నారు. ప్రవాస భారతీయులు పాసుపోర్టులో తాము పేర్కొన్న ప్రాంతంలో ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవడానికి వీలుంది. పేరు నమోదు చేసుకున్న తరువాత వారికి సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఎన్నికల అధికారులు పోస్టు ద్వారా సమాచారం పంపిస్తారు. వారి పాసుపోర్టే గుర్తింపు కార్డు కావడంతో ప్రత్యేకంగా మళ్లీ ఎన్నికల గుర్తింపు కార్డు ఇవ్వరు. ఎన్నికల సమయంలో నియోజకవర్గానికి వచ్చి పాసుపోర్టు చూపించి ఓటు వేసే అవకాశం ఉంది. అయితే ఇలా రావడానికి వారు ఇబ్బంది పడుతుండడంతో తమకు నచ్చిన ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తూ నిబంధనలు సవరించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది.



ఆగస్టు 15, 1947న సెయింట్ జార్జి కోటపై ఎగురవేసిన జాతీయ పతాకమిది. భారత పురావస్తు సర్వేవారి ఆధ్వర్యంలో చెన్నైలోని ఫోర్ట్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచిన దృశ్యమిది

ఈనాడు సినిమా



పవన్ కల్యాణ్

బాలకృష్ణ

ప్రేమతో చేశామనే అర్థం!



అనుష్క

"నా ప్రతిభని ప్రదర్శించే అవకాశం కోసమే నేనెప్పుడూ ఏ సినిమా ఒప్పుకోలేదు" అంటోంది అనుష్క. ఒక మంచి కథలో భాగం కావాలనే తపన తప్ప, ఈ సినిమా చేస్తే నాకెంత పేరొస్తుందనే లెక్కలు వేసుకొనే అలవాటు అసలు లేదంటోం దామె. కథానాయిక ప్రాధాన్య చిత్రాలకి చిరునామాగా నిలుస్తూ వచ్చిన ఆమె పలు చిత్రాల్లో నటనతో తనకి తానే సాటి అని నిరూపించింది. త్వరలోనే కథానాయిక ప్రాధాన్యంతో కూడిన మరో చిత్రం 'భాగ్‌మతి' కోసం రంగంలోకి దిగబోతోంది. కథల ఎంపిక, సెట్‌లో కష్టపడే విధానం గురించి అనుష్క మాట్లాడుతూ "ఒక పనిలో మన ప్రతిభ కనిపించిందంటే దాన్ని మనం వందశాతం ప్రేమతో చేశామనే అర్థం. నా ప్రతిభ కూడా అలా బయటికొచ్చిందే తప్ప, అదే లక్ష్యంతో ఎప్పుడూ పని చేయలేదు. ఏం చేసినా ఇష్టంతో చేయాలనేది నా సిద్ధాంతం. చేసే సినిమాపై నాకు ఇష్టం కలగాలంటే ముందు ఆ కథ నాకు నచ్చాలి. అలా మంచి కథలపైన నా దృష్టి ఉంటుంది తప్ప వేరే ఇతరత్రా విషయాలేవీ పట్టించుకోను" అని చెప్పింది అనుష్క.

ఇల్లు అంటే గోడలు,
తలుపులు అనుకున్నాను...
కానీ మనుషులు, మమతలు
అని ఇప్పుడు తెలిసింది!
చిత్రం: లక్ష్మీ నివాసం
- పంపినవారు: మద్దాల శోభాదేవి, మియాపూర్, హైదరాబాద్

సంక్రాంతి కోడి ముందే కూసింది



మహేష్ బాబు

తెలుగు సినిమా పద్ధతులలో మార్పు కనిపిస్తోంది. ఇది వరకు 'మీ సినిమా ఎప్పుడు విడుదల చేస్తారు' అని అడిగితే... 'కౌన్ బనేగా కరోడ్ పతి'లో కోటి రూపాయల ప్రశ్నలా... అయోమయంగా చూసేవారు. సినిమా తీయడమే గానీ, విడుదల తేదీ నిర్మాతల చేతుల్లో ఉండేది కాదు. అనుకొన్న సమయానికి సినిమాని పూర్తి చేస్తామన్న నమ్మకం అంతగా కుదిరేది కాదు. ఇప్పుడు ఆ రోజులు మారాయి. కొబ్బరికాయ కొట్టేటప్పుడే 'ఫలానా రోజు విడుదల చేస్తాం' అని ధీమాగా చెప్పేస్తున్నారు. దాదాపుగా చెప్పిన సమయానికి వస్తున్నారు కూడా. ఏ సమయానికి సినిమా విడుదల చేయాలన్న విషయంపై దర్శక నిర్మాతలకు స్పష్టత రావడం నిజంగా అభినందించదగిన విషయమే. ఈ కారణంతోనే పండుగలకు ముందే కర్చీఫ్‌లు సిద్ధం చేసుకొంటున్నారు. దాంతో బెర్తులన్నీ ముందే.. బుక్ అయిపోతున్నాయి. అందుకే మరి... రాబోయే సంక్రాంతి కోళ్లు ముందుగానే కూసేస్తున్నాయి. సంక్రాంతికి ఏయే సినిమాలు రాబోతున్నాయన్న విషయంలో ముందే ఓ స్పష్టత వచ్చేసింది.

సంక్రాంతి చాలా ముఖ్యమైన సీజన్. తెలుగు సినిమా క్యాలెండర్ మొదలయ్యేదే సంక్రాంతి సినిమాలతో! ప్రతి యేడాదీ బాక్సాఫీసు దగ్గర సంక్రాంతి సంబరాలు జోరుగా సాగుతున్నాయి. ఒకేసారి మూడు, నాలుగు పెద్ద సినిమాల్ని చూసే అవకాశం దక్కుతోంది. ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలొచ్చాయి. అందులో మూడు చిత్రాలు ఘన విజయం సాధించాయి. 2018 ముగ్గుల పండక్కీ... ఈ పోటీ తప్పడం లేదు.

పవన్ కల్యాణ్ - త్రివిక్రమ్ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. అన్నీ అనుకొన్నట్టు జరిగితే ఈ యేడాదే ఈ సినిమా చూసేవాళ్లం. కానీ బిజీ షెడ్యూల్ వల్ల కాస్త ఆలస్యం అవుతోంది. ఈ చిత్రాన్ని 2018 సంక్రాంతికి విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది. రెండేళ్ల క్రితం 'గోపాల గోపాల' చిత్రాన్ని సంక్రాంతికే తీసుకొచ్చాడు పవన్. ఆ సెంటిమెంట్ ఇప్పుడు మళ్లీ పునరావృతం కాబోతోంది. సెంటిమెంట్ అంటే గుర్తొచ్చింది. 'సంక్రాంతి హీరో ఎవరయ్యా...' అంటే నందమూరి బాలకృష్ణ పేరే చెబుతారంతా. సంక్రాంతికి ఓ సినిమా విడుదల చేయడం, హిట్టు కొట్టడం బాలయ్యకు రివాజు. 'డిక్టేటర్', 'గౌతమిపుత్ర శాతకర్ణి' కూడా సంక్రాంతి బరిలోనే నిలిచాయి. రెండింటికీ ఆదరణ దక్కింది. బాలయ్య 102వ చిత్రాన్ని సంక్రాంతికే విడుదల చేస్తున్నామని నిర్మాత సి.కల్యాణ్ ప్రకటించేశారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఇటీవలే సెట్స్‌పైకి వెళ్లింది.

రామ్ చరణ్ కూడా సంక్రాంతిపై కన్నేశాడు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న 'రంగస్థలం.. 1985' సంక్రాంతి సీజన్‌లోనే రాబోతోంది. సమంత కథానాయికగా నటిస్తోంది. అటు చరణ్‌కీ, ఇటు సుకుమార్‌కీ సంక్రాంతి సీజన్ కలిసొచ్చింది. అందుకే ఈసారీ.. అదే సెంటిమెంట్‌ని నమ్ముతున్నారు. మరో వైపు మహేష్‌బాబు - కొరటాల శివ కలయికలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'భరత్ అను నేను' అనే పేరు పరిశీలిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేసే ప్రయత్నాల్లో ఉంది చిత్రబృందం. ప్రస్తుతానికి సంక్రాంతి బెర్తుల కోసం ఎదురుచూస్తున్న చిత్రాలివే. ఈలోగా ఒకట్రెండు సినిమాలు తయారైనా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే సంక్రాంతికి ఎన్ని సినిమాలొస్తే అంత కళ. నాలుగు సినిమాలొచ్చినా వసూళ్ల వర్షం కురిపించొచ్చు అన్న నమ్మకం తెలుగు ప్రేక్షకులు ఇచ్చేశారు. అందుకే నిర్మాతలూ ధైర్యం చేస్తున్నారు.



రామ్ చరణ్

ఒకే ఒక్క జీవితం
ఇది చెయ్యిజారి పోనీకు
మళ్లీరాని ఈ క్షణాన్ని
మన్నుపాలు కానీకు
కష్టమనేది లేని
రోజంటూ లేదు కదా
కన్నీరు దాటుకుంటూ
సాగిపోగ తప్పదుకదా
అమ్మ కడుపు వదిలిన అడుగడుగు
ఆనందం కోసమే ఈ పరుగు
కష్టాల బాటలో కడవరకూ
చిరునవ్వు వదలకు

గీతం: ఒకే ఒక్క జీవితం...
చిత్రం: మిస్టర్ నూకయ్య
రచన: రామజోగయ్య శాస్త్రి
- పంపినవారు: సి.సాయినాథ్‌రెడ్డి, హైదరాబాద్

గీతోపదేశం

ఉత్తమ నటుడు నాగచైతన్య



అల్లు అరవింద్, బోయపాటి శ్రీను, నాగచైతన్య

"బాహుబలి'తో ప్రపంచం మొత్తం తెలుగు సినిమా వైపు చూసింది. భవిష్యత్తులోనూ ఇలాంటి గొప్ప చిత్రాలు మరిన్ని రావాల"న్నారు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్. హైదరాబాద్‌లో జరిగిన 'సంతోషం' పురస్కారాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'ప్రేమమ్' చిత్రానికి గానూ నాగచైతన్యకు ఉత్తమ నటుడు అవార్డు దక్కింది. సమంత (అఆ) ఉత్తమ నటిగా ఎంపికైంది. ఉత్తమ దర్శకుడిగా బోయపాటి శ్రీను (సరైనోడు) అవార్డు అందుకొన్నారు. ఉత్తమ చిత్రంగా 'పెళ్లిచూపులు' నిలిచింది. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ "తెలుగు సినీ పరిశ్రమకు కావల్సిన సహాయ సహకారాల్ని అందివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పరిశ్రమలో కొన్ని సమస్యలున్నాయి. కూర్చొని మాట్లాడుకొంటే అవన్నీ పరిష్కారమైపోతాయ"న్నారు. దాసరి నారాయణరావు స్మారక పురస్కారాల్ని అల్లు అరవింద్, మురళీమోహన్, పరుచూరి బ్రదర్స్ అందుకొన్నారు.



రామ్ ఆచంట, నితిన్, అర్జున్, మేఘ ఆకాష్, హను రాఘవపూడి

కొత్తగా ఉందంటూ ఆస్వాదిస్తున్నారు!

"కొత్త సినిమాలు ఎందుకు చేయరు? అని అడుగుతుంటారు. ఆ మాట విని వినీ విసుగొచ్చింది. 'అఆ' తర్వాత నేను మరో ప్రేమకథ చేయొచ్చు కానీ, కొత్తగా ఏదైనా ప్రయత్నించాలనుకొన్నా. అందుకే 'లై' చేశా. కొత్త సినిమా కావాలనుకొనే వాళ్లంతా ఈ సినిమాని బాగా ఆస్వాదిస్తున్నార"న్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'లై'. మేఘ ఆకాష్ కథానాయిక. హను రాఘవపూడి దర్శకుడు. రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర నిర్మాతలు. అర్జున్ ముఖ్యభూమిక పోషించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో చిత్రబృందం థ్యాంక్స్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ "కామెడీ ట్రాక్‌లు, ఆరు పాటలు, ఫైటులు లేకుండా ఒక మంచి ప్రయత్నం చేద్దామనుకొన్నాం. విడుదలకి ముందు వరకు కూడా ఈ సినిమాపై నమ్మకంగా ఉన్నా. కానీ విడుదలకి ముందు రోజు రాత్రి నిద్రపట్టలేదు. విడుదలైన రోజున వచ్చిన రిపోర్ట్ చూసి టెన్షన్ పడ్డాను. ఎక్కడైనా తప్పు చేశామా? మామూలు సినిమా చేస్తే సరిపోయేది కదా? అనిపించింది. కానీ రోజు రోజుకీ స్పందన మారింది. సినిమా కొత్తగా ఉందంటూ ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. అర్జున్ గారు లేకపోతే ఈ సినిమాని ఊహించలేను" అన్నారు. అర్జున్ మాట్లాడుతూ "కథానాయకుడైన నన్ను ఈ సినిమాతో ప్రతినాయకుడిగా మార్చారు. హను చెప్పిన కథని అంతకంటే బాగా తీశాడు. కమర్షియల్ సినిమాలు ఎప్పుడైనా చేయొచ్చు, కానీ కొత్తగా ప్రయత్నించాలనే ఈ సినిమాని తీశారు. 'శ్రీఆంజనేయం'లో నితిన్ ఎంతకష్టపడ్డాడో చూశా. ఈ సినిమాకోసం అంతకంటే ఎక్కువ కష్టపడ్డాడ'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నితిన్‌ని 'అఆ' తర్వాత కలిశా. ఆ సమయంలో తను మామూలు కమర్షియల్ సినిమా చేయొచ్చు. కానీ ఓ కొత్త రకమైన సినిమా చేయాలని అడిగాడు నన్ను. అప్పుడు నాకు శ్రీకృష్ణుడు అర్జునుడికి విశ్వరూపం చూపించినప్పుడు ఎలా అనిపించిందో అలా అనిపించింది. ఆలోచనలు ఎన్నయినా రావొచ్చు కానీ దాన్ని తెరమీదకి తీసుకురావడం కష్టం. నిర్మాతలు, కథానాయకుడి వల్లే 'లై' సాధ్యమైంది. ఈ సినిమాలో తప్పొప్పులకి పూర్తి బాధ్యత నాదే"అన్నారు. మేఘ ఆకాష్ మాట్లాడుతూ "నా కెరీర్‌లో విడుదలైన తొలి సినిమా ఇదే. అందుకే ఈ సినిమా నాకు ప్రత్యేకం" అన్నారు. ఈ కార్యక్రమంలో యువరాజ్, రామ్ ఆచంట, మధునందన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి.. చెడు.. తింగరితనం



శ్రీముఖి

నటుడిగా, రచయితగా సుపరిచితమైన హర్షవర్ధన్ దర్శకుడిగా మారారు. మురళి, శ్రీముఖి జంటగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అంజిరెడ్డి నిర్మాత. ఎస్.కె.విశ్వేష్‌బాబు సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి హర్షవర్ధన్ సంగీతం కూడా సమకూరుస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం జరిగింది. హర్షవర్ధన్ మాట్లాడుతూ "1988-89 కాలంలో ఓ మారుమూల గ్రామంలో జరిగిన ప్రేమకథే ఈ చిత్రం. ఒక మంచి అనుభూతిని పంచడంతో పాటు, వాణిజ్యాంశాలు పుష్కలంగా ఉంటాయి. ఇప్పుడు పెళ్లిళ్లు ఘనంగా జరుగుతున్నాయి తప్ప, షష్ఠి పూర్తి కార్యక్రమాల్ని ఆశించడం కూడా తప్పే అన్నట్టుగా ఉంది పరిస్థితి. పెళ్లిళ్లు సాధారణంగా జరగాలి, షష్ఠిపూర్తి ఘనంగా జరగాలనే ఒక ఆలోచన నుంచే ఈ కథ పుట్టింది. ఇలాంటి కాన్సెప్ట్ చిత్రాల్ని మొదలుపెట్టడం కంటే పూర్తి చేయడం చాలా కష్టం. మొదటిసారి సినిమాకి దర్శకత్వం వహించడంతో సినిమా గురించి, నా గురించి చాలా విషయాలు నేర్చుకున్నా. మనలోని మంచి, చెడు, తింగరితనం అనేవి సందర్భాన్నిబట్టి బయటికొస్తుంటాయి. అందుకే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే పేరు పెట్టా. పాత్రలకి తగ్గట్టుగానే నటీనటుల్ని ఎంపిక చేసుకొన్నా. సినిమాకి దర్శకత్వం వహించడంతో పాటు, సంగీతం కూడా అందించడానికి కారణం నేను సంగీత దర్శకుడిని అవుదామనే హైదరాబాద్‌కి రావడం. కమల్ సహకారంతో సంగీతం అందించాను. పెద్ద హీరోల సినిమా స్థాయికి తగ్గకుండా ఈ చిత్రం రూపుదిద్దుకొంటోంది" అన్నారు. హర్షవర్ధన్ చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేయడానికి ఒప్పుకొన్నా అని చెప్పారు శ్రీముఖి. "హర్షవర్ధన్ తయారు చేసిన కథ, ఆ కథపై ఆయనకున్న నమ్మకంతోనే ఈ సినిమాని నిర్మించాం. సినిమా అందరికీ వినోదాన్ని పంచేలా ఉంటుంది" అన్నారు ఎస్.కె.విశ్వేష్‌బాబు. ఈ కార్యక్రమంలో సంతోష్, సురేష్, శ్రీధర్, టి.ఎన్.ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయ్.. నిన్నే!



సృష్టి, భరత్

భరత్, సృష్టి జంటగా నటించిన చిత్రం 'ఓయ్ నిన్నే'. సత్య చల్లకోటి దర్శకుడు. వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్మాత. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. తొలిసీడీని కోన వెంకట్ ఆవిష్కరించారు. అనిల్ రావిపూడి స్వీకరించారు. ముఖ్య అతిథి, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ "తెలుగు చిత్రసీమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. చిన్న, పెద్ద సినిమాలు భారీ విజయాల్ని సాధిస్తున్నాయి. వాటిని స్ఫూర్తిగా తీసుకొని కొత్తతరం మరింత ముందుకు రావాల"న్నారు. 'దర్శకుడు మాట్లాడుతూ "నిర్మాత సహకారంతోనే ఈ చిత్రం పూర్తయింది. శేఖర్ చంద్ర కథకు తగ్గ బాణీల్ని అందించార"న్నారు. "మా సంస్థ నుంచి వచ్చిన 'సోలో' మంచి విజయాన్ని అందుకొంది. ఈ సినిమా కూడా ఆ స్థాయిలోనే ఉంటుంద"న్నారు నిర్మాత. కార్యక్రమంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కృష్ణ చైతన్య, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నవ్వులే నవ్వులు

శ్రీనివాస్‌రెడ్డి, టిల్లు వేణు, జబర్దస్త్ రాకేశ్, శివారెడ్డి, చిత్రం శ్రీను ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'సచ్చింది రా గొర్రె'. ఓ ప్రముఖ కథానాయిక కీలక పాత్ర పోషించనుంది. శ్రీధర్ రెడ్డి.వై దర్శకుడు. దీపక్ ముకుత్, యన్.యమ్.పాషా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. దర్శకుడు మాట్లాడుతూ "హాస్యానికి పెద్ద పీట వేస్తూ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రతి సన్నివేశం నవ్వులు పండిస్తుంది. దర్శకుడిగా ఇదే నా తొలి చిత్రం" అన్నారు. "కొత్త ఆలోచనలకి ప్రాధాన్యమిస్తూ, అర్థవంతమైన చిత్రాల్ని నిర్మించడమే మా లక్ష్యం. దక్షిణాదిలో వినూత్నమైన కథలు తెరకెక్కుతున్నాయి. అందుకే బాలీవుడ్‌లో పలు చిత్రాల్ని నిర్మించిన మేం తెలుగు చిత్ర నిర్మాణంపై దృష్టిపెట్టాం. 'సచ్చింది రా గొర్రె' చిత్రాన్ని నవంబరులోపు పూర్తి చేసి విడుదల చేస్తామ"న్నారు నిర్మాతల్లో ఒకరైన దీపక్ ముకుత్. చిత్రానికి సంగీతం: సంతోష్‌కుమార్, ఛాయాగ్రహణం: రమణ సాల్వ.



శ్రీనివాస్‌రెడ్డి, వేణు, జబర్దస్త్ రాకేశ్

70 ఏళ్లు.. 70 పథకాలు


స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విస్తృత ప్రచారంలోకి తేనున్న ప్రభుత్వం























స్వతంత్ర భారతావని 70 వసంతాల్ని పూర్తిచేసుకుని.. 71వ ఏట అడుగిడుతోంది. ఈ 70 ఏళ్లలో ప్రగతికి దోహదం చేసే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు దేశంలో అమలయ్యాయి, అవుతున్నాయి. ఆ విజయాల్ని మరీ ముఖ్యంగా మోదీ సర్కారు అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం కోసం 70 పథకాల గురించి ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున ప్రచారం చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. రాజకీయ నిష్పాక్షికతను తెలియజెప్పేలా.. మునుపటి యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన', 'ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన' పథకాల్ని కూడా ఈ ప్రచార జాబితాలో చేర్చారు. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ఉద్దేశించిన సడక్ యోజన ఈ జాబితాలో 53వ అంశంగా, అందుబాటు ధరల్లో ఔషధాలను అందించేందుకు ఉద్దేశించిన జనౌషధి యోజనను 60వ అంశంగా చేర్చారు.

మోదీ సర్కారు ప్రారంభించిన 71 పథకాల జాబితాను గత ఏడాది ప్రభుత్వం వెలువరించింది. ఆ జాబితాలోని మెజారిటీ పథకాలు ఈ మారు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వెలువరించే 70 పథకాల జాబితాలో ఉంటాయి. మరీ ముఖ్యంగా ఎన్డీయే ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలైన స్వచ్ఛభారత్ అభియాన్, పెద్దనోట్ల రద్దు, మేకిన్ ఇండియా, స్టాండప్ ఇండియా-స్టార్టప్ ఇండియా, ప్రధానమంత్రి జనధన్ యోజన, పహల్, నమామి గంగ, స్మార్ట్ సిటీ, మిషన్ ఇంద్రధనుష్, స్కిల్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, జీఎస్టీ... ఇత్యాది అన్నింటినీ జాబితాలో చేర్చారు. ఇంకా ప్రారంభించాల్సిన 'భారతమాల'ను కూడా ఇందులో ఉంది. జాబితాలో 70వ అంశంగా సైనిక బలగాలకు ఉద్దేశించిన ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్ ఉంది. అయితే మునుపటి యూపీఏ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, సర్వశిక్ష అభియాన్, సమీకృత బాలల అభివృద్ధి పథకం, జాతీయ గ్రామీణ జీవన మిషన్, జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ పునరుద్ధరణ పథకం, మధ్యాహ్న భోజన పథకం, ఆధార్... ఇత్యాది వాటిని మాత్రం జాబితా నుంచి మినహాయించారు.

కార్యక్రమాల జాబితా
(ఇందులో కొన్ని మార్పులు / చేర్పులు ఉండొచ్చు)

1. **స్వచ్ఛభారత్ అభియాన్:** పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి.. స్వచ్ఛభారత్ దిశగా వారిని కార్యోన్ముఖుల్ని చేసే కార్యక్రమం.
2. **కిసాన్ సంపద యోజన:** రైతు సంక్షేమ కార్యక్రమం. దీనికి రూ.6వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఇందులో 236 కోల్డ్ చైన్ ప్రాజెక్టులుంటాయి. నాబార్డ్ ద్వారా రూ.2వేల కోట్ల ప్రత్యేక నిధుల్ని కేటాయిస్తారు.
3. **పెద్దనోట్ల రద్దు:** నల్లధనాన్ని అరికట్టడం, పన్ను పరిధిని విస్తరించడం లక్ష్యంగా... 2016 నవంబరు 8వ తేదీన రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేశారు.
4. **జీఎస్టీ:** ఒకే దేశం, ఒకే పన్ను విధానం లక్ష్యంగా అమల్లోకి తెచ్చిన సంస్కరణ ఇది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలవుతోంది.
5. **నమామి గంగ:** గంగా నది ప్రక్షాళనకు ఉద్దేశించిన కార్యక్రమం.
6. **స్కిల్ ఇండియా:** వివిధ రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే కార్యక్రమం.
7. **ప్రధానమంత్రి ముద్రా యోజన:** వ్యాపారులకు ఆర్థికంగా చేయూతనిచ్చే కార్యక్రమం.
8. **ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన:** గ్రామాలను సమీప పట్టణాలతో అనుసంధానించే రోడ్ల నిర్మాణ కార్యక్రమం. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఇది ప్రారంభమైనా... ఎన్డీయే హయాంలో ఇది బాగా ఊపందుకుంది. 2016-17లో రోజుకు సగటున 130 కి.మీ.ల రోడ్డును నిర్మించారు. 2017-18లో రోజుకు 156 కి.మీ.లు నిర్మించాలన్నది లక్ష్యం. 57 వేల కి.మీ.ల గ్రామీణ రోడ్లను నిర్మించాలని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.
9. **ప్రధానమంత్రి జనౌషధి యోజన:** ప్రజలకు అందుబాటు ధరల్లో ఔషధాలు అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం. యూపీఏ హయాంలోనే మొదలైనా... ఎన్డీయే హయాంలో ఊపందుకుంది.
10. **రాష్ట్రీయ గోకుల్ మిషన్:** దేశీయ పశు సంపదను అభివృద్ధి చేసే, సంరక్షించే కార్యక్రమం.
11. **భారత్‌మాల:** తీర, సరిహద్దు, పర్యాటక ప్రాంతాలు, జిల్లా ప్రధాన కేంద్రాల్ని కలుపుతూ జాతీయ రహదారుల్ని నిర్మించడానికి ఉద్దేశించిన కార్యక్రమం. దీనిని ఇంకా అమలుచేయాల్సి ఉంది.
12. **స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా:** దేశీయ పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సహించి, అంకుర సంస్థల్ని ప్రారంభించేలా చేయడం.
13. **మేకిన్ ఇండియా:** దేశీయ తయారీ కార్యక్రమం. భారతీయ ఉత్పత్తులు ప్రపంచంలో పోటీపడగలిగేలా తయారుచేయడానికి దేశ, విదేశీ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పిస్తారు.
14. **స్మార్ట్ సిటీలు:** పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహం అందించే కార్యక్రమం.
15. **ప్రసూతి ప్రయోజన పథకం:** ప్రసూతి సెలవుల్ని 12 వారాల నుంచి 26 వారాలకు పొడిగించేందుకు ఉద్దేశించిన పథకం.
16. **అమృత్ పథకం:** అటల్ పట్టణ రూపాంతరీకరణ, పునరుజ్జీవన పథకం(అమృత్) ప్రధాన ఉద్దేశం పట్టణాల్ని అభివృద్ధి చేయడం.
17. **పహల్:** వంటగ్యాస్ రాయితీని వినియోగదారుల ఖాతాల్లోకే నేరుగా జమచేసే పథకం.
18. **ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన:** వంటగ్యాస్ పంపిణీ కార్యక్రమం.
19. వంటగ్యాస్ రాయితీని వదులుకునే (గివ్ ఇట్ అప్) కార్యక్రమం.
20. రైల్వే స్టేషన్లలో నీటి అమ్మకం మిషన్ల ఏర్పాటు.
21. **జాతీయ యువ నాయకత్వ కార్యక్రమం:** యువతలో నాయకత్వ లక్షణాల్ని పెంపొందించే కార్యక్రమం.
22. **ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన:** ప్రతి కుటుంబానికీ బ్యాంకు ఖాతా కల్పించడం.
23. **ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన/సురక్ష బీమా యోజన:** బ్యాంకు ఖాతా ఉన్న అందిరికీ తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ కల్పించడం.
24. **ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన:** ప్రతి పొలానికీ నీరు అందివ్వడం.
25. **ప్రధానమంత్రి ఆవాస్ యోజన:** గ్రామాలు, పట్టణాల్లో అందరికీ గృహాల నిర్మాణం
26. **ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన:** పంటల బీమా పథకం.
27. **దీనదయాళ్ అంత్యోదయ యోజన:** జాతీయ పట్టణ జీవనభృతి కల్పన మిషన్.
28. **బేటీ బచావో, బేటీ పడావో:** బాలికల విద్య, సంరక్షణ కార్యక్రమం.
29. **స్వధార్:** కష్టాల్లో ఉన్న, అనాథలైన మహిళల్ని ఆదుకునే కార్యక్రమం.
30. **మిషన్ ఇంద్రధనుష్:** రోగ నిరోధక శక్తిని పెంచేలా టీకాలు వేసే కార్యక్రమం.
31. **ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన:** ఆరోగ్య బీమా
32. **సుకన్య సమృద్ధి యోజన:** బ్యాంకులు, పోస్టాఫీసుల్లో బాలికల పేరిట ఖాతాలు తెరవడం.
33. **పరంపరాగత్ కృషి వికాస్ యోజన:** సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం.
34. **భూసార కార్డులు:** భూసార పరిరక్షణ కార్యక్రమం.
35. **నీలి విప్లవం:** మత్స్య సంపదను పెంపొందించడం.
36. **శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్:** ఆవాసాలకు సబంధించి క్లస్టర్ల ఏర్పాటు కార్యక్రమం.
37. **ప్రధానమంత్రి గ్రామ జ్యోతి యోజన:** గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమం.
38. **ఉజాలా పథకం:** ఇంధనాన్ని ఆదా చేసే ఎల్ఈడీ బల్బుల పంపిణీ.
39. **ఉదయ్:** డిస్కంల ఆర్థికస్థితిని మెరుగుపరచే కార్యక్రమం.
40. **వికల్ప్:** ప్రత్యామ్నాయ రైల్లో బెర్తుల సర్దుబాటు వ్యవస్థ(ఏటీఏఎస్).
41. **ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రస్థాన్ యోజన:** పింఛను కంట్రిబ్యూషన్ పథకం
42. **వనబంధు కల్యాణ్ యోజన:** గిరిజనుల అభివృద్ధికి ఉద్దేశించిన పథకం.
43. **నయీ మాంజిల్:** మదార్సాల్లోని విద్యార్థులకు సమకాలీన విద్య అందివ్వడం.
44. **ఉస్తాద్:** సంప్రదాయ కళలు, వృత్తుల్లో నైపుణ్యాభివృద్ధి.
45. **నయీ రోష్ని:** మైనారిటీ మహిళల్లో నాయకత్వ లక్షణాల పెంపు.
46. భూ రికార్డుల నవీకరణ, డిజిటలైజేషన్(డీఐఎల్‌ఆర్ఎంపీ)
47. జాతీయ గ్రామీణ తాగునీటి కార్యక్రమం(ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ)
48. ప్రకృతి విపత్తుల్లో నష్టపోయిన వారికి పరిహారం పెంపు
49. రేషన్ కార్డుల డిజిటలైజేషన్, ఆధార్ సీడింగ్
50. బీపీఎల్ రేషన్ కార్డులున్న వారికి ఉచిత హెల్ప్‌లైన్లు
51. దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన
52. రైతులకు చెరకు బకాయిల చెల్లింపు
53. **జీవన్ ప్రమాణ్:** సర్టిఫికెట్ల స్వీయ ధ్రువీకరణ
54. నవజాత శిశువుల సంరక్షణ కార్యక్రమాలు
55. అటల్ పెన్షన్ యోజన
57. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన
58. ఈశాన్య రాష్ట్రాలు, సిక్కింలలో నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల
59. కిసాన్ ఛానెల్ ప్రారంభం
60. షెడ్యూల్డు కులాలకు వెంచర్ క్యాపిటల్ ఫండ్, ఎస్సీ కార్పొరేషన్లకు సహకారం.
61. దీనదయాళ్ వికలాంగుల పునరుద్ధరణ కార్యక్రమం(డీడీఆర్ఎస్)
62. దివ్యాంగులకు ఉద్యోగావకాశాల కల్పన
63. యువజన క్లబ్బుల అభివృద్ధి కార్యక్రమం.
64. అమ్మకందారుల అభివృద్ధి కార్యక్రమం.
65. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం.
66. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం.
67. రుణ, పెట్టుబడి రాయితీ పథకం.
68. వాణిజ్య సంబంధ సహకారం, అభివృద్ధి
69. పారిశ్రామిక అభివృద్ధి, శిక్షణ కార్యక్రమం.
71. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు యథాతథంగా అమలు. రాష్ట్రాలకు నిధుల బదలాయింపు పెంపు.

56.



ఆదర్శ్ గ్రామ యోజన

70.




ఒకే ర్యాంకు, ఒకే పెన్షన్: వేర్వేరు సమయాల్లో పదవీ విరమణ పొందిన సైనికుల పెన్షన్లలో సమతౌల్యం తీసుకురావడం లక్ష్యంగా ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

సిరియాలో 25 మంది జిహాదీల హతం

బీరుట్: మధ్య సిరియాలో రష్యా యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల సాయంతో జరిగిన కమెండో ఆపరేషన్‌లో 25 మంది ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.)కు చెందిన జిహాదీ ఉగ్రవాదులు మరణించారు. హోమ్స్ రాష్ట్రంలో మిత్రదేశాల సహకారంతో సిరియా సైనికులు శనివారం ఈ దాడులు జరిపారు. ఈ దాడిలో ఆరుగురు సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 90వేల చ.కి.మీ. విస్తీర్ణం ఉన్న బదియా ఎడారి ప్రాంతంలో 2015 నుంచి ఐఎస్ ఆధీనంలో ఉండగా, ఇలాంటి దాడులు చేయడం ద్వారా ఒక్కొక్క ప్రాంతాన్ని సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటోంది. ప్రస్తుతం నాలుగు గ్రామాలపై ఆధిపత్యాన్ని ప్రకటించుకుంది.

బోస్ కిరణ్‌కు రెండు కాంస్యాలు



ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ పోలీసు క్రీడల్లో తెలంగాణ పోలీసు అధికారి బోస్ కిరణ్ రెండు కాంస్యాలు సొంతం చేసుకున్నాడు. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన ఈ క్రీడల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ తరపున బరిలో దిగిన అతను టెన్నిస్ సింగిల్స్‌తో పాటు డబుల్స్ విభాగాల్లో పతకాలు సాధించాడు. ప్రస్తుతం కిరణ్ డబీర్‌పురా పోలీసు స్టేషన్‌లో అదనపు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: మంత్రి జూపల్లి

ఈనాడు, హైదరాబాద్ : కాంగ్రెస్ నేతలు తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీటిపారుదల రంగంలో అత్యధిక నిధులు కేటాయించింది ఉమ్మడి పాలమూరు జిల్లాకేనని తెలిపారు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు రూ. వేల కోట్లతో పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్యే చిన్నారెడ్డి లాంటి వారు ఎస్సారెస్పీకి నిధుల కేటాయింపును విమర్శించడం దారుణమని పేర్కొన్నారు.

వర్జీనియాలో ప్రదర్శన హింసాత్మకం

- శ్వేతజాతీయుల ర్యాలీ వ్యతిరేక ప్రదర్శనపైకి దూసుకొచ్చిన కారు
- ఒకరు మృతి, 19 మందికి గాయాలు
- గస్తీ హెలికాప్టర్ కూలి ఇద్దరు పోలీసు అధికారులు మృతి

వాషింగ్టన్: అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో శ్వేతజాతీయుల ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ ర్యాలీకి వ్యతిరేకంగా మరో వర్గం వారు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనపైకి అకస్మాత్తుగా కారు దూసుకురావడంతో ఓ మహిళ మరణించగా. . 19 మంది గాయపడ్డారు. ర్యాలీ అనుకూల, ప్రత్యర్థి వర్గాల ఘర్షణల్లో మరో 15 మంది సైతం గాయపడ్డారు. ఈ ఘర్షణలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. మరోవైపు ఈ ర్యాలీకి గస్తీ నిర్వహిస్తున్న హెలికాప్టర్ కూలి ఇద్దరు పోలీసు అధికారులు మరణించారు. చార్లెట్స్‌విల్లేలోని ఓ పార్క్‌లో మాజీ కమాండర్ రాబర్ట్ ఈ లీ విగ్రహాన్ని తొలగించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శ్వేతజాతీయులు భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం దీనికి హాజరయ్యారు. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ మరో వర్గం సమాంతర ర్యాలీకి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో వర్జీనియా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ర్యాలీపైకి కారులో దూసుకొచ్చిన జేమ్స్ ఫీల్డ్(20)ను అరెస్టు చేసి విచారిస్తున్నారు.



వర్జీనియాలోని చార్లెట్స్‌విల్లేలో ఆందోళనకారులపైకి దూసుకుపోతున్న కారు. అంతర్ చిత్రంలో అరెస్టు చేసిన జేమ్స్ అలెక్స్ ఫీల్డ్స్ జూనియర్

ఖండించిన ట్రంప్

ర్యాలీలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా ఖండించిన అధ్యక్షుడు ట్రంప్.. ఇలాంటి ఘటనలకు అమెరికాలో చోటులేదని స్పష్టంచేశారు. అమాయకుల ప్రాణాలను కాపాడేందుకు చట్టాలను కఠినంగా అమలుచేస్తామన్నారు. దేశంలో ఏ పౌరుడూ తమ భద్రత కోసం భయపడకూడదని, బయటకెళ్లి ఆడుకునేందుకు ఏ చిన్నారీ ఆందోళన చెందకుండా పరిస్థితులు ఉండాలన్నారు. మరోవైపు ఈ హింసాత్మక ఘటనల వెనుక జాత్యహంకార కోణం ఉందని.. ఈ వ్యవహారంపై ఎఫ్‌బీఐతో విచారణ జరిపించాలని భారతీయ అమెరికన్, 'లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ ఆన్ సివిల్, హ్యూమన్ రైట్' సంస్థ సీఈవో వనితా గుప్తా.. అమెరికా అధ్యక్షుడిని డిమాండ్ చేశారు.

24 గంటలు.. 507 చిత్రాలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: పెన్సిల్ స్కెచ్ ద్వారా 24 గంటల పాటు చిత్రాలు వేసి అబ్బురపరిచాడు హైదరాబాద్‌కు చెందిన చిత్రకారుడు హర్ష. నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల్లో 507 చిత్రాలు గీసి 4 రికార్డులు పొందేందుకు అర్హత సాధించాడు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధి డా.హరికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ.. తెరపై ఫొటోలు చూస్తూ మైనం

హైదరాబాద్‌కు చెందిన హర్ష ఘనత


పెన్సిల్ ద్వారా స్కెచ్ చేస్తూ చిత్రాలు గీసిన దాఖలాలు ఏ రికార్డుల్లోనూ లేవన్నారు. ఈ విధానంలో రికార్డు కోసం ప్రయత్నించిన వారిలో తాను తొలి వ్యక్తినని తెలిపారు. బొమ్మలు వేసే ప్రక్రియను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు, లిమ్కా బుక్ రికార్డ్సు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్సు ప్రతినిధులు నమోదు చేశారని త్వరలో ఆ రికార్డులూ అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



పెన్సిల్ స్కెచ్ ద్వారా గీసిన చిత్రాలు, 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సు' ధ్రువపత్రంతో చిత్రకారుడు హర్ష

ఈ అయిదూ నేర్చుకుందాం!

నిరంతరం కొత్త పరిణామాలతో విలసిల్లే సాంకేతిక ప్రపంచం.. నేర్చుకునేవారికి గొప్ప వేదిక. కుతూహలం, ఆసక్తి ఇలాంటివారి లక్షణాలు. ప్రతీ సెమిస్టర్ పూర్తయ్యాక దొరికే సమయాన్ని విద్యార్థులు తన రెజ్యూమేకు అదనపు హంగులద్దే నైపుణ్యాల అభ్యాసానికి ఉపయోగించుకోవచ్చు.






సర్వేష్ అగర్వాల్
సీఈఓ, ఇంటర్న్‌శాల

ఈ రోజుల్లో గిరాకీ ఉన్న సాంకేతిక నైపుణ్యాలను అంతర్జాల సహాయంతో నేర్చుకోవచ్చు- ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే!

నేర్చుకోవడానికి 'సరైన సమయ'మంటూ ఉంటుందా? ఏమీ ఉండదు. ఆసక్తి ఉండాలే కానీ, ప్రతిరోజూ ఏదో ఒకటి నేర్చుకోవచ్చు. ఏదైనా అంకుర సంస్థను స్థాపించినవారినో, వ్యాపారవేత్తనో ఇదే ప్రశ్నను అడిగితే.. 'నేనింకా నేర్చుకుంటూనే ఉన్నాను. ఈ ప్రక్రియ ఎప్పటికీ ముగియదు' అనే సమాధానం వినిపిస్తుంది. విద్యార్థులు అయితే తమకు మిగిలే ఖాళీ సమయాన్ని వినోదానికి మాత్రమే పరిమితం చేయకూడదు. కొత్త నైపుణ్యాల అవగాహనకూ, వాటిని నేర్చుకోవడానికీ వినియోగించాలి. వాటిలో ప్రముఖమైనవాటిని ఒకసారి చూద్దాం!

1 ఆండ్రాయిడ్



వేగంగా అభివృద్ధి చెందుతున్న స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలో ఆండ్రాయిడ్ ఆప్ డెవలప్‌మెంట్‌కు ఆదరణ ఎక్కువ. భారత్‌లో అంకుర పరిశ్రమల సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో.. ప్రతీ వ్యాపారానికి తమకంటూ ఆప్ ఉండటం తప్పనిసరి అయింది. బిలియన్‌కు పైగా ఉన్న ఆండ్రాయిడ్ వినియోగదారులకు గూగుల్ ప్లే స్టోర్‌లో 1.8 మిలియన్ ఆప్‌లు ఉన్నాయంటేనే ఆండ్రాయిడ్ మన జీవితాల్లో ఎంతగా చొచ్చుకునిపోయిందో అర్థమవుతుంది. వాణిజ్య వ్యాపారాలన్నీ ఆండ్రాయిడ్ మార్కెటింగ్ మీద ఆధారపడుతున్నాయి కాబట్టి, ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్‌ను నేర్చుకున్నవారికి ఎంతో గిరాకీ ఉంటుంది.

2 ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)



సాంకేతిక రంగంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. వాటికి ఐఓటీ ఓ చుక్కాని లాంటిది. దీంతో కార్పొరేట్ ప్రపంచం తమ వ్యాపారాలను సుదూర ప్రాంతాలకు విస్తరిస్తోంది. అంతులేని అప్లికేషన్ల సంభావ్యతే విద్యార్థులు ఐఓటీ నిపుణులుగా మారడానికి ప్రధాన కారణం అవుతోంది. ఎఫ్‌బీ స్టేటస్‌లు, ట్వీట్‌లకు స్పందించడం, హృదయ స్పందనలను పర్యవేక్షించడం, జిమ్‌లలో ఎన్ఎఫ్‌సీ పేమెంట్ చేయడం, నియంత్రణ చేయగల కార్లను ఉపయోగించడం మొదలైనవి చేసే పరికరాలను వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా తయారుచేయవచ్చు. ఐఓటీని ఇంటర్నెట్ భవిష్యత్తుగా అభివర్ణిస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న గొప్ప సంస్థలు దీనిలో బిలియన్ల రూపాయలు పెట్టుబడిగా పెడుతున్నాయి. భారత్‌లోనూ ప్రభుత్వం స్మార్ట్ సిటీ (ఆకర్షక నగరాలు)లను అభివృద్ధిపరచడానికి నిర్ణయం తీసుకున్న క్రమంలో ఐఓటీ పరిజ్ఞానం విద్యార్థులకు మరింత మేలు చేకూరుస్తుంది.

3 సి/ సి++

ఇప్పటికీ సి++ తన ప్రాముఖ్యాన్ని కోల్పోలేదు. ఇది ఇప్పటికీ ప్రోగ్రామర్ అమ్ములపొదిలో విశ్వసనీయ బాణమే. ప్రోగ్రామర్స్ అందరూ ఒకవేళ ప్రత్యేకమైన దేశాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి వస్తే నిస్సందేహంగా సి/ సి++ వారి జాతీయ భాషవుతుంది. ప్రపంచవ్యాప్తంగా దీనికి గుర్తింపు ఉంది. దీన్ని అనేక అప్లికేషన్లలో ఉపయోగిస్తున్నారు. ఫైనాన్స్ రంగంలో (బ్యాంకింగ్, ట్రేడింగ్), జీయూఐ ఆధారిత అప్లికేషన్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్, గేమ్స్‌ల్లోనూ దీని ఉపయోగం ఉంది.



ఈ నైపుణ్యాలను విద్యార్థులు తమ ఇంటినుంచే ఆర్జించుకోవచ్చు. యూట్యూబ్‌లో ట్యుటోరియళ్లు, ఈ-రిసోర్సులు వారికి ఇప్పుడు చాలానే అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఆన్‌లైన్ శిక్షణ వేదికలైన internshala, udemy, coursera లాంటి వాటి నుంచీ శిక్షణ పొందవచ్చు. కోడింగ్ చాలెంజ్, హ్యాకథాన్ వంటి ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనడం ద్వారా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్నీ పొందవచ్చు.

ఎప్పుడూ పరిణామం చెందే సాంకేతిక ప్రపంచం గురించి తెలుసుకోవడానికి తరగతి గదికే పరిమితం కాకూడదు. సాంకేతిక రంగాన్ని అవగాహన చేసుకోవాలంటే ప్రయోగాత్మక జ్ఞానం తప్పనిసరి. పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా సొంతంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అందులో భాగంగా కొత్త యాప్, వెబ్‌సైట్, గేమ్‌ల్లో ఏదో ఒకదానిని సృష్టించే ప్రయత్నం చేయండి.

> యూట్యూబ్‌లో ట్యుటోరియళ్లు, ఈ-రిసోర్సులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ శిక్షణ వేదికలనుంచీ శిక్షణ పొందవచ్చు. కోడింగ్ చాలెంజ్, హ్యాకథాన్ వంటి ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనడం ప్రయోజనకరం.

4 వెబ్ డెవలప్‌మెంట్



గూగుల్ ఇండియా ప్రకారం 2017 చివరినాటికి దేశ ఆన్‌లైన్ షాపింగ్ వినియోగదారుల సంఖ్య 100 మిలియన్ల మైలురాయికి చేరుకుంటుందని అంచనా. ఈ-కామర్స్‌లో ఇంత విలక్షణమైన పెరుగుదల కనిపిస్తుండటంతో, సంస్థలు వెబ్ డెవలపర్స్ కోసం నిరంతరం చూస్తున్నాయి. కాబట్టి, విద్యార్థులు తమ ఆసక్తి, ఎంచుకున్న ప్రాజెక్టుల మేరకు ఫ్రంట్ ఎండ్/ బ్యాక్ ఎండ్ లేదా ఫుల్ స్టాక్ డెవలపర్‌ల్లో నైపుణ్యం సాధించవచ్చు. కొన్నిరకాల వ్యాపారాలకు హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, పీహెచ్‌పీ పరిజ్ఞానం కూడా కీలకమే. అంతేకాకుండా, ఫ్రీలాన్సింగ్‌పై ఆసక్తి ఉంటే, చాలా సంస్థలు ఫ్రీలాన్సర్లపై ఆసక్తి చూపుతున్నాయి కాబట్టి, వెబ్ డెవలప్‌మెంట్ వారికి చక్కని ఎంపిక.

5 పైథాన్

'ఐఓటీ, అనలిటిక్స్, హై ఎండ్ గేమ్స్‌ల్లో ఉమ్మడిగా కనిపించేదేంటి?' అని అడిగితే- దానికి సమాధానం పైథాన్. దీన్ని నేర్చుకోవడం అంటే మాయాలోకపు బడిలో ప్రవేశం సంపాదించినట్టే. విద్యార్థి సూపర్ మారియో, హెల్పర్ రోబోట్స్, రిమోట్ కంట్రోల్ కార్లతో కూడిన తన సొంత వింత లోకాన్ని నిర్మించుకోవచ్చు. రాస్‌బెర్రీ పై లాంటి స్వతంత్ర పరికరాన్ని ఉపయోగించి నిరాసక్తికరమైన ప్రోగ్రామింగ్ ఉత్తేజభరితమైన, సరదా ప్రక్రియగా ఎలా రూపొందుతుందో గ్రహించవచ్చు. అంతేకాకుండా ఆర్థికపరమైన ప్రోత్సాహకాలనూ పొందవచ్చు. గూగుల్, యాహూ, ఐబీఎం లాంటి ఎన్నో పెద్ద సంస్థలు పైథాన్‌ను ఉపయోగిస్తున్నాయి.





సివిల్స్ మెయిన్స్‌కు... ఏమేం ప్రధానం?

ప్రతిష్ఠాత్మకమైన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ దగ్గరపడుతున్నాయి.ఈ ప్రధానపరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో కాకుండా వ్యాసరూపంలో జరుగుతుంది. లిఖిత రూపంలో అభ్యర్థుల భావ వ్యక్తీకరణకు ఇది సవాలులాంటిది. దీని సన్నద్ధతను నిర్దిష్టంగా, ప్రభావశీలంగా మలుచుకోవాలంటే ఏమేం గమనించాలి? ఆచరించాలి?

సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. దాదాపుగా 13,000 మంది అభ్యర్థులు అర్హత సాధించారు, అక్టోబరులో జరిగే మెయిన్స్ పరీక్షను రాయబోతున్నారు. వారికింకా తగినంత సమయం కూడా లేదు.



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

అర్హత సాధించని మెజారిటీ అభ్యర్థులు వచ్చే సంవత్సరం నిర్వహించబోయే పరీక్షల వరకూ వేచి ఉండాల్సి వస్తుంది. ఒకవేళ వారు వచ్చే ఏడాది ఈ పరీక్షలో అర్హత సాధించినా, వారికి తక్కువ సమయం ఉన్నట్లుగా భావించే అకాశముంది. కాబట్టి వారు ఇప్పటి నుంచే మెయిన్స్‌కు సన్నద్ధమవడం మేలు. నిజానికి వారు ప్రిలిమినరీలో అర్హత సాధించినట్లుగా భావించి, మెయిన్స్‌కు సన్నద్ధత ప్రారంభించడం మంచిది. ఈ ఆలోచన ఆచరణీయమేనా అనిపించొచ్చు కానీ, అమలుపరిస్తే వచ్చే ఏడాది విజయం సాధించే అవకాశం తప్పనిసరిగా ఉంటుంది.

ప్రిలిమినరీ సిలబస్‌లోని అంశాలు మెయిన్స్ సిలబస్‌లో 75% కలుస్తున్నాయి.

కరంట్ అఫైర్ నుంచి జీకే, జాగ్రఫీ... ఇలా రెండు పరీక్షలకూ చదవాల్సిన అంశాలున్నాయి. వాటి జాబితాను ఇక్కడ చూడండి.

ఉమ్మడి అంశాలు

అంశం	ప్రిలిమినరీ	మెయిన్స్
1. కరంట్ అఫైర్స్	✓	✓
2. జనరల్ నాలెడ్జ్	✓	✓
3. హిస్టరీ ఆఫ్ ఇండియా, ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్	✓	✓
4. ఇండియన్ పాలిటీ, గవర్నెన్స్	✓	✓
5. జనరల్ సైన్స్	✓	✓
6. ఎకనామిక్స్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్	✓	✓
7. ఇండియన్ అండ్ వరల్డ్ జాగ్రఫీ	✓	✓



అయినప్పటికీ చాలామంది అభ్యర్థుల్లో కొన్ని సందేహాలున్నాయి. అవి..

- మెయిన్స్ సన్నద్ధత ప్రిలిమ్స్‌తో పోల్చినపుడు ఏవిధంగా భిన్నం?
- ఒక అంశాన్ని ప్రిలిమ్స్, మెయిన్స్‌లకు చదవడం ఎలా? వాటిని ఎలా అనుసంధానించి చదవాలి?
- మెయిన్స్‌లో పరిశీలించేవేమిటి? సమాధానాలను ఎలా రాయాలి?

వీటికి తగిన సమాధానాలను అన్వేషిస్తే నిశ్చింతగా పరీక్షకు సిద్ధం కావొచ్చు.

మెయిన్స్ సన్నద్ధత ప్రిలిమ్స్‌తో పోల్చినపుడు ఏవిధంగా భిన్నం?

మెయిన్స్‌కూ, ప్రిలిమ్స్‌కీ సన్నద్ధతకు సంబంధించిన పునాది ఒకేలా ఉంటుంది. కాన్సెప్టులను అర్థం చేసుకోవడం ముఖ్యం. కాన్సెప్టులను అర్థం చేసుకున్నాక ప్రిలిమ్స్ సన్నద్ధతలో వాస్తవాధారిత అంశాలుండాలి. అదే మెయిన్స్‌కు అయితే వాస్తవాలు, అభిప్రాయాలు, విశ్లేషణలను జోడించాలి.


ఒక అంశాన్ని ప్రిలిమ్స్, మెయిన్స్‌లకు చదవడం ఎలా? వాటిని ఎలా అనుసంధానించి చదవాలి?

ప్రాథమికాంశాలను పూర్తిచేశాక అభ్యర్థి సహజంగానే ముఖ్యమైన అంశాల చిత్రాన్ని మనసులోనే రూపొందించుకోవాలి. అది వర్తమాన వ్యవహారాలవైపునకు దారి తీస్తుంది. నిజానికి ప్రశ్నలు వర్తమాన వ్యవహారాల ఆధారంగానే ఉంటాయి. ఒకసారి టాపిక్‌లను ఎంపిక చేసుకుంటే సన్నద్ధత ప్రారంభించవచ్చు.

ఉదాహరణకు- ఇటీవల వార్తాపత్రికల్లో ఆర్టికల్ 35-ఏ గురించి చదువుతున్నాం.

ఈ అంశంపై కింది ప్రశ్నలు వేసుకుని, వాటికి సమాధానాలను వివరంగా సేకరించాలి.

- ఆర్టికల్ 35-ఏ ఏమిటి? ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది?
- జమ్మూ కశ్మీర్‌కు సంబంధించి దాని ప్రాముఖ్యం ఏమిటి?
- ఈ ఆర్టికల్ ఎందుకు చర్చనీయాంశమవుతోంది?
- దీన్ని మార్చడానికి వ్యతిరేకత ఎందుకు వస్తోంది?



ఈ సమాచారంలో వాస్తవాధారిత ప్రాథమికాంశాలు ప్రిలిమ్స్‌కు ఉపయోగపడతాయి. మిగిలిన అంశాలైన కాలక్రమానుగత పరిణామాలూ, వివిధ సంస్థల అభిప్రాయాలూ, చర్చలూ... ఇవన్నీ మెయిన్స్ పరీక్ష కోణంలో ముఖ్యమైనవి.

మెయిన్స్‌లో పరిశీలించేవేమిటి? సమాధానాలను ఎలా రాయాలి?

సివిల్స్ ప్రధాన పరీక్షను మూల్యాంకనం చేసేవారు జవాబు పత్రంలో 'పాయింట్ల' కోసం చూస్తారు. అది 20 మార్కుల ప్రశ్న అయితే వీలైనన్ని పాయింట్లు ఉండాలని ఆశిస్తారు. దీన్ని ఓ ఉదాహరణ ద్వారా చూద్దాం.

ఇటీవల నాగార్జున సాగర్‌కు 29 కి.మీ. వాయవ్య దిశలో భూకంపం సంభవించింది. దీన్ని జాతీయ జియోఫిజికల్ పరిశోధన కేంద్రం (NGRI) జులై 26న కనిపెట్టింది. ఈ పరిణామం రెండు అంశాలను (భారీ రిజర్వాయర్ల వద్ద భూ ప్రకంపనాలను పరిశీలించటం, పెద్ద ఆనకట్టలకు సంబంధించిన పర్యావరణ అంశాలపై దృష్టి పెట్టాలనే భావన) వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో రాదగ్గ ప్రశ్న-

Q : 'WHAT ARE THE ECOLOGICAL IMPACTS OF LARGE DAMS ?'

A: Experience from all over the world has shown that large dams have major environmental and ecological impacts. Some of these are listed below:

Upstream (including reservoir) (1) soil erosion; (2) micro-climatic changes; (3) loss of forests, flora, and fauna; (4) changes in floral and faunal density and diversity; (5) changes in fisheries, especially on spawning grounds; (6) chain effects on catchment area due to constructions, displacement, etc.; (7) landslips, siltation and sedimentation; (8) breeding of vectors in reservoir and increase in related diseases; (9) seismicity; (10) loss of non-forest land; (11) water logging around reservoir ; and (12) growth of weeds.

Downstream (including command area); (1) water logging and salinity; (2) reduced water flow and deposition in river, with related impacts on aquatic ecosystem, flora and fauna; (3) micro-climatic changes; (4) flash-floods; (5) salt-water ingress at river mouth; (6) changes in coastal ecosystem (e.g., mangroves); (7) loss of land fertility along river; and (8) vector breeding and increase in related diseases.

ఈ జవాబులో 20 పాయింట్లు ఉన్నాయి కదా! సాధారణంగా ఇది 20 మార్కుల ప్రశ్నగా రావొచ్చు. అంటే పాయింటుకో మార్కు ఉంటుందని ఊహించవచ్చు.

రాత సాధన ఎందుకు అవసరం?

సివిల్స్‌కు అవసరమైన పుస్తకాలన్నీ చదివేసి వివిధ అంశాలపై పరిజ్ఞానం సంపాదించినవారు దాన్ని రాతపూర్వకంగానే అది కూడా నియమిత కాలవ్యవధిలో ప్రదర్శించాల్సివుంటుంది. అందుకు రాత సాధన చాలా ముఖ్యం.

కొందరు... మొదట అన్ని అంశాల్లో పరిజ్ఞానాన్ని సంపాదించేదాక వేచి ఉండి, ఆ తర్వాత రాయడాన్ని సాధన చేయాలని సలహా ఇస్తుంటారు. ఇది అర్థరహితమైన వాదన. అన్ని అంశాల్లో అభ్యర్థికి 'తగినంత' పరిజ్ఞానం ఎప్పటికి లభిస్తుంది? మెయిన్స్ పరీక్షకు నెలరోజుల ముందా? రెండు నెలల ముందా? అప్పుడైతే రోజుకు 4-5 గంటల రాత సాధన అవసరమవుతుంది. మరి వార్తాపత్రికలు చదవటం, తయారు చేసుకున్న నోట్సు/ పుస్తకాలను పునశ్చరణ చేయటం, నమూనా పరీక్షలు రాయటం.. వీటికి సమయం ఎక్కడ ఉంటుంది?

అందుకే సమాధానాలను రాసే సాధన సన్నద్ధతతోపాటే కొనసాగాలి. అస్పష్టమైన అవగాహన ఉన్న అంశం పైన కూడా కొన్ని పాయింట్లను రాయగలిగేలా తయారు కావాలి. మెయిన్స్ పరీక్షలో ఒక రోజు సమయంలో 8000 నుంచి 10,000 కుపైగా పదాలను రాయాల్సి ఉంటుంది. కాబట్టి, ఒక నిర్ణీత సమయం పాటు రాయడాన్ని అలవాటు చేసుకోకపోతే పరీక్ష కేంద్రంలో చిక్కులు ఎదురవుతాయి.

> 'సివిల్ సర్వెంట్ పరిణతిని సూచించేలా రాయగలిగివుండాలి. వ్యాకరణ దోషాలు, అక్షరక్రమ (స్పెలింగ్) లోపాలు లేకుండా జాగ్రత్తపడాలి. పదాడంబరం పనికిరాదు. సందర్భ శుద్ధిలేని గణాంకాలను ఏకరువు పెట్టడం తగదు.'

అభ్యర్థుల రాతలు సివిల్ సర్వెంట్ పరిణతిని సూచించేలా ఉండాలి. వ్యాకరణ దోషాలు, అక్షరక్రమ (స్పెలింగ్) లోపాలు లేకుండా జాగ్రత్తపడాలి. పదాడంబరం, సందర్భ శుద్ధిలేని గణాంకాలను ఏకరువు పెట్టడం తగదు. ప్రముఖుల కొటేషన్లనూ, జాతీయాలనూ వాడేటప్పుడు వాటిని ఇష్టం వచ్చినట్టు మార్చకుండా యథాతథంగా ఇవ్వాలి. అడిగిన ప్రశ్నకు నిర్దిష్టంగా జవాబు రాయటం, రాసే విషయాన్ని అవసరమైన పేరాగ్రాఫులుగా విడగొట్టటం, పాయింట్లు కనపడేలా అమర్చటం.. ఇవన్నీ అభ్యర్థి ఆలోచనా క్రమంలోని స్పష్టతను సూచిస్తాయి.

సివిల్స్ పరీక్ష స్వరూపం

ప్రిలిమినరీ (ఆబ్జెక్టివ్ పద్ధతి- అర్హతకు మాత్రమే)	పేపర్లు	మార్కులు
జనరల్ స్టడీస్	1	200
సీశాట్ (అర్హతకు) 33%	1	200
(రెండు పేపర్లూ తప్పనిసరిగా రాయాలి. మెయిన్‌కు అర్హత పొందటానికి మాత్రం జనరల్ స్టడీస్ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు)		
మెయిన్స్ (క్వాలిఫైయింగ్ పేపర్లు)		
ఇండియన్ లాంగ్వేజ్ (అర్హతకు మాత్రమే; పదోతరగతి స్థాయి) కనీసం 75 మార్కులు సాధించాలి	1	300
ఇంగ్లిష్ (అర్హతకు మాత్రమే; పదో తరగతి స్థాయి) కనీసం 75 మార్కులు సాధించాలి	1	300
మెరిట్‌కు పరిగణనలోకి తీసుకునే పేపర్లు		
వ్యాసం (ఎస్సే)	1	250
జనరల్ స్టడీస్ పేపర్-1: ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్, హిస్టరీ, జాగ్రఫీ ఆఫ్ ద వరల్డ్ అండ్ సొసైటీ	1	250
జనరల్ స్టడీస్ పేపర్-2: గవర్నెన్స్, కాన్‌స్టిట్యూషన్, పాలిటీ, సోషల్ జస్టిస్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్	1	250
జనరల్ స్టడీస్ పేపర్-3: టెక్నాలజీ, ఎకనమిక్ డెవలప్‌మెంట్, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్	1	250
జనరల్ స్టడీస్ పేపర్-4: ఎథిక్స్, ఇంటెగ్రిటీ అండ్ ఆప్టిట్యూడ్	1	250
ఆప్షనల్ సబ్జెక్ట్: పేపర్-1	1	250
ఆప్షనల్ సబ్జెక్ట్: పేపర్-2	1	250
మొత్తం రాతపరీక్ష మార్కులు	7	1750
పర్సనాలిటీ టెస్ట్ (మౌఖికపరీక్ష)		275
అన్నీ కలిపి		**2025**

రాతపరీక్ష, ఇంటర్వ్యూ మార్కులు కలిపి తుది మెరిట్ జాబితాను నిర్ణయిస్తారు.

రేపటి ఇంజినీర్లూ... ఇది మీ కోసమే!

ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి, అందులో ఉన్న ఇబ్బడిముబ్బడి అవకాశాలను అందిపుచ్చుకోవటానికి ఎందరో విద్యార్థులు బీటెక్/బీఈలలో చేరారు. భావి ఇంజినీర్లు తమ నాలుగేళ్ళ కోర్సు ప్రయాణంలో కొన్ని ప్రణాళికలను వేసుకోవాలి. ఈ దిశలో మొదటి సంవత్సరంలో ఎలా చదవాలి, ఏయే అదనపు మెలకువలు నేర్చుకోవచ్చు? తెలుసుకుందాం!



నీలమేఘశ్యామ్ దేశాయి
లైఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సెల్
ఏస్ ఇంజినీరింగ్ కాలేజి

ఇంజినీరింగ్ రంగం జన జీవన శైలి, జీవన స్థితిగతులపై ఎంతో ప్రభావం చూపుతుంది. శాస్త్రవేత్తల పరిశోధనలకు మెరుగులు దిద్ది తమ ప్రయోగాల ద్వారా ప్రజోపయోగకరమైన ఉత్పత్తులుగా మలచే ఇంజినీర్ల కృషి అనన్య సామాన్యం. ఇంజినీరింగ్ విద్య ఇతర వృత్తి విద్యలకన్నా విభిన్నమైనది. ఈ రంగంలో దేశ ఆర్థిక అభివృద్ధిని నిర్దేశించే బహుళ ప్రయోజనాల సంస్థలు, కర్మాగారాలు ఉండటం వల్ల ఒకే శాఖకు చెందిన, ఇంకా ఇతర శాఖలకు చెందిన ఇంజినీర్ల బృందం కలసి సేవలందించే అవసరం ఉంటుంది. అందుకే సమాజానికి ఎక్కువ ఇంజినీర్ల అవసరం ఉంటుంది. ఈ కారణాల వల్లనే వృత్తివిద్యలన్నిటిలోకీ ఇంజినీరింగ్ విద్యకు ఎక్కువ గిరాకీ!

కొత్త ఆవిష్కరణలూ, స్వయం నియంత్రిత పనిముట్ల రూపకల్పన ఇంజినీరింగ్‌లో ఒక వాడుక; వాటి తయారీ ఇంజినీర్లకు ఒక వేడుక. రోజురోజుకూ పెరుగుతున్న యంత్రీకరణ ఎన్నో ఉపయోగాలను ఇచ్చినా, ఇవి కొన్నిసార్లు కొత్తరకమైన ప్రమాదాలకు కూడా కారణమవుతుంటాయి. ఉదాహరణకు సైకిల్ మీద ప్రయాణంలో ప్రమాదం ఒకరు లేక ఇద్దరికే పరిమితం, సైకిల్ కన్నా ఎన్నో రెట్లు సౌలభ్యాన్నిచ్చే బస్సు ద్వారా ప్రమాదం కూడా కొన్ని రెట్లు ఎక్కువే. నూతన సాంకేతికతలు తెచ్చే కొత్తరకాల ప్రమాదాలను మునుముందే గుర్తించగలగడం, ప్రమాదం అనివార్యమైతే తగిన ముందస్తు జాగ్రత్తల సూచన, నివారణ, నియంత్రణ కూడా ఒక కొత్త ఉద్యోగ అవకాశమే. అందుకే ఇంజినీరింగ్ రంగం సృజనాత్మకత ఉన్నవారికి అంతులేని అవకాశాలను అందిస్తుంది.

మన దేశంలో ప్రతి సంవత్సరం 15 లక్షలకు పైగా ఇంజినీరింగ్ ముగించిన విద్యార్థులు తయారవుతున్నారు. ఐతే నిపుణుల అంచనాల మేరకు దాదాపు 80 శాతం పైగా విద్యార్థులు తగిన మెలకువలూ, నైపుణ్యాలూ లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. కోర్సు ముగించిన తరువాత ఎక్కువ శాతం మంది ఉద్యోగాలవైపే మొగ్గు చూపుతారు. అంటే నాలుగేళ్ళ ఇంజినీరింగ్ నలభై ఏళ్ళ భవితకు పునాది. కాబట్టి ఈ కోర్సు ద్వారా కేవలం ఉద్యోగానికో, కెరియర్‌కో కాకుండా జీవితానికి ప్రణాళిక చేసుకోవాలి.

ఈ మూడూ అవసరం

బీటెక్/ బీఈ డిగ్రీలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రధానంగా రెండు రకాల నైపుణ్యాల అవసరం ఉంటుంది. మొదటిది అభిజ్ఞా వికాస మెలకువలు (Cognitive Skills), రెండోది ప్రవర్తన మెలకువలు (Behavioural Skills). ఈ మూడూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి, అవసరమైతే వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడానికి కావాలి. విద్యార్థులు ఇంజినీరింగ్ చేసే సమయంలోనే సాంకేతిక పరంగానే కాకుండా వ్యక్తిత్వ పరంగా కూడా పూర్తిగా రూపాంతరం చెందడానికి అవసరమైన ఈ అన్ని మెలకువలూ నేర్చుకోవాలి. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం, సరైన సమాధానాల అన్వేషణకు అవసరమైన కిటుకులు పెంపొందించుకోవాలి.

ఇంతటి విశిష్టతలున్న ఇంజినీరింగ్‌లో మొదటి సంవత్సరం నుంచే ఉద్యోగ సంసిద్ధత కోసం అడుగులు వెయ్యడం నేర్చుకోవాలి. తమ బాధ్యతను గుర్తెరిగి ఈ వృత్తిలో రాణించేవిధంగా అమరుకోవాలి. అంతర్జాలం ద్వారా లభించే వివిధ రకాలైన అపార విద్యావనరులను సద్వినియోగం చేసుకోగల సామర్థ్యాలను పెంచుకోవాలి.

ఆరంభం నుంచీ ఒత్తిడి

దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో మొదటి సంవత్సరం నుంచే సెమిస్టర్ పద్ధతి అమలులోకి వచ్చింది. అంటే విద్యార్థికి మొదటినుంచే ఒత్తిడి ఉంటుందని అర్థం చేసుకోవాలి. పైగా క్రెడిట్ల ఆధారంగా డిటెన్షన్ పద్ధతి కూడా అమలులోకి వచ్చింది. విద్యార్థులు ఈ విధానాన్ని గురించి పూర్తి ఆకళింపు చేసుకోవాలి. అలసత్వం ప్రదర్శిస్తే భారీ మూల్యమే చెల్లించుకోవలసి వస్తుంది. 'ఇంటర్మీడియట్ వరకు ఒత్తిడితో చదివాం కదా, ఈ కోర్సులో కాస్త ఊపిరి పీల్చుకుందాం' అనుకుంటే మాత్రం ఊపిరి ఆడని పరిస్థితి దాపురిస్తుంది. కాబట్టి మొదటినుంచే జాగ్రత్త వహించడం చాలా అవసరం. కొత్త వాతావరణానికి ఎంత త్వరగా అలవాటు పడితే అంత మంచిది.

మన ఆలోచనలకు అనుగుణంగా ఉన్న స్నేహితులతో, సీనియర్లతో పరిచయాలు చాలా మేలు చేస్తాయి. ఇందువల్ల లక్ష్య సాధనకు మార్గం సులువౌతుంది. వీలైనంతవరకు తరగతులకు గైర్హాజరు కాకుండా ఉండాలి. తప్పనిసరి పరిస్థితులలో తరగతులకు వెళ్లలేకపోతే స్నేహితులను అడిగి నోట్సు తయారు చేసుకోవాలి. ఇక్కడ స్నేహితులు, సీనియర్లు లేదా అధ్యాపకులు చాలా సహాయపడతారు. అంతే కాకుండా హాజరును నిర్లక్ష్యం చేయకుండా చాలా జాగ్రత్త వహించాలి.



ఇదీ సరైన మార్గం

ఈ కింద సూచించినవిధంగా ఆచరిస్తే నాలుగేళ్ల బి.టెక్ కాలం నల్లేరు మీద బండి నడకగా అవుతుంది. భవిష్యత్తు పట్ల కూడా ఆత్మవిశ్వాసం కలుగుతుంది. కోర్సు పూర్తిచేశాక 'ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనగలను' అన్న ఆత్మస్థైర్యంతో ఉద్యోగంలోకి అడుగుపెట్టవచ్చు. నాలుగు సంవత్సరాల విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవటం విద్యార్థుల లక్ష్యం కావాలి.

✦ ఇంజినీరింగ్ స్థాయిలో విద్యాబోధన పద్ధతులు ఇంటర్మీడియట్ స్థాయి కన్నా భిన్నంగా ఉంటాయి. విద్యార్థులు ఈ పద్ధతికి అతి త్వరగా మానసికంగా సంసిద్ధులు కావడం ఎంతో అవసరం. ఇంటర్మీడియట్ వరకు 'చంచా దాణా' (స్పూన్ ఫీడింగ్) పద్ధతిలో, అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణలో చదువుకోవడం జరుగుతుంది. అధ్యాపకుల సహాయ సహకారాలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ఐతే సాంకేతిక కోర్సులో అలా కాదు. అధ్యాపకులు తక్కువ సమయంలో ఎక్కువ లోతుగా చెప్పవలసి ఉంటుంది. అందువల్ల సమయాభావం దీనిలో పెద్ద సమస్య. విద్యార్థులు అధ్యాపకుల బోధనలకు సొంతంగా మెరుగులు దిద్దుకోవలసి ఉంటుంది. మొదటి సంవత్సరంలో ఇంటర్మీడియట్ స్థాయి కన్నా ఎక్కువ లోతుగా చదువుకోవాలని అర్థం చేసుకోవాలి.

✦ అంతర్గత మార్కులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ప్రతి సబ్జెక్టులోను గరిష్ఠంగా 25 మార్కులకు ఈ పరీక్షలుంటాయి. వీటి మూల్యాంకనం పాఠాలు బోధించే అధ్యాపకులే చేస్తారు. బీటెక్ పరీక్షల్లో ప్రతిభ కాలేజీ, విశ్వవిద్యాలయాల సమష్టి బాధ్యత. విశ్వవిద్యాలయం నిర్వహించే పరీక్షలు మనం ఉత్తీర్ణులమో కాదో నిర్ణయిస్తే, అంతర్గత మార్కులు మన శ్రేణిని నిర్ణయిస్తాయి. ప్రతి సబ్జెక్టులోనూ రెండు సార్లు అంతర్గత పరీక్షలు నిర్వహించి వాటి సగటును గణించి, వచ్చిన మార్కులు విద్యార్థికి కేటాయిస్తారు.

ఇంజినీరింగ్ మెకానిక్స్, డ్రాయింగ్, భౌతికశాస్త్రం కొంచెం కష్టమనిపిస్తాయి. వాటిపై జాగ్రత్త వహించాలి. బట్టీ పట్టి పరీక్షలను ఎదుర్కోవాలనుకోవడం అసలు మంచిది కాదు. సబ్జెక్టులను అర్థం చేసుకుని నోట్సు రాసుకుని చదువుకోవాలి. తరగతిలోనే అనుమానాల నివృత్తి చేసుకోవాలి. గైడ్ల జోలికి వెళ్లకూడదు. పరీక్షల్లో మార్కులు గమ్యం కాదు. వాటి సాధన ఒక లక్ష్యం మాత్రమే.

సెమిస్టర్ పద్ధతిలో పరీక్షల సమయం చాలా త్వరగా దగ్గర పడినట్టు అనిపిస్తుంది. అందువల్ల పరిస్థితులకు తమను తాము రూపాంతరీకరించుకునే మానసిక స్థితిని మార్చుకోవాలి.

✦ ఇంజినీరింగ్ మెకానిక్స్, డ్రాయింగ్, భౌతికశాస్త్రం కొంచెం కష్టమనిపిస్తాయి. కాబట్టి జాగ్రత్త వహించాలి. బట్టీ పట్టి పరీక్షలను ఎదుర్కోవాలనుకోవడం కొరివితో తల గోక్కోవడం లాంటిది. ఈ పద్ధతి అసలు మంచిది కాదు. సబ్జెక్టులను అర్థం చేసుకుని నోట్సు రాసుకుని చదువుకోవాలి. తరగతిలోనే అనుమానాల నివృత్తి చేసుకోవాలి. స్వయం బాధ్యత తప్పనిసరి. మన చర్యలకు మనమే బాధ్యత వహించాలి. గైడ్ల జోలికి వెళ్లకూడదు. పరీక్షల్లో మార్కులు గమ్యం కాదు. అది ఒక లక్ష్యం మాత్రమే. సబ్జెక్టు పరిజ్ఞానం వృత్తిలో వినియోగించవలసివుంటుంది. గైడ్లు పరీక్షలు పాస్ అవ్వడానికీ, బహుశా కొన్ని అదనపు మార్కులకూ ఉపయోగపడతాయేమో కానీ, సబ్జెక్టుపై పట్టును మాత్రం ఇవ్వలేవు.

✦ డిటెన్షన్, క్రెడిట్ల గురించి అవగాహన పెంచుకోవాలి. విఫలమవ్వడానికి చదవకూడదు. ప్రతి అంశం మీద హేతుబద్ధమైన, స్థిరమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకోవాలి. ఒకే అంశాన్ని వివిధ కోణాల్లో నుంచి విశ్లేషించి సారాంశాన్ని గ్రహించాలి. అలాగే ఆ అంశాన్ని ఇతరులు ఎలా విశ్లేషిస్తున్నారో తెలుసుకోవాలి.

✦ తమకు అవసరమయ్యే లఘుకాల శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి.

✦ ఇంగ్లిషు భాషలో మంచి పునాదులు వేసుకోవాలి. మౌఖిక, లిఖిత భావ ప్రకటన మెలకువలు చాలా అవసరం.

కళాశాల నిర్వహించే సాంస్కృతిక, ఇతరత్రా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి. వీటివల్ల బృంద నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది. ఈ ప్రశంసా పత్రాలు విదేశాలలో పైచదువులకు బాగా ఉపయోగపడతాయి.

ప్రయోగశాలలో ప్రయోగాలను వీలైనంతవరకు సొంతంగా చెయ్యడానికి ప్రయత్నించాలి. అనువర్తన జ్ఞానం ఇంజినీర్లకు పునాది.

ఈ అంశాలపై కూడా శ్రద్ధ వహిస్తే మంచిది.

1. ఎప్పటి పని అప్పటికి ముగించాలి.
2. పాఠ్యాంశాలకు సంబంధించిన నిర్దేశిత పుస్తకాలు, ఇతర పాఠ్య వనరులను సమకూర్చుకోవాలి.
3. తరగతిలో విన్న పాఠాలను అదేరోజు పునశ్చరణ చేసుకోవాలి. దీనివల్ల సబ్జెక్టులోని మౌలికాలపై మంచి పట్టు లభిస్తుంది.
4. గత సంవత్సరం ప్రశ్నపత్రాలకు సమాధానం తయారుచేసుకోవాలి.
5. ప్రతిరోజూ రెండు గంటల సమయాన్ని కేటాయించి చదువుకోవాలి. సెలవు రోజులలో ప్రాంగణ నియామకాలలో అడిగే ప్రశ్నలను అభ్యాసం చెయ్యాలి.
6. ఆంగ్ల వార్తా పత్రికలు చదివే అలవాటు ముఖ్యం. సమకాలీన సమస్యలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

డిజిటల్ మార్కెటింగ్‌లో..

1. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: రాక్స్ ఫరెవర్
ప్రదేశం: విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ.10,000
internshala.com/ i/5051
గడువు: ఆగస్టు 21, 2017
అర్హత: ఎంఎస్ ఆఫీస్ నైపుణ్యాలు ఉన్నవారు.

2. గ్రాఫిక్ డిజైన్
సంస్థ: నావిగో
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.8000 నుంచి రూ.10,000
internshala.com/ i/5052
గడువు: ఆగస్టు 24, 2017
అర్హత: అడోబ్ ఫొటోషాప్, కోరెల్‌డ్రా, అడోబ్ ఇలస్ట్రేటర్, ఫైనల్ కట్ ప్రో, అడోబ్ ఇన్‌డిజైన్, అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్ నైపుణ్యాలు ఉన్నవారు.

3. ఇంటర్న్‌శాల స్టూడెంట్ పార్ట్‌నర్ 8.0
సంస్థ: ఇంటర్న్‌శాల
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: పర్‌ఫార్మెన్స్ ఆధారంగా
internshala.com/ i/5053
గడువు: ఆగస్టు 28, 2017
అర్హత: సంబంధిత రంగంలో నైపుణ్యాలు ఆసక్తి ఉన్న విద్యార్థులు.

4. మార్కెటింగ్
సంస్థ: డక్‌బక్స్
ప్రదేశం: చెన్నై, గుంటూరు, ఇండోర్, నెల్లూరు, హైదరాబాద్, విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ.5000 నుంచి రూ.6000
internshala.com/ i/5054
గడువు: ఆగస్టు 25, 2017
అర్హత: ఎంఎస్ ఆఫీస్ నైపుణ్యాలు ఉన్నవారు.

5. అకౌంటింగ్
సంస్థ: వేణు అండ్ విజయ్
ప్రదేశం: అనంతపురం, గుంటూరు, ఆదోని, విజయవాడ, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.5000 నుంచి రూ.10,000
internshala.com/ i/5055
గడువు: ఆగస్టు 17, 2015
అర్హత: టాలీ, ఎంఎస్ ఎక్సెల్‌లో నైపుణ్యాలు ఉన్నవారు.

6. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: క్లౌడ్‌ఐ టెక్నాలజీస్ ఇండియా
ప్రదేశం: విశాఖపట్నం
స్టైపెండ్: నెలకు రూ.6000 నుంచి రూ.8000
internshala.com/ i/5056
గడువు: ఆగస్టు 21, 2017
అర్హత: ఆంగ్లభాషా రాత నైపుణ్యాలు ఉన్నవారు.

7. ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్
సంస్థ: Kkekk ఇన్‌కార్పొరేషన్
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.7000 నుంచి రూ.12,000
internshala.com/ i/5057
గడువు: ఆగస్టు 23, 2017
అర్హత: జావా, ఆండ్రాయిడ్‌లో నైపుణ్యాలు ఉన్నవారు.

ఇంటర్న్‌షిప్‌లు

8. డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: GenY మీడియం
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000 నుంచి రూ.7000
internshala.com/ i/5058
గడువు: ఆగస్టు 24, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలు ఉన్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

9. ఆపరేషన్స్
సంస్థ: గ్లోబల్ 3డీ లాబ్స్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.2500 నుంచి రూ.7500
internshala.com/ i/5059
గడువు: ఆగస్టు 19, 2017
అర్హత: సంబంధిత నైపుణ్లాయు ఉన్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

10. వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: రిపోర్ట్‌గార్డెన్ టెక్నాలజీస్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000 నుంచి రూ.8000
internshala.com/ i/5060
గడువు: ఆగస్టు 23, 2017
అర్హత: జావా నైపుణ్యాలు ఉన్నవారు.

(మరిన్ని ఇంటర్న్‌షిప్‌ల కోసం www.eenadupratibha.net)

రెండు తెలుగు రాష్ట్రాల్లో విలువైన పని అనుభవం పొందేలా తోడ్పడటంతోపాటు స్టైపెండ్‌ను కూడా అందిస్తున్నాయి వివిధ సంస్థల ఇంటర్న్‌షిప్‌లు. విద్యార్థులు తగిన విచారణ చేసుకుని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి!
- http://internshala.com

జీఎస్ ప్రశ్నపత్రాలు


ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ పరీక్షలు ముగియడంతో తిరిగి రాబోయే నోటిఫికేషన్ల కోసం అభ్యర్థులు దీర్ఘకాలిక సన్నద్ధతకు ఉపక్రమించారు. ఏపీపీఎస్సీ ద్వారా రాబోయే గ్రూప్-1, 2, ఏఈఈ, తదితర పోస్టుల కోసం సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం తొలిమెట్టుగా ఉపయోగపడే గత ప్రశ్నపత్రాల సంకలనాన్ని ఉద్యోగసోపానం, విక్రమ్ పబ్లిషర్స్ సంయుక్తంగా విడుదల చేశాయి. ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ 2016-17లో నిర్వహించిన జనరల్‌స్టడీస్ ప్రశ్నపత్రాల్లోని వివిధ సబ్జెక్టుల ప్రశ్నలను వర్గీకరించి, అంశాలవారీగా అందించారు. ఇలా దాదాపు అయిదు వేల బహుళైచ్ఛిక ప్రశ్నలను పొందుపరిచారు. దీనివల్ల జనరల్‌స్టడీస్‌లోని వేర్వేరు సబ్జెక్టుల్లో ఏయే అంశాలకు ఎంత ప్రాధాన్యముందో అవగాహన వస్తుంది. ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో స్పష్టమవుతుంది. అదే సమయంలో ఇవన్నీ ముఖ్యమైన ప్రశ్నలైనందువల్ల తిరిగి వచ్చే అవకాశాన్ని తోసిపుచ్చలేం. దీర్ఘకాలిక సన్నద్ధతను ప్రారంభించిన అభ్యర్థులకు ఈ పుస్తకం దారి చూపుతుంది.



జనరల్ స్టడీస్ గత ప్రశ్నపత్రాలు
పేజీలు–336; ధర: రూ.162
ప్రతులకు: విక్రమ్ పబ్లిషర్స్

సీసీఈ తరహాలో...

తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల స్థాయిలో సీసీఈ విధానంలో పరీక్షలకు నిర్వహిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులు అధ్యయనం సాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం 'ఎస్ ఆర్ బుక్ లింక్స్' ఆంగ్ల మాధ్యమంలో ఇంగ్లిష్, గణితం, మ్యాప్ పాయింటింగ్ వర్క్‌బుక్‌లను విడుదల చేసింది. నిర్దేశిత ప్రమాణాలకు తగినట్లు అభ్యాసాలను వీటిలో పొందుపరిచారు. ఇటీవల పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలను కూడా ఈ వర్క్‌బుక్స్‌లో చేర్చారు. అన్నింటికీ జవాబులు కూడా ఇచ్చారు.



1) పదో తరగతి ఇంగ్లిష్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 297
2) పదో తరగతి మ్యాథమేటిక్స్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 144
3) పదో తరగతి మ్యాప్‌పాయింటింగ్ వర్క్‌బుక్
ధర: రూ. 72
4) తొమ్మిదో తరగతి ఇంగ్లిష్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 153
5) తొమ్మిదో తరగతి మ్యాథమేటిక్స్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 81
6) ఎనిమిదో తరగతి ఇంగ్లిష్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 72
7) ఏడో తరగతి ఇంగ్లిష్ గ్రేడ్ విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 63
8) ఆరో తరగతి ఇంగ్లిష్ గ్రేడ్‌విన్నర్ వర్క్‌బుక్
ధర: రూ. 63

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, హయత్‌నగర్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
e-mail: edc@eenadu.net

ఇంటర్ లేకుండా ఎల్ఎల్‌బీ?

సందేహాలు? సమాధానాలు



✿ **బీఎస్సీ (ఎంపీసీఎస్) 2017లో పూర్తైంది. ఎంఎస్సీ (ఫిజిక్స్) చేయాలనుంది. విశ్వవిద్యాలయాన్ని ఎలా ఎంచుకోవాలి? పరిశోధనలోనూ ఆసక్తి ఉంది. అందుకు నేను ఏయే అంశాలపై దృష్టిసారించాలి? - వీరేంద్ర,** విజయవాడ



● ఎంఎస్సీ అభ్యసించాలనుకునే విద్యార్థులు ఐఐటీ వారు నిర్వహించే జామ్ (JAM) పరీక్ష లేదా వివిధ ఎన్ఐటీలు నిర్వహించే ఎంఎస్సీ ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. బోధన, పరిశోధనలపరంగా అత్యున్నత ప్రమాణాలున్న, పీజీలోనే పరిశోధనలను ప్రోత్సహించే విశ్వవిద్యాలయాల్లో పీజీ చేయడం వల్ల పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకోవచ్చు. లోతుగా అధ్యయనం చేయడం, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు సీఎస్ఐఆర్ నెట్- జేఆర్ఎఫ్ పరీక్షకు సిద్ధం కావడం ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందవచ్చు.

✿ **దూరవిద్య ద్వారా బీకాం చేసి, ఎంబీఏ (2008) రెగ్యులర్ విధానంలో పూర్తిచేశాను. కానీ, నేను ఇంటర్మీడియట్ చదవలేదు. ఎల్ఎల్‌బీ చేయాలనుంది. నాకు రెగ్యులర్ విధానంలో చేసే వీలుందా? - ఎస్. కిరణ్ కుమార్**



● మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ చేయదలచిన అభ్యర్థులు ఏపీ లాసెట్ లేదా తెలంగాణ లాసెట్ నిబంధనల ప్రకారం 10+2+3 విధానంలో ఏదైనా డిగ్రీ 45% మార్కులతో పూర్తి చేసినవారు మాత్రమే అర్హులు. క్లాట్ ద్వారా ఎల్ఎల్‌బీ చేయాలనుకుంటే 10+2 పాస్ అవ్వాల్సి ఉంటుంది. గరిష్ఠ వయఃపరిమితి జనరల్ వారికి 20 ఏళ్లు, రిజర్వ్‌డ్ వారికి 22 ఏళ్లు. మీరు ఇంటర్ పూర్తిచేయలేదు కాబట్టి, ప్రస్తుతం మీకు ఎల్ఎల్‌బీ అభ్యసించడానికి అర్హత లేదు.

✿ **విదేశీ కళాశాలలతో సంబంధమున్న వాటిల్లో సైబర్‌లా లేదా హ్యూమానిటీస్ చదవాలనుంది. అటువంటి కళాశాలలు, వాటి అడ్మిషన్‌ల వివరాలను తెలియజేయండి. - ఎం. లావణ్య**

● మీరు మీ విద్యార్హతలను తెలియజేయలేదు. సాధారణంగా సైబర్‌లా కోర్సును ఐటీ సంస్థల్లో పని చేసే వారు, ప్రాక్టీసింగ్ న్యాయవాదులు తమ అర్హతను పెంపొందించుకోవడానికి అభ్యసిస్తారు. నల్సార్ యూనివర్సిటీ, నేషనల్ లా యూనివర్సిటీ, సింబయాసిస్ లా స్కూల్ వంటివి తమ విద్యార్థులకు అనుబంధ విదేశీ కళాశాలల్లో ఒక సెమిస్టర్ లేదా ఒక సంవత్సరంపాటు ఒక ఐచ్ఛికంగా సైబర్‌లా కోర్సును అభ్యసించే వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఈ విద్యాలయాల్లో క్యాట్ ద్వారా ప్రవేశం పొందవచ్చు.

హ్యూమానిటీస్ విషయంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఎరాస్మస్ ప్రోగ్రాం ద్వారా విదేశంలో కొంతకాలం విద్యనభ్యసించే ఏర్పాటును కల్పిస్తున్నాయి. ప్రైవేటు విశ్వవిద్యాలయాలైన ఎస్ఆర్ఎం, గీతం వర్సిటీ, క్రయిస్ట్ విశ్వవిద్యాలయాలు తమ విద్యార్థులకు విదేశీ కళాశాలల్లో ఒక సెమిస్టర్ విద్యను పూర్తిచేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. సంబంధిత వర్సిటీలు తమ సొంత ప్రవేశపరీక్ష ద్వారా హ్యూమానిటీస్ కోర్సులో ప్రవేశాన్ని కల్పిస్తున్నాయి.

✿ **డిగ్రీ (బీజెడ్‌సీ) మూడో సంవత్సరం చదువుతున్నాను. సైకాలజీలో పీజీ చేయాలనుంది. నాకు అర్హత ఉందా? వాటికి ఉండే ప్రవేశపరీక్షలు, ఏయే అంశాల్లో వాటికి సన్నద్ధమవాల్సి ఉంటుంది? - కృష్ణ**

● సైకాలజీలో పీజీ చేయాలనుకునేవారు డిగ్రీ సైకాలజీ చదివివుండాలి. కానీ కొన్ని విశ్వవిద్యాలయాలు ఏదైనా డిగ్రీ చదివినవారికి కూడా అవకాశాన్ని కల్పిస్తున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ తమ సొంత ప్రవేశపరీక్ష ద్వారా ప్రవేశాలను కల్పిస్తున్నాయి.



ప్రొ. బి. రాజశేఖర్
కెరియర్ కౌన్సెలర్

సైకాలజీ అంటే మానసిక ప్రవర్తన, మనస్తత్వ శాస్త్ర అధ్యయనం, విశ్లేషణాత్మక ఆలోచన, సహనం వంటి అంశాల్లో అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మంచి ఫలితాలను పొందవచ్చు.

ఇంగ్లిష్ రాతలో, సంభాషణల్లో phrasal verbs ను ఉపయోగించడం వల్ల భాష సహజంగా ఉంటుంది. ఈవారం కొన్నింటిని ఉదాహరణల సాయంతో నేర్చుకుందాం!

మర్చిపోతే.. Slip from memory



ఎం. సురేశన్

Janakiram: Jeevan looks totally put out. What could be the reason? (జీవన్ చాలా నిరుత్సాహంతో ఉన్నట్లు కనిపిస్తున్నాడు. కారణం ఏమై ఉండొచ్చు?)

Sriram: Prabhakar has invited everyone to his birthday party except Jeevan. He is not much worried, but his leaving him out has certainly hurt him (జీవన్‌ని తప్ప ప్రభాకర్ మిగతా అందరినీ తన పుట్టినరోజుకు పార్టీకి పిలిచాడు. జీవన్ అంతగా బాధపడటం లేదు కానీ, తనను ఉపేక్షించడం అతన్ని బాధించింది).

Janakiram: It must have slipped his memory. Otherwise he is not one to pass anybody up. I will remind him of it (ప్రభాకర్ మరచిపోయి ఉండొచ్చు. లేకపోతే ఎవరినీ మరచిపోయేవాడు కాడతను. నేనతనికి గుర్తు చేస్తాను).

Sriram: You had better. I will do it too if I find the occasion (ఆ పని చేయడం మంచిది. నేనూ గుర్తుచేస్తాను, అవకాశం వస్తే).

Janakiram: I met him a few days ago, and he appeared to have come down with something. I don't know what was wrong (కొన్ని రోజుల క్రితం నేనతన్ని కలిశాను. అంత కులాసాగా లేనట్టు, జబ్బు పడ్డట్టుగా కనిపించాడు. ఏం పొరపాటు జరిగిందో నాకూ తెలీదు).

Sriram: Hasn't he fully got over his illness? (అతను జబ్బు నుంచి ఇంకా కోలుకోలేదా?)

Janakiram: I think he has. When I met him last evening he was in the best of health (కోలుకున్నాడనుకుంటా. నిన్న సాయంత్రం నేనతన్ని కలుసుకున్నప్పుడు బాగా కులాసాగానే కనపడ్డాడు).


Sriram: May he continue so until at least his birthday function (ఆ వేడుక జరిగేదాకైనా అతనలా కొనసాగాలని ఆశిస్తున్నా).

Now let us look at these phrasal verbs in detail:

1) slipped his memory – slip one's memory = forget (మరచిపోవడం/ జ్ఞాపకం రాకపోవడం)

a) Hemanth: How come you did not turn up for Seenu's wedding yesterday? (నిన్న శీను పెళ్లికి నువ్వు రాకపోవడం ఎలా జరిగింది?)

Krishnamurthy: He gave the invitation so long ago that it totally slipped from my memory. I am sorry. I will apologise to him (అతను నాకు ఆహ్వాన పత్రిక ఇచ్చి చాలాకాలం అవ్వడంతో నేనది పూర్తిగా మర్చిపోయాను. అందుకు బాధపడుతున్నా. నేనతనికి క్షమాపణ చెబుతా).



b) Kumar: Yesterday was the last date for the submission of our certificates. I did not find Raghav anywhere around (మన సర్టిఫికెట్లు పంపడానికి నిన్న చివరి రోజు. రాఘవ్ నాకెక్కడా కనపడటం లేదు).

Sekhar: It totally slipped from his memory, it seems. He met the officer late in the evening. The officer was kind enough to accept the application and the certificates (అతనది పూర్తిగా మర్చిపోయినట్టున్నాడు. నిన్న సాయంత్రం అతను ఆఫీసర్‌ను కలుసుకున్నాడు. ఆ ఆఫీసర్ చాలా జాలి కలవాడు. అతని దరఖాస్తు, సర్టిఫికెట్లను స్వీకరించడానికి ఒప్పుకున్నాడు).

2. Pass anybody up – general expression: pass somebody up = ignore/forget (పట్టించుకోకపోవడం/ మరచిపోవడం)

a) Kusuma: The lecturer did not ask her colleague to go with us for the picnic (మన లెక్చరర్ తన సహోద్యోగిని పిక్‌నిక్‌కు పిలవడం మరిచిపోయింది).

Sanjana: She does not usually pass anybody up. It must have been by sheer oversight (మామూలుగా తాను ఎవరినీ మరచిపోదు. పొరపాటు అయ్యుండొచ్చు).

b) Prasad: What if he passes you over and asks somebody to carry on the work? (అతను నిన్ను ఉపేక్షించి ఇంకెవరినైనా ఆ పని చేయమంటే ఏమవుతుంది?)

Prakash: I shall be all the happier. It would save me a lot of trouble (నాకది ఇంకా సంతోషంగా ఉంటుంది. నాకు పెద్ద శ్రమ తప్పినట్లు అవుతుంది).

3. To come down with an illness = to suffer from ill health (అనారోగ్యంతో బాధపడటం)

a) Abhiram: You did not attend the party yesterday. What was the reason? (నిన్న పార్టీకి నువ్వెందుకు రాలేదు. కారణమేంటి?)

Aparna: I came down with some serious health trouble. I thought rest would be the best medicine (నాకు ఓ పెద్ద ఆరోగ్య సమస్య వచ్చి పడింది. అందుకని విశ్రాంతి అత్యుత్తమ మార్గమని అనుకుని విశ్రాంతి తీసుకున్నా).

b) Bhaskar: Why didn't he turn up for the class yesterday? (నిన్న అతను తరగతికి ఎందుకు హాజరుకాలేదు?)

Prabhakar: I think he came down with some serious illness two days ago. That could be the reason (అతనికి రెండు రోజుల క్రితం ఓ పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినట్లుంది. అదే కారణమై ఉండొచ్చు).

ఆశలిలా కూలిపోయాయ్..











తడి కళ్లతో... నువ్వు మేము

● బోల్ట్ చివరి రేసులో ఊహించని మలుపు ● పరుగే పూర్తి చేయలేకపోయిన ఉసేన్ ● కన్నీటితో ట్రాక్‌కు వీడ్కోలు ● పరుగులో ముగిసిన మహా ప్రస్థానం

అది లండన్‌లోని అథ్లెటిక్ స్టేడియం. ఐదేళ్ల కిందట ఇదే స్టేడియంలో స్వర్ణాల ట్రిపుల్‌తో సంబరాలు చేసుకున్నాడు ఉసేన్. ఇప్పుడు బోల్ట్ చిట్టచివరి రేసుకూ అదే స్టేడియం వేదికైంది. ఉసేన్ వీడ్కోలు రేసును ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చిన 60 వేల మందితో స్టేడియం నిండిపోయింది. హీట్స్, సెమీస్ తర్వాత శనివారం రాత్రి 9 గంటల 50 నిమిషాలకు (భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 2.20 గంటలు) 4×100 మీ. రిలే ఫైనల్ రేసు మొదలైంది. గన్ పేలగానే మిగతా అథ్లెట్లతో పాటు జమైకా స్ప్రింటర్ ఒమర్ మెక్‌లాడ్ పరుగు మొదలుపెట్టాడు. తర్వాత ఫోర్ట్ బ్యాటన్ అందుకుని పరుగు పూర్తి చేశాడు. అతడి నుంచి బ్లేక్ బ్యాటన్ అందుకుని మెరుపు వేగంతో దూసుకెళ్లాడు. రిలేలో చివరి వాడైన బోల్ట్ కూడా సరిగ్గానే బ్యాటన్ అందుకుని ముందుకు ఉరికాడు. 100 మీటర్ల పరుగు తరహాలోనే ఆరంభంలో వెనుకబడ్డ ఉసేన్.. తర్వాత పుంజుకున్నాడు. ఇక వాళ్లను అధిగమించడం.. గెలుపు గీతను దాటడం.. స్వర్ణ సంబరాలతో తన కెరీర్‌కు వీడ్కోలు పలకడం లాంఛనమే అనుకున్నారంతా!

ఆ క్షణాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తుండగానే.. పెద్ద కుదుపు! బోల్ట్ అడుగు తడబడింది. తొడ కండరాలు పట్టేసి.. బాధతో విలవిలలాడుతూ.. కుంటుతూ.. గెంతుతూ.. పరుగు ఆపేసి ట్రాక్‌పై కూలబడ్డాడు జమైకా చిరుత. వీక్షకుల్లో విజేతలెవరన్న దానిపై ఆసక్తి లేదు. అందరి దృష్టీ బోల్ట్ మీదే. ఎప్పుడూ రేసు అనంతరం సింహనాదాలు చేస్తూ.. నవ్వుతూ.. తుళ్లుతూ.. విచిత్ర విన్యాసాలు చూస్తూ.. సందడి చేసే బోల్ట్.. తన చివరి రేసులో మాత్రం అలా ట్రాక్‌పై కూలబడిపోయి విలవిలలాడుతుంటే.. కన్నీళ్లు పెట్టుకుంటుంటే అభిమానుల గుండె బరువెక్కింది. తర్వాత కొంచెం తేరుకుని.. లేచి నిలబడ్డ చప్పట్లతో అభినందనలు తెలుపుతున్న ప్రేక్షకులకు అభివాదం చేస్తూ.. భారంగా మైదానం నుంచి నిష్క్రమించాడు బోల్ట్.

ఏం వేగం.. ఏం ఆధిపత్యం.. ఏం ఉత్సాహం!

ఆ అసాధారణ వేగాన్ని..

ఆ ఏకఛత్రాధిపత్యాన్ని..

ఆ ఉరకకలెత్తే ఉత్సాహాన్ని..

చివరాఖరుగా ఒక్కసారి తనివి తీరా చూసి ఆస్వాదించాలని..

ఆ జ్ఞాపకాల్ని చిరకాలం పదిలంగా మనసుల్లో దాచుకోవాలని..

పరుగును పండుగలా మార్చి, దశాబ్దం పాటు ఉర్రూతలూగించిన ఆ మహా యోధుడికి ఘనమైన వీడ్కోలు అందించాలని..

అతడి మహా పరుగు ప్రస్థానంలో చివరి మజిలీని చిరస్మరణీయం చేసుకోవాలని..

ఆశించిన క్రీడాభిమానులకు ఊహించని శరాఘాతం!

వారం కిందటి 100 మీటర్ల పరుగులో పసిడి పతకాన్నందుకోలేక అభిమానుల్ని విస్మయానికి గురి చేసిన ఉసేనుడు.. ఈసారి 4×100 మీటర్ల రిలేలో తన వంతు వచ్చేసరికి పరుగైనా పూర్తి చేయలేకపోయాడు!

ప్రత్యర్థులు అందుకోలేని స్థాయిలో పెద్ద పెద్ద అంగలేస్తూ అతడిని ముందంజలో నిలిపే కాళ్లే.. ఈసారి అతడిని వెనక్కి లాగేశాయి.

వెనుకబడ్డ తన ప్రత్యర్థుల వైపు చూస్తూ తన ఆధిపత్యాన్ని చాటిచెప్పే అతడు.. ఈసారి తనను దాటి అందరూ ముందుకెళ్లిపోతుంటే పరుగాపి నిస్సహాయంగా చూస్తుండిపోయాడు.

పరుగు పూర్తి చేసి సింహనాదాలు చేయడం అలవాటైన అతడు.. ఈసారి ట్రాక్ మీద కూలబడి కన్నీళ్లు పెట్టుకున్నాడు.

అతడి ఆధిపత్యాన్ని చూస్తూ జయ జయ ధ్వానాలు చేసే అభిమానులు.. ఈసారి ఓదార్పు వచనాలతో అతడికి నైతిక స్థైర్యాన్నిచ్చే ప్రయత్నం చేశారు.

మొత్తానికి దశాబ్దం పాటు ప్రపంచ వేదికలపై అసాధారణ వేగంతో.. అద్భుత విజయాలతో అందరితోనూ చిరుత.. చిరుత.. అనిపించుకున్నవాడు కాస్తా చివరికి మామూలు మనిషిలాగే నిష్క్రమించాడు.

లండన్

విధి విలాపం అంటే ఇదేనేమో మరి! ప్రపంచ ట్రాక్ అండ్ ఫీల్డ్ చరిత్రలోనే ఏ స్ప్రింటర్‌కూ సాధ్యం కాని అప్రతిహత విజయాలతో.. అద్భుత రికార్డులతో సాగిపోయిన ఉసేన్ బోల్ట్.. తన చిట్ట చివరి అంతర్జాతీయ రేసులో చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నాడు. ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 4×100 మీటర్ల రిలే పరుగులో అతను కనీసం పరుగు కూడా పూర్తి చేయలేకపోయాడు. తొడకండరాలు పట్టేయడంతో మధ్యలోనే పరుగు ఆపేసి ట్రాక్‌పై కూలబడిపోయాడు. దీంతో మెక్‌లాడ్, ఫోర్ట్, బ్లేక్, బోల్ట్‌తో కూడిన జమైకా బృందం ఉత్త చేతులతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 4×100 మీ. రిలే పరుగుల్లో ఎప్పుడూ జమైకాను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించే బోల్ట్.. ఈసారి ఆ జట్టు పతకం కోల్పోవడానికి కారకుడయ్యాడు. వారం కిందట బోల్ట్ తన చివరి వంద మీటర్ల పరుగులో స్వర్ణానికి దూరమై, కాంస్యానికి పరిమితమవ్వడాన్నే జీర్ణించుకోని అభిమానుల్ని.. మొత్తంగా తన కెరీర్లో చివరిదైన పరుగు పందెంలో రేసే పూర్తి చేయలేకపోవడం మరింత నిరాశకు గురి చేసేదే.

అమెరికా కాదు.. బ్రిటన్: బోల్ట్ బృందం స్వర్ణం గెలవకపోవడం అనూహ్యం అంటే.. బ్రిటన్ ఆ పతకాన్ని సొంతం చేసుకోవడం మరో షాక్. జమైకా తర్వాత పసిడి ఫేవరెట్ అయిన అమెరికా (గాట్లిన్-కోల్‌మన్-బాకన్-రోజర్స్) రజతానికి పరిమితంగా కాగా.. బ్రిటన్ జట్టు స్వర్ణం ఎగరేసుకుపోయింది. జపాన్ కాంస్యం సాధించింది.

అంచనాలు తగ్గి..: ట్రాక్‌పై బోల్ట్ ఆధిపత్యం ఎలా ఉంటుందో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. అతను బరిలోకి దిగితే.. ప్రత్యర్థులు స్వర్ణం సంగతి వదిలేసి.. మిగతా పతకాల్ని లక్ష్యంగా చేసుకోవాల్సిందే! 2008 ఒలింపిక్స్ దగ్గర్నుంచి వ్యక్తిగత పరుగైనా, రిలే పరుగైనా అతడికి ఎదురే లేదు. వయసు మీద పడటంతో గత కొన్నేళ్లలో బోల్ట్ వేగం కొంచెం తగ్గింది కానీ.. అతడు వెనుకబడటం మాత్రం జరగలేదు. కానీ మొన్నటి 100 మీ. పరుగులో అనూహ్యంగా కాంస్యానికి పరిమితమైన తీరు అనూహ్యం. అప్పుడే అర్థమైంది.. ఈ బోల్ట్ ఒకప్పటి బోల్ట్ కాదని. ఎప్పుడూ రేసును నెమ్మదిగానే మొదలుపెట్టి.. ఆ తర్వాత అసాధారణ వేగంతో అద్భుతంగా పుంజుకుని ప్రత్యర్థులందరినీ వెనక్కి నెట్టేయడం అలవాటైన బోల్ట్.. వారం కిందట ఆ మ్యాజిక్‌ను పునరావృతం చేయలేకపోయాడు. అతడిలో వేగం, సామర్థ్యం, ఫిట్‌నెస్ తగ్గిన సంగతి స్పష్టంగా కనిపించింది. ఐతే 4×100 రిలే అంటే ఉసేన్ ఒక్కడి మీదే ఆధారపడ్డ పరుగు కాదు కాబట్టి.. పైగా తన చివరి రేసు కాబట్టి సర్వశక్తులూ ఒడ్డి స్వర్ణం సాధించే ప్రయత్నం చేస్తాడని.. కెరీర్‌ను ఘనంగా ముగిస్తాడని ఆశించారు అభిమానులు. కానీ జరిగింది వేరు.




బద్దలవుతాయా?

● 100 మీటర్ల పరుగులో చివరి మూడు ప్రపంచ రికార్డులు బోల్ట్‌వే. 2008లో 9.72 సెకన్లతో అసఫా పావెల్ (9.74 సెకన్లు) రికార్డును తిరగరాసిన బోల్ట్.. అదే ఏడాది బీజింగ్ ఒలింపిక్స్‌లో 9.69 సెకన్లతో మరోసారి ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. 2009 బెర్లిన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 9.58 సెకన్లతో రికార్డును తిరగరాశాడు. ఇప్పట్లో ఈ రికార్డు బద్దలవడం కష్టమే!

● 200 మీటర్ల పరుగులో చివరి రెండు ప్రపంచ రికార్డులు బోల్ట్ పేరిటే ఉన్నాయి. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో 19.30 సెకన్లలో లక్ష్యాన్ని చేరిన బోల్ట్ మైకెల్ జాన్సన్ (అమెరికా) పేరిట ఉన్న పన్నెండేళ్ల రికార్డు (19.32 సెకన్లు)ను తిరగరాశాడు. బెర్లిన్‌లో బోల్ట్ 200 మీటర్ల పరుగును 19.19 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. మరికొన్నేళ్లు ఈ రికార్డుకు ఎలాంటి ఢోకా ఉండకపోవచ్చు.

బోల్ట్‌ను ఓడించిన వీరులు

2008 తర్వాత బోల్ట్ ఒకేఒక్కసారి 200 మీటర్ల పరుగులో ఓడిపోయాడు. 2012 జమైకా జాతీయ ఛాంపియన్‌షిప్‌లో యోహాన్ బ్లేక్.. బోల్ట్‌పై విజయం సాధించాడు. అదే టోర్నీ 100 మీటర్ల పరుగులో కూడా ఉసేన్‌పై బ్లేక్ నెగ్గాడు. అతడు గాక మరో నలుగురు మాత్రమే 100 మీటర్ల పరుగులో బోల్ట్‌ను వెనక్కి నెట్టారు. ఆ నలుగురిలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్‌ను కాంస్యానికి పరిమితం చేసిన గాట్లిన్ (అమెరికా), కోల్‌మన్ (అమెరికా)లు ఇద్దరు కాగా.. గతంలో అసఫా పావెల్ (జమైకా), టైసన్ గే (అమెరికా) బోల్ట్‌కు ఓటమి రుచిచూపించారు.



అతడు లేని ట్రాక్



ఈనాడు క్రీడావిభాగం

అతడు సాధించని విజయాలా..? అతడు గెలవని పతకాలా..? అతను బద్దలు కొట్టని రికార్డులా..? వారం కిందట 100 మీటర్ల పరుగులో ఓ స్వర్ణం.. ఇప్పుడు 4×100 మీటర్ల రిలే పరుగులో ఓ స్వర్ణం సాధించేస్తే ఏమయ్యేది? ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఉసేన్ బోల్ట్ ఇప్పటికే సాధించిన 11 స్వర్ణాలకు ఇంకో రెండు కలిసేవి! అంతమాత్రాన బోల్ట్ గొప్పదనం పెరిగిపోతుందా..? ఇప్పుడు రెండు రేసుల్లోనూ విఫలమయ్యాడు కాబట్టి అతడి గొప్పదనం తగ్గిపోతుందా..?

బోల్ట్ గొప్పదనాన్ని పతకాలతో కొలిచే దశ ఎప్పుడో దాటిపోయింది. అతను దిగ్గజాలకే దిగ్గజంగా మారి చాలా కాలమే అయింది. ఇప్పుడు అతను కొత్తగా రుజువు చేసుకోవాల్సిందేమీ లేదు. ప్రస్తుత ప్రదర్శన అతడి గొప్పదనాన్ని ఇసుమంతైనా తగ్గించదు! అతడిపై క్రీడా ప్రేమికుల గౌరవాభిమానాల్లో లేశమాత్రమైనా తేడా ఉండదు! తన చివరి రేసుల్లో బోల్ట్ ఎలాంటి ప్రదర్శన చేస్తే ఏంటి..? అతను ట్రాక్ నుంచి నిష్క్రమిస్తుండటమే ఇప్పుడు చర్చనీయాంశం! అదే ఇప్పుడు ప్రపంచ క్రీడా ప్రియులందరినీ భారంగా మార్చేస్తున్న విషయం!

కేవలం విజయాలు మాత్రమే బోల్ట్‌ను గొప్పవాడిని చేసేశాయా? అలా చూస్తే ఒలింపిక్స్ సహా ఎన్నో ప్రపంచ స్థాయి క్రీడల్లో తిరుగులేని విజయాలు సాధించిన, పతకాల పంట పండించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. అమెరికా స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ సంగతే చూస్తే.. అతను ఏకంగా 28 ఒలింపిక్ పతకాలు కొల్లగొట్టాడు. అందులో 23 స్వర్ణాలే. ఇక్కడ ఫెల్ప్స్ గొప్పదనాన్ని తగ్గించడం కాదు కానీ.. ఇన్ని ఘనతలున్నప్పటికీ క్రీడా ప్రపంచం బోల్ట్‌ను అభిమానించినంతగా.. ఆరాధించినట్లుగా అతణ్ని అభిమానించదు, ఆరాధించదు. ఫెల్ప్స్ అనే కాదు.. ఎంతోమంది దిగ్గజ క్రీడాకారులు అతడి ముందు తక్కువగానే అనిపిస్తారు. ఒక పీలే.. ఒక మహ్మద్ అలీ.. ఒక బ్రాడ్‌మన్.. ఇలా తాము ఆడే ఆటను దాటి.. మొత్తంగా క్రీడా రంగానికే తలమానికంగా నిలిచిన క్రీడాకారుల జాబితాలో నిలుస్తాడు ఉసేన్. పరుగులో తన నైపుణ్యంతో మాత్రమే కాదు.. ఇంకా అనేక రకాలుగా ప్రత్యేకత చాటుకున్నాడు పైన చెప్పుకున్న దిగ్గజాల్లాగే అతను కూడా తన క్రీడలో 'ఒకే ఒక్కడు'.

బోల్ట్ అంటే కేవలం పరుగు మాత్రమే కాదు.. వినోదం.. ఉత్సాహం.. స్వచ్ఛత.. ఇంకా అనేక అంశాల కలబోత! పది క్షణాల్లో ముగిసే పరుగును పదుల కోట్ల మంది ఊపిరి బిగబట్టి చూసేలా.. దాని కోసం ఉత్కంఠగా ఎదురు చూసేలా.. దాని గురించి కథలు కథలుగా చెప్పుకునేలా చేసిన ఘనత అతడిది. చరిత్రలో ఎందరో పరుగు వీరులున్నారు. కానీ బోల్ట్‌లా పరుగుకు ఆకర్షణ, ఆదరణ తెచ్చిన స్ప్రింటర్ మాత్రం మరొకరు లేరు. సోమరిలా పరుగు ఆరంభించడం.. తర్వాత అద్భుతంగా పుంజుకోవడం.. గెలుపు గీత ముంగిట వెనుకబడ్డ ప్రత్యర్థుల్ని చూడటం.. ఛాతీపై గుద్దుకుంటూ సింహనాదాలు చేయడం.. ట్రాక్ నృత్యాలు చేయడం.. 'మెరుపు'ను తలపించే విన్యాసం పెట్టడం.. ఇంకా ఒకటేమిటి.. బోల్ట్ ఏం చేసినా ప్రత్యేకమే. నయనానందకరమే! పరుగును ఒక పండుగలా మార్చి.. కొత్తగా కోట్లాదిమందిని అథ్లెటిక్స్‌కు అభిమానులుగా మార్చిన ఘనుడు ఉసేన్. డోపింగ్ మయమైన స్ప్రింట్ చరిత్రలో బోల్ట్ ఒక మేలిమి ముత్యం! ఉసేన్ స్వచ్ఛత అతడి ఘనతలకు మరింత సొబగులద్దేదే! అతడి గొప్పదనాన్ని మరెన్నో రెట్లు పెంచేదే. ఇంత స్వచ్ఛంగా ఉంటూ అన్ని ఘనతలు సాధించడం మామూలు విషయం కాదు. మామూలుగా ఒక క్రీడాకారుడు గెలిస్తే వార్త. కానీ బోల్ట్ ఓడితే అదే పెద్ద వార్త! ఇంతటి ఆధిపత్యం ఇంకో స్ప్రింటర్‌కు సాధ్యమా? ట్రాక్‌పై బోల్ట్ ఘనతల్ని, అతడి రికార్డుల్ని అందుకోవడమే అసాధ్యమంటే.. అతడిలా మరో స్ప్రింటర్ ఆకర్షణ, ఆదరణ సంపాదించుకోవడం అంటే అది కలే!

తొమ్మిదేళ్ల కిందట బీజింగ్ ఒలింపిక్స్‌లో తన అసమాన వేగంతో ట్రాక్‌పై ప్రకంపనలు రేపుతూ.. ప్రపంచాన్ని ఊపేస్తూ.. ఒకటికి రెండు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టి మరీ స్వర్ణాలు సాధించిన రోజే బోల్ట్ దిగ్గజం అయిపోయాడు. ఆ వెంటనే వచ్చిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మళ్లీ రికార్డులు బద్దలు కొడుతూ పసిడి పతకాలు ఎగరేసుకుపోయినప్పుడే ఎవ్వరూ అందుకోలేని స్థాయికి చేరిపోయాడు. ఇక ఆ తర్వాత అతను సాధించిన పతకాలు, రికార్డుల విలువ కట్టడం ఎప్పుడో మానేశారు క్రీడా ప్రియులు. కేవలం బోల్ట్ పరుగును ఆస్వాదించడం మీదే అందరి దృష్టి. ఒలింపిక్స్ వచ్చినా, అథ్లెటిక్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ వచ్చినా అందరి కళ్లూ అతడి మీదే! ఆకర్షణ మొత్తం అతడి పరుగు చుట్టూనే! ఐతే బోల్ట్ నిష్క్రమణ నేపథ్యంలో ఇక ముందు ఈ పరుగు పోటీలు ఏమాత్రం జనాల్ని ఆకర్షిస్తాయన్నది సందేహం. బోల్ట్ లేని లోటు జనాల్ని ఎంతగా మెలిపెడుతుందో అంచనా వేయలేం! ఐతే ఎలాంటి మహా ప్రస్థానానికైనా ఏదో ఒక దశలో తెరపడాల్సిందే. దేన్నికైనా ఒక ముగింపు ఉండాల్సిందే. తన విజయాలకు మాత్రమే అలవాటు పడ్డ అభిమానులకు.. తాను కూడా ఓడుతానని తన చివరి రేసుల్లో చూపించడం ద్వారా ఒక రకంగా భవిష్యత్ బాధను కొంత మేర తగ్గించాడు ఉసేన్. బోల్ట్ గెలిచి నిష్క్రమించి ఉంటే.. అతను ఇంకా కొనసాగాల్సిందన్న భావన కలిగేది. విఫలమయ్యాడు కాబట్టి నిష్క్రమణ సరైందే అన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైంది. తనలో చేవ తగ్గిందని గుర్తించి, సరైన సమయంలో నిష్క్రమణ నిర్ణయం తీసుకోవడం బోల్ట్‌లోని పరిణతికి నిదర్శనం! ఐతే బోల్ట్ ఏ తీరులో నిష్క్రమించినప్పటికీ.. అతను ఒక దిగ్గజంగానే గుర్తుండిపోతాడు! పరుగుపై అతడి ముద్ర చిరకాలం నిలిచిపోతుంది!

యువరాజ్ కథ ముగిసె!

- లంకతో వన్డేలకు దక్కని చోటు
- దినేశ్ కార్తీక్‌పైనా వేటు
- మనీశ్ పాండే పునరాగమనం

దిల్లీ: అనుకున్నదే అయింది. యువరాజ్ సింగ్‌పై వేటు పడింది. మూడేళ్ల విరామం తర్వాత.. లేక లేక ఈ ఏడాది ఆరంభంలో భారత వన్డే జట్టులో మళ్లీ చోటు దక్కించుకున్న యువీ.. తన స్థానాన్ని ఎంతో కాలం నిలుపుకోలేకపోయాడు. శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌కు అతణ్ని జట్టు నుంచి తప్పించారు. చివరగా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడిన యువీ.. అందులో విఫలమయ్యాడు. దీనికి తోడు 2019 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని కుర్రాళ్లకు ప్రాధాన్యమివ్వాలన్న డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో యువీపై వేటు వేసింది ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోనే సీనియర్ సెలక్షన్ కమిటీ. ఇప్పటికే యువీ 36వ పడికి చేరువవుతున్న నేపథ్యంలో భారత్ ప్రపంచకప్ ప్రణాళికల్లో అతడు లేనట్లే. అతడి కెరీర్‌కు దాదాపుగా తెరపడినట్లే అని కూడా భావిస్తున్నారు. ఐతే యువీ కంటే వయసులో పెద్దవాడైన ధోనిని మాత్రం సెలక్టర్లు కొనసాగించారు. వెస్టిండీస్ సిరీస్‌లో ఆడిన మరో సీనియర్ ఆటగాడు దినేశ్ కార్తీక్ పైనా వేటు పడింది. వెస్టిండీస్ పర్యటనకు ఎంపికైనా మ్యాచ్ ఆడే అవకాశం దక్కని యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌ను ఈ సిరీస్‌కు సెలక్టర్లు ఎంపిక చేయలేదు. గాయంతో ఛాంపియన్స్ ట్రోఫీ, వెస్టిండీస్ సిరీస్‌లకు దూరమైన మనీష్ పాండే పునరాగమనం చేశాడు. చాహల్, శార్దూల్ ఠాకూర్‌లకు మరో అవకాశం దక్కింది. లంకతో చివరి టెస్టుకు అందుబాటులోకి వచ్చిన అక్షర్ పటేల్‌ను వన్డేలకూ కొనసాగించారు సెలక్టర్లు. మూడో టెస్టులో సత్తా చాటుతున్న కుల్‌దీప్ యాదవ్ కూడా వన్డేల్లో కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌కు జడేజా, అశ్విన్‌లకు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. లంకతో భారత్ ఐదు వన్డేల సిరీస్ ఈ నెల 20న మొదలవుతుంది. దాని తర్వాత ఓ టీ20 కూడా జరుగుతుంది.

జట్టు: కోహ్లి (కెప్టెన్), ధావన్, రాహుల్, రోహిత్, ధోని, కేదార్ జాదవ్, మనీష్ పాండే, పాండ్య, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, చాహల్, భువనేశ్వర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, రహానె



ఛాంపియన్

ధనాధన్ హార్దిక్

● భారత్ 487 ● విజృంభించిన కుల్‌దీప్ ● 135కే కుప్పకూలిన శ్రీలంక

పల్లెకెలె కూడా మనదే. టీమ్ఇండియా సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడం ఇక లాంఛనమే. మూడో టెస్టులో లంక పరాజయాన్ని ఆపడం అద్భుతాలకూ కష్టమే. భారత్‌ను కట్టడి చేయొచ్చన్న ఆశతో రెండో రోజును ఆరంభించిన శ్రీలంకను కళ్లు చెదిరే శతకంతో హార్దిక్ పాండ్య దెబ్బతీస్తే.. బంతితో చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ ఆ జట్టు వెన్ను విరిచాడు. 135కే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడ్డ శ్రీలంక పరాభవానికి ఎదురీదుతోంది. ఇప్పుడు ప్రశ్న భారత్ గెలుస్తుందా లేదా అన్నది కాదు.. ఎప్పుడు, ఎంత తేడాతో గెలుస్తుందన్నది! పడగొట్టాల్సిందిక 9 వికెట్లే.

పల్లెకెలె

శ్రీలంకపై తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోన్న భారత్.. రెండో టెస్టుపై పట్టు బిగించేసింది. మరో ఘనవిజయం ముంగిట నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 329/6తో రెండో రోజు, ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. హార్దిక్ పాండ్య (108; 96 బంతుల్లో 8×4, 7×6) ధనాధన్ బ్యాటింగ్‌తో 487 పరుగులు సాధించింది. సండకాన్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం కుల్‌దీప్ యాదవ్ (4/40), షమి (2/17), అశ్విన్ (2/22) విజృంభించడంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలి ఫాలో ఆన్‌లో పడింది. 352 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన లంక.. ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. భారత్‌ను మళ్లీ బ్యాటింగ్‌కు దించాలంటే లంక ఇంకా 333 పరుగులు చేయాలి.


కుల్‌దీప్ మాయలో..: ముందు కొండంత స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక.. కుల్‌దీప్ మాయకు ఉక్కిరిబిక్కిరైంది. కెరీర్‌లో రెండో టెస్టు ఆడుతున్న కుల్‌దీప్.. రెండోసారి నాలుగు వికెట్ల ఘనత సాధించాడు. ఐతే ఓపెనర్లిద్దరినీ ఔట్ చేసి భారత్‌కు మంచి ఆరంభాన్నిచ్చింది మాత్రం పేస్ బౌలర్ షమినే. బౌన్స్‌ను ఉపయోగించుకున్న షమి మూడో ఓవర్లో తరంగను ఔట్ చేయడం ద్వారా లంక పతనాన్ని ఆరంభించాడు. తన తర్వాతి ఓవర్లో కరుణరత్నెను వెనక్కి పంపాడు. చండిమాల్‌తో సమన్వయ లోపంతో కుశాల్ మెండిస్ (18) రనౌట్ కాగా.. మాథ్యూస్‌ను పాండ్య వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. పదో ఓవర్లో లంక 38/4తో నిలిచింది. ఐతే చండిమాల్, డిక్వెలా నిలబడడంతో కాసేపు వికెట్ల పతనానికి అడ్డుకట్టపడింది. స్కోరు 100 దాటింది. ఐతే కుల్‌దీప్ విజృంభించడంతో లంక 34 పరుగులకే చివరి ఆరు వికెట్లు చేజార్చుకుని ఫాలో ఆన్‌లో పడింది. కుల్‌దీప్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి డిక్వెలా (29) స్టంప్ కావడంతో 63 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ఏదశలోనూ పతనం ఆగలేదు. దిల్రువన్ పెరీరా ఖాతా అయినా తెరవకుండానే కుల్‌దీప్ బౌలింగ్‌లో పాండ్యకు క్యాచ్ ఇచ్చాడు. అర్ధశతకానికి చేరువలో చండిమాల్ (48; 87 బంతుల్లో 6×4) అశ్విన్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు.

పాండ్య అదరహో..: భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది అంటే ప్రధాన కారణం హార్దిక్ పాండ్యనే. రెండో రోజు అతడి ఆటే హైలైట్. ఓవర్‌నైట్ స్కోరు 329/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాహా (16) వికెట్‌ను చేజార్చుకుంది. ఐతే క్రీజులో మొండిగా నిలిచిన కుల్‌దీప్.. పాండ్యకు చక్కని సహకారాన్నిచ్చాడు. కుల్‌దీప్‌తో ఎనిమిదో వికెట్‌కు పాండ్య 62 పరుగులు జోడించాడు. ఇన్నింగ్స్ 110వ ఓవర్లో జట్టు స్కోరును 400 దాటించాడు. శ్రీలంక గడ్డపై వరుసగా మూడు టెస్టుల్లో 400పై స్కోర్లు సాధించిన తొలి జట్టుగా భారత్ ఘనత సాధించింది. వెంటనే కుల్‌దీప్ ఔటైనా.. పాండ్య జోరు పెరిగిందే తప్ప తగ్గలేదు. షమితో కలిసి 20 పరుగులు జోడించాడు. గేర్ మార్చి భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. షమి నిష్క్రమణ తర్వాత.. ఉమేశ్ యాదవ్ (3 నాటౌట్)తో కలిసి పాండ్య కేవలం 26 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యం పూర్తి చేయడం విశేషం. ధాటిని కొనసాగించిన పాండ్య 86 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అతడి రెండో అర్ధశతకం 25 బంతుల్లోనే రావడం విశేషం. చివరికి సండకాన్ బౌలింగ్‌లో పాండ్య వెనుదిరగడంతో 66 పరుగుల పదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.



ఆల్‌రౌండర్ కోసం మా నిరీక్షణ హార్దిక్ రూపంలో ఫలించింది. పరిమిత ఓవర్ల క్రికెట్లో అతడు బాగా నిలదొక్కుకున్నాడు. టెస్టు క్రికెట్లో కూడా నిలదొక్కుకునేందుకు ఈ సిరీస్ అతడికి మంచి వేదికలా నిలిచింది. అవకాశాన్ని అతడు పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. అతడు ఇలాగే ఒద్దిగ్గా ఉంటే భవిష్యత్తులో అతణ్ని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్‌తో పోలుస్తారు"

–ఎమ్మెస్కే ప్రసాద్, ముఖ్య సెలక్టర్



హార్దిక్ పాండ్య (108)

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (సి) చండిమాల్ (బి) పుష్పకుమార 119; రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85; పుజారా (సి) మాథ్యూస్ (బి) సండకాన్ 8; కోహ్లి (సి) కరుణరత్నె (బి) సండకాన్ 42; రహానె (బి) పుష్పకుమార 17; అశ్విన్ (సి) డిక్వెలా (బి) ఫెర్నాండో 31; సాహా (సి) పెరీరా (బి) ఫెర్నాండో 16; హార్దిక్ పాండ్య (సి) పెరీరా (బి) సండకాన్ 108; కుల్‌దీప్ యాదవ్ (సి) డిక్వెలా (బి) సండకాన్ 26; షమి (సి) అండ్ (బి) సండకాన్ 8; ఉమేశ్ యాదవ్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 24 **మొత్తం:** (122.3 ఓవర్లలో ఆలౌట్) **487; వికెట్ల పతనం:** 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322, 7-339, 8-401, 9-421

బౌలింగ్: ఫెర్నాండో 26-3-87-2; లహిరు కుమార 23-1-104-0; కరుణరత్నె 7-0-30-0; పెరీరా 8-1-36-0; సండకాన్ 35.3-4-132-5; పుష్పకుమార 23-2-82-3

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నె (సి) సాహా (బి) షమి 4; తరంగ (సి) సాహా (బి) షమి 5; మెండిస్ రనౌట్ 18; చండిమాల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 48; మాథ్యూస్ ఎల్బీ (బి) పాండ్య 0; డిక్వెలా (స్టంప్డ్) సాహా (బి) కుల్‌దీప్ 29; దిల్రువన్ (సి) పాండ్య (బి) కుల్‌దీప్ యాదవ్ 0; పుష్పకుమార (బి) కుల్‌దీప్ యాదవ్ 10; సండకాన్ (సి) ధావన్ (బి) అశ్విన్ 10; ఫెర్నాండో (బి) కుల్‌దీప్ యాదవ్ 0; లహిరు కుమార నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (37.4 ఓవర్లలో ఆలౌట్) **135; వికెట్ల పతనం:** 1-14, 2-23, 3-38, 4-38, 5-101, 6-107, 7-125, 8-125, 9-135

బౌలింగ్: షమి 6.5-1-17-2; ఉమేశ్ యాదవ్ 3.1-0-23-0; హార్దిక్ పాండ్య 6-1-28-1; కుల్‌దీప్ యాదవ్ 13-2-40-4; అశ్విన్ 8.4-2-22-2

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: 19/1

సరైనోడు దొరికాడు

ఈనాడు క్రీడావిభాగం

కొన్ని రోజుల కింద పాండ్య.. మరో బెన్ స్టోక్స్ అవుతాడని కెప్టెన్ కోహ్లి అంటే అతడు మరీ ఎక్కువగా అంచనా వేస్తున్నాడేమోనన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ అరంగేట్ర టెస్టులోనే మెరుపు అర్ధశతకంతో అతడు అందరినీ ఆలోచనలో పడేశాడు. ఇప్పుడు పల్లెకెలెలో కళ్లు చెదిరే శతకంతో తనలోని ప్రతిభను ఘనంగా చాటి చెప్పాడు. కోహ్లిది గుడ్డి నమ్మకం కాదని తేల్చేశాడు. ఇప్పుడు అందరి చర్చా అతడి గురించే! ఓ నిఖార్సైన పేస్ ఆల్‌రౌండర్ కోసం భారత్ ఎదురుచూపులకు ఎట్టకేలకు తెరపడినట్లేనని భావిస్తున్నారు! చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ సహా అనేక మంది భారత క్రికెట్‌కు మరో కపిల్ దేవ్ దొరికినట్లేనని అంటున్నారు. శ్రీలంకను మామూలుగా ఉతికేశాడా హార్దిక్ మరి!

పల్లెకెలెలో పాండ్య ఇన్నింగ్స్ చూసిన వారెవరైనా మెచ్చుకోకుండా ఉండలేరు. కళ్లు చెదిరే షాట్లతో అంత గొప్పగా అలరించాడు అతడు. అలవోకగా సిక్సర్లు కొడుతూ అభిమానులను మంత్ర ముగ్ధుల్ని చేశాడు. టీ20 శైలిలో చెలరేగి శతకం సాధించాడు. భారత్.. 322/తో (ఓవర్‌నైట్ 329/6) ఉన్నప్పుడు క్రీజులో అడుగుపెట్టాడు పాండ్య. రెండో రోజు జట్టు స్కోరు 400 దాటడం కష్టమే అనిపించింది. మరోవైపు జడేజా కూడా లేడాయె. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ సాహా కూడా కొద్దిసేపటికే వెనుదిరిగాడు. ఈ దశలో కుల్‌దీప్‌తో కలిసి జాగ్రత్తగా ఇన్నింగ్స్ నిర్మించిన పాండ్య. చివరి ఇద్దరు బ్యాట్స్‌మన్‌ను క్రీజులో పెట్టుకుని చెలరేగిపోయాడు. సింగిల్స్ తీసే అవకాశమున్నా వదిలేస్తూ, అవతలి బ్యాట్స్‌మన్‌ను కాపాడుకుంటూ విధ్వంసం సృష్టించాడు. ఓ దశలో 54 బంతుల్లో 38 పరుగులతో ఉన్న అతడు.. 96 బంతుల్లో 108 పరుగులతో ఇన్నింగ్స్‌ను ముగించడం విశేషం. కుల్‌దీప్ యాదవ్‌తో కలిసి విలువైన భాగస్వామ్యంతో జట్టును స్కోరును 400 దాటించిన పాండ్య.. అతడు ఔటయ్యాక అమాంతం రెచ్చిపోయాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఐతే అతడు ఏ షాటూ గుడ్డిగా కొట్టలేదు. తన మెరుపు ఇన్నింగ్స్‌లో ప్రతి షాట్‌నూ నియంత్రణతోనే ఆడాడు. ఐపీఎల్ అనుభవాన్ని సద్వినియోగం చేస్తూ అలవోకగా సిక్సర్లు బాదేశాడు. ఐతే ఇంత విధ్వంసం సృష్టించినా అతడు చాలా ప్రశాంతంగానే కనిపించాడు. సండకాన్ దూరంగా బంతు లేస్తూ డ్రాగ్ చేసేలా ఉసికొల్పినా.. తొందరపడకుండా వదిలేశాడు. అతడి ధాటిని అడ్డుకోవడానికి లంక కెప్టెన్ చండిమాల్ ఓ దశలో బౌండరీ దగ్గర ఏకంగా 9 మంది ఫీల్డర్లను పెట్టాడు. ఐతే తన టెక్నిక్‌పై సంపూర్ణ విశ్వాసమున్న పాండ్య.. ఫీల్డర్లు ఎక్కడున్నా లక్ష్య పెట్టలేదు. తన ఆట తాను ఆడేశాడు. బంతిని అలవోకగా స్టాండ్స్‌లోకి పంపాడు. కేవలం 86 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. భారత్‌ను దాదాపు ఐదొందల పరుగులకు చేరువ చేసిన పాండ్య.. లంక తొలి ఇన్నింగ్స్‌లో బంతితోనూ రాణించాడు. కీలకమైన మాథ్యూస్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

ఒక్క ఓవర్లో 4 4 6 6 6 0: పాండ్య ఊచకోతకు ఎక్కువ బలైంది పుష్పకుమారనే. ఇన్నింగ్స్ 116వ ఓవర్లో అతడు బౌలింగ్‌లో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ పాండ్య ఏకంగా 26 పరుగులు రాబట్టాడు. టెస్టుల్లో ఒక ఓవర్లో ఓ భారత బ్యాట్స్‌మన్ సాధించిన అత్యధిక స్కోరిదే. స్లాగ్ స్వీప్ బౌండరీతో దాడిని మొదలెట్టిన పాండ్య.. ముందుకొచ్చి మరో ఫోర్ కొట్టాడు. తర్వాత వరుసగా మూడు సిక్స్‌లు బాదాడు. అందులో ఒకటి సైట్ స్క్రీన్‌కు రంధ్రం చేసింది. కపిల్ దేవ్, ధోని తర్వాత టెస్టుల్లో వరుసగా మూడు సిక్స్‌లు కొట్టిన భారత ఆటగాడిగా పాండ్య ఘనత సాధించాడు.



నీకెర్క్

వారసుడెవరు?

ప్రపంచ అథ్లెటిక్స్‌లో పదేళ్ల పాటు బోల్ట్‌దే ఏకఛత్రాధిపత్యం. ఈ దశాబ్దంలో అతడికి పోటీగా నిలిచే అథ్లెటే కనిపించలేదు. ఇప్పుడు అతడి కెరీర్ ముగిసిపోయింది. మరి అతడిలా 100 మీ. 200మీ. విభాగాలను శాసించే అథ్లెట్ ఎవరు..? మరో బోల్ట్ ఎవరు..? దీనికి సమాధానం లేదనే చెప్పొచ్చు! బోల్ట్‌లా స్ప్రింట్‌ను శాసించే అథ్లెట్ ప్రస్తుతానికైతే లేడు! సమీప భవిష్యత్‌లో అతడిలా తయారయ్యే అథ్లెట్ కూడా కనిపించడం లేదు. ఐతే వర్ధమాన తారల్లో దక్షిణాఫ్రికా స్ప్రింటర్ వేడ్ వాన్ నీకెర్క్, ఆండ్రూ డిగ్రాస్ (కెనడా) ముందున్నారు. అథ్లెటిక్స్‌లో సూపర్‌స్టార్ అయ్యే లక్షణాలు నీకెర్క్‌లో ఉన్నాయని బోల్ట్ కూడా కితాబిచ్చాడు. నిరుడు రియో ఒలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డుతో పాటు స్వర్ణం ఎగరేసుకుపోయిన నీకెర్క్.. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణం నెగ్గాడు. ఐతే అతడు 100మీ. 200మీ. పరుగులో ప్రదర్శన అంత గొప్పగా ఏమీ లేదు. కెనడా అథ్లెట్ ఆండ్రీ డిగ్రాస్ గొప్పగా రాణిస్తున్నాడు. రియోలో 200మీ. రజతం, 100మీ. కాంస్యం నెగ్గిన ఈ కుర్రాడు టోక్యో ఒలింపిక్స్ స్ప్రింట్ విభాగాలను శాసించే అవకాశం లేకపోలేదు.

తర్వాత ఏంటి?: ఉసేన్ బోల్ట్ కెరీర్ ముగిసిపోయింది. పన్నెండేళ్ల వయసు నుంచి పరుగునే ప్రాణంగా చేసుకున్న జమైకా పరుగుల వీరుడు కెరీర్‌లో చివరి రేసును ముగించేశాడు. మరి తర్వాత ఏంటి..? ఇక బోల్ట్ ఏం చేయనున్నాడు! ఈ ప్రశ్నకు ఇప్పుడిప్పుడే సమాధానం లభించకపోవచ్చు. పదిహేనేళ్లుగా నిత్యం సాధన చేస్తూ.. కఠిన ఆహార నియమాలను పాటిస్తూ.. పరుగుకు పూర్తిగా అంకితమైపోయిన బోల్ట్ ఇప్పుడు జీవితాన్ని ఆస్వాదించాలనే లక్ష్యంతో ఉన్నాడు. "ఇక నేను నా ఇష్టమొచ్చినట్లు జీవించొచ్చు. శిక్షణ ఉండదు. ఆహార నియమాలుండవ్. ఓ సాధారణ మనిషిలా జీవించడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ఇక ఎప్పుడు, ఎక్కడికి వెళ్లాలన్నా నేను వెళ్లగలను. జీవితాన్ని అనుభవించే అవకాశం నాకు లభించింది" అని అంటున్నాడు బోల్ట్. ప్రస్తుతానికైతే పరుగుకు అతడు వీడ్కోలు పలికాడు. ఐతే అథ్లెటిక్స్‌లో అతడు కొనసాగే అవకాశం లేకపోలేదు! బోల్ట్‌కు లాంగ్ జంప్ అంటే చాలా ఇష్టం. 2009లో స్ప్రింటర్‌గా అద్భుత ఫామ్‌లో ఉన్నప్పుడే బోల్ట్ లాంగ్‌జంప్ కెరీర్ గురించి ఆలోచించాడు. పరుగుకు ఇబ్బందికాకూడదన్న ఉద్దేశంతో అప్పుడు ఆ ఆలోచనను విరమించుకున్నాడు. అథ్లెట్‌గా కెరీర్‌ను కొనసాగించేందుకు అతడి ముందున్న గొప్ప ప్రత్యామ్నాయం లాంగ్ జంప్. జూన్‌లో ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ లీగ్ సందర్భంగా సరదాగా బోల్ట్ లాంగ్‌జంప్ చేశాడు. మరి ఆ క్రీడాంశాన్నే అతడు కెరీర్‌గా చేసుకుంటాడేమో చూడాలి. దిగ్గజ అథ్లెట్ కార్ల్ లూయిస్‌లా స్ప్రింట్‌తో పాటు లాంగ్‌జంప్‌లోను అదరగొట్టే అవకాశం బోల్ట్ ముందుంది!



మో ఫరా ముగించేశాడు

లండన్: అథ్లెటిక్స్ ట్రాక్ కెరీర్‌కు సుదీర్ఘ పరుగుల వీరుడు మో ఫరా కూడా వీడ్కోలు పలికాడు. ఉసేన్ బోల్ట్‌లానే అతడూ కెరీర్ ఆఖరి రేసులో స్వర్ణం సాధించడంలో విఫలమయ్యాడు. 5000 మీటర్ల పరుగులో మో ఫరా రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇథియోపియాకు చెందిన ముక్తార్ ఎడ్రిస్ (13 నిమిషాల 32.79 సెకన్ల)లో రేసు ముగించి అగ్రస్థానం దక్కించుకోగా.. బ్రిటన్ అథ్లెట్ మో ఫరా (13:33.22) రెండో స్థానానికి పరిమితమయ్యాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 10000 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించిన మో ఫరా.. ఈ రేసులోనే స్వర్ణం సాధిస్తే అరుదైన డబుల్ సాధించేవాడు. గతంలో రెండేసిసార్లు ప్రపంచ అథ్లెటిక్స్, ఒలింపిక్స్‌లో మో ఫరా డబుల్ సాధించాడు. ట్రాక్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన మో ఫరా మారథాన్‌పై దృష్టి సారించనున్నాడు.

పట్నా 27 - యూపీ 27

పైరేట్స్, యోధ మధ్య మ్యాచ్ టై

అహ్మదాబాద్: ప్రొకబడ్డీలో మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఆదివారం పట్నా పైరేట్స్, యూపీ యోధ మధ్య ఆఖరి నిమిషం వరకు నువ్వానేనా అన్నట్టుగా సాగిన మ్యాచ్ 27-27 స్కోర్‌తో టైగా ముగిసింది. ప్రథమార్ధం ముగిసేసరికి 13-10తో యోధ ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ ఆధిపత్యం కొనసాగించిన యోధ జట్టు మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా 25-17తో ఆధిక్యంలో ఉంది. ఈ దశలో ఆ జట్టు విజయం తేలికే అనిపించింది. ఐతే పర్దీప్ నర్వాల్ చెలరేగి ఆడటంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఒకే నిమిషంలో మూడు రెయిడ్ పాయింట్లు సొంతం చేసుకుని యూపీ ఆధిక్యాన్ని తగ్గించిన నర్వాల్ మ్యాచ్ ఆఖరి రెండు నిమిషాల్లో మరో రెండు పాయింట్లు నెగ్గాడు. 26-27తో పట్నా వెనకబడిన దశలో రెయిడ్‌కు వెళ్లిన పర్దీప్ ఒక పాయింటు సాధించడంతో మ్యాచ్ టైగా ముగిసింది. మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 27-20తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. సచిన్ 7 రెయిడ్ పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.



యూపీ - పట్నా మ్యాచ్‌లో ఓ దృశ్యం


● కంగా విఫలం



లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జావెలిన్ త్రో ఫైనల్ చేరిన భారత తొలి అథ్లెట్‌గా ఘనత సాధించిన దవీందర్ సింగ్ కంగా తుది పోరులో విఫలమయ్యాడు. ఫైనల్లో జావెలిన్‌ను 80.02 మీటర్లు మాత్రమే విసిరిన అతడు 12వ స్థానంలో నిలిచాడు. జర్మనీకి చెందిన జొహానెస్ వెటెర్ (89.89 మీటర్లు) స్వర్ణం నెగ్గాడు.

● మైరాజ్-రష్మీకి స్వర్ణం

అస్తానా: ఆసియా షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణంతో ముగించింది. స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో మైరాజ్ అహ్మద్ ఖాన్, రష్మీ రాథోడ్ జోడీ విజేతగా నిలిచింది. పసిడి కోసం జరిగిన పోరులో భారత జంట 28-27తో లియూ జియాంగ్‌చి, గావో జిమాన్మై (చైనా) జోడీని ఓడించింది. ఈ టోర్నీలో భారత్ మొత్తం ఎనిమిది పతకాలు సొంతం చేసుకుంది.



ఫైనల్లో ఫెదరర్

మాంట్రియల్: ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. శనివారం సెమీఫైనల్లో ఫెదరర్ 6-3, 7-6 (5) తో నెదర్లాండ్స్ ఆటగాడు రాబిన్ హాసిపై విజయం సాధించాడు. వరుసగా 16 మ్యాచ్‌ల్లో గెలిచి ఈ ఏడాది ఆరోసారి ఫైనల్‌కు చేరాడు ఫెదరర్.

నెదర్లాండ్స్‌కు భారత్ షాక్

వాల్విక్ (నెదర్లాండ్స్): హాకీలో భారత జట్టు ప్రపంచ నం. 4 నెదర్లాండ్స్‌కు షాకిచ్చింది. రోబో సూపర్ సిరీస్‌లో భాగంగా ఆదివారం నువ్వానేనా అన్నట్టుగా సాగిన మ్యాచ్‌లో 4-3తో డచ్ జట్టును ఓడించింది. మన్‌ప్రీత్ (30వ నిమిషం, 44వ) రెండు గోల్స్ సాధించగా.. వరుణ్ కుమార్ (17వ), హర్జీత్ సింగ్ (49వ) తలో గోల్ చేశారు.



హిజ్బుల్ అగ్రనాయకుడు ఘజ్నవీ హతం

- **కశ్మీర్‌లో భద్రతా దళాలకు కీలక విజయం**

శ్రీనగర్

జమ్మూకశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థకు చావు దెబ్బ తగిలింది. ఆ ముఠా ఆపరేషన్స్ విభాగం కమాండర్ యాసిన్ ఇటూ అలియాస్ ఘజ్నవీ సహా ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికులు కూడా వీర మరణం పొందారు.

దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో ఉన్న అవనిరా గ్రామంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదుల ఉనికి గురించి ఉప్పందుకున్న సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు శనివారం రాత్రి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. అనంతరం గాలింపు జరుపుతుండగా.. ముష్కరులు వారిపై కాల్పులు మొదలుపెట్టాయి. భద్రతా దళాలు కూడా దీటుగా స్పందించాయి. రెండు పక్షాల మధ్య రాత్రంతా చెదరుమదురుగా కాల్పులు కొనసాగాయి. తెల్లవారాక సైన్యం జోరు పెంచింది. ఈ కాల్పుల్లో.. అక్కడ మాటు వేసిన ముగ్గురూ ఉగ్రవాదులూ హతమయ్యారు. వీరిని ఘజ్నవీ, అతడి అంగరక్షకుడు ఉమర్, మరో ముష్కరుడు ఇర్ఫాన్‌గా గుర్తించారు. ఇర్ఫాన్‌కు సాంకేతిక పరిజ్ఞానంపై మంచి పట్టుంది. హిజ్బుల్ తరఫున జోరుగా ఆన్‌లైన్ ప్రచారంలో చేస్తుంటాడు. ఘజ్నవీది మధ్య కశ్మీర్‌లోని బద్గామ్ జిల్లా. దీర్ఘకాలంగా అతడికి హిజ్బుల్‌తో సంబంధాలు ఉన్నాయి. ఈ ముఠా కమాండర్ బుర్హాన్ వనీని గత ఏడాది భద్రతా దళాలు హతమార్చాక కశ్మీర్ లోయలో చెలరేగిన అశాంతిని సజీవంగా ఉంచడంలో అతడు కీలక పాత్ర పోషిస్తున్నాడు. హిజ్బుల్‌లో రిక్రూట్‌మెంట్లు కూడా చేస్తుంటాడు. 1996 నుంచి ఉగ్రవాద ముఠాలో కొనసాగుతుండటం వల్ల అతడిని 'పురాతన మిలిటెంట్'గా అభివర్ణిస్తుంటారు. 2007లో ఒకసారి లొంగిపోయాడు. 2014లో పెరోల్‌పై విడుదలయ్యాడు. ఆ తర్వాత మళ్లీ హిజ్బుల్‌లో చేరాడు. ఘటనా స్థలం నుంచి కెవ్లిట్ కొనెవివాన్ (కేకే) శ్రేణికి చెందిన ఒక తుపాకీ, రెండు ఏకే శ్రేణి తుపాకులు లభ్యమయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో తమిళనాడుకు చెందిన పి.ఇళయరాజా, మహారాష్ట్రకు చెందిన గవాయ్ సుమేధ్ వామన్‌లు వీరమరణం పొందారు. మరో ఐదుగురు కూడా గాయపడ్డారు. మరోవైపు ఉత్తర కశ్మీర్‌లోని బందీపొర జిల్లాలో గస్తీ తిరుగుతున్న భద్రతా దళ సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇందులో ఒక సైనిక జవాను, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.



ఎన్‌కౌంటర్లో అమరులైన భారత సైనికులు గవాయి సుమేధ్ వమన్, ఇళయరాజా



యాసిన్ ఇటూ అలియాస్ ఘజ్నవీ

భద్రతా సిబ్బంది కాల్పుల్లో యువకుడి మృతి

దక్షిణ కశ్మీర్‌లో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది జరిపిన పెల్లెట్ కాల్పుల్లో ఒకరు మరణించారు. షోపియాన్ జిల్లాలో జరిగిన హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ అనంతరం పుల్వామా జిల్లా కాక్రపొరాలో ఆందోళనకారులు రాళ్లు విసిరారు. వారిని చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది పెల్లెట్ కాల్పులు, భాష్పవాయు ప్రయోగం చేశారు. ఈ ఘటనలో ఒక యువకుడు చనిపోయాడు.

సరిహద్దుల్లో పాక్ కాల్పులు

ముగ్గురు భారత జవాన్లకు గాయాలు

జమ్మూ: నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ దళాలు మరోసారి పేట్రేగిపోయాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ.. కశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి, బారాముల్లాజిల్లాల్లో భారత శిబిరాలపై విరుచుకుపడ్డాయి. సాయంత్రం 4 గంటల సమయంలో బారాముల్లా జిల్లాలోని ఉరీలో విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. ఈకాల్పులను భారత సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. శనివారం పాక్‌జరిపిన కాల్పుల్లో ఒక సైనికుడు, ఓమహిళ మరణించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 1 నుంచి 285 సార్లు పాక్ దళాలు కాల్పులకు పాల్పడ్డాయి.

కశ్మీర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్

దిల్లీ: కశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆదివారం ఇండియా టీవీ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం అణచివేతలో జమ్ము-కశ్మీర్ పోలీసులు విశేషమైన కృషి చేస్తున్నారని చెప్పారు. ఉగ్రవాదంపై పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎలాంటి ఆటంకాలు కలిగించడం లేదని అన్నారు. కశ్మీర్ విషయంలో ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలన్నీ శాశ్వత పరిష్కారం కోసం ఉద్దేశించినవేనని, అయితే వాటిని వివరించి చెప్పలేనని తెలిపారు. కశ్మీర్ తన గుర్తింపును నిలబెట్టుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పోలీసులపై రాళ్లు విసరడం చాలా తగ్గిపోయిందని, అయితే ఇది పూర్తిగా ఆగిపోవాల్సి ఉందని అన్నారు. కశ్మీరీ యువతకు ఉద్యోగాలు కల్పించాల్సి ఉందని చెప్పారు. కశ్మీరీ పండిట్ల పునరావాసంపై మాట్లాడుతూ ఈ విషయమై దివంగత ముఖ్యమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ హయాంలోనే పలు చర్యలు చేపట్టారని చెప్పారు. అయితే తరువాత పరిస్థితులు మారాయని అన్నారు. ఏడాది, ఆరు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పలేమని తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం మానివేస్తేనే ఆదేశంతో చర్చలు జరుపుతామని వివరించారు.

భారీగా భారత్, రష్యా యుద్ధ విన్యాసాలు

అక్టోబరులో నిర్వహణకు ప్రణాళికలు

దిల్లీ: సైనిక బంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా భారత్, రష్యా భారీ యుద్ధ విన్యాసాలకు ప్రణాళికలు సిద్ధంచేశాయి. అక్టోబరు 19 నుంచి పది రోజులపాటు జరిగే వీటిలో రెండు దేశాల సైన్యాలు, నావికా, వైమానిక దళాలు పాలుపంచుకుంటాయి. రెండు దేశాల బలగాలమధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవడమే వీటి ప్రాథమిక లక్ష్యం. భారీ స్థాయిలో భారత త్రివిధ దళాలు కలిసి వేరొక దేశంతో యుద్ధ విన్యాసాల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. మేజర్ జనరల్ ర్యాంకు అధికారి నేతృత్వంలో 350 మంది సైనిక సిబ్బంది విన్యాసాల్లో పాలుపంచుకోనున్నారు. నావికా, వైమానిక బలగాలు కూడా ఈ స్థాయిలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. డోక్లాం ప్రతిష్టంభనపై చైనా స్వరం పెంచడం; సరిహద్దుల వెంబడి ఉగ్రవాదం సహా పలు అంశాలపై వివాదాల వల్ల పాకిస్థాన్‌తో సంబంధాలు మరింత క్షీణించడం.. తదితర పరిణామాల నడుమ ఈ యుద్ధ విన్యాసాలు తెరమీదకు రావడం గమనార్హం. ఇవి రష్యాలోని వ్లాదివోస్టోక్ పర్వత ప్రాంతంసహా మూడు చోట్ల జరుగనున్నట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. సైన్యాలు, నావికాదళాలు, వైమానిక దళాలు విడివిడిగా ద్వైపాక్షిక విన్యాసాలు చేస్తుంటాయని; మూడు దళాలు కలిసి విన్యాసాల్లో పాల్గొనడం ఇదే తొలిసారని పేర్కొన్నాయి.

ఉగ్రవాదులది ఇప్పుడు పలాయనవాదం

- **రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ**

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఇన్నేళ్లపాటు ప్రజల్లో భయోత్పాతాలు సృష్టించిన ఉగ్రవాదులు ఇప్పుడు పలాయనం చిత్తగిస్తున్నారని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. కశ్మీర్ లోయ నుంచి సాయుధ ఉగ్రవాదులను తుడిచిపెట్టేయడమే తమ లక్ష్యమని ఆదివారం ఇక్కడ ఓ టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో చెప్పారు.

"ఉగ్రవాదులపై ఇప్పుడు బాగా ఒత్తిడి పెరిగింది. వారి సంఖ్య తగ్గిపోతోంది. పెద్ద నోట్ల రద్దు, విదేశాల నుంచి వస్తున్న అక్రమ నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కొరడా ఝుళిపించడం వంటి చర్యల వల్ల వారికి ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఫలితంగా జమ్మూకశ్మీర్‌లో వారి అక్రమ కార్యకలాపాలకు చాలా వరకూ అడ్డుకట్ట పడింది" అని జైట్లీ పేర్కొన్నారు. నేడు ఎంత పెద్ద ఉగ్రవాది అయినా సరే.. కశ్మీర్ లోయలో ఉగ్రవాద చర్యలకు పాల్పడగలనని, దశాబ్దాల పాటు భయోత్పాతాన్ని కొనసాగించగలనని కలలో కూడా అనుకోవడం లేదన్నారు. "ఆ ఉగ్రవాదుల ఆయుష్షు ఇప్పుడు కొన్ని నెలలకు పడిపోయింది.



ఈ ముష్కరులను ఏరివేసేందుకు జమ్మూకశ్మీర్ పోలీసులు సాగిస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నా" అని చెప్పారు.

ఉగ్రవాదం.. తీవ్రవాదం..: నేడు దేశం రెండు తీవ్రమైన ముప్పులను ఎదుర్కొంటోందని జైట్లీ తెలిపారు. ఇందులో ఒకటి.. సరిహద్దు ఆవలి నుంచి ఉత్పన్నమవుతున్న ఉగ్రవాదం కాగా, రెండోది..దేశంలోని మధ్య భాగాల్లో తలెత్తుతున్న వామపక్ష తీవ్రవాదమని పేర్కొన్నారు. "కశ్మీర్.. భారత్‌లో అంతర్భాగమని మొదటినుంచీ అంగీకరించని పాకిస్థాన్.. సంప్రదాయ యుద్ధాల ద్వారా ప్రయత్నించింది. ఆ యుద్ధరీతుల్లో భారత సామర్థ్యం చాలా మెరుగ్గా ఉండటంతో దేశంలోకి ఉగ్రవాదాన్ని ఎగదోసే వ్యూహానికి తెగబడింది" అని తెలిపారు.

మనదే పైచేయి..: సాంకేతిక సాధనాల సాయంతో భారత దళాలు సరిహద్దుల్లో శత్రువుపై పైచేయి సాధించిందన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో మెరుపు దాడుల తర్వాత ఉగ్రవాదులను మన బలగాలు తుదముట్టిస్తున్నాయని తెలిపారు. "లోగడ ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రదేశానికి వేల మంది వచ్చి రాళ్లు రువ్వేవారని, దీన్ని ఆసరాగా చేసుకొని.. చాలా సందర్భాల్లో ఉగ్రవాదులు పరారయ్యేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. రాళ్లు రువ్వే వారి సంఖ్య 20, 30, 50లకు పడిపోయింది" అని పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ ఉగ్రవాద ముప్పు దాదాపుగా లేనట్టేనన్నారు.

ఉగ్రవాదులను కీర్తిస్తారా? : ఉగ్రవాదులు, మావోయిస్టులను కీర్తించే చర్యలపై రక్షణ మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో భారత వ్యతిరేక నినాదాలపై ఆవేదన వ్యక్తంచేశారు. అలాంటి వ్యక్తులతో కొన్ని రాజకీయ పార్టీలు అంటకాగడాన్ని నిరసించారు. భారత ప్రభుత్వం నిస్సహాయ స్థితిలో ఉందని చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశీయంగా రక్షణ ఉత్పత్తిని పెంచేందుకు తన మంత్రిత్వశాఖ ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. భారత్-చైనా సైన్యాల మధ్య ఏర్పడ్డ ప్రతిష్టంభనపై జైట్లీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

భారత సైనిక ఆధునికీకరణకు తోడ్పాటు

అమెరికా వెల్లడి

వాషింగ్టన్: భారత సైనిక దళాల ఆధునికీకరణలో సాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ప్రకటించింది. రెండు దేశాల ఉమ్మడి చర్యల ద్వారా భారత సైనిక సత్తాను గణనీయంగా పెంచవచ్చని పేర్కొంది. గత దశాబ్ద కాలంలో భారత్, అమెరికాల మధ్య రక్షణ వాణిజ్యం దాదాపు 1500 కోట్ల డాలర్లకు చేరింది. యుద్ధవిమానాలు, మానవరహిత విమానాలు, విమానవాహక నౌకలు సహా అధునాతన సైనిక హార్డ్‌వేర్ కోసం భారత్.. అమెరికా వైపు చూస్తుండటంతో రానున్న కొన్నేళ్లలో ఈ వాణిజ్యం మరింత జోరందుకుంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా నౌకాదళ పసిఫిక్ కమాండ్ అధిపతి అడ్మిరల్ హ్యారీ హారిస్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. రెండు దేశాల మధ్య దృఢమైన రక్షణ సంబంధాల కోసం వ్యక్తిగతంగా ఆయన చాలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. "భారత్‌ను మా ప్రధాన రక్షణ భాగస్వామిగా ప్రకటించాం. ఇది చాలా వ్యూహాత్మక ప్రకటన. అది భారత్‌కు ప్రత్యేకం. మా అత్యంత మిత్రపక్షాలతో సమాన హోదాను భారత్‌కు కట్టబెట్టాం" అని హారిస్ తెలిపారు. రెండు దేశాల నడుమ నేడున్న రక్షణ సహకారంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. రెండు దేశాల నౌకాదళాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి మలబార్ విన్యాసాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో జపాన్ కూడా చేరడం సంతోషకరమని చెప్పారు. ఈ విన్యాసాల్లో ఆస్ట్రేలియా కూడా పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది భారతేనని తెలిపారు. హిందు మహాసముద్రంలో ఉమ్మడి గస్తీకి భారత్ నిరాకరించడంపై తామేమీ నిరుత్సాహానికి గురికాలేదన్నారు. ఈ మహాసాగరంలో చైనా జలాంతర్గాముల ఉనికి గురించి అమెరికా.. భారత్‌కు సమాచారమిస్తోందా అన్న ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఆయన నిరాకరించారు.

బాలల వ్యాధులపై పరిశోధన కేంద్రం

- **రూ.85 కోట్లతో గోరఖ్‌పూర్‌లో ఏర్పాటు చేస్తాం: నడ్డా**
- **పిల్లల మృతికి కారకుల్ని వదిలిపెట్టం: ఆదిత్యనాథ్**
- **విమర్శల్ని తీవ్రతరం చేసిన విపక్షాలు**

గోరఖ్‌పూర్: ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటు చేసుకుంటున్న శిశు మరణాలను నివారించడానికి గోరఖ్‌పూర్‌లో ఒక ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని రూ.85 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా ప్రకటించారు. వైరస్ సంబంధిత మరణాలపై ఈ కేంద్రం ద్వారా లోతుగా అధ్యయనం చేయిస్తామని ఆయన ఆదివారం నాడిక్కడ వెల్లడించారు. గోరఖ్‌పూర్‌లో శిశుమరణాలు సంభవించిన బీఆర్‌డీ వైద్య కళాశాల ఆసుపత్రిని సందర్శించడానికి వచ్చిన నడ్డా ఆదివారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు అవసరమైన పూర్తి సహకారాన్ని కేంద్రం అందిస్తోందని చెప్పారు. అంతకుముందు ఆదిత్యనాథ్ మాట్లాడుతూ- యూపీ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా వైరస్ సంబంధిత వ్యాధులపై తాము యుద్ధం చేయలేకపోతున్నామనీ, పూర్తి స్థాయి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనీ చెప్పారు. ప్రభుత్వ నిర్వహణలోని ఆసుపత్రిలో మరణ మృదంగానికి కారకులైనవారు ఎక్కడున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని ఆయన చెప్పారు. మెదడువాపు సమస్యపై యూపీ వీధుల నుంచి పార్లమెంటు వరకు అన్నిచోట్లా తాను లేవనెత్తాననీ, ఆ ఆవేదనను తన కంటే బాగా అర్థం చేసుకోగలిగినవారు మరెవరూ లేరని చెబుతున్నప్పుడు సీఎం గొంతు గద్గదమయింది. ఆదివారం ఆయన బీఆర్‌డీ ఆసుపత్రిని సందర్శించారు.

యూపీ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలి: రాహుల్

నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన యూపీ సర్కారుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పసిపిల్లల మరణాలకు కారకులపై హత్యానేరాన్ని నమోదు చేయాలని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌బబ్బర్ డిమాండ్ చేశారు. సీఎంగా ఆదిత్యనాథ్ రాజీనామా చేయాల్సిందేనన్నారు. గోరఖ్‌పూర్ ఘటనపై దిల్లీలో వివిధ సామాజిక, రాజకీయ సంస్థలు జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి.

72కి చేరిన మృతుల సంఖ్య

గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య 72కి చేరింది. మరోవైపు- ఆసుపత్రి పిల్లల వార్డుకు చెందిన సమన్వయాధికారి డాక్టర్ ఖఫీల్ ఖాన్‌ని సస్పెండ్ చేశారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్ ఎత్తివేయాలి: ఐఎంఏ

దిల్లీ: గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్‌మిశ్రపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) డిమాండ్ చేసింది. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బిల్లుల చెల్లింపులన్నీ సకాలంలో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది.



గోరఖ్‌పూర్‌లోని ఆసుపత్రిని సందర్శించిన యూపీ సీఎం ఆదిత్యనాథ్, కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా

సాయపడిన వైద్యుడిని ఎందుకు తొలగించారు?

- **చిన్నారులకు ఆక్సిజన్ అందేలా యత్నం**
- **సొంత డబ్బుతో కొనుగోలు చేయించిన వైనం..**
- **గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆసుపత్రి వైద్యుడి తాపత్రయం**

గోరఖ్‌పూర్: ఇంతకీ ఇక్కడి బీఆర్‌డీ ఆసుపత్రి డాక్టర్. కఫీల్ అహ్మద్‌ను ప్రభుత్వం ఎందుకు తొలగించింది? ఆయనే కనుక అటూ ఇటూ పరుగులు పెట్టి...తెలిసిన ఆసుపత్రి వారిని బతిమలాడి....తన సొంత డబ్బును ఖర్చు పెట్టి...ఇలా నానా రకాలుగా తాపత్రయపడకపోయి ఉండి ఉంటే.. బీఆర్‌డీ ఆసుపత్రిలో మరింత మంది చిన్నారులు ఆక్సిజన్ లేక అకాల మరణం పాలై ఉండేవారు. చిన్నపిల్లల వైద్యవిభాగం, మెదడువాపు వార్డు అధిపతి అయిన డాక్టర్. కఫీల్ అహ్మద్‌ను ఆదివారం ప్రభుత్వం ఆ బాధ్యతలనుంచి తప్పిస్తూ ఉత్తర్వులు చేసింది. బకాయిల భారం అధికమై పంపిణీ దారు ఆక్సిజన్ సరఫరాను నిలిపివేయడంతో చిన్నారులు పిట్టల్లా రాలిపోయిన ఘటన చోటు చేసుకున్న రోజున డాక్టర్.కఫీల్ అహ్మద్ పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈనెల 10 వతేదీ రాత్రి ఆక్సిజన్ సరఫరా నిలిపివేత హడావుడి మొదలైంది. ఆరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు రెండుగంటల ప్రాంతంలో ఆసుపత్రి నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. ఓ గంటలోపల ఆసుపత్రిలో ఉన్న ఆక్సిజన్ అయిపోయే ముప్పు ముంచుకొస్తోందన్నది ఆ ఫోన్ సారాంశం. మెదడువాపు బాధితులకు ఆక్సిజన్ సరఫరా ఎంత అవసరమో తెలిసిన ఆయన వెంటనే అప్రమత్తమైనారు. హడావుడిగా తన స్నేహితుడి నర్సింగ్ హోంకు వెళ్లి మూడు భారీ ఆక్సిజన్ సిలిండర్లను సొంత వాహనంలో వేసుకుని 3 గంటల కల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. అయితే, అవికాస్తా అరగంటలోపే అయిపోయాయి. ప్రమాదాన్ని పసిగట్టిన ఆయన వెంటనే జూనియర్ వైద్యులందరినీ సమాయత్త పరిచారు. అవసరమైన చిన్నారులకు 'అంబుబ్యాగ్స్'(చేతితో నొక్కుతూ శ్వాస సక్రమంగా తీసుకునేలా సహరించే సాధనాలు) తో ఆక్సిజన్ పంపింగ్‌ను కొనసాగించాల్సిందిగా సూచించారు. వెంటనే బీఆర్‌డీ ఆసుపత్రికి ఆక్సిజన్‌ను పంపిణీచేసే వారికి అదే పనిగా ఫోన్‌లు చేశారు. ప్రయోజనం శూన్యం కావడంతో నానా రకాలుగా ప్రయత్నాలు చేసి మరో 12 సిలిండర్లను సేకరించి ఆసుపత్రికి తెప్పించగలిగారు. ఈ లోగా ఆక్సిజన్ సరఫరా దారులకు ఫోన్‌ల మీద ఫోన్లు చేస్తూనే ఉన్నారు. డబ్బు ఇస్తే వెంటనే ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేసేందుకు ఒక పంపిణీదారు ఎట్టకేలకు అంగీకరించారు. వెంటనే ఆయన సిబ్బందిని పంపి తన సొంత బ్యాంకు ఖాతా నుంచి రూ.10వేలను తెప్పించారు. ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేయించారు. డాక్టర్.కఫీల్ అహ్మద్ ఇలా హడావుడి పడుతుంటే...మరోవైపు జూనియర్ వైద్యులు అంబూబ్యాగ్స్‌తో పిల్లలకు ప్రాణవాయువు అందేలా అగచాట్లు పడుతూనే ఉన్నారు. ఆయన కనుక అంతలా శ్రమ పడకుండా ఉన్నట్లయితే మరింత మంది చిన్నారులు కన్నుమూసి ఉండేవారన్న వాదనలున్నాయి. అయితే, ఆదివారం డాక్టర్.అహ్మద్‌ను తొలగించి ఆ స్థానంలో డాక్టర్. భూపేంద్ర శర్మను నియమించింది. అసలు అహ్మద్‌ను ఎందుకు తొలగించాల్సి వచ్చిందనేదానికి ఇంతవరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటిస్పందనా లేదు.



మా కంటిదీపం ఆరిపోయిందని విలపిస్తున్న ఓ తల్లి ఆవేదనను నిస్సహాయంగా వింటున్న డాక్టర్ కఫీల్ అహ్మద్

గవర్నర్ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్ : శ్రీకృష్ణ జన్మాష్టమిని (సోమవారం) పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ భగవానుడు సమస్త మానవాళికి ఇచ్చిన భగవద్గీత సందేశాన్ని జన్మాష్టమి గుర్తుకు తెస్తుందన్నారు. గోకులాష్టమిని ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'మా దేశభక్తిని అనుమానిస్తున్నారా?'

లఖ్‌నవూ: మదర్సాల్లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను చిత్రీకరించాలన్న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలకు ఓవర్గం ముస్లింగురువులు అభ్యంతరంవ్యక్తం చేశారు. ఇది ఒక అసాధారణ ఆదేశమని, మైనారిటీల దేశభక్తిని శంకించేలా ఉందన్నారు. ఇటీవల యూపీ ప్రభుత్వం మదర్సాలలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలను చిత్రీకరించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు సభ్యుడు మౌలానా ఖలీద్ రషీద్ ఫరంగి మహ్లి స్పందిస్తూ.. 1947 నుంచి మదర్సాలలో స్వాతంత్య దినోత్సవం జరుపుతున్నారని, జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయగీతం ఆలపిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఈ ఆదేశాలు ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమై ఉంటుందని సందేహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈఅంశంపై ఆల్ ఇండియా షియా పర్సనల్ లాబోర్డు అధికార ప్రతినిధి యాసుబ్ స్పందిస్తూ.. స్వాతంత్య దినోత్సవ కార్యక్రమాలను చిత్రీకరించడానికి ఎలాంటి అభ్యంతరంలేదన్నారు. తద్వారా విశ్వాసం, పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. అయితే అన్ని మతాలకు చెందిన విద్యాసంస్థలకు ఇదే ఆదేశాలు ఇవ్వాలన్నారు.

బాబ్రీ స్థలాన్ని ఆలయానికి ఇద్దాం.. కోట్లాది హృదయాలు గెలుద్దాం

అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు ఉపాధ్యక్షుడి పిలుపు

లఖ్‌నవూ: సుప్రీంకోర్టు తీర్పు ఎలా వచ్చినా.. బాబ్రీ మసీదు స్థలాన్ని హిందువులకు అప్పగించేందుకు ముస్లింలు అంగీకరించాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు ఉపాధ్యక్షుడు, ప్రముఖ షియా మతగురువు మౌలానా కల్బే సిద్దిఖ్ పిలుపునిచ్చారు. ఆదివారం ముంబయిలో ప్రపంచ శాంతి సదస్సులో ఆయన మాట్లాడారు. "ఆ కొద్దిపాటి స్థలాన్ని ఆలయానికి ఇవ్వడం ద్వారా కోట్లాది హృదయాలను గెలవొచ్చు. అందుకే మసీదు స్థలాన్ని హిందువులకు వదిలేయాలని చెబుతున్నా. ఇది హిందూ-ముస్లింలకు సంబంధించిన అంశం కాదు. దేశానికంతటికీ సంబంధించినది" అని సిద్దిఖ్ పేర్కొన్నారు. మనమనస్సుకు దగ్గరగా ఉన్న ఏ వస్తువునైనా వదులుకుంటే అందుకు ప్రతిఫలంగా మనకు వెయ్యి రెట్ల ప్రయోజనం చేకూరుతుందని ఇస్లాం చెబుతోందని ఆయన అన్నారు. వివాదాస్పద స్థలానికి దూరంగా మసీదు నిర్మించొచ్చంటూ ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ షియా వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో సిద్దిఖ్ వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

ప్రజాభీష్టాన్ని ప్రతిధ్వనించనున్న ప్రధాని ఎర్రకోట ప్రసంగం!

దిల్లీ: భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభతరుణాన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసే ప్రసంగంలో విద్య, పరిశుభ్రత, పర్యావరణం, డిజిటలైజేషన్, బాలికా సాక్షరత తదితర అంశాలు చోటుచేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రధానికి అందిన సూచనల్లో ఈ అంశాలే అధికంగా ఉన్నాయి. ఆగస్టు 15వ తేదీన చేసే ప్రసంగంలో ఏఏ అంశాలు ఉండాలని ప్రజలు అభిలషిస్తున్నారో తెలపాలంటూ ప్రధాని పేర్కొన్న నేపథ్యంలో ఆయనకు కుప్పలు తెప్పలుగా సూచనలు అందాయి. జులై 30న ప్రసారమైన 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ప్రధాని ఈ మేరకు ప్రజల నుంచి సూచనలను కోరారు. ఆగస్టు 15న ఎర్రకోట బురుజు నుంచి తాను చేసే ప్రసంగం కేవలం ఎవరో ఒకరిదే కాదు. ఎర్రకోట నుంచి ప్రతిధ్వనించే భారత దేశ ప్రజలందరి సమష్టి గళమది అని ఆయన పేర్కొన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం. ప్రధాని పిలుపునకు లభించిన స్పందన అనూహ్యం. వేలాది అభిప్రాయాలూ, సూచనలు 'నరేంద్రమోదీ యాప్", "మైగవ్' పోర్టల్స్‌లో వెల్లువెత్తాయని అభిజ్ఞవర్గాలు తెలిపాయి. అందుకే, పైన పేర్కొన్న అంశాలు 15న మోదీ చేసే స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రతిధ్వనించనున్నాయి.

అసలైన జేడీయూ మాదే

మాకు 14 రాష్ట్ర శాఖల మద్దతుంది: శరద్ యాదవ్ వర్గం

దిల్లీ: జేడీయూ చీలిక పక్షమైన శరద్ యాదవ్ వర్గం అసలైన జేడీయూ మాదేనని చెబుతోంది. అందుకు బలపరీక్షకు సిద్ధమవుతోంది. తమకు 14 రాష్ట్ర శాఖల మద్దతు ఉందని చెబుతోంది. రాజ్యసభలో ఇద్దరు ఎంపీలు, జాతీయ స్థాయి కార్యవర్గం, 14 రాష్ట్ర శాఖల అధ్యక్షుల మద్దతు తమకే ఉందని శరద్‌యాదవ్ సన్నిహితుడు అరుణ్ శ్రీ వాస్తవ చెప్పారు. జేడీయూ బిహార్‌కు మాత్రమే పరిమితం అయి ఉందన్న నీతీశ్ వ్యాఖ్యల్ని ఖండిస్తూ జేడీయూకు ఎప్పటి నుంచో జాతీయ స్థాయి గుర్తింపు ఉందన్నారు. నీతీశ్ తన సమతా పార్టీని విలీనం చేయకముందు పార్టీకి శరద్ యాదవ్ నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. తాము పార్టీని వీడే ప్రసక్తే లేదని, బిహార్ బయట జేడీయూ లేనే లేదని చెబుతున్న నీతీశ్‌కుమార్ బిహార్‌లో కొత్త పార్టీ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అంతేకానీ జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న జేడీయూను తన నియంత్రణలోకి తీసుకోవద్దని చెప్పారు.

6 కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి. బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయింల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు(సవరణ) బిల్లు; జమ్ము-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ(సవరణ) బిల్లు; ఇండియన్‌ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం)- బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (సవరణ)బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్‌అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై సంతకాలు చేశారు. ఇందులోని ఎన్ఐటీఎస్ఈఆర్ చట్టం ప్రకారం తిరుపతి, బరంపురాల్లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (ఐఐఎస్ఈఆర్)లకు జాతీయ ప్రాముఖ్యం ఉన్న విద్యా సంస్థల హోదా లభించింది.

బెంగళూరుకు సమీపంలో రైల్వే విపత్తు నిర్వహణ గ్రామం

దిల్లీ: రైల్వేల్లో విపత్తు నిర్వహణపై శిక్షణకు బెంగళూరుకు సమీపంలో 'విపత్తు నిర్వహణ గ్రామా'న్ని ఏర్పాటు చేయనున్నారు. రైల్వే ప్రమాదాలు వాస్తవంగా జరిగినట్లుగా సృష్టించి అక్కడ తీసుకోవాల్సిన సహాయక చర్యలు, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి గ్రామాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం బెంగళూరుకు 25కిలోమీటర్ల దూరంలో విపత్తు నిర్వహణ, భద్రతా సంస్థను ఏర్పాటు చేసేందుకు హెజ్జల గ్రామాన్ని ఎంపిక చేశారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు. దాదాపు రూ.44.42కోట్ల వ్యయంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అన్నిరకాల భౌగోళిక పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు చేపట్టేలా ఉండేందుకు ఈ విపత్తు నిర్వహణ గ్రామాన్ని ఏర్పాటు చేయనున్నారు. క్లాస్‌రూం బోధనతోపాటు ప్రయోగాత్మక బోధన సైతం ఇక్కడ ఉంటుంది. ప్రయోగాత్మక బోధనలో వాస్తవంగా జరిగిన రైల్వే ప్రమాదాలను తలపించేలా రైల్వే గూడ్సు డబ్బాలు, కంటెయినర్లను వినియోగించి మాక్‌డ్రిల్స్ చేపట్టి బోధిస్తామని రైల్వే సీనియర్ అధికారి తెలిపారు.

విషాదం నింపిన కారు ప్రయాణం..

వాహనం దగ్ధమై.. వ్యక్తి సజీవ దహనం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: వెళ్తున్న కారులో మంటలు చెలరేగడంతో ఒక వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. కేరళ ఎర్నాకులానికి చెందిన దిలీప్ కుమార్ (38) తన భార్య ఆషా, కుమారుడు నితూస్, కుమార్తె గల్‌తో బెంగళూరుకి కారులో బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున కోయంబత్తూరు సమీపంలోని ఎల్‌అండ్ టీ బైపాస్ రోడ్డు ప్రాంతంలో వెళ్తుండగా ఉన్నట్టుండి కారు ముందు భాగం నుంచి మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన భార్య ఆషా తన ఇద్దరు పిల్లలతో వెంటనే కారు నుంచి బయటికి దిగారు. సీటు బెల్టు పెట్టుకొని కూర్చోవడంతో దిలీప్‌కుమార్ వెంటనే బయటకు రాలేకపోవడంతో సజీవ దహనమయ్యాడు.

తల్లిని మోసుకొని..



మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన ఆ తల్లీకొడుకులు బండి చక్రాలు బాగు చేస్తూ సంచార జీవనం సాగిస్తుంటారు. అలా నిజామాబాద్ జిల్లా ఆచన్‌పల్లికి వచ్చారు. నాలుగు రోజులుగా పని దొరక్కపోవడంతో చేతిలో డబ్బులన్నీ అయిపోయాయి. ఆదివారం తిరిగి వెళ్లిపోదామనుకుంటుండగా వృద్ధురాలైన తల్లి కాలికి గాయమైంది. ఆసుపత్రికి తీసుకెళ్లడానికి హన్మంతు చేతిలో చిల్లిగవ్వ లేదు. దీంతో తల్లిని వీపుపై ఎక్కించుకుని మూడు కిలోమీటర్ల దూరంలోని బోధన్ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లి కట్టు కట్టించుకొని వచ్చాడు.

– ఎడపల్లి, న్యూస్‌టుడే

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG